
# బ్రహ్మానందలహరి

## హాస్య కథలు




## సింహప్రసాద్

# బ్రహ్మానందలహరి

## హాస్య కథలు

## సింహ ప్రసాద్


**శ్రీశ్రీ ప్రచురణలు**

401, మయూరి ఎస్టేట్స్

ఎమ్.ఐ.జి -II - 650

కె.పి.హెచ్.బి. కాలనీ

**హైదరాబాద్-500 072.**

ఫోన్ - 9849061668

040 - 23157608

**Brahmanandalahari**
By Simha Prasad
e-mail : simhaprasad@ yahoo.com

© **రచయిత**

ముద్రణ :

**ఆగస్ట్ 2012**

ముఖచిత్రం : మృత్యుంజయ

లోపలి బొమ్మలు : మృత్యుంజయ,

**ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక నుంచి పునర్ముద్రితం**

వెల : ₹ **100/-**

డి.టి.పి :**శ్రీ భువనేశ్వరి**

ప్రింటర్స్ : **అనుస్వర క్రియేషన్స్**

సంజీవరెడ్డి నగర్, హైదరాబాద్.

ఫోన్ : 9000999183, 9848549158

ప్రతులకు :

**అన్ని ప్రధాన పుస్తక కేంద్రాలలో**

మరియు

**శ్రీశ్రీ ప్రచురణలు**

401, మయూరి ఎస్టేట్స్,

టెంపుల్ బస్టాండు దగ్గర, కె.పి.హెచ్.బి. కాలనీ,

**హైదరాబాద్ - 500 072.** సెల్ : 98490 61668

## కృతజ్ఞతాంజలి

'బ్రహ్మానందలహరి' హాస్య కథల్ని

**6.1.2000 నుండి 1.6.2000 వరకు**

సీరియల్‌గా ప్రచురించిన

ఆంధ్రభూమి సచిత్ర వార పత్రిక సంపాదకులకు,

చిత్రకారుడు మృత్యుంజయకు మరియు ఇతర కథలను
ప్రచురించిన ఆయా పత్రికా సంపాదకులకు

కృతజ్ఞతాభివందనాలు

– రచయిత

## అంకితం

మా పిన్ని, బాబాయి

**వర్ధినీడి అన్నపూర్ణ**
**వర్ధినీడి నరసింహామూర్తి (పూళ్ల) గార్ల**

దివ్యస్మృతికి.......

– **గాంధీ**

# ఇందులో...

## బ్రహ్మానందలహరి


| | | |
|---|---|---|
| 1. | హైటెక్ దొంగ | 5 |
| 2. | మాయలేడి | 12 |
| 3. | సన్మానం | 18 |
| 4. | ఓ గాడ్! | 25 |
| 5. | స్కూటరోపాఖ్యానం | 31 |
| 6. | వేయికళ్లు | 37 |
| 7. | పదవి | 45 |
| 8. | ముఖ్యఅతిథి | 51 |
| 9. | ఫ్రీ పాస్ | 57 |
| 10. | భవిష్యద్దర్శనం | 63 |
| 11. | గురుబ్రహ్మ | 70 |
| 12. | మాస్ హిస్టీరియా | 76 |
| 13. | సిద్ధాంతి బలం | 83 |
| 14. | దశమగ్రహం | 90 |
| 15. | నడమంత్రపు అధికారం | 97 |
| 16. | మోడ్రన్ పనిమనిషి | 104 |
| 17. | డాగ్సోపాఖ్యానం | 110 |
| 18. | బామ్మరిదీ – బ్లాక్‌మెయిలూ | 116 |
| 19. | రాంగ్‌నెంబర్ | 122 |
| 20. | సినిమా భాగోతం | 130 |
| 21. | పరమవీర సుత్తి | 134 |
| 22. | టెక్నిక్ | 142 |


## ఇతర కథలు :


| | | |
|---|---|---|
| 23. | ఇ–ఇహ్హిహ్హి | 148 |
| 24. | అది చిత్రం! ఇది విచిత్రం | 150 |
| 25. | దాసోహం | 158 |
| 26. | సిఫారసు | 165 |
| 27. | జ్ఞాననేత్రం | 174 |
| 28. | సహస్రనామార్చన | 179 |
| 29. | నేనూ మా ఆవిడా టెలివిజనూ | 183 |

# హైటెక్ దొంగ

**కా**లింగ్ బెల్ మ్రోగింది.

"ఇంత రాత్రివేళ ఎవరొచ్చారబ్బా?" ఆవులిస్తూ లేచి అన్నాడు బ్రహ్మానందం.

"చుట్టాలేమో" అంది శ్రీలక్ష్మి.

"చెప్పా చెయ్యకుండా వూడిపడతారంటావా?"

"దొంగలంటారా?"

"వాళ్లకన్ని దమ్ములెక్కడివి? ఘరానాగా బెల్ కొట్టి మరీ ఇంట్లోకొచ్చి దోచుకోడానికి నేనేమైనా వెర్రి వెధవనా?"

మళ్లీ మ్రోగింది.

"ఏం చేద్దామంటారు? తలుపులో చిన్న కంత పెట్టించండీ, ఎవరొచ్చిందీ తెలుస్తుందీ అంటే విన్నారు కాదు"

"నీకేం భయంలేదు గాని రా"

"నేనెందుకు? తోడు కోసమా?"



"కాదోయ్. నేనెలా మేనేజ్ చేస్తానో చూద్దువు గాని. అవసరపడితే రెండు జెల్లకాయ లిస్తాను. దెబ్బకి కళ్లు తిరిగి పడతాడు. రా మరి!"

"పదండి"

ఆమె తన వెనుకనుందన్న ధైర్యంతో వెళ్లి తలుపు తీశాడు.

ఓ నల్లని ఆకారం నల్లని దుస్తులూ నల్ల కళ్లజోడు నల్ల టోపీ ధరించి నల్లని సూట్ కేసుతో లోపలికి త్రోసుకొచ్చింది.

"ఏయ్ ఎవర్నువ్వు?"

"నా యూనిఫాం చెప్పట్లేదా?"

"యూనిఫాం ఏమిటి నువ్వేమిటి? రాత్రిపూట ఆ నల్లకళ్ల జోడేవిట్రా పిచ్చోడా!"

అతడు తలపంకించి ఠీవిగా వెళ్లి సోఫాలో కాలుమీద కాలు వేసుక్కూర్చున్నాడు.

"సేల్స్ మేనేమోనండీ" మెల్లగా అంది శ్రీలక్ష్మి.

"అర్ధరాత్రి సేల్సేమిటి నా పిండాకూడు!"

"నిరోధ్ లాంటి కండోమ్స్ ప్రచారానికీ అమ్మకానికీ..."

ఆమె మాటలు పూర్తి కాకుండానే ఆగంతకుడు అన్నాడు "మనది సేల్స్ సెక్షన్ కాదు, పర్స్ చేజింగ్ డిపార్ట్‌మెంటు"

"నీకు ఇంగ్లీషు సరిగ్గా పలకడం రాదా ఏమిటి కర్మ? పర్చేజింగ్ అనాలి గాని పర్సేజింగ్ పర్స్ చేజింగూ కాదు"

"పిచ్చివాడా! నేనే కరక్టని తర్వాత తెలుస్తుందిలే"

"అసలెవర్నువ్వు?"

"ఇంట్లోకి రాగానే మంచినీళ్లిచ్చి ప్రయాణం బాగా సాగిందా? దారిలో ఎలాంటి ఇబ్బందీ పడలేదు కదా వగైరాలడిగి బ్రూ కాఫీ ఇవ్వక ప్రశ్నమీద ప్రశ్న వేసేస్తున్నాడేవిటీ మానవుడు? ఇతడ్తో నువ్వెలా వేగుతున్నావమ్మా?"

"మా చెడ్డ ఇబ్బందిగా వుంది భాయీసాబ్" శ్రీలక్ష్మి అంది.

"అదెక్కడి వరసే"

"టీవీ ద్వారా హిందీ నేర్చుకుంటున్నానండీ" అంటూనే ఫ్రిజ్‌లోంచి కూలింగ్ వాటర్ తెచ్చిచ్చింది.

"ఏడ్చినట్టే వుంది గాని బాబూ నీ పేరేమిటి?" అడిగాడు బ్రహ్మానందం.

"మోహన్ బాబూ మోహన్ బిసికె"

"బిసికె? ఇదెక్కడి డిగ్రీ?"

"బాచిలర్ ఆఫ్ చోరకళ అని కొత్త కోర్సులే. నీకు తెలీదు. మనదంతా ఓపెన్ వరల్డ్ చదువు"

"మేం నిన్నెరగం. మరి నువ్వు మా ఇంటికెందుకు వచ్చినట్టు?"

"నా డ్యూటీ చేసుకోడానికి"

"మా ఇంట్లో నీకు డ్యూటీ ఏవిట్రా? ఒళ్లు తిక్కగా తిమ్మిరిగా వుందా?"

"చెబుతాన్లే గానీ కొంచెం గుర్రాన్ని కట్టెయ్యి. ఏమ్మా చక్కని బ్రూ కాఫీ ఇస్తావా?"

"అలాగే భాయీసాబ్" అంటూ లోపలికెళ్లింది శ్రీలక్ష్మి.

"ఇంద నా విజిటింగ్ కార్డు. చూస్తే అంతా నీకే తెలుస్తుంది"

"స్టయిలుకేం తక్కువ లేదు" అంటూ చూసి పైకే చదివాడు "బాబూ మోహన్ బిసికె. హైటెక్ తీఫ్. ఫోన్ నెంబర్ 66677... హైటెక్ తీఫ్? కొంప తీసి నువ్వు దొంగవి కాదు కదా?"

"కొంప తీయడానిక్కాదు ముంచటానికొచ్చిన దొంగని"

"దొంగ దొంగ" గంతులేశాడు.

"ఎక్కడండీ దొంగా?" అంటూ పచ్చడి బండతో వచ్చింది శ్రీలక్ష్మి.

"నేనే గ్రేట్ తీఫ్‌ని, బడాచోర్‌ని, గొప్ప దొంగని" అన్నాడతడు స్టైలుగా నిలబడి.

"నిజమా భాయీసాబ్" ఆనందంతో అరిచింది శ్రీలక్ష్మి.

"నేను చెల్లెలి దగ్గర అబద్ధమాడేంత నీచుడ్ని కాదమ్మా"

"ఏడిసినట్టుంది నీ డైలాగుకాని, ముందు బయటికి దయచెయ్"

"కాఫీ పెట్టేనండి, ఒక్క నిమిషం భాయీసాబ్"

"నాకేం తొందర్లేదమ్మా"

"నీకెందుకుంటుంది తొందర? అర్ధరాత్రి వచ్చి మా ఇంట్లో తిష్ఠ వేసినందుకు మాకు తొందరగానీ"

"ఇంద తీసుకో భాయీసాబ్ "కాఫీ తెచ్చిచ్చింది శ్రీలక్ష్మి.

"దొంగకి కాఫీలిచ్చి మర్యాద చేయడం ఏమిటే" నుదురు కొట్టుకున్నాడు బ్రహ్మానందం.

'ష్. మీరుండండి. భాయీసాబ్ నువ్వేమీ అనుకోనంటే చిన్న ఇంటర్వ్యూ చేస్తాను" పెన్నూ కాగితం తీసుకుంటూ అంది.

"నువ్వేమైనా టీవీ యాంకర్ననుకుంటున్నావా ఎవడ్నిబడితే వాడ్ని ఇంటర్ వ్యూ చేయడానికి'

"బావగారికి కోపం ఎక్కువ. ఆయన ముఖం ఎప్పుడూ ఇలా ముట ముటలాడ్తూనే వుంటుందా?" అడిగాడు బాబూమోహన్.

"నా మొహం నా ఇష్టం"

"మీరు కాస్త ఆగుతారా నేను ఇంటర్వ్యూ చేయాలి"

"వాడ్ని ఇంటర్వ్యూ చెయ్యడమేమిటే నా మొహం. వాడేమైనా హీరోయా క్రికెట్ స్టారా పొలిటికల్ ఫిగరా?"

"బ్లాక్ హీరో! నైట్ కింగ్! ఆయన మాటల్ని నువ్వేం పట్టించుకోకు భాయీసాబ్. మొదట నీకీ వృత్తిలోకి రావాలనెలా అన్పించింది?"

"పరీక్ష ఫెయిలై ఇంట్లోంచి పారిపోయి అన్నానికి మాడి జేబుకొట్టి వుంటాడు" బ్రహ్మానందం అన్నాడు.

"మీరు కాస్త మీ ఛానెల్ని కట్టేస్తారా? నువ్వు చెప్పు భాయీసాబ్. మీ మొదటి అనుభవం ఏమిటి?"

"అదో పెద్దకథ. బస్టాండులో నేనూ నా ఫ్రెండ్సూ కబుర్లు చెప్పుకుంటున్నాం. ఇంతలో ఒక పల్లెటూరి రైతు వచ్చాడు. అతడి లాల్చీ జేబులోంచి పది రూపాయల నోటు తొంగి చూస్తోంది. ఆ పదీ అతడికి తెలీకుండా కొట్టేస్తే నువ్వు గ్రేట్ అన్నారు మిత్రులు. ఓస్ ఇంతేనా అని ప్రయత్నించాను.

కానీ ఆ పల్లెటూరి వాడు గబుక్కున నా చేయి పట్టుకుని అరిచాడు. అంతా వచ్చి బాదేశారు. పోలీసులు లాక్కెళ్లి జేబులోని చిల్లరతో సహా అన్నీ లాక్కుని వదిలేశారు. ఇంత చిన్నపని చేయలేని నువ్వేం హీరోవీ అని గేలి చేశారు ఫ్రెండ్స్. నా శక్తి నిరూపించుకోవాలన్న పట్టుదలతో మళ్లీ ప్రయత్నించి అదే రోజున ఓ పర్సు కొట్టేశాను. అందులో వెయ్యి రూపాయలున్నాయి"

"ఓహ్! నీ కథ చాలా ఎక్సైటింగా వుంది. నువ్వు గ్రేట్ తీఫ్ అన్నావు కదా నీకెవరైనా బిరుదు లివ్వడం సన్మానాలు చెయ్యడం లాటివి చేశారా?

"సన్మానించి బిరుదు కూడా ఇచ్చారు. కానీ ఆ సభకి ప్రేక్షకులెవరూ లేరు"

"అదేవిటి?"

"మా వాళ్లంతా వచ్చేస్తారనీ అందరి జేబులూ కత్తిరించేస్తారని జనం భయపడ్డారు"

"కనీసం మీ వాళ్లయినా వచ్చి వుంటారుగా?"

"జనం లేనప్పుడెళ్లి ఏం చేస్తామని వాళ్లూ రాలేదు"

"ఓహ్ చాలా బాగుంది బాబూమోహన్‌గారూ! ఇంకో చిన్న ప్రశ్న. మీకో సంఘం వుందని విన్నాం"

"ప్రతి కులస్తులకీ ప్రతి వృత్తి వారికీ ప్రతి కేడర్ వారికీ సంఘాలున్నప్పుడు మాకు మాత్రం ఎందుకుండకూడదనుకుని ఓ సంఘాన్ని స్థాపించాం. రిజిస్టర్ కూడా చేయించాం"

"అబ్బో! రిజిస్టర్డ్ సంఘం అన్నమాట. చాలా మంచి సంగతులు చెప్పేరు. మీ సంఘం తరపున ప్రభుత్వాన్నేమయినా సహాయాలర్థిస్తున్నారా?"

"మేం చాలా డిమాండ్లు చేస్తున్నాం. మమ్మల్ని ప్రొఫెషనల్ అండ్ సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ కేటగిరీగా గుర్తించి స్వయం ఉపాధి పథకాల క్రింద బ్యాంకులు మాకు రుణాలిచ్చేట్టు చూడమంటున్నాం. మాకు ఇళ్ల స్థలాలిప్పించమని అడిగాం. పోలీసుల వాటాలనీ మామూళ్లనీ క్రమబద్ధం చెయ్యమంటున్నాం"

"ఇంతేనా ఇంకేమైనా డిమాండ్స్ వున్నాయా?"

"ఇంకా ముఖ్యమైనవి వున్నాయి. కరెంటుకోతని రాత్రి పదకొండు గంటల్నుండి ఒంటి గంట వరకూ విస్తరించాలి. కరెంటు పరిస్థితి మెరుగుపడినప్పటికీ కోతని రాత్రివేళ కంటిన్యూ చెయ్యాలి. టీవీ కార్యక్రమాలన్నీ రాత్రి పదకొండు గంటలకి బంద్ చెయ్యాలి. మసాలా సినిమాలూ మసాలా పాటలూ అర్ధరాత్రుళ్లు చచ్చినా ప్రసారం చెయ్యకూడదు"

"అబ్బో చాలా డిమాండ్స్ వున్నాయే. మీ డిమాండ్స్‌కి ప్రతిస్పందనేమిటి భాయీసాబ్?"

"ప్రభుత్వంలో మావాళ్లు–పెద్ద పెద్ద తిమింగలాల్లాంటోళ్లు వున్నారు. వాళ్లంతా మా డిమాండ్స్‌ని సానుభూతితో పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు"

"మీ అనుభవాలని కొత్తగా మీ వృత్తిలోకి ప్రవేశించాలనుకునే ఎమెచ్యూర్స్ కోసం గ్రంథస్థం చెయ్యొచ్చు కదా?"

"చేశానమ్మా! 'తిన్న ఇంట్లో దొంగతనం చెయ్యడం ఎలా?' అన్న ఆ పుస్తకం పదివేల కాపీలు అమ్ముడుపోయింది. ఇంగ్లీషు హిందీ తమిళ కన్నడ భాషల్లోకి అనువదించబడింది కూడానూ"

"ఈ రకంగా తెలుగు సాహిత్యానికి సేవ చేస్తున్నందుకు చాలా సంతోషం. మీ మాటలు వింటోన్న కొద్దీ మీ రంగంలో మీరు నిష్ణాతులని అంగీకరిస్తున్నాను. ఇకపోతే ఓ సందేహం భాయీసాభ్, ఈ సూట్‌కేస్‌లో ఏమున్నాయి?"

"వృత్తి పరికరాలు"అంటూ తెరచి అందులోని తాళాల గుత్తులూ, సుత్తీ, పెద్ద మేకూ, మోకు, కుక్క బిస్కట్లూ, చాకులూ, పిస్తోలు వగైరాలు చూపించాడు.

"ఓర్నాయనో తుపాకీ కూడా వుంది" అరిచాడు బ్రహ్మానందం.

"కడప బాంబు కూడా వుంది"

"అమ్మో పోలీసులకి తెలిస్తే రాజకీయ కుట్ర అనుకుని అందర్నీ కటకటాల వెనక్కి తోసేస్తారు గాని నువ్వు త్వరగా వెళ్లిపో నాయనా" బ్రతిమాలాడు బ్రహ్మానందం.

"పనవ్వకుండా ఎలా వెళ్తాను? నువ్వు నా బామ్మర్దివని సరదాగా పరాచికాలాడ్డానికి వచ్చాననుకున్నావా పిచ్చోడా. అదేం కాదు, కాసేపు సెటిలయ్యే వరకూ సరదాగా మాట్లాట్టం నా పాలసీ. ఇప్పుడిహ డ్యూటీలోకి దిగిపోతాను"

"అంటే మేం చూస్తూండగానే మా ఇంట్లో దొంగతనం చేస్తారా? రియల్లీ గ్రేట్!" శ్రీలక్ష్మి అంది ఆశ్చర్యంగా చూస్తూ.

"అవున్నీకు ప్రాక్టికల్స్ చూపిద్దామనీ! సిగ్గులేకపోతేసరి! మీ ఇల్లు దోచెయ్యడానికొచ్చానూ అంటే ఎలా దోస్తావో దోచెయ్ చూస్తానంటావేమిటే పిచ్చిదానా!"

"ఇలాటివి ప్రత్యక్షంగా చూసే అవకాశం చాలా అరుదుగా లభిస్తుందండీ'

"మీ మాటలూ ఆటలూ నా దగ్గర సాగవుగాని డబ్బూ బంగారం ఎక్కడున్నాయో చెప్పు" బటన్‌నైఫ్ తీసి బెదిరించాడు దొంగ.

"ఏంటి పొడుస్తావా? పొడు చూస్తాను"

"పొడిచేక నువ్వు చూసేది నన్ను కాదు, యముడ్ని. నోర్మూసుకుని కూర్చో. కాఫీ ఇచ్చి మర్యాద చేశారు గనక ఈవిడ భాయీసాబ్ అని నోరారా పిలిచింది గనుక చిన్న కన్సెషన్ ఇస్తాను. మీ ఇంట్లో ఇన్సూర్ చేసినవి ఏమేమిటో చెబితే అవి మాత్రం పట్టుకుపోతాను''

"నా లైఫ్‌కి తప్ప ఇంక దేనికీ ఇన్యూరెన్స్ చెయ్యలేదు దేవుడోయ్!"

"నన్ను దేవుడ్ని చెయ్యకు. ఇంత ముందు చూపు లేకపోతే ఎలా బతుకుతావోయ్? ఆర్నెల్లకి గాకపోయినా ఏడాదికోసారైనా మేమొచ్చి పడతాం కదా! మరి ఇన్సూర్ చెయ్యకపోతే ఎలా?"

"ఇన్సూరెన్స్ కేన్వాసింగ్ నీ పార్ట్‌టైమ్ జాబా భాయీసాబ్?" అడిగింది శ్రీలక్ష్మి.

"కాదమ్మా! సంఘసేవ చేయడం నా వీక్నెస్"

"సరే అలాగే! రేపే ఇన్సూర్ చేస్తాను. చేశాక వద్దువు గాన్లే గాని ఇప్పుడెళ్లిపోవయ్యా బాబూ"

"వూరికే వెళ్తే నా వృత్తికి ద్రోహం చేసినట్టు. అందుకని శాంపిల్‌గా..." అంటూ ఆమె వంక చూశాడు.

"మెడలోని గొలుసూ చేతి గాజులూ ఇచ్చేయ్. ఏమోయ్ నువ్వు నీ ఉంగరాలు తీసివ్వు. బీరువాలో వున్న డబ్బంతా పట్రా. క్విక్"

"అన్నీ మేమే తీసి అందివ్వాలా ఇవ్వం" భీష్మించాడు బ్రహ్మానందం.

"నిజంగానే దొంగతనమా భాయీసాబ్" ఏడుపొస్తోంటే అంది శ్రీలక్ష్మి.

"ఇది ఇంగ్లీషు సినిమాయే బుల్లెమ్మా. ఇంకా అలా బిగుసుకుపోయావేమోయ్. నీ రక్తం నీకు చూడాలని సరదాగా వుందా?"

అతడి మాటలకి భయపడిపోయారిద్దరూ. గబగబా నగలూ డబ్బూ వగైరాలన్నీ తెచ్చి అతడి సూట్‌కేస్‌లో సర్దేశారు.

"గుడ్ బై బై" అంటూ అతడెళ్లబోతోంటే "దొంగ దొంగ" అని అరిచాడు బ్రహ్మానందం.

"ఇంకో దొంగ వచ్చాడా? ఏడి ఎక్కడ? నాకు పోటీకొస్తాడా? సంఘ నిబంధనలని అతిక్రమిస్తాడా? వాడి పని సంఘంలో చెప్పి సస్పెండ్ చేయిస్తాను. ఎవడ్రా వాడూ..." అంటూ మరొకడి కోసం వెదుకుతూనే సూట్‌కేస్‌తో సహా మాయమయ్యాడు బాబూమోహన్.

"హమ్మో! నా నగలు నా నగలు!" ఘొల్లుమంది శ్రీలక్ష్మి.

"భాయీసాబ్ అంటూ ఇంటర్వ్యూ చేశావుగా! ఇంకా నయం వీడియో తీయలేదు"

"అరె. నిజమే సుమండీ. ముందెందుకు గుర్తు చెయ్యలేదు?"

పిచ్చి చూపులు చూశాడు బ్రహ్మానందం!

* * *

**(ఆంధ్రభూమి వారపత్రిక 13.1.2000)**

# మాయ లేడి

"శ్రీలూ! శ్రీలూ!"

చిలకలా పలుకుతూ వచ్చాడు బ్రహ్మానందం.

"మొహం వెయ్యి కేండిల్ బల్బులా వెలిగిపోతోందేవిటి కథ?"

"ఎంక్వైరీ కెళుతున్నానోయ్. ఈ రాత్రికే ప్రయాణం. రెండు జతల బట్టలు సూట్‌కేసులో సర్దేసేయ్"

"ఎన్నడూలేంది మీరు కేంపుకెళ్ళడం ఏవిటండీ" బుగ్గలు నొక్కుకుంది శ్రీలక్ష్మి.

"అక్కడే వుందీ కీలకం. నా ప్రతిభ గురించి మా హెడ్డాఫీసులోని అందరికీ తెలిసి పోయిందోయ్. నా అంత నమ్మదగ్గవాడు నిక్కచ్చిగాడు లేడని వాళ్ళ అభిప్రాయం"

"కొంచెం అర్ధమయ్యేట్లు చెప్పరూ.."



"మా బ్రాంచి ఆఫీసులోని ఓ మేనేజరు ఆఫీసు సొమ్ముని అడ్డంగా నిలువుగా తినేస్తున్నాట్ట. నన్ను వెళ్ళి అన్నీ పరిశీలించి రిపోర్టివ్వమని హెడ్డాఫీసు నుండి కాన్ఫిడెన్షియల్ లెటరొ చ్చిందే..."

"మీరు వెళ్ళి ఏం చేస్తారు?"

"ఏం చెయ్యడం ఏవిటే పిచ్చి మొహమా – ఎడాపెడా చెక్ చేస్తాను. కలుగు తవ్వేస్తాను. పందికొక్కుల్ని పట్టేస్తాను. మన ఎంక్వైరీ రిపోర్టు దెబ్బకి అతగాడి ఉజ్జోగం వూడటం ఖాయం"

"పాపం. మీలాంటి స్ట్రిక్టు ఆఫీసరు ఎంక్వైరీ కెళ్ళడం వాడి ఖర్మ!"

"కరక్టుగా చెప్పేవు. మరొకడూ మరొకడూ అయితే మందుకో మనీకో మహిళకో లోబడిపోయి అతగాడి కనుకూలంగా రాసేసేవాడు. మన దగ్గరలాటి పప్పులు ఉడకవు కదా!"

"పిల్లలు గలవాడైతే పాపం కాస్తంత కనికరించండి.."

"సెంటిమెంటు సెంటేమెంటే డ్యూటీ డ్యూటీయే. రెంటికీ లింకు పెట్టకూడదు శ్రీలూ. పెట్టేమనుకో డ్యూటీకి అన్యాయం చేసిన వాళ్ళ మవుతాం. నాలాటి స్ట్రిక్టు ఆఫీసరు అలాటి పని చెయ్యడుగాక చెయ్యడు. అంతే"

ఫోం చేసి రెడీ అయ్యాడు బ్రహ్మానందం. ఈలోగా సూట్‌కేస్ సిద్ధం చేసింది శ్రీలక్ష్మి.

"రెండు జతల బట్టలూ టవలూ లుంగీ బనీనూ టూత్ బ్రష్షూ పేస్టూ అమృతాంజనం అన్నీ సర్దేనండీ"

"గుడ్. అక్కడ్నుంచి నీకేమైనా తేనా శ్రీలూ.."

"ఏం తెస్తారు? ఆ..గుర్తొచ్చిందండోయ్. మీరెళ్ళే ఊరు ప్రక్కనే అడవి వుంది కదా! లేళ్ళూ నెమళ్ళూ కణుజులా వుంటాయి కదా! వాటి మాంసం ఎంతో బావుంటుందిట. నేనెప్పుడూ తినలేదు.. రెండు కిలోలు తేరూ.." గోముగా అంది అతడి చొక్కా బొత్తాములు సవరిస్తూ.

ఐసైపోయాడు బ్రహ్మానందం.

"రెండేవిటి అయిదు కేజీలు తెస్తాను. ఏకంగా మాంసం ఆవకాయ పెట్టేద్దాం..."

"దొరుకుద్దంటారా?"

"అది ఆ అభాగ్యుడి ప్రోబ్లం. నా నోట్లోంచి ఫలానాది కావాలన్న మాట వూడిపడితే చాలు అగ్గగ్గలాడుతూ అన్నీ తెచ్చివ్వాల్సిందే. ఎంక్వైరీ అఫీసర్నా మజాకా. అతగాడి ఉద్యోగ ప్రాణాలు నా గుప్పిట్లో వున్నాయే..." గర్వంగా నవ్వేడు.

మురిసిపోయింది శ్రీలక్ష్మి.

"మా వారు చాలా గొప్పవారు. నేనేం అడిగినా కాదనరు.."

ఆటో ఎక్కి స్టేషన్ కెళ్ళాడు. మర్నాడు తెలతెలవారుతోంటే ట్రెయిన్ ఆ ఊళ్లో ఆగింది. చలి చలిగా వుంది. స్వెట్టర్ని సరిచేసుకుని మఫ్లర్ తలకి చుట్టుకుని సూట్‌కేసు పట్టుకుని దిగాడు బ్రహ్మానందం.

"వెరీ గుడ్ మార్నింగ్ సర్..." భరణి అన్నాడు అతి వినయం ప్రదర్శిస్తూ.

"మీరు..."

"నా పేరు భరణి సర్.. లోకలాఫీసు మేనేజర్ని.."

"ఓ..గ్లాడ్ టు మిట్యూ.. నేనీ ట్రెయిన్ కొస్తున్నట్టు అసల్నేనీ ఊరోస్తున్నట్టు మీకెలా తెలిసింది?"

జవాబుగా నవ్వేడు. చొరవగా సూట్‌కేస్ తీసుకొంటోంటే, "వద్దొద్దోయ్. నా పని నేను చేసుకోవడం నా పాలసీ" అన్నాడు.

"ఫరవాలేదు సార్'

సూట్‌కేసు అందుకుని గబగబా ముందుకు నడిచాడు భరణి.

టాక్సీ డోర్ తెరచి పట్టుకుని "రండి సార్.. మీకోసం అరేంజ్ చేశాను" అన్నాడు భరణి.

"ఇవన్నీ ఎందుకోయ్.. నాకిలాటివి నచ్చవు.."

"మీరు స్ట్రిక్టు ఆఫీసరని తెలుస్సార్. మొదటిసారిగా మా ఊరొచ్చారు. అతిథి మర్యాదలు చెయ్యడం నా బాధ్యత. నాకెలాటి ఫేవరూ చెయ్యమని కోరను సార్.."

"కోరినా చెయ్యను మరి. మనదంతా స్ట్రిక్టు వ్యవహారం. అందుకనే పని గట్టుకుని నన్ను పంపించారు"

"తెలుస్సార్. నా పిలక మీ చేతుల్లో వుందనీ తెలుసు. అయినా ఏమీ అడగను. మీలాటి ఆఫీసర్‌కి ఆతిథ్యం ఇచ్చే అవకాశం కల్పించండి చాలు"

మొహమాటపడ్తూ అన్నాడు. "నీకెందుకోయ్ అనవసర శ్రమా!"

"అమ్మమ్మ అలా అనకండి. మీలాంటి సిన్సియర్ ఆఫీసర్‌కి శుశ్రూష చేసే భాగ్యం కలగటం నిజంగా అదృష్టం కదండీ"

"ఏవిటోనోయ్. మొహమాట పెట్టేస్తున్నావ్. సరే కానియ్.."

"చాలా థాంక్సు సార్.."

టాక్సీలో ట్రావెలర్స్ బంగళాకెళ్ళారు.

"హొటల్ రూం అయితే బావుడ్నేమో.."

"ఇక్కడ అన్ని సౌకర్యాలూ వున్నాయి సార్. అదనపు సౌకర్యాలు ఏం కావాలన్నా క్షణాల్లో రెడీ అవుతాయి సార్.."

"నాకు స్పెషల్సేం అక్కర్లేదు. సింపుల్ భోజనం చాలు. మందూ మగువ లాంటి వంక కన్నెత్తి చూడను.."

"ఛ ఛ.. అలాటివెందుకేర్పాటు చేస్తాను సార్. మీరు స్ట్రిక్టు వెజిటేరియన్ అని నాకు తెలుసు కదా సార్.."

"ఆ విషయాల్లో వెజిటేరియన్నే గాని మామూలుగా మాత్రం నాన్ వెజిటేరియన్ని.."

"నాకు తెలుస్సార్. మీ టేస్టులన్నీ కూడా తెలుసు. కణుజు మాంసానికి అరేంజ్‌మెంట్స్ చేశాను.."

చటుక్కున శ్రీలక్ష్మి కోరిక గుర్తొచ్చింది.

"ఒక చిన్న హెల్ప్ చెయ్యాలి భరణీ.."

"ఆజ్ఞాపించండి సార్.."

"అహ ఏం లేదు. ఈ ప్రక్క అడవిలో అన్ని రకాల జంతువులూ దొరుకుతాయి కదా.."

"దొరికించుకునే బాధ్యత నాది. మీకేం కావాలో చెప్పండి..."

"మా ఆవిడకి లేడి, కణుజు, నెమలి మాంసాలు తినాలనుందిట..."

"చాలు సార్.. ఇంకేం చెప్పొద్దు. మీరా సంగతిహ మరచిపోండి"

"ఎంత ఖర్చయితే అంత ఇచ్చేస్తాను. తీస్కోవాలి మరి. అలాగైతేనే తీసుకుంటాను"

"అలాగే సార్. ఎంత ఖర్చయిందో చెబుతాను. అణాపైసల్తో ఇచ్చెయ్యండి.."

"మరి కాస్సేపు నడుం వాలుస్తాను.."

"అలాగే సార్ పడుకోండి. బ్రేక్‌ఫాస్టు అరేంజ్ చేశాన్సార్. వాచ్‌మెన్ అన్నీ చూస్తాడు. టాక్సీ ఇక్కడే వుంటుంది.పదింటికల్లా ఆఫీసుకొచ్చేయండి. నేనక్కడ ఎదురు చూస్తూ వుంటా న్సార్. మీతో కలిసి వెళ్తే అంతా మీగురించి ఏదేదో అనుకోవచ్చు"

"కరెక్ట్. నీతో భుజం భుజం రాసుకుని తిరిగానంటే నా ఇమేజ్ పాడవుతుంది.."

"వస్తాన్సార్.. మీరెలాంటి రిపోర్టు రాసినా సరే సార్.. నేనేమీ కోరను సార్.." అని చెప్పి వెళ్ళి పోయాడు భరణి.

'చూస్తోంటే మంచి వాళ్ళానే వున్నాడు. ఇతగాడి మీద అన్ని ఆరోపణలెలా వచ్చా యబ్బా!' బుర్ర గోక్కుంటూ అనుకున్నాడు బ్రహ్మానందం.

సరిగ్గా పదింటికి ఆఫీసుకెళ్ళాడు.

అప్పుడే చూసినట్టు చూసి కంగారు నటిస్తూ ఆహ్వానించాడు భరణి.

ఏమీ మాట్లాడకుండా తిన్నగా అతడి కేబిన్లో కెళ్ళాడు.

తనక్కావాల్సిన ఫైలూ్సు లెడ్జర్లూ బిల్లూ్సు తెప్పించుకుని వేటలో పడ్డాడు బ్రహ్మానందం.

చాలా లొసుగులు కన్పించాయి. రెండు మూడు లక్షలకి తక్కువ కాకుండా భరణి స్వాహా చేశాడని కనిపెట్టాడు. బిల్లూ్సు వోచర్లూ మాత్రం పకడ్బందీగా వున్నాయి. అతడి తెలివికి అబ్బుర పడుతూనే బోల్డన్ని సాక్ష్యాలు సేకరించాడు.

ప్యూనుకి డబ్బిచ్చి హోటల్నుంచి కేరియర్ తెప్పించుకున్నాడు బ్రహ్మానందం.

భోజనానంతరం మళ్ళీ తవ్వే కార్యక్రమంలో పడ్డాడు.

సాయంత్రానికో పెద్ద రిపోర్టు తయారు చేశాడు. ఇక భరణిని రక్షించడం దేవుడి వల్ల కూడా కాదనుకుని అతడి వంక జాలిగా చూశాడు.

అతడేమీ భయపళ్ళేదు, బెదర్లేదు. కనీసం ఏం రాశారని కూడా అడగలేదు.

'హెడ్డాఫీసులో గాడ్ ఫాదర్ వుండివుంటాడు. అందుకే అంత ధీమాగా వున్నాడు. చూస్తాగా! నా రిపోర్టు చదివి గాడ్ ఫాదర్ కూడా దిమ్మ తిరిగి పడిపోవాల్సిందే!' అనుకున్నాడు.

భరిణితో సహా ఆఫీసు వాళ్ళందరికీ షేక్ హేండిచ్చి టాక్సీలో టీ.బీ కెళ్ళాడు.

ఘుమ ఘుమ వాసనలు నోరూరిస్తోంటే "ఏవిటి విశేషం" అనడిగాడు వాచ్‌మేన్ని.

"మీకిష్టం అని లేడి, నెమలి, కణుజు మాంసాలని వండుతున్నానండి. అమ్మగారి కోసం ఆగిలేస్తున్నానండి.."

"వెరీగుడ్. ఎంతయ్యిందేవిటీ"

ఏవో లెక్కలేసి "నాలుగొందల యాభయ్యండి" అన్నాడతడు.

అయిదొందలిచ్చేడు బ్రహ్మానందం.

తృప్తిగా భోంచేసి రాత్రి ట్రెయిన్‌కి రెడీ అవుతోంటే వచ్చాడు భరణి.

"చాలా థాంక్స్ భరణీ. లేడి మాంసం నిజంగా అదిరిందనుకో"

అతడు మాట్లాడలేదు. ఆందోళనగా చూశాడు.

కంగారుపడుతోన్న అతడ్ని చూసి 'రిపోర్టు భయం కాబోలు!' అనుకుని నవ్వుకున్నాడు.

"చాలా దారుణం జరిగిపోయింది సార్. మీరు వన్య ప్రాణుల్ని చంపి కూర వండించారని పోలీసులకి తెలిసింది సార్... వాటిని మీరే తెమ్మన్నారని వాచ్‌మెన్ చెబుతున్నాడు. ఆ మాట పోలీసులకి చెబితే మీకు ఆర్నెల్లు జైలుశిక్ష తప్పదు సార్.. వార్త తెలిస్తే ఆఫీసువాళ్లు సస్పెండ్ చేస్తారు.. ఆపైన..."

గబుక్కున అతడి చేతులు పట్టుకుని బావురుమన్నాడు బ్రహ్మానందం.

"మా ఆవిడేదో అడిగిందని... బుద్ధొచ్చింది.. నువ్వే రక్షించాలి భరణీ!"

"మీరు నన్ను రక్షిస్తే నేను మిమ్మల్ని రక్షిస్తాను. మీరు రిపోర్టు చింపేసి ఈ రిపోర్టు సమర్పిస్తే చాలు" కొన్ని పేపర్లిస్తూ నవ్వేడు భరణి.

"లేడి మాయ! మా లేడీ మాయ! ఎంక్వయిరీ మాయ..! రిపోర్టూ మాయే!" కన్నీళ్లు కారుతోంటే గొణుక్కున్నాడు బ్రహ్మానందం!

* * *

**(ఆంధ్రభూమి వారపత్రిక 11.5.2000)**

# సన్మానం

"బ్రహ్మానందంగారూ! బ్రహ్మానందంగారూ!"

బ్రహ్మానందం ఇంట్లోంచి బయటికొచ్చాడు.

గేటు దగ్గర గ్లాస్కోపంచె ఖద్దరు సిల్కులాల్చీ నల్లకళ్ళజోడు చేతిలో సిగరెట్ పెట్టె మరో చేతిలో కాల్తోన్న సిగరెట్టు ధరించి స్టైలుగా నిలబడి వున్నాడొకతను.

"బ్రహ్మానందంగారు కావాలి"

"నేనే బ్రహ్మానందాన్ని"

"ఇంత చిన్న వయసులో అంత పెద్ద ఆఫీసుకి అధికారివైపోయావా? నమ్మలేక పోతున్నాను" ఆశ్చర్యబోతూ అన్నాడు.

పరమానంద పడ్డాడు బ్రహ్మానందం.



"మిమ్మల్ని గుర్తించలేకపోయాం. మీరేం ఫీల్ కావొద్దు. ఆఫీసర్ అంటే బట్టతల వుండే ముసలాయననుకున్నాంగాని ఇలా యంగ్ యనర్జటిక్ ఫెలో అనుకోలేదు. ఇప్పుడు మీతో మాట్లాడాల్సిన అవసరం మరింత పెరిగింది. మీరేం ఫీల్ కాకపోతే లోపలికి రామా?"

"రండి రండి"

లోపలికెళ్లి కూర్చున్నాక ఒక అనుచరుడన్నాడు "మా గురువుగార్ని అంతా సింపుల్‌గా మాడా అంటారు"

వెంటనే రెండోవాడు అందుకున్నాడు "వీరు ది గ్రేట్ టౌన్ కల్చరల్ అసోసియేషన్ ప్రెసిడెంటూ సెక్రటరీ అన్నీను"

లేచి షేక్ హేండిచ్చాడు బ్రహ్మానందం.

"చాలా సంతోషం. మీ సంస్థ కార్యకలాపాలేమిటి"

"మాది ఏక సూత్ర కార్యక్రమం. ప్రతిభ ఎక్కడున్నా గాలం వేసి మరీ పట్టుకుని సన్మానించడం!"

"తెలుగువాడు పైకొస్తోంటే తొక్కేసే తెలుగువాడ్ని చూశానుగాని సాటి తెలుగువాడ్ని గౌరవించడమే ధ్యేయంగా పెట్టుకున్న తెలుగువాడ్ని ఇప్పుడే చూస్తున్నాను"

"మీరు గొప్పవారు గనుక నా ప్రతిభ గుర్తించారు. చాలామంది మూర్ఖులు ఆ నిజాన్ని అంగీకరించలేక ఏదేదో వాగుతూంటారు" అన్నాడు మాడా.

"ఇంతకీ తమరొచ్చిన పని..." సస్పెన్స్ భరించలేక అడిగేడు.

"మీ ఆఫీసుకి మీరు చీఫ్‌గా నియమింపబడ్డారని తెలిసింది. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని మిమ్మల్ని భారీ ఎత్తున సన్మానించాలని మా సంస్థ నిర్ణయించింది. మీరేం ఫీల్ కాకుండా అంగీకరించాలి"

"ఇంత చిన్న వయసులో నాకు సన్మానం ఏవిటండీ" లోపల్నుంచి సంబరం తన్నుకొస్తున్నా పైకి మొహమాటం నటించాడు.

"అమ్మమ్మ. అలా అనొద్దు. ఇవాళ ఇంతటి ఆఫీసుకే అధికారి అయ్యారు. రేపు జిల్లాకి ఎల్లుండు రాష్ట్ర ఆఫీసుకే ఉన్నతాధికారి అయి తీరతారు. మొగ్గ దశలోనే ప్రతిభని గుర్తించి గౌరవించటం మా ప్రత్యేకత. మీరు కాదనకూడదు"

"ఒప్పుకోండి సార్" అని ఒక అనుచరుడంటే, "ఒక సినీనటిని కూడా పిలుస్తున్నాం సార్" అన్నాడు రెండోవాడు.

"మొహమాట పెట్టేస్తున్నారు. అసలు నేనేం సాధించాననీ..." వుబ్బితబ్బిబ్బవుతూనే అన్నాడు బ్రహ్మానందం.

"అమ్మమ్మ. అలా అనొద్దు. మీరు చాలా సాధించారు. మీక్కూడా తెలీనివెన్నో సాధించారు. దాని గురించి మీరేం ఫీల్ కావొద్దు. అదంతా మా మైక్‌జాన్సన్ చెబుతాడుగా..."

"అతడెవరు? నన్నెరుగుదుడా?"

"ఎరగక్కర్లేదు. మైకు అందిస్తే చాలు. అతగాడికి పూనకం వచ్చేస్తుంది. బలవంతాన ఆపి కూర్చోబెట్టే వరకూ ఉపన్యసిస్తూనే వుంటాడు"

సంబరాన్ని అణచుకోలేకుండా వున్నాడు బ్రహ్మానందం. భార్యని పిలిచి పరిచయం చేశాడు.

"వీరు మాడాగారని ప్రముఖ సంఘ సేవకులు. నగరంలోని ప్రముఖ వ్యక్తి. నన్ను సన్మానిస్తామనొచ్చారు..."

"చాలా సంతోషం. ఒక్కక్షణం... కాఫీ తెస్తాను" శ్రీలక్ష్మి అన్నదోలేదో "మా గురువు గారు అలాటి ద్రవాలు తాగరు" అన్నాడొకడు.

"మా గురువు గారి ట్రాకే వేరు" అన్నాడు రెండోవాడు.

వారి భావాలు అర్థంగాక అయోమయంగా చూసిందామె.

"మీరో డేట్ ఇస్తే ఆ రోజున కానిచ్చేస్తాం" అన్నాడు మాడా.

"వచ్చే సండే అయితే బావుంటుంది. అవాళ నా బర్త్‌డే కూడానూ"

"మరింకేం. ఆ రోజు ఫిక్స్ చేసేశాం. మీరింకేం ఫీల్ కావొద్దు. ఇకపోతే మీ ఆఫీసుతో సంబంధ బాంధవ్యాలుండే వారి వివరాలు చెబితే మావాళ్ళు కాస్త నోట్ చేసుకుంటారు"

"ఎందుకు?"

"మీతో మీ ఆఫీసుతో సంబంధముండే వారందర్నీ ఫంక్షన్‌కి పిలవొద్దూ? వాళ్ళ చేత అభినందనల బేనర్లు కట్టించొద్దూ? మీకు సన్మానమంటే మీ వాళ్ళందరికీ పండగే కదా. పైగా ఈ మాడా చేసే సన్మానం అదిరిపోయే లెవెల్లో వుంటుంది. జన్మలో మర్చిపోలేరు. మీరేం ఫీల్ కావొద్దు. త్వరగా చెప్పేసెయ్యండి టైము ఎంతో లేదు. వెంటనే మేం పనుల్లోకి దూకెయ్యాలి"

అదీ నిజమే అన్పించింది బ్రహ్మానందానికి. తమ ఆఫీసుతో పనులుండే వారి వివరాలన్నీ చెప్పేడు.

"వచ్చే ఆదివారం పక్కా రెడీగా వుండండి. అమ్మగారూ మీరు కూడా రెడీగా వుండండి. ఆయనతో బాటు వారి అర్థాంగైన మిమ్మల్ని కూడా సత్కరించడం మా విధి" అని చెప్పి వెళ్ళిపోయాడు మాడా తన అనుచరగణంతో.

"ఇది నిజమా కలా?" శ్రీలక్ష్మి అంది.

"నిజంగా నిజం. మా ఆఫీసుకి ఇన్చార్జినయ్యానని ఎలా తెలిసిందో ఏమో!"

"అవునూ. వచ్చే ఆదివారం మీ పుట్టిన్రోజేవిటండీ. మీరు పుట్టింది జనవర్లో కదా!"

"ష్. నెమ్మది. ఆ సంగతి వాళ్ళకి తెలీదుగా. ఆ వంకన త్వరగా సన్మానం చేయించేసుకుంటే మంచిది, లేకపోతే మనస్సు మారిపోవచ్చు"

"అదీ నిజమేలెండి. మనిద్దరికీ పట్టు శాలువాలు కప్పుతారంటారా..."

"ఎందుకు కప్పరు? ఖరీదైన కాశ్మీరు శాలువాల్తో సత్కరిస్తారు. పెద్ద మెమెంటో ఇస్తారు. పెద్ద సైజు సన్మానపత్రం ఫ్రేము కట్టించి మరీ ఇస్తారు. అసలు గేటు దగ్గర్నుంచే పూర్ణకుంభంతో వేదమంత్రాల్తో స్వాగతం చెబుతారే పిచ్చిదానా"

"మన బంధువులందర్నీ పిలిచేద్దామండీ చూసి తరిస్తారు"

"ఇన్విటేషన్లు ప్రింటయ్యాక కొన్ని తీసుకుని వాళ్ళు పంపినట్టుగా మనమే పంపిద్దాంలే"

"మీ వల్ల నాక్కూడా సత్కారం జరగబోతోంది. ఎంత అదృష్టవంతురాల్నో. మా వైపు వారిలో ఎవరికీ ఇలా సన్మానాలు జరగలేదండీ"

"మా వైపు వారికీ జరగలేదు. అటూ ఇటూ కూడా మనమే ఫస్ట్ అన్నమాట"

అవాళంతా సన్మానపు ముచ్చట్ల గురించే చెప్పుకుని మురిసిపోయారు.

మర్నాటికి ఆఫీసులోని అందరికీ సన్మానపు వార్త తెలిసిపోయింది. అంతా తలోరకంగా వాఖ్యానించడం నవ్వుకోవడం బ్రహ్మానందం గమనించినా గమనించనట్టే వుండిపోయాడు.

ఆఫీసుతో సంబంధాలుండే ఇద్దరు ముగ్గురు ఫోన్ చేసి సన్మానవార్త నిజమా కాదా అని అడిగారు.

మూడోరోజున ఇన్విటేషన్ కార్డ్ తెచ్చిచ్చాడు మాడా. కార్డు కొంచెం చీప్‌గా వున్నా పెద్దగా బాగానే వుంది. వక్తలూ అతిథులూ చాలామంది వున్నారు.

కార్డులోని పేర్లు చూస్తూ "సినీ నటి శకుంతల ఎవరూ?" అనడిగాడు.

"మీకు తెలీదులెండి. ఈ వూరి అమ్మాయే. నాటకాలేస్తూంటుంది. ఆ మధ్య ఇక్కడ తీసిన ఒక సినిమాలో హీరోయిన్ స్నేహితురాళ్ళలో ఒకరిగా నటించింది"

"ఎక్స్ట్రా నటా?"

"మీలాటి పెద్దవారు ఒక ఆర్టిస్టుని డ్రింకు త్రాగేక పారేసే స్ట్రాలా చూడటం బావోలేదు. ఇలా అంటున్నానని మీరేం ఫీల్ కావద్దు"

"అహ వూరికే అడిగేనంతే..."

"సినిమా గ్లామర్ లేకపోతే మన మొఖాలు చూట్టానికెవరొస్తారూ?"

ఇబ్బందిగా కదిలాడు బ్రహ్మానందం.

"ఉన్నమాట అనేయడం నాకలవాటు. మీరేం ఫీల్ కావొద్దు" సిగరెట్టు వెలిగించి రింగులు రింగులుగా పొగవదుల్తూ అన్నాడు మాడా.

"నాకో పాతిక కార్డులు కావాలి..."

"పాతికేమిటి యాభై తీసుకోండి. మేం మాత్రం ఎందరికని పంచుతాం" అంటూ ఓ కట్ట అందించాడు.

"మీరేం ఫీల్ కాకుండా ఓ వెయ్యి కొట్టించండి. ఏర్పాట్లకి చాలా ఖర్చైపోతోంది....."

మొదట అయోమయంగానూ పిమ్మట ఇబ్బందిగానూ చూశాడు బ్రహ్మానందం.

"ఇలా అడగటం నాకూ బాగోటం లేదు. కాని అడక్క తప్పటం లేదు"

"రెడీ కేష్ లేదు బ్యాంక్ చెక్కు ఇస్తాను" అంటూ చెక్కు రాసిచ్చాడు.

"హమ్మయ్య. నాకిప్పుడు శాంతిగా వుంది. వస్తానూ" అనెళ్ళిపోయాడు.

మర్నాడు ప్యూన్ గుండు వచ్చి తల గోక్కుంటూ చిన్న బాంబు వేశాడు.

"మాడాగారు మన కస్టమర్లందరి దగ్గరికీ వెళ్ళి చందాలు వసూలు చేస్తున్నారట సార్. ఆఫీసులో అంతా చెవులు కొరుక్కుంటున్నారు"

అదిరిపడ్డాడు బ్రహ్మానందం. "ఏవో బేనర్లు కట్టింపిస్తానని చెప్పి ఇలా తన పరువు బజార్న పడెయ్యడం ఏవిటి!" అని వాపోయాడు.

అతగాడు కన్పిస్తే చెడామడా తిట్టెయ్యాలన్నంత కోపమూ వచ్చింది. కానీ తీరా అతగాడొచ్చేసరికి నోరెండిపోగా మొఖానికి నవ్వు పులుముకుని ఆహ్వానించాడు.

"మళ్ళీ వచ్చినందుకు మన్నించాలి. మీకూ మేడం గారికీ శాలువాలూ పట్టువస్త్రాలూ పెట్టాలని నిర్ణయించాం. మా సెలక్షన్ మీకు నచ్చుతుందో లేదో. మీరు కొనేసిస్తే రేపు నేనొచ్చి డబ్బిస్తాను. ఇలా అంటున్నందుకు మీరేం ఫీల్ కావట్లేదు కదా?"

"అహ. దానికేం భాగ్యం. ఇవాళే బజారు కెళ్ళి కొనేస్తాంలే"

"సంతోషం. ఇంకా చాలా పనులు మిగిలిపోయాయి" హడావిడిగా వెళ్ళిపోయాడు మాడా.

ఇంటికెళ్ళగానే సంగతి భార్యకి చెప్పి. "అంతా బాగానే వుంది గాని ఎంతలో కొనుక్కోవాలో చెప్పలేదోయ్" అన్నాడు.

"అదీ మనమంచికేనండీ. ఖరీదైనవి సెలక్ట్ చేద్దాం. చచ్చినట్టు కక్కేస్తాడు"

"బాగోదేమోనే..."

"మీకేం తెలీదు మీరూరుకోండి చెబుతా"

వూరుకుండిపోయాడు. మరో అరగంటలో తయారై బజారుకెళ్ళి పట్టుబట్టలూ శాలువాలూ కొనుక్కొచ్చారు. ఎనిమిది వేల పై చిలుకు బిల్లయ్యింది!

మరుసటి రోజు ఉదయమే ఇంటికొచ్చాడు మాడా.

'డబ్బు ఇవ్వడానిక్కాబోలు. ఎంత మర్యాదస్తుడు' అనుకుని సంబరపడ్డాడు గాని అతడా వూసెత్తలేదు.

"సన్మానపత్రం తయారయ్యింది. ఎలా వచ్చిందో చూడండి"

ఆసాంతం చదివాడు. ప్రతి వాక్యమూ ఇంద్రుడూ చంద్రుడూ అంటూ పొగడుతూ రాయబడింది. బ్రహ్మానందం భుజాలు మూడంగుళాలు పెరిగాయి.

"బావుంది"

"అంతా అదే అన్నారు. మీ సన్మానానికి వూళ్లో రెస్పాన్స్ కూడా బావుంది. మీ గురించి చాలా గొప్ప అభిప్రాయం వుందందరికీ. అన్నీ ఇంత బావున్నప్పుడు దీనికి సింపుల్ ఫ్రేము కట్టిస్తే ఏం బావుంటుంది చెప్పండి. అందుకని బ్రాస్ ఫ్రేము కట్టిద్దామని వుంది. పన్లోపనిగా జ్ఞాపిక మీద కూడా మీ బొమ్మ బ్రాన్‌తో చేయిస్తే బావుంటుందంటున్నారంతా. కాని మా సంస్థ దానికీ దీనికీ కేటాయించింది వెయ్యి రూపాయిలే. ఖర్చు మూడు వేల దాకా అవుతుంది. ఆ బాలన్స్ మీరిస్తే..... మీరేం ఫీల్ కాకపోతేనే సుమండీ"

నోర్మూసుకుని చెక్కు రాసిచ్చాడు.

"మీరేం ఫీల్ కావట్లేదు కదా?"

రాని నువ్వు పులుముకుంటూ తల అడ్డంగా వూపగా హుషారుగా వెళ్లిపోయాడతడు.

"బట్టల బిల్లు ఇచ్చేశాడా?" అంటూ వచ్చింది శ్రీలక్ష్మి.

"లేదే. ఎదురు డబ్బట్టుకుపోయాడు. ఆలోచిస్తోంటే వీడు నాకు సన్మానం చేస్తున్నాడా లేక నా మీద వ్యాపారం చేస్తున్నాడా అని అనుమానమొస్తోంది!"

బుగ్గలు నొక్కుకుని కళ్లప్పగించి చూస్తూండిపోయిందామె.

మర్నాడే సన్మానం. బంధువులూ చాలామంది వచ్చారు.

బ్రహ్మానందానికి చాలా టెన్షన్‌గా వుంది. ఎలాగైనా సన్మానం గ్రాండ్‌గా జరిగిపోతే బావుణ్ణని వుంది. తప్పక జరుగుతుందని తనకి తాను వెన్ను తట్టుకొంటున్నాడు పదే పదే!

మాడా నీరసంగా వచ్చాడు. బ్రహ్మానందం గుండెల్లో రాయిపడింది.

"ఒక చిక్కు సమస్య వచ్చిపడింది గురూగారూ. మీరేం ఫీల్ కానంటే చెబుతాను"

"అదేంటో త్వరగా చెప్పండి. నాకెందుకో దడగా వుంది"

"ఫంక్షన్ హాలుకీ కుర్చీలకీ డెకరేషన్‌కీ అని చెప్పి మా వాడికి మూడు వేలు ఇస్తే అది పట్టుకుని వాడు వుడాయించాడు. ఇప్పుడేం చెయ్యాలో తోచటం లేదు. ఇంత దాకా వచ్చేక ఫంక్షన్ కేన్సిల్ చేస్తే బావుండదు. మీ పరువుపోతుంది. అందుకని..."

ఏడుపొచ్చేసింది బ్రహ్మానందానికి.

"అంత మాటనకయ్యా బాబూ. సంగతి ఆఫీసులోనూ బయటా టాం టాం అయి పోయింది. ఎక్కడెక్కడ్నుంచో బంధువులు కూడా వచ్చేశారు. ఇప్పుడు కేన్సిల్ అయితే నవ్వుల పాలైపోతాను"

"అలా ఫీలయ్యే కదా మీ దగ్గరకి పరుగెత్తుకొచ్చాను. ఆ ఖర్చు మీరు భరిస్తానంటే..."

"భరించక ఛస్తానా... అలాగే కానివ్వు" మరో చెక్కు బర బరా రాసిచ్చాడు.

సన్మాన సభ తూతూ మంత్రంలా సాగిపోతోంది. బంధువులూ ఆఫీసు వాళ్లూ ఏ కాలక్షేపమూ లేని ఆ ప్రాంతపు ముసలి వాళ్లూ మాత్రం సభకి వచ్చారు.

మైక్ జాన్సన్ సొంతడబ్బా అరగంట కొట్టుకుని బ్రహ్మానందం గురించి అయిదు నిమిషాలు మాట్లాడాడు.

శ్రీలక్ష్మి పొంగిపోతూ స్టేజిమీద కూర్చుంది గాని బ్రహ్మానందం దిగులుగా  కూర్చుని సన్మానానికైన  ఖర్చు లెక్కవేసుకుంటున్నాడు.

ఇంతలో మాడా వచ్చి బ్రహ్మానందంతో "ఫంక్షన్ ఎలా వుంది?" అనడిగాడు చెవిలో.

"బాగానే వుంది' అన్నాడతడు నీరసంగా.

వెంటనే మైకు దగ్గరికెళ్లాడు మాడా. "ఒక ప్రత్యేక ప్రకటన. మా సంస్థ కార్యకలాపాలని మెచ్చి శ్రీమాన్ బ్రహ్మానందం గారు  అయిదు వేల నూట పదహార్లు విరాళం ప్రకటిస్తున్నట్టు ఇప్పుడే చెప్పారు. వారికి వేన వేల కృతజ్ఞతలు"

తప్పట్లు మార్మోగాయి.

బ్రహ్మానందానికి స్పృహ తప్పుతున్నట్టుగా వుంది!

* * *

**(ఆంధ్రభూమి వారపత్రిక 20.4.2000)**

# ఓ గాడ్!

"బ్రహ్మానందం!"

"ఎవరూ, మీరా స్వామీ – మనదేవూరు?"

"వైష్ణవ లోకం"

"సినిమాలోని సంగతి కాదు, మామూలు సంగతి అడుగుతున్నాను"

"నిజమే చెబుతున్నానయ్యా. నేనెవరో తెలీటం లేదూ?"

"వేంకటేశ్వర స్వామి వేషం వేసుకున్నారని తెలుస్తూనే వుంది గాని ఇంతకీ ఈ వేషం సినిమాలో నటించడానికా టీవీలో యాక్ట్ చేయడానికా?"

"ఇది నటన కాదయ్యా నిజంగా నిజం"

"పోదురూ. బొత్తిగా నా చెవుల్లో కాలీఫ్లవర్లు పెట్టేస్తానంటే ఎలాగా! మీకు తెలుసో లేదో నేను వెయ్యి సినిమాలు చూసిన వీరుడ్ని"

"నీకెలా బోధపర్చాలో తెలియటం లేదయ్యా"



"ఏంటి అసలేంటి నీ వుద్దేశం? నేను బొత్తిగా పార్టీ మారటం కూడా చేతకాని యంపీలా కన్పిస్తున్నానా? మన దగ్గర పప్పులూ అప్పచ్చిలూ వుడకవు. అసలు మన స్టైలే వేరు"

"నేను వేంకటేశ్వరుడిననిన కాదనెదవు"

"నువ్వెక్కడ దొరికావయ్యా బాబూ. వేషం వేసుకొచ్చి వేంకటేశ్వరుడ్నంటే సరిపోద్దేంటి? ఓ సంగతి చెప్పనా. నువ్వు వేంకటేశ్వరుడివైతే నేను బ్రహ్మనయ్యా"

"నీవు బ్రహ్మానందం కదా"

"అసలు బ్రహ్మని నేనే. ఈ అవతారంలో మాత్రం బ్రహ్మానందాన్ని. అంటే నేను సృష్టికర్తనన్న మాట. నీతో సహా సమస్త జీవుల్నీ సృష్టించిన వాడ్నన్నమాట"

"సృష్టికి ప్రతిసృష్టి చేస్తున్నంత మాత్రాన అంతలా విర్రవీగకు మానవా"

"ఇదేం పిలుపు? జగదేకవీరుడు అతిలోకసుందరి సినిమా చూశావా?"

"లేదు కాని అన్నమయ్య సినిమా చూశాను"

"నువ్వేంటి అంతా చూశారు. మళ్లీ మళ్లీ చూశారు. అందుకే అంత హిట్ అయ్యింది"

"మా అన్నమయ్య కథ నీకు నచ్చిందా?"

"సూపర్ కదండీ. ఏలో ఏలో మరదలా... అంటూ ఇద్దరు మరదళ్ళ ముద్దు ముచ్చట్ల మధ్య నలిగిపోతూ ఓహ్...!"

"శివా శివా!"

"మధ్యలో శివుడెందుకు? ఓహొహొ... అందుకా. అవున్లే ఆయనకిద్దరూ. నీకు–అదే వేంకటేశ్వరుడికి ఇద్దరు. ఒప్పుకుంటున్నాను. కానీ ఆ పాటని రాఘవేంద్రరావు సూపర్బ్‌గా తీశాడు కదండీ. మోహన్‌బాబు రోజాల పాట అయితే మసాలా తాళింపేసినట్టే వుంది. వహ్వా వహ్వా...!"

ఇబ్బందిగా కదిలాడాయన. "వాటి సంగతి కాదయ్యా. నా భక్తాగ్రేసరుడు అన్నమయ్య పద కవితా విశిష్టత గురించి చెప్పవయ్యా"

"అవీ బాగానే వున్నాయిలే. మా నాగార్జున ఎలా దున్నేశాడనీ. అబ్బో అబ్బో–నభూతో నభవిష్యతి అనుకోండి"

"నా భక్తుడు అంత సరసుడు కాదయ్యా"

"కానీ మా హీరో సరసుడు. స్టైలుడు. పొడగరి. అందగాడు. గ్రీకు వీరుడు. హీమాన్. అన్నీను. మధ్యన నీకెందుకు జెలసీ?"

"అహ అది కాదయ్యా"

"మరింకేవిటి స్వామీ?"

"బ్రహ్మమొక్కటే – గీతం ఎలా వుందయ్యా?"

"ఆ పాటలో ముసలి గెటప్‌లో ఏం స్టెప్పులేశాడనీ, అదిరిపోయిందనుకో. ఆ పాటకి ప్రేక్షకులు ఈలలు వేశారూ అంటే వెయ్యరూ మరి"

"పైపై మెరుగులు గురించి కాదయ్యా. భావం గురించి ఆలోచించు. ఆ పద కవితల్లోని ఆర్ద్రతని, తపనని, లోతుని ఆస్వాదించు. వేలాది కవితల్తో నన్నభిషేకించి ధన్యుడ్నైనట్టు భావించిన అన్నమయ్య అంకితభావనని భక్తిభావాన్ని తరచి చూడు"

"నేనెలా కన్పిస్తున్నాను మీ కళ్లకి?"

"ఏం నాయనా"

"పిలక పంతులి తెలుగు విద్యార్థిలా కన్పిస్తున్నానా అర్థాలూ తాత్పర్యాలూ శ్లేషలూ నేర్చుకోడానికీ?"

"భలేవాడివయ్యా. భావసారామృతాన్ని దోసిళ్లతో గ్రోలక భౌతిక మోహాల వలలో చిక్కుకుంటానంటావేవిటి?"

"సారా అమృతమా? గట్టిగా అనకయ్యా బాబూ ఇక్కడ సారాకి నిషేధం వుంది"

ఆయన మోము మ్లానమయింది. చిన్నగా నిట్టూర్చాడు. "అంతకంతకీ నాకు దూరంగా జరిగిపోతున్నారయ్యా మీరంతా"

"అవును చంద్రమండలం కూడా వెళ్లొచ్చాం కదా. రేపో మాపో దాన్ని పిక్నిక్ స్పాట్ చేసి రెస్టారెంట్స్ తెరిచేస్తాం కూడా"

"అల్పమూ అశాశ్వతమూ అయిన ఐహిక సుఖాల కోసం వువ్విళ్లూరుతూ అసలు సిసలు బ్రహ్మానందాన్ని చేజార్చుకుంటున్న వెర్రివారు మీ మానవులు"

"అక్కడికి నువ్వేదో దేవుడివైనట్టు మాట్లాడతావేంటి? వేషం వేసుకుంటే వేషగాళ్లు అవుతారుగాని దేవుళ్లు అయిపోరు"

"నేను నిజంగా దేవుడ్నయ్యా"

పడి పడీ నవ్వేడు బ్రహ్మానందం. "భలే జోకు వేశార్సార్. అబద్ధపు దేవుళ్లు కూడా వుంటారా సార్?"

"వక్ర దృష్టి మానుకో. జిహ్వని అదుపులో వుంచుకో"

"పోండి సార్. దేవుడెవరో దెయ్యమెవరో మాకు తెలీదనుకోకండి. మీరు దేవుడు కాదుగాక కాదు. ముమ్మాటికీ కాదు. అంతే"

"మరెలా రుజువు చేసుకోను? ఏమైనా మహత్యాలు చూపించనా?"

"సర్కార్ నుంచి పట్టాభిరాం వరకూ ఎందరివో మ్యాజిక్కులూ ఇంద్రజాల మహేంద్రజాల విద్యలూ చాలా చూశానయ్యా. ఖాళీ బిందెలోంచి నీళ్లు రప్పిస్తారు. పెట్టెలో కూర్చుని మాయమై మరోచోట తేలతారు. మనిషిని పెట్టెల్లో బంధించి కత్తుల్తో పొడిచినా అతడికేమీ కాదు. అబ్బో–అలాటివి చాలా చాలా చూశాన్లే. మనలో మనమాట. ఈ కనికట్టు విద్యలు నువ్వెవరి దగ్గర నేర్చుకున్నావు?"

"నేను నేర్చుకోవడం ఏవిటి మూర్ఖా! నేను భగవంతుడ్ని"

"అయితే మీకూ నాకూ అనుసంధామైనది అంబికా దర్బార్ బత్తి"

"అదేవిటి?"

"టీవీ యాడ్స్ చూస్తే తెలుస్తుంది. మీ లోకంలో టీవీలున్నాయా సార్? అన్ని ఛానల్సూ వస్తాయా? ముఖ్యంగా స్టార్‌ప్లస్ వస్తుందా? అందులో వస్తోన్న బేవాచ్ ఎప్పుడైనా చూశారా? ఒక్కసారి చూస్తే చాలు ఎలాటి ఋషీశ్వరుడైనా సరే సాగిలపడిపోవాల్సిందే. ఎవరికీ చెప్పన్లెండిగాని సార్ మీరెప్పుడైనా చూశారేవిటీ?"

"నీ అమాయకత్వమునకు జాలి కలుగుచున్నది"

"అమాయకత్వం నాదా నీదా? వేషం వేసుకొచ్చి ట్రిక్కులు చెయ్యగల్ను. నేనే దేవుడ్నంటే నమ్మెయ్యడానికి మేమేం సత్తెకాలపు సత్తెయ్యలం కాదు"

"హతవిధీ! ఏమి కాలము దాపురించింది. నా దర్శనార్థం వేనవేల సంవత్సరాల ఘోర తపస్సు చేసిన వారిని చూశాను. ప్రత్యక్షం కాగానే వరాలడిగిన ఋషుల్నీ అసురుల్నీ చూశాను. కానీ నీలాంటి మూర్ఖపు శిఖామణిని ఇప్పుడే చూస్తున్నాను"

"ఇంతకీ మీరు చెప్పేదేమిటి? మీరు దేవుడు గనుక మీరు ప్రత్యక్షమయ్యారన్చెప్పి ఆహా ఓహో అంటూ పొగుడ్తూ భజన చెయ్యాలంటారు. నైవేద్యాలు సమర్పించి వరాలు కోరుకోవాలంటారు. ఒకవేళ వరం అడగానే అనుకోండి. మా రూపాయల నోట్లు ఇవ్వగలరా? లేకపోతే మా బాబాల్లా శివలింగాలూ ఉంగరాలూ వీభూదీ మాత్రం ఇస్తారా?"

"పిచ్చి ప్రశ్న! మానవుని అజ్ఞానమే కాదు అహంకారమునూ భరింపశక్యంగాకున్నది. ఏవో కొన్ని విద్యలు నేర్చి విధ్వంసకాయుధములు సృష్టించినంత మాత్రాన మానవుడు అతి బలవంతుడని విర్రవీగుట అతడి అజ్ఞానమునకు ప్రత్యక్ష తార్కాణము''

"మొత్తం మా వాళ్లందర్నీ కలిపి తీసిపారేస్తున్నారేవిటి కథ? మమ్మల్ని తక్కువగా అంచనా వెయ్యకండి. దేవాంతకులం తెలుసా?"

"తెలుసు. అన్న వస్త్రాల సంగతి మరచి అణ్వస్త్రాలు సృష్టిస్తున్న ఘనులాయె! పచ్చని ప్రకృతిని వికారముగ కలుషితాలంకారిగా మారుస్తున్న శూరులాయె!"

"అయితే మీకొచ్చే నష్టమేమిటి చెప్పండి. అసలు మీ బాధేవిటి?"

"పిచ్చివాడా. మొత్తం మానవాళికే వినాశనం ముంచుకొస్తోంది. ఆ సంగతి గ్రహించవేమి? నివారణోపాయాన్ని అన్వేషించవేమి?"

"నేనొక్కడ్నే దారుణాలు చేసేస్తున్నట్టు మాట్లాడతారేంటి? భలేవారే. బుద్ధి తక్కువై మీతో మాట్లాడుతున్నట్టుంది. మా గోలా మా గొడవా మేం చూసుకుంటాం గాని మహానుభావా ఇక మీరు దయచేయండి"

''అజ్ఞానాంధకారంలో అలమటిస్తూ పరమాత్మజ్యోతిని చూడకుండా కళ్లు మూసుకుంటున్నావు"

"బాబూ! బుద్ధొచ్చింది. లెంపలేసుకుంటున్నాను. ఇక వెళ్లండి మీ బోధలకి నా బుర్ర గిర్రున తిరుగుతోంది"

"అది కాదయ్యా..."

"చేతులు జోడించాను స్వామీ. నాకు అర్జంటు పని వుంది"

"ఇప్పటికినీ నా నిజ రూపమును గుర్తించలేకున్నావు మానవా. నీ దృష్టి లోపమునకు మనసున ఖేదము కలుగుచున్నది"

"ఇన్ని మాటలేల? దేవుడి నిజస్వరూప లావణ్యము లన్నియునూ మాకు బాగుగా తెలియును గాని నన్నిహ కరుణించి వదలిపెట్టండి మహాప్రభో!"

"ఏమీ! నీవెటుల చూసితివి?"

"కళ్లతో. నేను మాత్రమే కాదు, ఆంధ్రదేశ ప్రజలందరునూ అనేకమార్లు చూసితిరి. తరించితిరి"

"ఎట్టెట్టా... బహు చిత్రముగానున్నదే. నాకు తెలియకుండా నన్ను చూసితిరా?"

"నిన్ను కాదయ్యా. దేవుడ్ని చూశాం"

"దేవుడు నాలాగా ఉండరా?"

"ఉండరుగాక ఉండరు. ఆయనకీ మీకూ పోలికే లేదసలు"

"ఎంత అవమానం. నా ఓరిమిని పరీక్షించు చుంటివి. దేవుడి ఎదుట అటుల తూలనాడుట సాహసము కాదు దుస్సాహసము"

"పోదురూ. మీరు నిజంగా దేవుడైతే మేం చూసిన దేవుడి రూపంలో రండి అప్పుడు నమ్ముతాను"

"అనగా నీ తాత్పర్యమేమి? నీ దృష్టిలో దేవుడు ఎట్లుండునో చెప్పెదవా?"

"ఎందుకు చెప్పను? కావలిసినచో నిలువెత్తు వాల్ పోస్టరే చూపెదను"

"అటులనా. ఎట్లుండునో చెప్పుము వినెదను"

"మా యన్టీఆర్లా ఉండును స్వామీ!"

"ఏమేమీ?"

"తెలుగులోనే చెబుతున్నాను కదా అలా నుదురు కొట్టుకుంటారెందుకు? దేవుడు యన్టీఆర్లా ఉండును. మీరు యన్టీఆర్లా లేరు గనుక మీరు దేవుడు కాదు గాక కాదు. దట్సాల్"

ఆ మాటలకి ఆయన హఠాత్తుగా శిలప్రతిమగా మారిపోయాడు.

"అరె... ఇలా జరిగిందేమిటి చెప్మా? కొంపదీసి ఇతగాడే దేవుడు కాదుకదా? యన్టీఆర్ పోయాక దేవుడు రూపం మార్చుకోలేదు కదా? దేవుడూ... దేవుడూ!"

"ఏవిటండీ! కలవాట్లు పలుకుతున్నారేమిటి?" బ్రహ్మానందాన్ని లేపి అడిగింది శ్రీలక్ష్మి.

బిత్తరపోయి చుట్టూ చూశాడతను.

శిలావిగ్రహం లేదు.

"హమ్మయ్య! అయితే అదంతా కలన్న మాట! మై గాడ్!"

* * *

**(ఆంధ్రభూమి వారపత్రిక 8.4.2000)**

# స్కూటరోపాఖ్యానం

"**శ్రీ**లూ...శ్రీలూ...!" రాగ యుక్తంగా పలుకుతూ హుషారుగా ఇంట్లో అడుగుపెట్టాడు బ్రహ్మానందం.

"ఇవాళ గాలిలో తేలిపోతున్నారేవిటి సినిమా చూసొస్తున్నారా!" పని చేసుకుంటూనే అంది శ్రీలక్ష్మి.

"అబ్బా! నా మూడ్‌ని ఖూనీ చేసి పారేస్తున్నావు కదా. అసల్నీకో సర్ర్పయిజ్ న్యూస్ చెబుదామనొచ్చాను తెలుసా?"

"మీకన్నీ చిత్రాలే. ఎలక చచ్చినా చిత్రమే పిల్లి సవత్తాడినా చిత్రమే!"

"అబ్బబ్బా..." జుట్టు పీక్కోబోయి నిగ్రహించుకుని ముఖానికి నవ్వు పులుముకుని అన్నాడు "శ్రీలూ! మనకోసం, మన ఆనందం కోసం చక్కనిది పెద్దది గొప్పది నడిచేది అయిన వాహనం తెచ్చానోయ్. ఒక్కసారి వీధిలోకి దయచేస్తారా మేడమ్!"

"ఏనుగుని తెచ్చారా ఏం ఖర్మ?"

ల



చేతులు తుడుచుకుంటూ శ్రీలక్ష్మి, ఆ వెనుకే బ్రహ్మానందం వీథిలోకొచ్చారు. రిక్షాలోంచి కొత్త స్కూటర్ని దింపుతూండడం చూసి నోరెళ్ళబెట్టిందామె.

"స్కూటర్ కొన్నారా? మీకు డ్రైవింగ్ రాదు కదా!"

"నన్నంత తక్కువగా అంచనా వేయకోయ్. నాకు వాహనగండం వుండి డ్రైవింగ్ నేర్చుకోలేదు గానీ..."

"సొరకాయల సీజన్ కాదు గానీ విషయంలోకి రండి"

"నా బుర్ర ఎంత అమోఘమో చెప్పడం ఎందుకు రేపు ప్రత్యక్షంగా చూద్దువుగాన్లే. ముందు మన స్కూటర్‌కి పూజా గట్రా చేసి నిమ్మకాయలు కట్టేసేయ్!"

"ఏవిటో! ఎవరి పిచ్చి వాళ్లకానందం!" నవ్వి వెళ్లి పోయింది గానీ జవాబివ్వలేదు.

మర్నాడు ఆఫీసుకు సెలవు పెట్టి ముందు గదిలో సోఫాలో ట్రిమ్‌గా తయారై కూర్చున్నాడు బ్రహ్మానందం.

కాళ్ళూపుతూ పేపర్ మీదేదో రాస్తోంటే "పేరంటానికెళ్తున్నట్లు తయారై కూర్చున్నారేమిటి?" అనడిగింది శ్రీలక్ష్మి.

"ఇంటర్వ్యూలో ఏమేం ప్రశ్నలడగాలీ అని కుస్తీపడుతున్నానోయ్!" ఫోజు కొట్టాడు.

"మీ ఆఫీసులో ఖాళీలున్నాయా? మా అన్నయ్యగారబ్బాయికి వేయించండి ప్లీజ్... ప్లీజ్" గెడ్డం పట్టుకుంది.

"నువ్విలా బ్రతిమాల్తోంటే భలే ముచ్చటేస్తోంది శ్రీలూ!"

"నా రికమండేషన్ పట్టించుకోకపోతే రోజూ కూరలో ఇంతింత ఉప్పు వేస్తాను. అసలే మీకు బీపీ ఉంది జాగ్రత్త" బెదిరించిందామె.

"అమ్మో! అంత పని చేయొద్దుగానీ ఇది ఆఫీసులోని ఉద్యోగానికి కాదు. మనింట్లోని ఉద్యోగానికి ఇంటర్ వ్యూ..."

"మనింట్లోనా? ఎర్రగా బుర్రగా వున్న కుర్ర దాన్ని పీఏగా వేసుకుందామనుకుంటు న్నారా? ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు సినిమా నేనూ చూశాను. వెర్రి మొర్రి వేషాలేస్తే ఇల్లెక్కి అరుస్తాను. ఖబడ్దార్!"

"స్టెప్నీ సెటప్ చేసేంత హీరోని కాదే బాబూ! ఏదో సంసారపక్షపు హీరోనిగాని కాస్త శాంతించి ఈ ప్రకటన చూడు చాలు"

పేపర్ అందించాడు. అందులో 'స్కూటర్ డ్రైవర్ కావలెను. వాక్ ఇన్ ఇంటర్ వ్యూ!' అను ప్రకటన చూసి నీరసపడిపోయింది శ్రీలక్ష్మి.

"మీరు సఫారీ సూట్ వేసుకుని హీరోలా స్కూటర్ డ్రైవ్ చేస్తుంటే కంచిపట్టుచీర కట్టుకుని మీ నడుం చుట్టూ చేతులేసి వయ్యారంగా కూర్చుని అలా అలా గాలిలో తేలిపోతూ ఎక్కడెక్కడికో వెళ్లిపోవాలని నేను కన్న కలలూ కలర్ దృశ్యాలూ అన్నీ కల్లలేనా?" కళ్ళొత్తుకుంటూ అంది.

"అంత పెద్ద డైలాగులొద్దు. నేనసలే తెలుగులో ముప్పై శాతం గాడ్ని. నీ కలల భాష తర్వాత వింటాను. అదిగో అప్పుడే ఓ కేండిడేట్ వచ్చేస్తున్నాడు. ఇంటర్వ్యూకి రెడీగా వుండాలి"

"నేను కూడా వుంటానండీ. మీరెలా ఇంటర్వ్యూ చేస్తారో చూస్తాను ప్లీజ్''

"ఓకే. ఇట్స్ మై ప్లెజర్. ఎలా అదరగొట్టేస్తానో చూసి ముద్దుల్తో మెచ్చుకుందువు గాని'

మరో అరగంటకి నలుగురొచ్చారు. వాళ్లంతా ఇంటర్వ్యూకే వచ్చారని నిర్ధారణ చేసుకున్నాక పరీక్షగా చూశాడు.

వారిలో ముగ్గురు లావుగా వున్నారు. సీటు మూడొంతులు అతగాడే ఆక్రమించేస్తాడని వెళ్లిపొమ్మన్నాడు. ఆ కండిషన్ పేపర్ ప్రకటనలో పేర్కొనలేదు గనుక రానూపోనూ ఆటో చార్జీల క్రింద తలో యాభై లాక్కుపోయారు.

ఇక మిగిలినవాడు చిదంబరం. సన్నగా రివటలా వున్నాడు.

"నీ పేరేమిటోయ్?"

"చిదంబరం అంటారండంతా!"

"నువ్వేమంటావు?"

"నేనూ అంతే అంటానండి!"

"నీ కళ్ళేమిటి అదోలా వున్నాయి. ఒకటి అటు, ఒకటి ఇటు చూస్తున్నట్లు!'

"అందుకే మనల్ని కళ్ళు చిదంబరం అంటారండీ" గలగలా నవ్వేస్తూ అన్నాడు.

"అందులో అంతలా నవ్వాల్సిందేముంది?"

"మనది త్రీసైడ్ లుక్కండీ. ముందుకు ఈ పక్కకి ఆ పక్కకి కూడా ఒకేసారి సూసేస్తాను. త్రీడీ టైపన్న మాట"

"జాగ్రత్తగా డ్రైవ్ చేయగలవు కదా!"

"ఇంతవరకూ అరడజను యాక్సిడెంట్లు చేశాను. ఒక్కసారీ నాకు గానీ, నా బండికి గానీ చిన్న పాటి దెబ్బ తగల్లేదు"

"మరి... అవతలి వాళ్ళు..."

"భూమ్మీద నూకల్లేక పోయారు"

గడగడా గ్లాసుడు నీళ్ళు త్రాగేశాడు బ్రహ్మానందం.

"సరేనోయ్. నువ్వు సెలక్టయ్యిందీ లేందీ తర్వాత తెలియజేస్తాను'

"అదేం కుదర్దు. ఇప్పుడే తేల్చి చెప్పేయాలి"

"ఇంకా కేండిడేట్స్ వస్తారు కదా. వాళ్ళని కూడా ఇంటర్వ్యూ చేయాలి కదా!'

"ఇంకెవర్రారు"

"ఏం ఎందుకు రారు?"

"తలమాసినోడు తప్ప స్కూటర్ డ్రైవర్‌గా ఎవడొస్తాడు?"

"సరే చిదంబరం! నిన్ను సెలెక్ట్ చేస్తున్నాను. తొమ్మిది నుండి ఆరింటి దాకా నీ డ్యూటీ!"

"ఓకే! ఆ టైమ్‌ని మించి పని చేస్తే ఓటి ఇవ్వాలి. లేకపోతే టైము అవగానే ఎక్కడున్నది అక్కడే వదిలి చక్కాబోతాను"

"రోడ్డు మధ్యలో ఆపేసిపోతావా? కనీసం ఇంటి దగ్గర కూడా డ్రాప్ చేయవా?"

"చేస్తాను. ఇంకా రాత్రేళ ఎక్కడెక్కడికో వెళ్లాలన్నా తీసుకెళ్తాను. కానీ ఓటీ ఇవ్వాలి"

"సరే. రేపట్నుంచొచ్చేయ్!"

చిదంబరం స్కూటర్ నడుపుతుంటే బ్రహ్మానందం వెనకాల కూర్చుని హాయిగా ఆఫీసుకీ, బజారుకీ ఫ్రెండ్స్ దగ్గరికీ వెళ్ళొస్తున్నాడు చాలా హేపీగా వుంది.

కానీ ఒకళ్ళిద్దరు "ఫ్రీ లిఫ్ట్ సౌకర్యం భలే పట్టావు గురూ!" అని కామెంట్ చేశారు. దాంతో ఒళ్లు మండి కారు డ్రైవర్‌కి లాంటి యూనిఫాం అతడికి కుట్టించేడు.

"ఇవాళ సినిమా కెళ్దామండీ!" గోముగా అంది శ్రీలక్ష్మి.

"ఓకే. డ్రైవర్ రాగానే వెళ్దాం. రెడీ అవ్వు"

"మా వారు చాలా మంచివారు"

"అప్పుడే ఏం చూసావ్. ఆటో ఖర్చు లేకుండా చల్‌మంటూ స్కూటర్ మీద వూరంతా తిప్పి తీసుకొస్తానోయ్!"

"ఏమైనా మీ బుర్ర అమోఘమండీ!'

"నువ్వు తెలివైందానివి గనుక గ్రహించావు"

ఇద్దరూ రెడీ అయ్యారు. డ్రైవర్ రాలేదు.

"టైమ్ అయిపోతోందండీ. పోనీ రిక్షామీద వెళ్లి పోదాం"

"ష్. స్కూటరుండగా రిక్షా మీద వెళ్లాల్సిన ఖర్మ మనకేమిటి?"

"టైము అయిపోతోంది మరి!"

"వస్తాడు. వచ్చేస్తుంటాడు. అదిగో వచ్చేశాడు"

"సిటీ బస్సు దొరకలేదు. స్కూటర్ని ఇంటికి తీసుకెళ్తానంటే ఒప్పుకోరాయె!" ఆలస్యానిక్కారణం తను కాదన్నట్టుగా అన్నాడు చిదంబరం.

"సరి సరే గానీ సినిమాకి టైమవుతోంది త్వరగా స్టార్ట్ చెయ్యి"

అతడు స్కూటర్ స్టార్ట్ చేశాక బ్రహ్మానందం మధ్యలోనూ, శ్రీలక్ష్మి చివర్నా ఇరికించుకుని కూర్చున్నారు.

"చీర నలిగిపోతోందండీ" శ్రీలక్ష్మి గొడవ పెట్టింది.

"ఏం ఫర్లేదు. ఫైవ్ మినిట్స్. పోనీవోయ్. కాస్త మెల్లగా పోనీయ్. స్పీడ్ బ్రేకర్ వుంది జాగ్రత్త. ఆ లారీవాడు దూసుకొస్తున్నాడు కాస్త లెఫ్టుకి పోనియ్! అక్కడ గొయ్యి వుంది స్లో... స్లో.." దారి పొడవునా బ్రహ్మానందం సూచనలిస్తుంటే "మీ రన్నింగ్ కామెంటరీ ఆపకపోతే స్కూటర్ ఆపేస్తాను" అని బెదిరించాడతడు.

దాంతో నోరు మూసుకోక తప్పింది కాదు బ్రహ్మానందానికి.

సెంటర్లో ట్రాఫిక్ కానిస్టేబుల్ విజిల్ వేస్తూ వచ్చి ఆపేడు.

"త్రీ రైడింగ్ నేరం. కమాన్ పేరు చెప్పండి" ఐరన్‌లెగ్ శాస్త్రి అన్నాడు జేబులోంచి చిన్న బుక్ తీస్తూ.

"చూడండి పర్వతాలు గారూ..."

"షటప్. నా పేరు శాస్త్రి... ఐరన్ లెగ్ శాస్త్రి"

"ఆ సంగతి విజిల్ వేసినప్పుడే తెలిసిందిలెండి. ఈ సారికి వదిలెయ్యండి సార్!"

"కుదర్దు. నేను యమస్ట్రిక్టు"

"మా వారికి డ్రైవింగ్ రాదండీ" అని శ్రీలక్ష్మి చెప్పబోయింది గానీ చెప్పనివ్వలేదు బ్రహ్మానందం.

"మీరు చాలా మంచివార్సార్. అసలు మీ పెర్సనాలిటీ యమ అదిరిపోతోందనుకోండి. మీ ఫేస్‌లో కూడా ఏదో అద్భుతకాంతి....."

"పొడుగు కబుర్లు చెప్పొద్దు. మనతో వ్యవహారం చకాచక్ ఢమాఢమ్. ముందు పేరు చెప్పండి"

"అదికాదు కానిస్టేబులుగారూ!"

"నేనేం వినను"

ఇతడు బ్రతిమాలటం, అతడు విదిలించడం చూసి చూసి విసుగొచ్చి "ఓ అయిదొందలిలా పారెయ్యండి చెబుతా" అన్నాడు చిదంబరం బ్రహ్మానందంతో.

"అంతెందుకు?"

"ఒకసారివ్వండి చెబుతా!"

సందేహిస్తూనే ఇచ్చాడు బ్రహ్మానందం. ఓ వంద కానిస్టేబుల్ చేతిలో పెట్టి "వదిలెయ్యండి సార్!" అన్నాడు.

"సరే. నీ ముఖం చూసి వదుల్తున్నాను. ఇంకెప్పుడూ ఇలా వెళ్లొద్దు. నేను యమ స్ట్రిక్టు. జాగ్రత్త"

మిగతా నాలుగొందలూ జేబులో పెట్టుకుంటుంటే "అదేమిటి?" అనడిగాడు.

"ఈ నెల జీతం. నీకూ నీ కొలువుకీ రాం రాం"

"ఆఁ! కనీసం మా ఇంటి దగ్గర డ్రాప్ చేసెళ్ళరా నీకు పుణ్యం వుంటుందీ!"

విన్పించుకోకుండా వెళ్లిపోయాడు చిదంబరం.

"అయ్యో! ఇప్పుడెలాగే!"

కొంగు బిగించింది శ్రీలక్ష్మి. "మీరు వెనకాల కూర్చోండి"

"ఓహో! నన్ను కూర్చోబెట్టి తోసుకుంటూ వెళ్తావా! నువ్వెంత గొప్ప పతివ్రతవే" అంటూ బ్రహ్మానందం కూర్చున్నాడో లేదో స్కూటర్ స్టార్ట్ చేసి ముందుకు దూకించిందామె.

"బాబోయ్! నీకు డ్రైవింగ్ వచ్చా? చచ్చేంరా దేవుడా! రేపే డ్రైవింగ్ నేర్చేసుకుంటాను తండ్రోయ్!"

* * *

**(ఆంధ్రభూమి వారపత్రిక 6.1.2000)**

# వేయి కళ్లు

ఆదివారం.

బ్రహ్మానందం కూనిరాగం తీస్తూ స్నానం చేసొచ్చేసరికి ఘుమఘుమలాడే పెసరట్ ఉప్మా ప్లేటు అందిచ్చింది శ్రీలక్ష్మి.

"ఓహ్! పెసరట్ ఉప్మా. మై ఫేవరేట్ డిష్. చాలా థాంక్స్ శ్రీలూ" ప్లేటు మీద దాడి చేస్తూ అన్నాడు.

"ఎలా వుందండీ?"

"అమృతం. ఇలా నోట్లో పెట్టుకుంటే అలా కరిగిపోతోందోయ్. పెసరట్ ఉప్మా చెయ్యడంలో నీకు నువ్వే సాటి"

తర్వాత సేమ్యా పాయసం తెచ్చిచ్చింది.

"ఏవిటివాళ అన్నీ నాకిష్టమైనవి చేశావు?" కించిత్తు సంశయిస్తూ అడిగాడు.

"మీ ఆనందమే నా ఆనందం కదా"

"అలాగని కొత్త చీరకో నగకో టెండర్ పెట్టవు కదా?"



"మీ అంతట మీరు కొన్నారు గాని నేనెప్పుడైనా అడిగానా చెప్పండి"

'అడగలేదు. పీక్కు తిన్నావంతే' స్వగతంగా అనుకున్నాడు.

"ఇప్పుడింకేం టెండర్లు లేవంటావు. నిశ్చింతగా త్రాగొచ్చంటావు"

"మీరు భలే చిత్రంగా మాట్లాడతారండీ"

"అవునవును"

పాయసం త్రాగి "భేషుగ్గా వుంది శ్రీలూ. ప్రతి సండే ఇంత కమ్మగా టిఫిన్ చెయ్యకూడదూ?" అన్నాడు.

"ఇక నుంచి తప్పకుండా చేస్తానండీ. మీ సంతోషమే నా సంతోషం"

"ఇవాళ కొత్తగా కన్పిస్తున్నావోయ్"

"ఛీ పోదురూ..." సిగ్గు పడింది.

"కొత్తగా కన్పించడానికీ సిగ్గుపడటానికీ సంబంధం ఏవిటి?"

"ఏదో బీరకాయపీచు సంబంధం లెద్దురూ. నాకో చిన్న సాయం చెయ్యరూ" గోముగా అంది.

గుండెల్లో రాయి పడగా "సాయమా?" అన్నాడు.

"బుల్లిదేనండీ. మీరు కొంచెం బజారు కెళ్ళాలి"

"ఇన్సల్ట్! నా గురించేమనుకుంటున్నావసలు?"

"తెలివైనవారు. చక్కగా బేరం చేస్తారు. ఎంచక్కని సరుకు తెస్తారు. ఎవరి బుట్టలోనూ పడరు – అనుకుంటున్నానండీ"

మురిసిపోయాడు బ్రహ్మానందం.

"అఫ్‌కోర్స్. నువ్వు చెప్పిందంతా కరక్టే. నాకు వేయికళ్లు. నన్నెవరూ బురిడి కొట్టించలేరు. సరే. చక్కని పెసరట్ ఉప్మా పెట్టావు. గనుక ఏం కావాలో చెప్పు టీవీయస్ మీద దూసుకెళ్లి తెచ్చేస్తాను"

"చేపలు"

ఆమె వాక్యం పూర్తి కాకుండానే కెవ్వుమని అరిచాడు.

"నాతరం కాదు బాబోయ్"

"అది కాదండీ..."

"ఇంకేం చెప్పొద్దు తల్లోయ్. ఆ జనసంద్రంలోకి నేను దూకలేను బాబోయ్. నన్ను వదిలేసెయ్యి. నీకు చేపలు ఇష్టమని నన్నిలా అగ్నిగుండంలోకి దూకమనడం అన్యాయం, ఘోరం!"

"కాస్త చెప్పేది విన్పించుకోండీ"

"నేను వినలేను తండ్రోయ్! చేపల బజారు తలచుకుంటే చాలు గుండె బేజారై పోతుంది" మంచమెక్కి మరీ గంతులేశాడు.

"మీకిష్టమైన వాలిగ చేపలొస్తున్నాయిటండీ"

గంతులాపి అన్నాడు. "ని...నిజమా...?"

"మీతోడు! మీకిష్టమనే వెళ్లమంటున్నాను. ప్రక్కింటి వాళ్లు తెచ్చుకున్నారండీ"

"మనక్కూడా తెమ్మనకపోయావా?"

"బతికిన చేపలు వాళ్లు తీసుకుని చచ్చినవి మన మొహాన కొడతారు. మీరైతే అన్నీ చూసి బావున్నవి తెస్తారు. అసలు మీ సెలక్షనే అద్భుతం"

"పద్మవ్యూహంలోకి చొరబడడం తేలిక గాని చేపల బజార్లో - అదీ నెల మొదటి ఆదివారం నాడు - ఎవరివల్లా కాదు!"

"అలాగనొద్దు ప్లీజ్. మీ కోసం మీరీమాత్రం త్యాగం చెయ్యలేరా?"

"బరువు డైలాగులొద్దు గాని వెళ్తాన్లే"

"మావారెంత మంచివారో" అంటూ సంచి అందించింది.

ఉసూరుమంటూ బయల్దేరాడు బ్రహ్మానందం.

దారిలో ఒకతను మోపెడ్‌కి అడ్డంగా వచ్చి ఆపేడు "స్టాప్ స్టాప్" అంటూ.

"ఎందుకాపేవ్!" కోపం చిరాకు మేళవించి అడిగాడు బ్రహ్మానందం.

"హలో బాగున్నారా!"

చెయ్యి చాచి షేక్ హాండ్ ఇస్తూ అన్నాడు.

"నువ్వు నాకు తెలీదే. నేన్నీకు తెలుసా?"

"మీరు మనిషని నాకు తెలుసు. ఇంకేం తెలియాలి?"

"ఆ సంగతి ముఖం చూస్తేనే తెలుస్తోందిలే. నేననేది నా గురించి తెలీడం అని"

"ఇప్పుడు తెలుసుకుంటాను. మీ పేరేమిటి?"

"పేరెందుకు?"

"మీ గురించి తెలుసుకుందామని"

"బ్రహ్మానందం. ఇక వదుల్తావా నాయనా!"

"వదలను తండ్రీ. నా పేరు చిడతల అప్పారావు. మీ వయసెంత? ఎత్తెంత?" ఒక బౌండ్ పుస్తకమూ పెన్ను తీసుకుని రాయడానికి సిద్ధమై అడిగాడు.

"ఈ వివరాలు ఎందుకు?"

"ఇదో రకమైన సర్వే అన్నమాట. ఎదురొచ్చిన వారి వివరాలన్నీ సేకరించడం నా హాబీ!"

"నీ హాబీ సంతకెల్ల. ఇంకెవడ్నన్నా చూసుకో"

"ఇందాకొకడు అలా అన్నందుకే నిన్ను చూశాను"

"నేనూ ఇంకోడ్ని చూసుకోమంటున్నానుగా. నన్ను వెళ్లనిచ్చి చూసుకోవచ్చు కదా!"

"ఇంకో మనిషికి సహాయపడడం నీ ధర్మం. చెప్పు నీ వయస్సెంత?"

"ముప్పై రెండు"

"ఎత్తు?"

"5' 5"

"బరువు?"

"నా బరువు నీకవసరమేమిటి?"

"మనందర్నీ భూదేవే మోస్తోంది. ఆవిడెంత బరువు మోస్తోందో తెలుసుకోవాలి కదా. ఒకవేళ బరువెక్కువైతే ఎవరెవరి బరువు తగ్గించాలో తెలుసుకోవాలి గదా!"

"నీకూ నీ గోలకీ ఓ నమస్కారం. నన్ను వదిలేస్తే వెళ్లిపోతాను"

"ఎక్కడికి?"

"చేపల బజారుకి"

"ఎందుకు?"

"అదేం పిచ్చి ప్రశ్నరా. చేపల బజారుకెందుకెళ్తారు? చేపలు కొనడానికి?"

"ఎవరు కొనమన్నారు?"

అతడ్ని ఎగాదిగా చూస్తూ "మా ఆవిడ" అన్నాడు.

"ఆవిడకోసం నువ్వెందుకు కొనడం?"

"తిండానికి"

"ఆవిడే వచ్చి కొనుక్కోవచ్చుగా!"

'నీలాటి వాడు ఎదురైై బుర్ర తినేస్తాడని' అని లోపలనుకుని "నేనుండి చచ్చానుగా అందుకని" అన్నాడు విసుగ్గా.

"నువ్వు ఛస్తే ఏం చేస్తుంది?"

"తనే వచ్చి కొనుక్కుంటుంది"

"ఆ పని ఇప్పుడే చేయవచ్చుగా?"

"నేనింకా చావలేదుగా. నువ్వెంత మాటలతో పొడిచినా చావనుగా. నువ్వు వదలకపోతే చంపుతానుగా. అసలే నాకు డ్రైవింగ్ రాదుగా. ఆ పైన నీ ఇష్టంగా" అంటూ టీవియస్ స్టార్ట్ చేశాడు. అతగాడు పారిపోయాడు.

మార్కెట్ బాగా రద్దీగా వుంది. బయట మోపెడ్ పెట్టడానికి జాగాలేదు. అటూ ఇటూ చూసి కాస్త ఎడంగా ఒక సందులో పార్కు చేశాడు.

బజార్లో ఇసుకవేస్తే రాలనంత జనం. తోసుకుంటున్నారంతా. చేపల కంపు. లోపలికెలా వెళ్లాలో చేపలెలా కొనాలో తెలీలేదు. ఆ వాతావరణం అదీ చూసేకొద్దీ మాంసాహారం మీద విరక్తి కలగసాగింది.

"మీలాంటి ఆఫీసర్లు ఇలాంటి చోట్లకి రాకూడదండీ" సన్నగా ఈనుప్పుల్లలా వున్నతనొచ్చి అన్నాడు బ్రహ్మానందంతో.

"నువ్వు..."

"ధమ్... అమలాపురం ధమ్అంటే ఆలోవర్ మార్కెట్లో మార్మోగిపోద్ది. ఆయ్.... అంతేనండి మరి. తమలాటోరికి సేవ చేయడానికున్న హనుమంతుడ్నండి. చెప్పండి ఏం కావాలి?"

"అంటే నువ్వు బ్రోకరువా?"

"చిన్న మాటతో ఎంత పెద్ద దెబ్బ తీశారండి బాబు. కొబ్బరికాయ నెత్తిమీద పడ్డట్టు కుదేలైపోయానంటే నమ్మండి. మీలాంటి ఆఫీసర్లకి మాంచి ఒకటో రకమైన సరుకు

కొనివ్వడం ఈ ధమ్‌గాడి ప్రత్యేకతండి. డోర్ డెలివరీ సర్వీసు కూడా వుందండి. తమరి ఇల్లెక్కడో చెప్పండి శాన, వారం వారం వచ్చి వాలిపోతాను"

"దుర్గా కాలనీలో నాలుగో వీధి. ఆఫీసర్ బ్రహ్మానందం గారి ఇల్లంటే ఎవరైనా చెబుతారు"

"రైట్. ఇప్పుడు మనకేం కావాలండి? చేపలా మాంసమా?" చొరవగా సంచి లాక్కుంటూ అడిగాడు.

"చేపలే అనుకో"

"ఇంకేం చెప్పొద్దు. చెరువు చేపలు ఇందాకే మావోడు తెచ్చాడు. ఒకటో రకమైన సరుకు. బొచ్చు, వాలిగ, సందువాయి, కొర్రమీను, పీత, రొయ్య – ఏం కావాలో చెప్పండి క్షణాల్లో తెచ్చి పెట్టేస్తాను"

అతడ్ని పూర్తిగా నమ్మలేక "నేనూ వస్తాను పద" అన్నాడు.

"రండి. మీరొత్తే మరీ మంచిది. కానీ లోపల కూరేత్తారండి. కుమ్మేత్తారండి. ఆయ్... అంతేనండి మరి. ఆనక తమరిష్టం. ఫస్ట్‌వీక్ కదండీ. జనం ఇరగబడి పోతున్నారు"

"సరే. చిన్నదీ, చక్కనిదీ, మరీ ముదురు మరీ లేత కానిది అయిన వాలిగ చేప కొనిపెట్టు"

"ముప్పై నలభైల్లో తెమ్మంటారా? వాగు చేపలైతే ఇంకా తక్కువలో వస్తాయండి. కానీ రుచి ఉండవు. మీలాటోళ్ళు తిన్లేరు. ఒకటో రకమైన చెరువు చేప తెస్తానండి. ఇంత తక్కువ రేటుకి ఎలా కొనితెచ్చానా అని మీరే ఆశ్చర్యపోతారు చూడండి. తమరిక్కడ ఎండలో ఏం నిలబడతారుగానీ అల్లక్కడి హొటల్లో కూర్చుని టీ త్రాగుతుండండి. టీ త్రాగేలోపు తెచ్చేత్తానండి"

పర్సులో చిల్లరలేదు. అనుమానంతో పీక్కుంటూనే వంద నోటు ఇచ్చాడు.

"చేపని శుభ్రం చేయించి ముక్కలుగా కోసి తీసుకురానాండీ. అమ్మగారికి తేలిగ్గా వుంటాది" వెళ్ళబోయే ఆగి అడిగాడు.

“ఆ పని చెయ్యవోయ్”

అతడు బజార్లోకి దూసుకుపోయాడు సంధించి విడిచిన బాణంలా.

“మంచోడు దొరికాళ్ళే. నా పని మరీ ఈజీ అయిపోయింది” అనుకుంటూ దగ్గర్లోని హెూటల్ ముందు నిలబడ్డాడు బ్రహ్మానందం.

పది నిమిషాలు గడిచాయి. ధమ్ రాలేదు. మరో పది నిమిషాలు కూడా కరిగి పోయాయి. అతగాడి జాడలేదు.

బ్రహ్మానందానికి ఒకటే టెన్షన్‌గా వుంది. ‘ఆ డబ్బుతో అటే పారిపోలేదు కదా! ఛా... అలాటి వాడు కాదులే. నన్ను మోసం చేసి బ్రతగ్గలడేవిటి?’ అనుకుంటూ ఎదురు చూశాడు.

అరగంట దాటిపోయింది. ఎక్కడా పత్తాలేదు. మరి ఎదురు చూళ్లేక జనంలోకి చొరబడ్డాడు.

అంతా త్రోశారు. గెంటారు. కాళ్ళు తొక్కారు. తిట్టేరు. అన్నీ భరిస్తూ అంతా వెదికాడు. త్రోపులాటలో ఓ చోట బేలన్స్ తప్పి కింద పడ్డాడు. బట్టల్నిండా చేపల మురికి అంటుకుంది. ఒళ్లు జలదరించింది. భార్యనీ ధమ్‌నీ కసిదీరా తిడుతూ వెదికాడు.

కన్నీళ్లు పొంగి రాబోతోంటే నిగ్రహించుకుని చూసి చూసి నిరాశపడ్డాడు. అయిందేదో అయిందని చేపలు కొందామని చూస్తే వాలిగలూ అయిపోయాయి.

‘భలే టోకరా ఇచ్చాడే’ అనుకుంటూ మార్కెట్లోంచి బయడ పడ్డాడు. ‘ఈ సంగతి శ్రీలూకి తెలిస్తే ఎంత ఇన్సల్ట్! కనీసం సంచి దొరికినా బావుణ్ణు ఏదో కోసేసేవాడు...’ అనుకొంటోంటే హెూటల్ ముందు ధమ్ కన్పించాడు. ప్రాణం లేచి రాగా పరుగునెళ్లాడు.

“ఇందాకట్నుంచి వెదుకుతున్నాను ఎక్కడికెళ్లేరండీ?”

అతడి చేతిలో సంచీ అందులో సరుకూ కన్పించాయి. అతడ్ని అనవసరంగా అనుమానించానే అని సిగ్గుపడ్డాడు.

“బట్టలేమిటి నీచు కంపు కొడుతున్నాయి’

"ఏం లేదులే. ఎంతయ్యిందేమిటి?" సంచి అందుకుని అందులోని చేప ముక్కల్ని చూసి సంతృప్తి పడుతూ అన్నాడు.

"నలభై అయిందండి. ఇవాళ మార్కెట్ మండిపోతోందండి. గీచి గీచి బేరమాడితే ఇంత కొచ్చిందండి. ఇందండి మిగతా డబ్బు"

అతడి మంచితనాన్ని మెచ్చుకుంటూ ఓ పది రూపాయాలిచ్చాడు. విజిటింగ్ కార్డిస్తూ "ప్రతి ఆదివారం వచ్చి కన్పించు. మాక్కావాల్సినవి తెచ్చిపెడుదువు గాని. నీ కష్టం వుంచుకోన్లే" అన్నాడు.

"తమరి పరిచయం అయింది. ఇంక వదుల్తానా చెప్పండి. ఒకటో రకమైన చేపండి. అమ్మగారు ఖుషీ అయిపోతారండి. ఆయ్. ధమ్‌గాడి పనంటే అంతేనండి మరి"

"మంచిదోయ్ వస్తాను"

హుషారుగా ఇంటికెళ్లాడు బ్రహ్మానందం.

"చూడవోయ్! ఫస్ట్‌క్లాసయిన వాలిగ ముక్కలు తెచ్చాను చూడు. గీచి గీచి బేరమాడి భలే చవగ్గా ముప్పై రూపాయలకే కొనుక్కొచ్చాను. ఇప్పుడైనా తెలిసిందా మనమేవిటో" ఫోజు కొట్టాడు.

సంచిలోని ముక్కల్ని చూసి, "ఇవీ చేప ముక్కలేనా. ఇందాక పంపేరు కదా!" అనడిగింది ఆశ్చర్యపోతూ శ్రీలక్ష్మి.

"నేను పంపడమేమిటే"

"ఈ సంచిలో వేసుకుని వాలిగ తెచ్చిచాడు"

"ధమ్మా?"

"ధమ్మో ధమ్మో ఏదో పేరు చెప్పేడు. మీరు పిట్టల్ని బేరం చేస్తున్నారనీ రెండొందలు తెమ్మన్నారనీ చెబితే ఇచ్చేను!"

ఆపై మాటలు వినబళ్లేదు బ్రహ్మానందానికి. ఆసరికే దభీమని పడిపోయాడు!

* * *

**(ఆంధ్రభూమి వారపత్రిక 23.3.2000)**

# పదవి

"ఈ వీథిలోని బ్రహ్మానందానికి సుబ్బారావుకి చలపతిరావుకి యాదగిరికి ఆంజనేయులుకి వారి వారి సతీమణులకి ఓట్లున్న వారి సంతానానికీ వందనాలు వేనవేల వందనాలోయ్..."

కూరగాయల బండి వాడిలా అరుస్తోంటే అంతా తమతమ ఇళ్లలోంచి బయటి కొచ్చారు.

కౌన్సిలర్ కె.కె.శర్మ ఖద్దరు బట్టలూ టోపీ ధరించి చిర్నవ్వు పెదాలకి అతికించుకుని రెండు చేతులూ ఫెవికాల్తో అంటించినట్టు జోడించి వచ్చాడు. అతడి వెనకాల తలమీద కుర్చీ పెట్టుకుని మోస్తూ వచ్చాడు నౌకరు.

బ్రహ్మానందం ఇంటి ముందాగాడు. నౌకరు కుర్చీ వేయగా గబుక్కున దానిమీద కూర్చున్నాడు శర్మ.

"మా ఇళ్లల్లో కుర్చీల్లేవనుకున్నారా ఏకంగా కుర్చీ మోయించుకొచ్చారు"

"అమ్మమ్మ అలా అనకు. ఆ కుర్చీ అంటే నా పదవి. పదవి అంటే నా ప్రాణం. మాయలఫకీరు ప్రాణం చిలకలో వుంటే నా ప్రాణం ఈ కుర్చీలో వుంది"



"అందుకే దాన్ని జాగ్రత్తగా దాచేసి రావొచ్చుగా" ప్రక్కింటి సుబ్బారావు అన్నాడు.

"నా పోలసీ వేరు. నేనింకొకరి కుర్చీలో కూర్చోను. ఇంకొకర్ని నా కుర్చీలో కూర్చోనివ్వను. ఇది మన పర్మనెంట్ సెటప్ అన్నమాట"

"అలా అనుకున్న ఎందరో నామరూపాల్లేకుండాపోయారు" చలపతిరావు వ్యాఖ్యానించాడు.

"నేను కౌన్సిలర్ని, ఏవిటనుకున్నావో"

"ఇరవై ఏళ్ల క్రితం నేను రాజకీయాల్లోకి దిగి వుంటే ఈపాటికి కేంద్ర మంత్రినవుదును తెలుసా?" చలపతిరావు గద్దింపునకాయన మరి మాట్లాడలేకపోయాడు.

"శర్మగారూ! మీ కుర్చీ మీద యం.సి. అని రాసి వుందేవిటండీ" ఏమీ ఎరగనట్టు అడిగాడు బ్రహ్మానందం.

"యంసీ అంటే మున్సిపల్ కౌన్సిల్. ఈ కుర్చీ వాళ్లదే కాని కౌన్సిలర్‌గా నాకిచ్చారు. సమావేశాలుంటే అక్కడికి పట్టుకెళ్లి కూర్చుంటానన్నమాట. నేను లోపలున్నా బయటున్నా కౌన్సిలర్నేగా!"

"అవును. ఏనుగు చచ్చినా బతికినా వెయ్యి రూపాయలే" అన్నాడు చలపతిరావు.

"ఈయనెవడండి బాబూ నన్ను నిలువునా చంపేస్తున్నాడు" వాపోయాడు శర్మ.

"నన్ను ఎవడంటావా? ముప్ఫై ఏళ్ల క్రితం రిజర్వ్ బ్యాంక్‌లో చేరుంటే ఈపాటికి దానికి గవర్నర్‌ని అవుదును తెలుసా?" మీది మీదికెళ్లాడు చలపతిరావు.

"ఇప్పుడు తెలిసింది గాని వదిలెయ్యవయ్యా పెళ్లాం పిల్లలు గలవాణ్ని"

"నువ్వు కాస్త ఆవేశం పాలు తగ్గించుకోవాలోయ్ చలపతీ... చెప్పండి కౌన్సిలర్‌గారూ! ఇంత పొద్దున్నే మా నామస్మరణ చేస్తూ ఎందుకొచ్చినట్టు?" అడిగాడు బ్రహ్మానందం.

"మునిసిపల్ ఎన్నికలొస్తున్నాయి. అందుకని ఓ సారి మీ అందర్నీ పలకరించి మీమీ ఆశీస్సులందుకుందామని" వినమ్రంగా చెప్పేడు.

"అసలు మీరీ అయిదేళ్లలో చేసిన మంచి పనులేంటో చెప్పండి చూద్దాం" బ్రహ్మానందం నిలదీశాడు.

"చెడ్డ పనులు కూడా చెప్పండి"

చలపతి రావు వంక ఏడుపు ముఖంతో చూసి బర్రున ముక్కు చీదాడు శర్మ. "గతం గతంబే అన్నారు. గతకాలము కంటె వచ్చు కాలము మంచిదన్నారు"

"ఆమాత్రం పాండిత్యం నాకూ వుంది. ఇరవై ఎనిమిదేళ్ల క్రితం కవిత్వం రాయడం మొదలెట్టుంటే ఈపాటికి గొప్ప కవినైపోదును తెలుసా?" ఆవేదన పడ్డాడు చలపతిరావు.

"నీకన్ని కళల్లోనూ గొప్ప ప్రావీణ్యం వుందని మా అందరికీ తెలిసిపోయింది కానీ నువ్వు కాస్త తగ్గు. ఆయన చెప్పేదేదో చెప్పనీ, మళ్లీ ఇలా అడగటానికి అయిదేళ్ల దాకా కన్పించడు"

బ్రహ్మానందం మాటలకి యాదగిరి వంతపాడాడు. "అవుమల్ల. గీడు బద్మాష్ గాడు. నల్ల గురించి అడగబోతె ఇంట్లవుండె లేడన్పించిండు"

"ఈపేటలో డ్రైనేజ్ సిస్టం లేదు. ఎటు చూసినా మురికి కాల్వలూ పందుల స్నానాలూ దోమల కచేరీలూనూ. ఒక్కనాడైనా మీ వార్డు బాగోగులు చూశారా" ఆంజనేయులు నిలదీశాడు.

"గడ్డీ గాదం కరెంటు వైర్లూ బల్బులూ కంకరా సిమెంటూ తినటానికే సరిపోయింది టైమంతా!" మళ్లీ అందుకున్నాడు చలపతిరావు.

జుట్టు పీక్కుంటూ "మంచి గతమున కొంచమే అన్నారు కదా పెద్దలు. అంచేత గతం గురించి మాట్లాడుకోవడం మానేసి భవిష్యత్తు గురించి ముచ్చటించుకుందాం. నా అభిప్రాయంతో ఏకీభవిస్తారా?" అడిగాడు శర్మ.

"గొప్ప యాక్టర్లా నటించకు మరి. పదిహేనేళ్ల క్రితం మద్రాసు రైలెక్కుంటే ఇవాళ సూపర్‌స్టార్‌నవుదును తెల్సా?"

"నువ్వన్నీ అయ్యి వుండే గాడివి గాని కాస్త కూల్ డౌన్ కూల్ డౌన్" చలపతిరావుని దువ్వి అన్నాడు బ్రహ్మానందం. "మళ్లీ మిమ్మల్నీ మీ మాటల్నీ నమ్మి మీకే ఓటు వెయ్యమంటారు. మేం మీకళ్లకెలా కన్పిస్తున్నాం? వెర్రి వెంగళప్పల్లానా? పిచ్చి గొర్రెల్లానా?"

"శర్మగారూ! ఈ వార్డు ఆడోళ్లకి రిజర్వ్ చేస్తారంట కదండీ" అన్నాడు ఆంజనేయులు.

"అలా అయితే నా భార్యని నిలబెడతాను. నా భార్యకే మీ ఓటు వెయ్యండి. కుర్చీ ముందు ఆవిడ్ని నిలబెట్టి కుర్చీలో నేను ముడుచుక్కూర్చుంటాను. ఎలా వుంది మన పథకం?" ఆశగా అడిగాడు శర్మ.

"పరమ రోతగా ఏడిసినట్టుగా వుంది" అన్నాడు చలపతిరావు.

ఈలోగా శర్మ మాటలు విన్న శ్రీలక్ష్మి కొంగు బిగించి రంగంలోకి దిగిపోయింది.

"ఏవిటీ. మీ ఆవిడ్ని ముందు నిలబెట్టి వెనక నుంచి మీరు చక్రం తిప్పుతారా? మేమేమైనా మీలాగా వాజమ్మలం దద్దమ్మలం అనుకున్నారా? మా స్త్రీ శక్తి పిడికిలి బిగిస్తే మహిషాసురులూ సారాసురుల్లానే పదవాసురులు కూడా మసైపోతారు జాగ్రత్త!"

"శ్రీలూ శ్రీలూ! నువ్వు నువ్వేనా?" నోరెళ్లబెట్టాడు బ్రహ్మానందం.

"ఇంత క్రితమే టీవీలో స్త్రీలకి జరుగుతున్న అన్యాయాల గురించి చూశాను. నా రక్తం సలసల మరిగిపోతోంది"

"టీవీలో జోకొట్టే సినిమా కార్యక్రమాలే గాని మత్తు వదిలించే కార్యక్రమాలెప్పుడు మొదలెట్టారే" అనింకేదో అనబోతుంటే అడ్డొచ్చాడు కెకె శర్మ.

"క్షమించు చెల్లెమ్మా! నేను మా ఆవిడ వెనకుండి చక్రం తిప్పను. ప్రక్కన పీఏలా నిలబడి గొడుగు పడతాను కాని మీ ఓట్లన్నీ నాకు లేకపోతే నా భార్యకే వెయ్యాలి వేయించాలి. ఈ అన్నని వెన్నుపోటు పొడవ్వు కదా?"

"ఇరవై ఏళ్ల క్రితం జులాయిగా మారుంటే ఇవాళ దాదానై నీ జుట్టు పట్టుకుని ఆడిద్దును ఏవిటనుకున్నావో" అన్నాడు చలపతిరావు.

"మరందుకే నువ్వలా మారలేదోచ్" గంతులేశాడు శర్మ.

బ్రహ్మానందానికి ఆవేశం వచ్చేసిందొక్కసారిగా.

"ఏమైనా సరే మీ పద్ధతేం బావోలేదు సార్. ఎంతసేపూ మీ పదవీ మీ పైరవీలూ మీ పైపాటేనా? కాస్త కాకపోతే కాస్తయినా మీ వార్డు బాగోగులు పట్టించు కోకపోతే ఎలా చెప్పండి. నమ్మకంగా ఓట్లేసి గెలిపించినందుకు కృతజ్ఞత చూపాల్సిన బాధ్యత మీమీద లేదా చెప్పండి. దేశం కోసం ఎందరో మహానుభావులు ఎన్నెన్నో త్యాగాలు చేసి మరెన్నో ఇడుముల పాలై జైళ్లలో మ్రగ్గి తుపాకి గుళ్లకి గుండెలొడ్డి మరీ సాధించిన స్వరాజ్యాన్ని మీ సొంత జాగీర్లా భావిస్తూ నిలువునా దోచుకోవాలని చూస్తే మేం సహించం! భరించం!"

చప్పట్ల వర్షం కురిసింది. చలపతిరావు ఉత్సాహంగా "బ్రహ్మానందానికీ జై" అన్నాడు.

మిగతా వాళ్లూ వంత పాడారు. అభినందనల్తో ముంచెత్తారు.

"వుండండి వుండండి. మా ఆయనకి దిష్టి తగులుతుంది" హడావిడి చేసింది శ్రీలక్ష్మి.

గాలి తీసిన బుడగైపోయాడు శర్మ. కన్నీళ్లు పొంగి రాగా బ్రహ్మానందం చేతులు పట్టుకున్నాడు.

"ఇవి చేతులు కావు బ్రహ్మానందం"

"చేతులేనయ్యా"

"కాళ్లలాంటి చేతులు పట్టుకుని బ్రతిమాల్తున్నాను. నాకు పోటీ రాకు. నానోట్లో మట్టి కొట్టకు. నీ పనులన్నీ ప్రతిఫలం ఆశించకుండా చేసే పూచీ నాది. ప్లీజ్ బ్రహ్మానందం"

"నాకేమీ అక్కర్లేదు. మా వీధికి మేలు చెయ్యి చాలు"

"ఓకే ఓకే ఓకే. ఇంకేం మాట మార్చొద్దు. ఎన్నికలవగానే టకటకా చకచకా చేసేస్తాను. మీ అందర్తో కమిటీ వేసి మీరేం చెబితే అదల్లా చేసేస్తాను. మీ బాగే నా భాగ్యం. ఎలా వుంది స్లోగన్?'

"పాతికేళ్ల క్రితం స్లోగన్లు రాయడం మొదలెట్టి వుంటే ఈ పాటికి సినిమా రచయితనై పోదును" బాధపడ్డాడు చలపతిరావు.

"ఇప్పటికైనా మించిపోయింది లేదుగాని నువ్వేదనుకుంటే అది మొదలుపెట్టు" అన్నాడు బ్రహ్మానందం.

"మొదలెట్టెయ్యమంటావా బ్రహ్మానందం. నీ మాటంటే నాకు యమగురి. నువ్వు వూ అంటే దూకేస్తాను" లుంగీ బిగిస్తూ లాంగ్ జంప్‌కి సిద్ధమైపోయినట్టు వూగిపోతూ అన్నాడు చలపతిరావు.

"ఎందులోనైనా దూకుగాని రాజకీయాల జోలికి మాత్రం రాకు నాయనా. అసలే ఈ రంగంలో నిరుద్యోగ సమస్య ఎక్కువగా వుంది. నాయకులు పెరుగుతున్నారు గాని పదవులు పెరగటం లేదు. జనాభాతో బాటు అవి కూడా పెంచొద్దూ? ఎన్నేళ్ళ క్రితమో

వున్నట్టే ఇవాళ కూడా యమ్మెల్యే సీట్లూ యంపీ సీట్లూ వుంటే ఎలా చెప్పండి? ఇంత తీవ్రమైన సమస్య గురించి మీరెందుకు ఆందోళన చెయ్యరు?"

"మా గురించీ మేమే చేసి మీ గురించీ మేమే చేస్తామా – వెళ్ళెళ్లవయ్యా చెప్పొచ్చావు గాని" అన్నాడు సుబ్బారావు.

"మీరేం చెయ్యొద్దు గాని జై కొట్టండి చాలు. శుభమా అంటూ ఎన్నికల ప్రచారం మొదలెట్టాను. ఒక్కసారి జై కొట్టండి ప్లీజ్.... మీ అందరికీ వందనాలు... 'జై'లు ప్లీజ్..." చేతులు జోడించి మరీ అర్థించాడు శర్మ.

"ఇంకా ఎన్నికలు ప్రకటించ లేదు. అప్పుడే 'జై'లు ఎవడు కొడతాడయ్యా. మా చేతులు ఖాళీలేవు వెళ్ళెళ్లు" కసురుకున్నాడు చలపతిరావు.

"జై–లు కోసం ఆత్రులు చాచొద్దు. అడ్డమైన గడ్డీ గాదం తినొద్దు. తింటే జైలు పాలు కావాల్సొస్తుంది జాగ్రత్త" అన్నాడు బ్రహ్మానందం.

"మంచి పనులు చేస్తే జైజైలు. చెడ్డ పనులు చేస్తే జైలు. కాలం మారిపోయింది" నవ్వేడు చలపతిరావు.

అవునవునన్నారంతా.

బిక్క చచ్చిపోయి అందరికీ విచారంగా షేక్ హేండిచ్చి వెళ్లిపోబోయాడు. అతడి నౌకరు యధా ప్రకారంగా కుర్చీని నెత్తిమీదికెత్తుకోలేదు.

"నా కుర్చీయే నా ప్రాణం. ఎత్తుకోరా"

"ఈ బాడుకావ్ పని నేన్చెయ్యను. నాకు బుద్ధొచ్చింది" అంటూ విసురుగా వెళ్లిపోయాడతడు.

మరేం చేయాలో తోచలేదు శర్మకి. ఏం చేస్తాడా అని ఉత్సుకతతో చూస్తూ నిలబడ్డారంతా.

అటూ ఇటూ చూసి కుర్చీ తలమీద పెట్టుకుని పరుగందుకున్నాడు శర్మ!

* * *

**(ఆంధ్రభూమి వారపత్రిక 10.2.2000)**

# ముఖ్య అతిథి

"నమస్కారం సార్"

ఓ ముగ్గురు పెద్ద మనుషులు బ్రహ్మానందం కేబిన్లోకొచ్చి నమస్కరించారు.

"నమస్కారం. రండి కూర్చోండి"

వాళ్లు కూర్చున్నాక "వాట్ కెన్ ఐ డూ ఫర్యూ. నేను మీకేం చెయ్యగలను?" రివ్వాల్వింగ్ చెయిర్లో అటూ ఇటూ తిరుగుతూ స్టయిలుగా అడిగాడు.

ఆఫీసర్‌కి ట్రాన్స్‌ఫర్ రావడంతో అతడిప్పుడు ఇన్చార్జి ఆఫీసరయ్యాడు మరి.

"మిమ్మల్నో కార్యక్రమానికి ముఖ్యులుగా పిలుద్దామని వచ్చాం సార్"

బ్రహ్మానందం గుప్పుమని వెలిగింది బ్రహ్మానందం మొఖంలో.



అది కనబడకుండా అర్జంటుగా ఫీలింగ్సు మార్చేసుకుని "నేను చాలా బిజీ మనిషిని. మీకు తెలుసో లేదో ఆఫీసు భారమంతా నా భుజస్కందాల మీదే వుంది. అలాగని ఎంతో ఆశతో వచ్చిన మిమ్మల్ని నిరాశపర్చనూ లేను. ఇంతకీ కార్యక్రమం ఎప్పుడు? ఎక్కడ?"

"పన్నెండవ తారీఖునండి"

"కష్టమనుకుంటాను..." అంటూ డైరీ తిరగేశాడు. "కంగ్రాట్స్. మీరు చాలా అదృష్టవంతులు. ఆరోజున నాకేం ఎంగేజ్‌మెంట్స్ లేవు. తప్పకుండా వస్తాను"

"చాలా సంతోషం. నాగభూషణంలాంటి మంచి మనిషి గురించి జరుగుతున్న కార్యక్రమంలో మీలాంటి పెద్దవారు ప్రముఖ అధికారి పాల్గొనడానికి అంగీకరించినందుకు చాలా సంతోషంగా వుంది. సాయంత్రం ఆరు గంటలకి కార్యక్రమం. అయిదున్నరకే మీ ఇంటికి కారు పంపుతాం సార్"

నాగభూషణం ఎవరో కార్యక్రమ వివరాలేమిటో తెలీలేదు బ్రహ్మానందానికి. అడుగుదామనుకుని, అంతలోనే అలుసైపోతానన్పించి వూరుకుండిపోయాడు. 'ఇన్విటేషన్ కార్డులు అచ్చు వేయించాక వచ్చి ఇస్తారుగా అప్పుడు తెలుస్తుందిలే' అనుకున్నాడు.

ఫంక్షన్‌కి ముందు నాగభూషణం వివరాలెలాగూ రాసిస్తారు గనుక దాన్ని బట్టి ఉపన్యసించెయ్యొచ్చులే – అని సరిపెట్టుకున్నాడు.

"కారు ఇంటికే పంపించండి. అట్నించటే వచ్చేస్తాను"

"మీకు మా కృతజ్ఞతలెలా చెప్పాలో తెలీడం లేదు"

"భలేవారే. నాగభూషణంలాంటి ప్రముఖ వ్యక్తి గురించి ఏర్పాటు చేసిన సభలో పాల్గోవడం నాకే గర్వకారణం"

"అయితే నాగభూషణం గురించి మీకు తెలుసన్న మాట"

"ఆయన గురించి తెలీని వాళ్లెవరు?" కోసేశాడు.

"మాకు చాలా ఆనందంగా వుంది" అని చెప్పి వెళ్లిపోయారు. వెంటనే ఇంటికి ఫోన్ చేశాడు బ్రహ్మానందం.

"శ్రీలూ! నేను మా ఆఫీసుకి సోల్ మోనార్క్‌నైపోయానని వూరందరికీ తెలిసిపోయిందోయ్"

"ఎలా తెలిసిందంటారు?" శ్రీలక్ష్మి అడిగింది ఫోన్లో.

"మాలాంటి పెద్ద పెద్ద ఆఫీసర్ల గురించి జనమంతా చెప్పుకుంటారుగా. మౌత్ పబ్లిసిటీ అన్నమాట. అంటే వూళ్లోని ప్రముఖ వ్యక్తుల్లో నేనూ చేరిపోయానన్నమాట. ఇక చూసుకో. మనల్ని ప్రతి కార్యక్రమానికీ పిలిచేస్తారు చూడు. సూటు వేసుకుని నేనూ పట్టుచీర కట్టుకుని నువ్వూ ఎంచక్కా హాజరైపోవచ్చు"

"నాకు చాలా సంతోషంగా వుందండీ. ఇంతకీ ఫంక్షన్ ఏవిటండీ? సినిమా యాక్టర్లు ఎవరైనా వస్తున్నారా?"

"అదీ...నాగభూషణం అనే ఓ ప్రముఖ వ్యక్తికి..."

"సన్మానమా?"

"అవును. అలాటిదే. ఎవరో సినిమా యాక్టర్ని కూడా పిలిచే వుంటారు. ఈ చుట్టు ప్రక్కల సినిమా షూటింగ్‌లు బాగా జరుగుతున్నాయి కదా"

"అయితే నేనూ వస్తానండీ. మీరెంత బాగా ఉపన్యసిస్తారో చూస్తాను. సినిమా యాక్టర్లతో ఫొటోలు దిగుతాను"

"ఓకే ఓకే... నాలాంటి పబ్లిక్ ఫిగర్ భార్యవైనందుకు నీకూ పేరొస్తుంది. గ్లామర్ పెరుగుతుంది"

"నాకు చాలా చాలా సంతోషంగా వుందండీ..."

"దిసీజ్ జస్ట్ ఎ బిగినింగ్. ముందు ముందు నువ్వే చూస్తావుగా" అంటూ రిసీవర్ పెట్టేశాడు.

కాసేపటికొచ్చిన ప్యూన్ గుండు "ఆఫీసు స్టాఫంతా మిమ్మల్ని తెగ మెచ్చుకుంటున్నారు సార్" అన్నాడు.

"ఎందుకోయ్..."

"సభకి వెళ్లడానికి అంగీకరించారట కదా. అలాటి చిన్నవారి సభకెళ్తున్నందుకు అంతా అభినందిస్తున్నారు సార్"

"వాళ్లు బ్రతిమాలారు. కాదన్లేకపోయాను. నాకు పెద్దవారూ చిన్నవారూ అన్న తేడా లేదోయ్. మంచితనం వుంది చూశావూ అది ముఖ్యం. అందుకనే సాటి మనిషిగా వారి అభ్యర్థనని అర్థం చేసుకున్నాను. అంగీకరించాను"

"మీరు చాలా ఎదిగిపోయార్సార్" అతడి కళ్లల్లో నీళ్లు తిరిగాయ్.

"నువ్వెక్కడో పిచ్చోడివి. ఇదీ నా డ్యూటీలో ఓ భాగమే. పబ్లిక్ రిలేషన్స్ చాలా ముఖ్యమోయ్" అన్నాడు. తన భాషలో భావాల్లో ఎంతెంతో మార్పు వచ్చేసినట్టు గమనించి గర్వంగా ఫీలయ్యాడు.

అవును మరి. తనిప్పుడు ఇన్చార్జి ఆఫీసరు. రేపో మాపో ఈ సీటు పర్మనెంట్ అయిపోవచ్చు కూడానూ!

బ్రహ్మానందం ఇంటికెళ్లేసరికి పట్టుచీరలన్నీ మంచం మీద పరచి గెడ్డం క్రింద చెయ్యి పెట్టుకుని కూర్చునుంది శ్రీలక్ష్మి.

"ఇదంతా ఏవిటి శ్రీలూ"

"ఫంక్షన్‌కి ఏ చీర కట్టుకోమంటారు?"

"ఇంకా నాలుగు రోజుల టైము వుందే. ఇప్పట్నుంచీ హడావిడి ఎందుకు?"

"భలేవారే. ఇప్పుడు మొదలుపెడితే అప్పుడు హర్రీ వుండదు. మీరేం వేసుకుంటారు? త్రీపీస్ సూటా సఫారియా?"

"త్రీపీస్ సూట్ అయితే హుందాగా బావుంటుందేమోనే..."

"బాగుంటుంది గాని పెళ్లినాటి సూట్ బిగుతవుతుందేమో. వచ్చే నెలలో రెండు సూట్లు కుట్టించెయ్యండి"

"అలాగేగాని బిగుతవడానికి ఏమంత లావెక్కాననీ, ఇప్పుడే తొడుక్కుని చూస్తానుండు"

సూట్ ధరించి అద్దంలో చూసుకున్నాడు. కొంచెం టైట్‌గా వున్నా బావుంది.

"సినిమా హీరోలా వున్నారండీ"

"ఛాన్స్‌రాక గాని నేను హీరోనే కదా. వయసు కూడా తగ్గినట్టు కన్పిస్తోంది కదూ"

"మీ వయస్సెంతనీ! ఆ 'టై' మాత్రం బాగోలేదు. 'పెళ్లి చేసుకుందాం'లో వెంకటేష్ కట్టుకున్నాడే ఆ టైపుది కొత్త ఫాషనండీ. అలాటిది కొనండి"

"ఓకే. శ్రీమతి ఆజ్ఞ శిరసావహిస్తాం"

"మీ డ్రెస్ ఇట్టే తెమిలిపోయింది. నాకేది బాగుంటుందో కొంచెం చెప్పరూ?"

"నీకు ఏదైనా బాగుంటుంది. ఏమీ లేకపోయినా బాగుంటుంది" నవ్వేడు.

"మిమ్మల్నీ..." కొట్టబోయింది.

"వున్నమాట అంటున్నానోయ్. మనం ఇద్దరమేగా వున్నదీ"

"అయితే మాత్రం మరీ అంత పచ్చిగా సిగ్గులేకుండా..."

"ఇంక అనన్లేగాని ఫంక్షన్లో పాల్గొన్నందుకు చక్కని మెమెంటో ఇస్తారు శ్రీలూ. దాన్ని డ్రాయింగ్ రూంలో ప్రముఖంగా కన్పించేలా పెడదాం"

"నిజంగా ఇస్తారంటారా?"

"మేమేంటో చూడండి అని ఇచ్చేదే మెమెంటో. చాలా చక్కని జ్ఞాపిక ఇస్తార్లే. సినీ నటుడొస్తే అతగాడి చేతే ఇప్పిస్తారు"

"అయితే ఆ ఫోటోని ఎన్లార్జ్ చేయించి ముందు గదిలో తగిలిద్దాం"

"గుడ్ ఐడియా"

"ఆఫీసర్ భార్యనా మజాకా!"

హాయిగా నవ్వుకున్నార్దిరూ.

పన్నెండో తారీఖున నాలుగింటికే ఇంటికెళ్లిపోయాడు బ్రహ్మానందం.

అతడికి చాలా టెన్షన్‌గా వుంది.

అవాళొచ్చి పిలిచి వెళ్లటమే గాని వాళ్లు మళ్లీ రాలేదు. ఆహ్వాన పత్రిక ఇవ్వలేదు. నాగభూషణం వివరాలూ చెప్పలేదు. అసలు ఫంక్షన్ జరుగుతుందో లేదో ముఖ్య అతిథిగా తన పేరు వుంచారో తీసేశారో అని ఒకటే ఆందోళనగా వుందతడికి.

అలాటి మార్పేదైనా జరిగితే తప్పకుండా వచ్చి చెబుదురని సమర్ధించుకుంటూ చకచకా తయారయ్యాడు.

అయిదు గంటలకే ఇద్దరూ చక్కగా అలంకరించుకుని రెడీ అయ్యారు. ఒకర్నొకరు పొగుడుకున్నారు. పన్లోపనిగా ఇద్దరూ ప్రక్కప్రక్కన నిలబడి రెండు మూడు ఫొటోలు తీయించుకోవాలని కూడా అనుకున్నారు.

అయిదున్నరయింది. కారు రాలేదు.

"ఇంకా కారు రాలేదేవిటండీ"

"సమయానికి ఆఫీసు కారు రిపేర్లో వుంది చూడు. అయినా తప్పకుండా పంపిస్తా రోయ్. జనం వచ్చేక పంపిస్తారు. జనం రాకుండా మనం వెళ్తే బావుండదు కదా!"

"సభలో మీరేం మాట్లాడతారండీ"

"ఏమీ ప్రిపేరవ్వలేదు. నలుగురూ చెప్పిందాన్ని బట్టి అప్పటికప్పుడు ఆలోచించుకుని చెప్పేస్తాను" వివరాలు తెలీవన్న విషయాన్ని దాచిపెడ్తూ అన్నాడు.

"అంతా పదే పదే చప్పట్లు కొట్టేలా మాట్లాడాలి సుమండీ"

"నిజమే కాని నాకొంచెం కంగారు కదా. పైగా ఇది కొత్త అనుభవం. సాధ్యమైనంత వరకూ అంతా మెచ్చేలా ఉపన్యసించడానికి ప్రయత్నిస్తాను. ఇలా రెండు మూడు సభల్లో ఉపన్యసిస్తే చాలు రాటుదేలిపోతాను. ఆపైన ఎలాటి సభలోనైనా దున్నెయ్యనూ!"

"మీ తెలివితేటలు అమోఘం లెండి"

"ఆ సంగతి అర్ధమవడానికి ఇన్నేళ్లు పట్టిందన్న మాట" నవ్వేడు.

కారు హారన్ విన్పించింది.

"కారు వచ్చినట్టుంది చూడు. నేను వెంటనే బయటికెళ్తే బావుండదు. ఆత్రంగా ఎదురు చూస్తున్నాననుకుంటారు"

శ్రీలక్ష్మి వెళ్లి చూసింది. ఒకతను కారు దిగి వస్తూ "సార్ వున్నారాండి?'' అనడిగాడు.

"వున్నారు....."

బ్రహ్మానందం బయటికొచ్చాడు. అతడ్ని చూసి వచ్చినతను విస్తుబోయాడు.

"మీరు రెడీ అయితే వెళ్దాం"

"రెడీయేనోయ్... మా ఆవిడ కూడా సరదాగా వస్తోంది. రావోయ్"

అతడదోలా చూసి ముందు నడవగా వారిద్దరూ అనుసరించి వెళ్లి కారెక్కారు.

కారు ఆడిటోరియం ముందాగింది. రంగుల విద్యుద్బల్బుల తోరణాలూ సన్నాయి మేళాలూ గులాబీపూల స్వాగతాలూ ఏవీలేవు!

ఆశ్చర్యంగా లోపలికెళ్లారు. అంతా సాదాసీదాగా వున్నారు. విచారంగా వున్నారు. ఎక్కడా ఫంక్షన్ హడావిడి లేదు.

బ్రహ్మానందానికేమీ అర్థం కాలేదు.

"ఈనాటి సభకి ముఖ్య వక్తగా విచ్చేసిన బ్రహ్మానందంగార్ని స్టేజి మీదకి రావాల్సిందిగా కోరుతున్నాం"

గబగబా స్టేజివైపు నడచి స్టేజి ఎక్కుతూ వెనుకనున్న బేనర్ చూసి స్థాణువైపోయాడు.

'కీ.శే. నాగభూషణం గారి సంతాపసభ'

కన్నీళ్లు పొంగి వచ్చాయి. తడబడ్డాడు. తూలిపడబోయి నిలదొక్కుకున్నాడు. సంతాప సభకి ముఖ్య అతిథి వుండరు!

"నాగభూషణం గారంటే వీరికెంతో ఇది. కళ్ల నీళ్ల పర్యంతమవుతున్నారు చూడండి..." నిర్వాహకుడన్నాడు.

బ్రహ్మానందానికి నిజంగానే ఏడుపు ముంచుకొచ్చింది తన సూటూ భార్య పట్టు చీరా గుర్తొచ్చి!

* * *

**(ఆంధ్రభూమి వారపత్రిక 13.4.2000)**

# ఫ్రీ పాస్

**"మా** శ్రీవారింత గొప్పవారని నాకింత వరకూ తెలీదు" లోపలికొస్తూ అంది శ్రీలక్ష్మి.

"హఠాత్తుగా జ్ఞానోదయమైనట్టు మాట్లాడుతున్నావేంటి శ్రీలూ" టీపాయ్ మీద కాలు పెట్టుకుని మరీ పేపర్లోని స్పోర్ట్స్ కాలం చూస్తోన్న బ్రహ్మానందం అడిగాడు.

"రెండిళ్ళవతల వుండే విజయ ఆవిడ చెప్పే వరకూ నాకు తెలీనే లేదు సుమండి"

"ఆవిడ సంగతలా వుంచి ఆవిడ వినిపించిన కథ గురించి చెప్పు"



"మీరు నగరంలోని వీఐపీల్లో ఒకరంటకదా"

గాలి కొట్టిన బెలూన్లా ఉబ్బిపోయాడు. మొఖం డబుల్ సైజుకి ఎన్లార్జ్ కాగా ముసి ముసి నవ్వులు కుమ్మరించాడు.

"మన ఊళ్ళోని ముఖ్యమైన ఆఫీసర్లలో నేనూ ఒకడ్ని కదా. అంచేత మనం ఉత్త వీఐపీ కాదు వీవీఐపీ అన్నమాట"

"ఆ సంగతి కూడా చెప్పింది. మీ ఆయన హనుమంతుళ్ళాంటి వారు. ఆయన సంగతి ఆయనకి తెలీదు అని కూడా చెప్పింది"

చిన్న సైజు అనుమానప్పురుగు మెదడులో ప్రవేశించింది. నుదురు ముడి వేసి అనుమానంగా చూశాడు.

“శ్రీలూ! కొత్త టెండరేమీ పెట్టడం లేదు కదా?”

“కోరకుండానే అన్ని కోర్కెలూ తీర్చే మీరుండగా టెండర్ల గొడవనాకెందు కండీ.. ఏవండీ..ఎల్లుండు సౌందర్య మన ఊరు వస్తోందిట కదండీ”

“అవునవును. సౌందర్యకి వూళ్ళోని కల్చరల్ అసోసియేషన్ వాళ్ళు సన్మానం చేస్తున్నారు. అసలా సభకి ముఖ్య అతిథిగా రమ్మని నన్ను పిలిచారు గానీ ఖాళీ లేదని తప్పించుకున్నాను” సొరకాయ గబగబా కోసేశాడు బ్రహ్మానందం.

“అలాగా! ఒప్పుకోకపోయారా. సౌందర్య నా అభిమాన నటి అని మీకు తెలుసు కదా!” బుంగ మూతి పెట్టింది.

“తెలుసు గాని సినిమా వాళ్ళ ముందు మనల్ని పిపీలికాల్లా చూస్తారే. అందుకని వాళ్ళొచ్చే సభలకి మనం వెళ్తే మర్యాద దక్కదు”

“అతిథిగా గాకపోతే ఆహ్వానితులుగా వెళ్దామండీ రెండు పాసులు తీసుకోండి..”

పచ్చి వెలక్కాయ గొంతులోపడింది. చటుక్కున లేచి జగ్గుడు నీళ్ళూ గట గటా త్రాగేశాడు.

“ఆ జనమూ ఆ త్రొక్కిసలాట... మన్లాటి వాళ్ళం తట్టుకోలేం శ్రీలూ”

“వూహూ. నా అభిమాని నటి సన్మానాన్ని కళ్ళారా చూడని ఈ కళ్ళెందుకు చెప్పండి?’

“ఆ రూట్లోకి వెళ్ళకు మరి. పాసు దొరకటం చాలా కష్టం. ఇప్పటికే అయిపోయినా అయిపోయి వుంటాయి. సినిమా వాళ్ళంటే వేలం వెర్రి కదా జనానికి!”

“మీరిలా మాట్లాడేరని  విజయకి చెబితే ఏమంటుందో తెలుసా?”

“ఏమంటుంది?”

“మీ ఆయన వీఐపీ కాదు వెర్రి వెంగళాయి అంటుంది”

“అది కాదు శ్రీలూ.....”

“ఒక వీవీఐపీ భార్యకి పాస్ దొరకలేదంటే ఎంత ఇన్సల్ట్. నేను సౌందర్య సన్మాన సభకి వెళ్తున్నానోచ్ అని అందరికీ టాంటాం వేశాను. మీరెలా తెస్తారో ఏమో నాకు తెలీదు. మనిద్దరికీ రెండు పాసులు తేవాల్సిందే.. మనమా సభకి వెళ్ళాల్సిందే...!”

"ఎక్కడో ఊరి చివరనున్న టౌన్ హాల్లోనే ఆ ఫంక్షనూ... చాలా దూరం"

"అయినా సరే వెళ్ళి తీరాల్సిందే. మొదటి వరసలో కూర్చుని చూడాల్సిందే. నా మీద మీకు నిజంగా ప్రేముంటే మీ ఇన్ఫ్లూయన్సు ఉపయోగించి పాసులు తెస్తారు. అంతే" తెగేసి చెప్పింది శ్రీలక్ష్మి.

డీలాపడిపోయాడు బ్రహ్మానందం.

ఎంతాలోచించినా ఈ సమస్యకి పరిష్కార మార్గం తోచలేదు.

ఆఫీసుకెళ్ళాడు. యాంత్రికంగా పని చేస్తున్నాడు తప్ప అతడి బుర్రలో పాసుల వ్యవహారమే గిర్రున తిరుగుతోంది.

"డల్గా వున్నారేంటి సారూ..." ప్యూను గుండు అడిగాడు.

"ఎల్లుండు సౌందర్య సన్మాన సభకి రెండు పాసులు కావాలి. ఎలాగైనా సంపాదించి పెట్రా నీకు పుణ్యం వుంటుందీ..."

"చాలా కష్టమండి.."

"నీ కష్టం వుంచుకోన్లేరా..'

"రెండొందలు కొట్టండి"

"చాలా ఎక్కువ. కొంచెం కన్సెషన్ ఇవ్వరా.."

"నేన్చెప్పింది పండగ డిస్కౌంటు రేటు సార్.."

"సరి సరే"

రెండొందలూ చేతిలో పెట్టాడు.

"డెఫినిట్గా పాసులు దొరకుతాయి కదా.."

"ఇంక వాటి సంగతి మరచిపోండి సార్.."

ఆఫీసు నుంచి హుషారుగా విజిల్ వేస్తూ మరీ వచ్చిన బ్రహ్మానందాన్ని చూసి "పాసులు దొరికాయా?" అడిగింది శ్రీలక్ష్మి.

"ఆ విజయ అన్నట్టు నా శక్తి నాకు తెలీదోయ్. ఫలానా సభకి రెండు టిక్కెట్లు కావాలోయ్ అన్నాను. అంతే రేపు తెచ్చి మీ చేతుల్లో పెడతాం అన్నారు మా స్టాఫ్..."

గబుక్కున ముద్దు పేట్టేసుకుంది. "ఎంత గొప్ప న్యూస్ చెప్పేరండీ. సన్మాన సభకి పాసులు దొరకవని ఫోజు కొట్టింది మనోరమ. వెళ్ళి ఫోజుకొట్టి వస్తానుండండి" అంటూ వెళ్ళి పోయింది.

అతడేదో చెప్పబోయినా విన్పించుకునే మూడ్‌లో లేదామె.

ఆ రాత్రంతా బ్రహ్మానందాన్ని తెగ పొగిడింది శ్రీలక్ష్మి. కాని వాటిని ఎంజాయ్ చెయ్యలేకపోయాడతడు. ఒకవేళ గుండు తొంటిచెయ్యి చూపిస్తే ఏవిటి చెయ్యడం అని మథనపడుతున్నాడు.

బ్రహ్మానందం భయపడినట్టుగానే మర్నాడు గుండు ఆఫీసుకే రాలేదు. వస్తాడొస్తాడని చూసి చూసి మరి టెన్షన్ భరించ లేక తిన్నగా అతడింటి కెళ్ళాడు.

"పాసులేవి?"

"దొరకలేదు సారూ.."

"మైగాడ్! చావు కబురు చల్లగా చెబుతావేంట్రా... సంగతి తెలిస్తే మా ఆవిడ ఇల్లు పీకి పందిరేస్తుంది తెలుసా?"

"ఏంటి సారూ అంత ఇదైపోతారూ.. సౌందర్య నటించిన సినిమాకి తీసుకెళ్ళండి. మేడం ఐసై పోతారు"

"ఐసవ్వదు ఫైరవుతుంది. నిన్ను నమ్మి కోతలు కోశాను కదురా. ఇప్పుడెలారా దేవుడా!"

ఉసూరుమంటూ ఆఫీసుకి తిరిగొచ్చాడు బ్రహ్మానందం.

అతడి టేబుల్ మీదో కవరు పెట్టివుంది. గబుక్కున తెరచి చూశాడు.

లోపల సౌందర్య సన్మాన సభకి రెండు పాసులున్నాయి.

మహదానందపడిపోయాడు. ఎవరు పంపేరోనని కవరు వంక చూశాడు. పోస్టులో వచ్చింది. ఫ్రం ఎడ్రస్సు లేదు.

'ఎవరు పంపించేరో వారికి వేన వేల థాంక్సు. నా పరువు దక్కించారు' అని థాంక్సుల మీద థాంక్సులు చెప్పేడు.

త్వరగా ఆ వార్త శ్రీలక్ష్మి చెవిలో వెయ్యాలన్న ఆరాటాన్ని అణచుకోలేక ఓ గంట ముందుగానే బయల్దేరి ఇంటికెళ్ళాడు.

"వచ్చేరా. మీ కోసమే చూస్తున్నా. పాసులివ్వండి, ఆ విజయకి మనోరమకి చూపిస్తాను. మనకి పాసు దొరికిందంటే వాళ్లు నమ్మటం లేదండీ"

జేబులోంచి గొప్పగా తీసి ఆమె చేతిలో పెట్టాడు బ్రహ్మానందం.

పరమానందపడిపోయింది. "మీరు గ్రేటండీ. పోలీసు వాళ్ల ద్వారా ప్రయత్నించినా విజయా వాళ్లకి పాసులు దొరకలేదుట. అలాటిది మీరు సంపాదించారు. ఎవరి ద్వారా సంపాదించారండీ?"

"పోస్టులో వచ్చిందే"

"ఎవరు పంపేరు?"

"తెలీదు. బహుశా సన్మాన నిర్వాహకులే పంపి వుంటారు"

"అంతే అయుంటుంది లెండి. టౌన్లోని వీవీఐపీలందరికీ పంపి వుంటారు. ఏమైతేనేం నా ఆరాధ్యనటి సౌందర్య సన్మానాన్ని కళ్లారా తిలకించే భాగ్యం మన వీధిలో మనకే దక్కిందండీ"

మర్నాడిద్దరూ టిప్‌టాప్‌గా తయారై బయల్దేరారు.

బయల్దేరే ముందు విజయకీ మనోరమకీ ఇరుగమ్మకీ పొరుగమ్మకీ గొప్పగా చెప్పి మరీ వచ్చింది శ్రీలక్ష్మి.

"ఒకవేళ ఇవి డూప్లికేట్ పాసులు కాదు కదా?" దారిలో సందేహం వెలిబుచ్చాడు బ్రహ్మానందం.

"ఛా..ఛా.. మీ మీద ప్రాక్టికల్ జోక్ ఎవరేస్తారండీ?"

"అదీ పాయింటే అనుకో. ఆఫీసర్నా మజాకా...!"

టౌన్ హాల్లోకెళ్లి నాలుగో వరుసలో నిర్దేశించిన సీట్లో ఆసీనులయ్యారు శ్రీలక్ష్మీ, బ్రహ్మానందం.

"ఇక్కడికి చక్కగా కన్పిస్తుందండీ. మంచి సీట్లే ఇచ్చారు. అవునూ, వాళ్లెవరూ మిమ్మల్ని పలకరించరేం?"

"నన్ను ఎరగరేమో.."

"మిమ్మల్ని ఎరగరా? సభకి ముఖ్య అతిధిగా రమ్మని పిలిచేరన్నారు కదా..."

"అహా... ఎరగరంటే నా ఉద్దేశం గుర్తుపట్టలేదని... ఎంత హడావిడి పడుతున్నారో చూడు"

"నిజమేలెండి'

ఇంతలో సౌందర్య, మరికొందరు సినీ ప్రముఖులూ రాజకీయవేత్తలూ రావడంతో ముందుకి వంగి మరీ వారిని చూస్తూ వింటూ వుండిపోయింది శ్రీలక్ష్మి.

బ్రహ్మానందం మాత్రం సరిగ్గా ఎంజాయ్ చెయ్యలేకుండా వున్నాడు.

ఎంత మరచిపోదామనుకున్నా ఆ ప్రశ్న అతడ్ని వెంటాడడం మానట్లేదు.

'పాసులెవరు పంపించి వుంటారు?'

బుర్ర గోక్కున్నాడు. గెడ్డం రుద్దుకున్నాడు. జుట్టు పీక్కున్నాడు. అయినా ఏమీ తోచలేదు.

సౌందర్య సన్మాన కార్యక్రమం పూర్తయ్యింది.

ఆనందంగా ఇంటి ముఖం పట్టారు.

దారి పొడవునా బ్రహ్మానందానికి సహస్ర నామార్చన చేస్తూనే వుంది శ్రీలక్ష్మి.

ఇంటి తాళం తీసి వుండడం చూసి "తాళం వెయ్యడం మర్చిపోయినట్టున్నామే" అని కంగారు పడ్డాడు బ్రహ్మానందం.

"నేనే కదా తాళం వేసింది. తాళపు చెవి కూడా నా దగ్గరే వుంది" అంటూ తలుపు తీసి లోపలికెళ్ళిందల్లా గావు కేక పెట్టి కూలబడిపోయింది శ్రీలక్ష్మి.

ఇంట్లోని టీవీ, వీసీపి, టేప్ రికార్డర్ వగైరాలన్నీ మాయమయ్యాయి.

టేబుల్ మీద పేపర్ వెయిట్ క్రింద చిన్న స్లిప్ రెప రెప లాడుతోంటే అదుర్తోన్న గుండెల్తో వెళ్ళి చూశాడు బ్రహ్మానందం.

"మాకు సహకరించినందుకు చాలా థాంక్స్.

ఇట్లు

లగేజీ లిఫ్టర్స్"

* * *

**(ఆంధ్రభూమి వారపత్రిక 27.4.2000)**

# భవిష్యద్దర్శనం

"**న**మస్కారం'

ఫైల్లోంచి తలెత్తి చూశాడు బ్రహ్మానందం.

సన్నగా పొడుగ్గా వున్న నడి వయస్సతను ఎదురుగా నిలబడి వున్నాడు. చాలా ప్రశాంతంగా వుత్సాహంగా వున్నాడు. నుదుట ఎర్రబొట్టు దాని చుట్టూ గంధం దిద్దుకున్నాడు. భుజానికి కాషాయరంగు సంచి తగిలించుకున్నాడు. మెడలో అదే రంగు వస్త్రం వేసుకున్నాడు. ఖద్దరు దుస్తుల్లో నిరాడంబరంగా వున్నాడు.

ఆయన్లో ఏదో ప్రత్యేకత మరేదో ఆకర్షణ కన్పించగా లేచి నిలబడి "మీరు..." అని ఆగాడు బ్రహ్మానందం.

"శ్రీశ్రీశ్రీ అవతారం గారి గురించి మీరు వినే వుంటారు"

"వారేం చేస్తారు?'



"భూత భవిష్యత్ వర్తమానాలు చెప్పగల త్రికాలజ్ఞులు. జరిగిందీ జరగబోయేదీ చెప్పగల త్రినేత్ర స్వాములు..."

"జ్యోతిష్కులా! నాకు నమ్మకం లేదు. మీరు వెళ్లొచ్చు" తిరిగి కూర్చుంటూ అన్నాడు.

చిద్విలాసంగా నవ్వుతూ కుర్చీ లాక్కుని కూర్చున్నాడతడు.

"మీరలా తీసిపారెయ్యలేరు. నేను అందర్నీ ఆశ్రయించే వాడ్ని కాదు. తుచ్ఛమైన కాసుల కోసం వచ్చిన వాడ్నీ కాదు. మీ మోములో ఏదో కాంతి కన్పించింది. అందుకే ఆఫీసులో ఇంతమంది వున్నా సరాసరి మీ దగ్గరికి వచ్చాను"

మెత్తబడ్డాడు బ్రహ్మానందం. "భలే గుర్తించారే. నేను జూనియర్ ఆఫీసర్ని. మిగతావాళ్ళు గుమస్తాలు. మీ పేరేమిటి? ఇలా దయచేసిన కారణమేమిటి?"

"రంగారావు. సాక్షి మా ఇంటి పేరు. శ్రీశ్రీశ్రీ అవతారం గారి శిష్యుడ్ని. బిజినెస్ ప్రమోషన్ కేంపయిన్లో భాగంగా ఇలా వచ్చాను"

"బిజినెస్సా?"

నవ్వేడతడు. "బిజినెస్ అంటే బిజినెస్ కాదు. సర్వసంగ పరిత్యాగులకి వ్యాపార గొడవలెందుకు? అలా చెబితే ఈ కాలపు జనానికి అర్ధమవుతుందని ఆ పదప్రయోగం చేశాను. మామూలుగా అయితే తలకి రెండొందలు తీసుకుంటారు మా గురువు గారు. ఈ కేంపయిన్లో భాగంగా ప్రత్యేక డిస్కౌంట్ వల్ల నూటయాభైకే చూస్తారు"

"ఎక్కడున్నారు? ఆఫీసు బయటున్న చెట్టు క్రిందా?"

"తొందరవద్దు. ఆ తొందరే నువ్వు తొందర తొందరగా పైకెళ్లకుండా అడ్డుపడుతోంది"

"ఎట్టెట్టా!"

"కుర్రవాడివి. పిల్ల కాకిలాటి వాడివి. తొందరపడొద్దు నాయనా. ఈ ప్రక్కనే వున్న హోటల్లో విడిది చేసి వున్నారు. రూం నెంబర్ 111"

ఆఫీసు స్టాఫంతా పనినాపి తన వంకే చూస్తూండడంతో కాస్త ఇబ్బందిగా ఫీలయ్యాడు బ్రహ్మానందం.

"మీరు కాస్త త్వరగా తెమిలిస్తే బావుంటుంది"

"ఇది ఆషామాషీ వ్యవహారం కాదు. మీ భవిష్యత్ సంగతి. మీ ముఖవర్చస్సు దృష్ట్యా చూస్తే మీకు చాలా ఉజ్వల భవిష్యత్తు వుంది. చుక్కలు చూడడం ఖాయం. కాదంటే దారిలో వున్న ముళ్లూ గట్రా ఏరి పారేయించాలి"

"ముళ్లా?"

"అవున్నాయనా! అడ్డముళ్లు. చిక్కుముళ్లు. తుమ్మముళ్లు. ఎన్నో వున్నాయి మరి. దాహంగా వుంది తేనీరు తెప్పించు నాయనా" సంచిలోంచి తాపీగా ముక్కుపొడుం డబ్బా తీస్తూ అన్నాడు.

బ్రహ్మానందానికి చాలా ఉత్కంఠగా వుంది. వెంటనే భవిష్యత్తులో తానెంత వున్నత స్థానానికెగ బ్రాకబోతున్నాడో తెలుసు కోవాలనీ అడ్డంకుల్ని అధిగమించడానికేవో మంత్రతంత్రాలు వెన్వెంటనే చేసెయ్యాలనీ ఉత్సాహ పడ్డాడు.

వెంటనే ప్యూన్ గుండుని పిలిచాడు.

"మన కేంటీన్ కెళ్లి రెండు స్పెషల్ టీలు పట్రా"

"దాంతో బాటు శక్తి వక్కపొడి కూడా తెప్పించు నాయనా. జీర్ణానికి చాలా మంచిది" అన్నాడు సాక్షి.

"అది కూడా పట్రా"

"మాక్కూడా టీ ఇప్పించకూడదూ" అంటూ వచ్చింది టైపిస్టు రజని.

"ఇప్పించవోయ్. ఎందరికి టీ దానం చేస్తే నీకంత పుణ్యం లభిస్తుంది. ఆ పుణ్యమే నీ భవిష్యత్తుని ఉజ్వలంగా మారుస్తుంది"

"మీరెవరో తెలుసుకోవాలనుందండీ" అడిగిందామె.

"వుండదూ వుంటుంది. శ్రీశ్రీశ్రీ అవతారం గారి శిష్యరత్నాన్నాయె. ఇంకా ఇలా మీనమేషాలు లెక్కపెడుతూ నిలుచున్నావేమిటి నాయనా. అందరికీ టీ చెప్పేరు గాని నువ్వెళ్లి పట్రావోయ్" గుండుతో అన్నాడు సాక్షి.

"నేనే చెబుదామనుకుంటున్నాను. ఇంతలో మీరే..." వెర్రిగా నవ్వేడు బ్రహ్మానందం.

"నీ మనస్సు తెలుసు. నీ భవిష్యత్తు తెలుసు. అందుకేగా తిన్నగా నీ దగ్గరకొచ్చి నీ ఎదుట కూర్చున్నానూ!"

"మీరు జ్యోతిష్కులా? నా చేయి చూసి చెబుతారా?" రజని అడిగింది.

"ఛ్ఛ! ఎవరికిబడితే వారికి చెప్పం. మోములో ప్రత్యేకత వున్న వారికే చెప్పబడుతుంది. వీరిని చూడు. వీరి మోములో తాండవమాడుతోన్న తేజస్సుని చూడు. ఆహా ఓహో ఏమి వీరి జాతక వైభవం!"

అతడి మాటలకి వుబ్బితబ్బిబ్బయ్యాడు బ్రహ్మానందం.

అక్కడేదో జరుగుతోందని మిగతావాళ్లకి అర్థమైంది. కుతూహలంతో నలుగురు చేరారు. ఆ పిమ్మట మరో అయిదుగురు వచ్చారు. అనంతరం అంతా వచ్చి చేరిపోయారు. ఆఫీసరు కేంపుకెళ్లడంతో ఇష్టారాజ్యమైపోయింది.

అంతా గుమిగూడేసరికి ఎంబ్రాస్సింగా వుంది బ్రహ్మానందానికి. అదే సమయంలో తన గొప్పతనం అందరికీ తెలియబోతోన్నందుకెంతో ఆనందంగానూ వుంది.

"గొడవ చెయ్యకుండా కాస్త నిశ్శబ్దంగా వుండండి. వీరు త్రికాలజ్ఞులు శ్రీశ్రీశ్రీ అవతారం గారి శిష్యరత్నం ముఖాన్ని చూసి భవిష్యత్తుని ఖచ్చితంగా చెప్పెయ్యగల ప్రజ్ఞావంతులు. వీరే ఇలా వుంటే ఇక శ్రీశ్రీశ్రీ అవతారం గారి సంగతి వేరే చెప్పాలా?' అన్నీ తెలిసినట్టుగా అన్నాడు బ్రహ్మానందం.

ఇంతలో గుండూ టీ కుర్రాడూ వచ్చి అందరికీ టీ ఇచ్చారు.

టీ త్రాగి వక్కపొడి నోట్లో వేసుకున్నాక తాపీగా అన్నాడు సాక్షి.

"వీరి నుదురు చూడండి. మిగతా వారి నుదురు చూడండి. రెంటికీ ఎంత తేడా వుందో గమనించండి. మీమీ భవిష్యత్తుల్లోనూ అంతే తేడా వుంది. అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి"

ఒకరి నుదురు ఒకరు చూస్తూ తేడాల్ని గమనిస్తూ తర్జన భర్జన పడ్డారంతా.

అతడి మాటల్లో పూర్తిగా గురి కుదిరింది బ్రహ్మానందానికి. మిగతా వారి కన్నా తన ఫాలభాగం విశాలమైంది. అంచేత తనకి ఆఫీసర్ యోగం పట్టిందనుకున్నాడు. ఆయనకేదో దివ్యదృష్టి లాటిది వుంది గనుక చూసీ చూడగానే గుర్తించారనుకున్నాడు.

"మీరు కాస్త విడమర్చి చెప్పాలి స్వామీ!" వినయంగా అడిగాడు.

చిద్విలాసంగా నవ్వాడు సాక్షి రంగారావు.

"చెబుతాను. మీ సందేహాలన్నీ నివృత్తి చేస్తాను. కానీ అందరికీ శ్రీశ్రీశ్రీ అవతారం గారి దర్శన భాగ్యం మాత్రం కలిగించలేను. ఆ విషయంలో మాత్రం ఒత్తిడి చెయ్యొద్దు"

"మొదట సంగతి వివరించండి స్వామీ" బ్రహ్మానందం మాటలకి అవునంటూ తలూపారంతా.

"మీరు గృహవాస్తు రేఖల గురించి హస్తరేఖల గురించి విన్నారు. కానీ ఫాలభాగ రేఖల గురించి విన్నారా?"

"నుదుటి మీద రేఖలుంటాయి?"

"వుంటాయా కాదు. ఉన్నాయి. అదే వ్యక్తి భవిష్యత్తుని ఖచ్చితంగా చెప్పే శాస్త్రం"

"కానీ అంతా చేతి రేఖల్లో..."

"అది పూర్వం సంగతి. రాజూ రైతూ ఖడ్గమో హలమో పట్టేవారు గనుక వారి కష్టఫలాలు చేతిలో ప్రతిబింబించేవి. అందుచేత హస్తసాముద్రిక శాస్త్రం అవతరించింది. కానీ ఇప్పుడు మేధావులైన మీరంతా చేతుల ద్వారా శ్రమిస్తున్నారా? లేదే. మెదడుతో పని చేస్తున్నారు. కంప్యూటర్లతో చేస్తున్నారు. రెండు క్షణాల బుల్లి సంతకాలతో ఎందరి రాతలో మారుస్తున్నారు. ఇదంతా హస్తరేఖల్లో ఎలా కన్పిస్తుంది? కన్పించదు. అందుకే అది అవుటాఫ్ డేట్ అయిపోయింది"

అతడి వివరణ సబబుగానే తోచిందందరికీ.

"ఫాలభాగ శాస్త్రం. దీన్ని ఎన్నో ప్రాచీన తాళపత్ర గ్రంధాలని ఔపోసనపట్టి మా గురువుగారు రూపొందించారు. అసలు బ్రహ్మ మన నుదుద మీద గంటంతో రాసిన రాత వుంది చూశారూ దాని లిపి గీతల రూపంలో వుంటుంది. అది తెలిస్తే బ్రహ్మరాత అర్ధమవుతుంది. ఇదే ఈ శాస్త్రం ఆవిష్కరిస్తున్న సత్యం!"

"నిజంగా బ్రహ్మరాత చదివెయ్యగలరా?" ఎవరో అడిగారు.

"ఎవడా అక్కుపక్షి?" సాక్షి మాటలకి ఆ అడిగిన వారు గమ్ము నుండి పోయారు.

"నమ్మకముంటే వినండి లేకపోతే లేదు. అంతేగాని యోగుల్నీ, సిద్ధుల్నీ, మహిమాన్విత సన్యాసుల్నీ అనుమానించ వద్దు" లేని పెద్దరికం మీదేసుకున్నాడు బ్రహ్మానందం.

"విన్నారా ఇతగాడికీ మీకూ వున్న తేడా. అందుకే అతడు నా దృష్టినాకర్షించాడు. రేపు మా గురువు గారి ముఖతః భవిష్యద్దర్శనం చేసొచ్చాక అతగాడ్నడగండి అంతా మీకే తెలుస్తుంది"

పొంగిపోయాడు బ్రహ్మానందం.

మిగతా వాళ్ళు కాస్తంత ఈర్ష్యగా చూసారతడ్ని.

"మా గురువుగారైన శ్రీశ్రీశ్రీ అవతారంగార్ని కేవలం దర్శిస్తే చాలు మీ అనుమానాలన్నీ పటాపంచలవుతాయి. మీ నుదుటి రాతని చదివి మీ భవిష్యత్తుని మీ కళ్లముందు ఆవిష్కరిస్తారు. మీ ఆరోగ్యం సంపద సంతానం ఉద్యోగ వైభవం ఆయుష్షు సమస్తమూ పూస గుచ్చినట్టు చెబుతారు. ఎదురు ప్రశ్నలు వెయ్యాలన్నా వేయలేరు. గుడ్లప్పగించి ఆశ్చర్యంగా వింటూ చూస్తుండిపోతారంతే!"

"వారి దర్శనం చేసుకోవాలని చాలా ఉబలాటంగా వుంది. నా భవిష్యత్తు తెలుసుకోవాలని ఆశగానూ వుంది. మీరు నాకా భాగ్యాన్ని వెంటనే కలిగించాలి. మీరెంత చెబితే అంత ఇస్తాను" అన్నాడు బ్రహ్మానందం.

"ముందే చెప్పాను కదా. ఫాలభాగ శాస్త్ర ప్రచార నిమిత్తం గాని డబ్బుకోసం గురువుగారు దేశ సంచారం చేయడం లేదు. ఉచితంగా చెబితే ఏ శాస్త్రమూ రాణించదు. అందుకని నూట యాభై రూపాయలు ఫీజుగా నిర్ణయించారు. ఇదంతా పుణ్యకార్యాలకి ఉపయోగించబడుతుంది" అంటూ సంచిలోంచి రసీదు పుస్తకం తీసి బ్రహ్మానందం పేరూ, భార్య పేరూ, జన్మ తేదీ, వివాహ తేదీ జన్మ నక్షత్రం, రాశి రాశాడు.

"మీకు రేపు ఉదయం ఆరూ నలభై అయిదుకి అప్పాయింట్‌మెంట్ రాస్తాను. పూజాదికాలు ముగించగానే ప్రథమంగా మిమ్మల్నే చూస్తారు. మీకే చెబుతారు. మనస్సు ప్రశాంతంగా ఉంటుంది కనుక మీ భవితని ఆసాంతం ఆవిష్కరిస్తారు"

"చాలా సంతోషం స్వామీ" పరమానందభరితుడై డబ్బిచ్చి రసీదు తీసుకున్నాడు బ్రహ్మానందం.

మిగతా వాళ్లు కూడా నాకు నాకంటూ త్రోసుకొచ్చారు.

"క్షమించాలి. అందరినీ చూడడం సాధ్యంకాదు. ఒక్కో ఆఫీసులో అయిదుగురికి మాత్రమే అవకాశం ఇవ్వడం జరుగుతుంది. అదైనా వీరు చెప్పిన వారికే. లేకపోతే జనాన్ని కంట్రోల్ చేయడం సాధ్యంకాదు" అన్నాడు సాక్షి బ్రహ్మానందాన్ని చూపిస్తూ.

నా పేరు రాయించండి, నా పేరు చెప్పండంటూ బ్రహ్మానందం చుట్టూ చేరారంతా. చాలా ఇబ్బంది పడ్డాడు బ్రహ్మానందం.

"మీరలా అంటే ఎలా స్వామీ! మీరే ఏదో దారి చూసి వీరందరికీ కూడా గురువుగారి దర్శన భాగాన్ని కలగజేయాలి" అర్థించాడతడు.

"ఇంకో ఆఫీసు పేరు రాసి మాకా అవకాశం కల్పించండి" అన్నాడొకరు.

ఆలోచనలో పడ్డాడతడు. సస్పెన్స్ భరించలేకుండా ఉన్నారంతా.

"సరే. వీరు చెప్పారు గనుక ఏదోలా సర్దుబాటు చేస్తాను. కానీ ఉదయపు టైమే కావాలనొద్దు. అది వీఐపీల కోసమే"

"లేదు లేదు. మాకూ మార్నింగ్ టైమే కేటాయించేటట్లు చూడండి" బ్రతిమాలారు ఇద్దరు. మిగతా వారు వంత పాడారు.

మొహమాటపడ్డాడు సాక్షి. ఇబ్బందిగా చూస్తూ "వీఐపీ రేటు రెండూ పాతిక మరి. ఆపైన మీ ఇష్టం. ప్రథమంగా నా దృష్టి వీరి మీద పడింది కనుక వీరొక్కరికీ కన్సెషన్ ఇవ్వగలిగాను. సాయంత్రమైనా చక్కగా చెబుతారు. మీరనవసరంగా డబ్బు వృధా చేసుకోవద్దు" అన్నాడు.

“అయినా సరే మాకూ మార్నింగే కావాలి. నాకు ముందు ఎలాట్ చేయండి” అంటూ ఒకరు డబ్బు తీసిచ్చారు. మిగతా వాళ్ళు పోటీపడ్డారు.

ఇబ్బందిగా చూశాడు సాక్షి.

“తప్పదు స్వామీ” అభ్యర్థించాడు బ్రహ్మానందం.

“సరే. ఇది గురువు గారి సంకల్పం అనుకుంటాను” అన్నాడు.

అందరికీ నచ్చచెప్పి వయస్సుని బట్టి వరుస నెంబర్లిచ్చి రసీదు ఇచ్చాడు.

“రేపు ఉదయమే హొటల్ స్వర్గం రూం నెంబర్ 111కి రండి. జంటగా రావాలి సుమా. ఇద్దరి రాతలూ ముడిపడి వుంటాయని మా గురువు గారు కనుక్కున్న సత్యం. ఇకపోతే ఖచ్చితమైన సమయపాలన అమలు చేయబడుతుంది. వేళకి రాకపోతే నిరాశపడక తప్పదు” అని లేచాడు.

వెళ్లబోతూ ఆగి “ఇతర ఆఫీసుల్లో నీ స్నేహితులుంటే చెప్పు బాబూ. సాధ్యమైనంత ఎక్కువ మందిని కలసి వారికీ భవిష్య జ్ఞానం కలిగించాలని మా గురువు గారి ఆశయం” అన్నాడు సాక్షి.

“అలాగే స్వామీ” అంటూ రెండు ఆఫీసులకి ఫోన్ చేసి ఆయన గురించి గొప్పగా చెప్పాడు బ్రహ్మానందం. వెంటనే పంపించమని వాళ్లు కోరడమూ ఇతడు ఒప్పుకోవడమూ చకచకా జరిగిపోయాయి.

“శుభం” అందర్నీ దీవించి వెళ్లిపోయాడు సాక్షి రంగారావు.

వాళ్లంతా ఆయన మాటల గురించీ, గురువు గారి కొత్త శాస్త్రం గురించీ చర్చించుకున్నారు.

మర్నాడు ఆరున్నరకే హొటల్‌కి వెళ్లారంతా. హొటలుంది. రూం నెంబరు 111 కూడా వుంది. కానీ గురువు గారు లేరు. శిష్యుడూ లేడు. అలాంటి వారెవరూ హొటల్లో బసచేయలేదన్నారు హొటల్ వాళ్లు!

ఇంతలో బ్రహ్మానందం ఫ్రెండ్సూ వారి ఆఫీసుల వాళ్లూ వారి ఫ్రెండ్సూ బిలబిల మంటూ వచ్చారు.

వారికి విషయం తెలిసేలోగానే అదృశ్యమయ్యాడు బ్రహ్మానందం సతీసమేతంగా– తన భవిష్యత్తు కళ్లముందు కదలాడగా!

* * *

**(ఆంధ్రభూమి వారపత్రిక 24.2.2000)**

# గురుబ్రహ్మ

"వీరు గౌతంరాజు. మన కొత్త ఎక్కౌంటెంట్"

ఆఫీస్ స్టాఫ్‌కి పరిచయం చేశాడు సూపరిండెంటు.

అంతా షేక్ హేండివ్వడానికి చేతులు చాపారు.

వాటిని అందుకోలేదతడు.

చేతులు జోడించి దండం పెట్టేడు.

"నమస్కారం. అన్నలకీ తమ్ముళ్లకీ అక్కలకీ చెల్లెళ్లకీ అందరికీ నమస్కారం..."

ఈ కొత్తరకం శాల్తీ ఎవడ్రా అనుకున్నారంతా.

అదోలా చూస్తూనే ప్రతి నమస్కారం చేశారు.

"గౌతంరాజు ఎక్కౌంట్స్‌లో దిట్ట. హార్డ్ వర్కర్. అంతేకాదు బ్రహ్మచారి కూడా"

ముదిరిపోయిన బెండకాయలా వున్న అతడి వంక చిత్రంగా చూశారు. పాపం అని జాలిపడిన వాళ్లూ వున్నారు.



టైపిస్టు రమణి మాత్రం అందంగా సిగ్గుపడింది. వంకర్లు తిరిగిపోయింది. ఆ ఆఫీసులో పెళ్లికాని అమ్మాయి ఆమె ఒక్కతే మరి.

"మీకు పెళ్లి కాలేదా పాపం" వుండబట్టలేక అనేశాడు రామ్మూర్తి.

అతడి మొఖంలో ఏడు రంగులూ గబగబా మారాయి. అవి కప్పి పుచ్చుకుంటూ వేదాంతిలా నవ్వేడు.

"పెళ్లి కాకపోవటం కాదు. పెళ్లి చేసుకోలేదు. మా గురువుగారు పెళ్లి వూసెత్తొద్దురా అన్నారు. ఆజ్ఞ గురువర్యా అన్నాను" గురువుగార్ని తలచుకుని దణ్ణం పెట్టుకున్నాడు గౌతం.

"ఆయనెక్కడి గురువండి బాబూ. బహుశా భార్యాబాధితుల సంఘాధ్యక్షుడయ్యుంటాడు" ఒకరన్నారు.

"అపార్ధం చేసుకోకండి. మా గురువర్యులు కూడా బ్రహ్మచారే. ఆ జన్మాంతం బ్రహ్మచారిగా వుంటానని కఠోరదీక్ష పట్టారు. నాలాంటి ఎందరికో ఉపదేశాలిస్తూంటారు"

"ఇప్పుడాయనెక్కడున్నాడూ? హిమాలయాల్లోనా?" వ్యంగ్యంగా అందొకావిడ.

"అపచారం. అపచారం. ఆయన పెద్దవారేం కాదు. నాకంటే ఒకటి రెండేళ్లు పెద్ద. అంటే చిన్నతనంలోనే జ్ఞానోదయమయ్యిందన్న మాట. ఆయన మన ఆఫీసులోనే పన్జేస్తున్నారు. ప్రస్తుతం ఏ బ్రాంచి ఆఫీసులో వున్నారో తెలీదు"

"మన ఆఫీసులోనా? అలాంటాయన్ని ఓసారి చూడాల్సిందే సుమా" రంగారావు వ్యాఖ్యానించాడు.

"ఆయన్ది కొత్తరకం సిద్ధాంతంలా వుందే. అసలు పెళ్లెందుకు చేసుకోవద్దన్నారయ్యా" సూపరిండెంటు కుతూహలం ఆపుకోలేక అడిగాడు.

"పడకటింటిని జయించిన వాళ్లే ప్రపంచాన్ని జయిస్తారట. అందుకని బ్రహ్మచారిగా వుండ్రా అన్నారు. వుండిపోయాను" కించిత్తు గొప్పగా నవ్వేడు గౌతం.

"ఇంతవరకూ ఏమేం జయించారు సార్" భక్తుడిలా వంగి చేతుల జోడించాడు ప్యూనుగుండు.

"జస్ట్ థర్టీ త్రీకి ఎకౌంటెంటునయ్యాను. మీలో నాకంటే పెద్దవాళ్లున్నారు. వాళ్లంతా నా క్రింద పని చెయ్యబోతున్నారు. వాళ్ల కిలాటి దౌర్భాగ్యం ఎందుకొచ్చిందో తెలుసా? పెళ్లి చేసుకున్నారు గనుక..!" ఆగి అందరి మొఖాల్లోకీ చూస్తూ నవ్వేడు గౌతం.

"ఎట్టెట్టా!" ఒకరు నోరు తెరిచారు.

"పెళ్లయిన వారికి వెన్నెముక వుండదు. దీక్ష పట్టుదల వుండవు. డూ డూ బసవన్నలై పోతారు. ఇంట్లోనూ ఆఫీసులోనూ కూడా స్వంత బుర్ర ఉపయోగించడం మరచిపోతారు. ఇంకెలా పైకొస్తారు చెప్పండి? ఇవి నా మాటలు కాదు. మా గురువు గారు ఉపదేశించిందే"

అవునని గాని కాదని గాని అనలేని స్థితిలో మొఖాలు వేలాడేశారంతా.

తానెంతో అధికుడ్నని ఫీలవుతూ అందరివంకా చూసి నవ్వేడు గౌతం.

ఆడ ఉద్యోగులు రుస రుస లాడారు.

మగాళ్లు బుర్ర గెడ్డం గోక్కున్నారు.

"గురుడు ఏ పిల్ల చేతిలోనో చావు దెబ్బ తిని వేదాంతం ఒంట బట్టించుకున్నాడు" అన్నాడు అప్పారావు.

"ఇతడు కాదు ఇతడి గురువుకో అమ్మాయి హాత్ ఇచ్చేసి వుంటుంది. దెబ్బకి జగమే మాయ అనేసుంటాడు.." అన్నాడు రామ్మూర్తి.

"ఆఫీసరుగారు కేంపులో వున్నారు. ఇవాల్టికెళ్లి పోయి సామాన్లవీ సర్దుకో. పాపం ఒంటరి వాడివి కదా…" సానుభూతిగా అన్నాడు సూపరిండెంటు.

"సింగిల్ గాడ్ని కదా. పెద్దగా సామాన్లు లేవు లెండి. కాని ఆంజనేయస్వామి గుడికి మాత్రం వెళ్లాలి. ఇవాల్టికెళ్లిపోతాను.." అంటూ లంచ్ టైంలో పర్మిషన్ తీసుకుని వెళ్లిపోయాడు గౌతం.

రేడియోలో వస్తోన్న పాత సినిమా పాటలు వింటూ చిక్కని కాఫీ త్రాగుతూ కాళ్లాడిం చుకుంటూ కూర్చున్నాడు గౌతం.

"ఏవోయ్" చొరవగా ఇంట్లోకి వచ్చాడొకాయన.

అయోమయం మార్కు మొఖం పెట్టాడు.

"నన్ను గుర్తుపట్టలేదూ? సాక్షి రంగారావుని"

"ఏ రంగారావూ గుర్తు రావట్లేదు"

"నువ్వెలా పుట్టేవయ్యా. ఈ వీధివాడ్నే గుర్తుపట్టలేవా?"

"నేను కొంచెం రిజర్వ్‌డ్ లెండి…'

"నేనూ రిజర్వ్‌డే నేలా బెంచీ కాదు"

"ఇంతకీ ఏవిటంటారు?"

"నువ్వు బ్రహ్మచారివట కదా. లక్కీఫెలోవోయ్"

"పెళ్లయిన వాళ్లంతా ఒప్పుకుంటున్న నగ్నసత్యం ఇది. మా గురువుగారెప్పుడో నాకు నూరిపోశారు"

"పెళ్లి కాక ముందు ఆయన దర్సన భాగ్యం నాక్కూడా కలిగి వుంటే నేనూ నీలాగా ఝామ్మంటూ వుండేవాడ్ని.."

"అందుకనే పెళ్లి చేసుకోకండోయ్ అని మా గురువు గారు ప్రచారం చెయ్యమన్నారు. అప్పట్నుంచీ ఆపని మీదే వున్నాను"

"చాలా మంచి పని చేస్తున్నావోయ్. కానీ పెళ్లైన వాళ్లం మళ్లీ బ్రహ్మచారులం కాలేం కదా. అంచేత నీలాటి వాళ్లు మాకు ఓ చెయ్యి అందించాలి"

"అంటే ఏం చెయ్యాలంటారు?"

"ఒంటికాయ సొంటికొమ్ముకి ఖర్చేం వుండదు కదా. అడపాదడపా మాకు డబ్బు సర్దుతూండు. ప్రస్తుతానికి నాకో అయిదొందలు సర్దవోయ్. జీతాలు రాగానే ఇచ్చేస్తాను.

"మీరెవరో తెలీకుండా.."

"పిచ్చోడా. నీలాటి బ్రహ్మచారిగాడు క్షణాల్లో బిచాణా ఎత్తెయ్యొచ్చుగాని నాలాటి పెళ్లైన వాడు ఎక్కడికీ పారిపోలేడు. అంత కంటే గ్యారంటీ ఏం కావాలి చెప్పు.."

మారు మాట్లాడకుండా డబ్బు తెచ్చిచ్చాడు.

"జీతాలు రాగానే ఇచ్చేస్తాన్లే" అంటూ వెళ్లిపోయాడతడు.

బుర్రగోక్కోక తప్పింది కాదు గౌతంకి.

మర్నాడు ఆఫీసుకి కాస్త ముందుగానే వెళ్లి ఎక్కౌంట్స్ చూస్తోంటే బ్రహ్మానందం లోపలి కొస్తూ కన్పించాడు.

"గురువు గారూ!" గావు కేక పెట్టేడు గౌతం.

బ్రహ్మానందంతో బాటు ఆఫీసు యావత్తూ అదిరిపడి చూశారు.

అతడెవరో గ్రహించే లోపలే వెళ్లి కాళ్ల మీద పడిపోయాడు గౌతం.

మహా ఇబ్బందికర పరిస్థితిలో చిక్కుకుపోయాడు బ్రహ్మానందం. మొహం తీసి జేబులో దాచేసుకో గలిగితే ఎంత బావుణ్ను– అనుకున్నాడు.

పూర్వాశ్రమంలో బ్రహ్మానందం కఠోర బ్రహ్మచారి. ఆ జన్మాంతం బ్రహ్మచారిగా వుండి పోవాలనుకున్నాడు. అందుకని బ్రహ్మచర్యం యొక్క గొప్పతనాన్ని వివరిస్తూ ప్రచారం చేశాడు. ఆఫీసులో చేరిన కొత్త గనుక ఎందరో శిష్యులు చేరారు. గురువుగారంటూ మర్యాదిచ్చారు. పూవూఫలం సమర్పించేరు. దాంతో ఆ పాత్రని అందరూ మెచ్చేలా పోషించక తప్పలేదు.

కాని తర్వాత ఇంట్లో వాళ్లు ముఖ్యంగా బామ్మ తను గింజుకుంటున్నా వినకుండా చెవులు మెలేసి పెళ్లి పీటల మీద కూర్చోబెట్టేసింది. ఆసరికి  కొత్త ఊరుకి ట్రాన్స్‌ఫర్ అవడం వల్ల బతికిపోయాడు.

మళ్లీ ఇన్నేళ్లకి ఆ పాత శిష్యుడు ఎదురయ్యాడు!

ఏం చేయాలో ఏమనాలో తోచక వెర్రి నవ్వు నవ్వేడు బ్రహ్మానందం.

"రండి గురువుగారూ ఇన్నేళ్లకి నన్ను కరుణించారన్నమాట. రండి. ఇలా కూర్చోండి" అంటూ ఓ కుర్చీలాగి కూర్చోబెట్టాడు గౌతం.

వింతగా చూస్తోన్న సహోద్యోగులవంక చూసి "రండి మా గురువు గారి ఉపదేశం విని తరిద్దురు గాని రండి" అన్నాడు.

"ఈయన మీ గురువా?' షాక్ నుండి మొదట తేరుకున్న గుండు అడిగాడు.

"వీరే మా గురుబ్రహ్మలు... ఎలా వున్నారు గురూజీ... ఇప్పుడే బ్రాంచిలో వున్నారు? ఇంకా ఉద్యోగం చేస్తున్నారా లేక రాజీనామా ఇచ్చేసి ఉపదేశామృతం పంచే కార్యక్రమంలో నిమగ్నమైపోయారా?"

నవ్వూ ఏడుపూ ఒక్కసారే వచ్చేశాయి బ్రహ్మానందానికి.

"చూశారా చూశారా. మా గురువు గారు నన్ను చూసి ఆనందం పట్టలేక ఎంత ఇదై పోతున్నారో. మా గురుశిష్య బంధం అంత గొప్పది మరి"

గౌతంకి అడ్డొస్తూ "వారే మన ఆఫీసరోయ్" అన్నాడు సూపరిండెంటు.

"అలాగా గురువు గారూ.. ఇక రోజూ మీ దర్శనభాగ్యం లభిస్తుందన్న మాట. నా జన్మ ధన్యమైపోయినట్టే  గురువు గారూ..."

ఒక్క డైలాగూ చెప్పకపోతే బావుండదనుకుని "అంతా దైవలీల శిష్యా. ఆడించేవాడు పైవాడు. మనం కేవలం ఆడేవాళ్లం. అంతే" అన్నాడు బ్రహ్మానందం.

"విన్నారా. విన్నారా. మా గురువు గారి ఒక్కో మాటా అమృతతుల్యం" ఫోజు కొట్టాడు గౌతం.

"అది సరేనయ్యా. మీ గురువు గారు శుభ్రంగా పెళ్లి చేసుకున్నారు కదా" ఒకామె సూటిగా అడిగింది.

అవాక్కయ్యాడు. అపనమ్మకంగా చూశాడు గౌతం.

వెర్రిగా నవ్వేడు బ్రహ్మానందం.

"మధ్యలో నాకు మా బామ్మగారి దగ్గర జ్ఞానోదయమయ్యింది శిష్యా!"

"గురువుగారూ!" ఆఫీసు అదిరేలా అరిచాడు గౌతం.

"ష్..... ఇది ఆఫీసు. అరుపులు డీటీఎస్ ఎఫెక్టుతో విన్పిస్తాయి. నోటికి తాళం వేసి నే చెప్పేది విను..."

"శలవివ్వండి గురూజీ..." భగవద్గీత టైంలోని అర్జునుడి ఫోజుతో అన్నాడు గౌతం.

"అప్పుడు అంధకారంలో వున్నాను. ఇప్పుడు వెలుగులోకి వచ్చాను. జీవితానికి సంపూర్ణత్వం సిద్ధించాలంటే పెళ్లి చేసుకుని తీరాలి.."

"మీ మాటలు నమ్మి బ్రహ్మచారిగా వుండిపోయాను. ఇంత లేటు వయస్సులో నన్నెవరు చేసుకుంటారు?" ఏడుపు మొఖం పెట్టాడు గౌతం.

"నీ పెళ్లి చేసే బాధ్యత నాది. సరేనా?"

"మరి పడకటింటిని జయించిన వాళ్లే ప్రపంచాన్ని జయించగలరని శలవిచ్చారు కదా. దాని సంగతేవిటి గురూజీ"

"ఇప్పుడూ అదే చెబుతున్నాను. పడకటింటిని జయించడమంటే బ్రహ్మచారిగా వుండటం కాదు శృంగారకాండలో కూడా విజయుడివి కావాలన్న మాట..."

"చిన్న డౌటు గురూ.."

"చెప్పేది వినవోయ్. బుద్దుడు, గాంధీ, మార్క్సులాంటి వాళ్లంతా గొప్ప వాళ్లెలా అయ్యారనుకున్నావు? పెళ్లి చేసుకున్నందువల్లే!"

ముక్కు మీద వేలేసుకోబోయి మూర్ఛబోయాడు గౌతం!

* * *

**(ఆంధ్రభూమి వారపత్రిక 18.5.2000)**

# మాస్ హిస్టీరియా

"శ్రీలూ! మన టీవీ ఎలా వుంది?

"దానికేమండీ దివ్యంగా వుంది"


"ఇప్పుడలాగే వుంటుంది. రేపు అవసరమైనప్పుడు అత్యంత ఇంపార్టెంట్‌వి చూడాల్సి వచ్చినప్పుడు ఒకటి రెండుగా మూడు నాలుగ్గా ఒకేసారి కన్పించొచ్చు. రకరకాల కూతల్తో ఒకేసారి రెండేసి ఛానల్స్ లాగేసి మనకి పిచ్చెక్కించొచ్చు"

"ఇంతకీ రేపేవిటండీ?"

"పండుగ. చాలా పెద్ద పండుగ. నీ బుర్ర కర్థం కాదులే" అంటూ టీవీ కన్నెక్షన్లన్నీ పరీక్షించి చూశాడు బ్రహ్మానందం.

అన్నీ బాగానేవున్నాయి. అన్ని ఛానల్సు పెట్టి చూశాడు. చక్కగా వస్తున్నాయి.

"హమ్మయ్య! ఇవన్నీ ఓకే. రేపు తినడానికి ఇంట్లో ఏమున్నాయి? బఠాణీలు, వేరుశనక్కాయలు, చిప్సూ, చాక్లెట్లు వగైరా వగైరా..."



"అవన్నీ కావాలా?"

"కావాలా అని నెమ్మదిగా అడుగుతావేమిటి? ప్రొద్దుట్నుంచి సాయంత్రం దాకా నోరు ఆడుతుండాల్సిందే. భోజనం బంద్. అసలు టీవీ ముందు నుంచి కదిలేంత టైము వుండదు. అంచేత నేను చెప్పిన లిస్టు రాసుకుని అన్నీ భారీగా రెడీ చెయ్యి. ఆఫీసర్ గాడికి ఎలాగోలా మస్కా కొట్టి శలవు సంపాదిస్తాను"

"ఇంతకీ పండగ పండగ అని కాకిలా అరవకపోతే ఏ పండగో ఏవిటో కోకిల్లా అందంగా చెప్పొచ్చుగా!" తడి బట్టల్ని జాడించినట్టుగా అంది శ్రీలక్ష్మి.

అదిరిపోయాడతడు. "నువ్వు నువ్వేనా?"

"నేనే. విజయశాంతి ఏకలవ్య శిష్యురాల్ని!"

"అమ్మో. అంత దూరం వెళ్ళొద్దు. మరేంలేదు. రేపు ఇండియాకీ, పాకిస్తాన్‌కీ మధ్య క్రికెట్ మ్యాచ్. అందుకని..."

"క్రికెట్టా? మరలా నీళ్ళు నములుతూ చెప్తారేం. రేపు వంటగింట అన్నీ బంద్. అన్నీ హొటల్ నుంచి పట్టుకురండి. నేను మాత్రం రేపు వంటింట్లోకి అడుగుపెట్టనుగాక పెట్టను. ఇదే శ్రీలక్ష్మి శపథం!"

"మరి ఫుడ్డెలాగే?"

"హొటల్నుంచి బిర్యానీ పాకెట్లు తెండి. తింటూ క్రికెట్ చూద్దాం. ఎంచక్కా క్రికెట్టు చూస్తూ తిందాం!"

"అది కాదు శ్రీలూ. నువ్వు చాలా మంచి దానివి కదా. క్రికెట్టు చూస్తూ మధ్యలో లేచి హొటల్‌కీ అక్కడికీ వెళ్ళకూడదు. పాపం చుట్టుకుంటుంది. అందుకని ప్రొద్దున్నే లేచి వంట చేసెయ్. ఇద్దరం కలిసి చిరుతిళ్ళు తింటూ క్రికెట్ చూద్దాం. సరేనా?"

ఏ కళ నుందో ఏమో వెంటనే అంగీకరించేసిందామె!

ఆఫీసు కెళ్ళాడు. కొలీగ్స్ అంతా క్రికెట్ గురించే మాట్లాడుకుంటున్నారు. ఎవరెన్ని రన్స్ చేయగలరో, ఎవరికి గెలిచే అవకాశాలున్నాయో తర్జనభర్జనలు పడుతున్నారు.

సీట్లో కూర్చోలేకపోయాడు బ్రహ్మానందం. టెన్షన్ భరించలేకుండా ఉన్నాడు. కడకి తెగించి లేచాడు. దీనాతిదీనంగా ముఖం పెట్టుకుని ఆఫీసర్ రూంలోకెళ్ళాడు.

ఆఫీసర్ పి.యల్.నారాయణ కళ్లజోడుపై నుంచి గుర్రుగా చూశాడు.

"సార్!" ఏడుపుగొంతుతో పిలిచాడు.

"చూడు మిస్టర్ బ్రహ్మానందం. నా హార్ట్ అసలే వీక్. నువ్వు ఏడ్పులు పెడబొబ్బల సీన్స్ నటించొద్దు. తిన్నగా పాయింట్‌కొచ్చి రెండు ముక్కల్లో విషయం చెప్పేసెయ్!"

"నాకేవిటో ఏవిటోగా వుంది సార్. తల తిరుగుతున్నట్లుగా వుంది. వికారంగా ఉంది. కడుపులో దేవుతున్నట్లుగా వుంది. కాళ్ళూ చేతులూ గుంజుతున్నాయి. ఇంకా చాలా చాలాగా వుంది. రేపటికి ఫెళ్లున జ్వరం రావడం ఖాయం. దయ చేసి రేపొక్క రోజుకీ సెలవివ్వండి సార్!"

"అలాగా! ఈ లక్షణాలని అరికట్టే దివ్యౌషధం హోమియోపతిలో వుందోయ్. కాస్సేపున్నాక రా మాత్రలిస్తాను. అరగంటలో నీ బుర్ర శరీరం క్లీన్‌బౌల్డ్ అయిపోతుంది"

"అయ్యో వణకు వస్తోంది సార్. సెలవు..."

"ఇది కూడా ఆ రోగ లక్షణమే. కాస్సేపు పిచ్చి పిచ్చిగా అరుస్తావు కూడాను. నీలాటి యువకులిలా బుల్లి బుల్లి రోగాలకి బెదర కూడదు. అసలు దేశ ప్రగతి నీలాంటి యువకుల భుజస్కంధాలమీద ఆధారపడి వుంది. మీరంతా పిడికిలి బిగించి పని చేయాలి. మీ శక్తి యుక్తుల్ని దేశం కోసం ఉపయోగించాలి. పని దొంగలుగా కబుర్ల రాయుళ్ళుగా నీరస జీవులుగా మారకూడదు. బోలో స్వతంత్రభారత్ కీ!"

"జై"

"గుడ్. రేపు నీ శక్తి సామర్థ్యాలకి పరీక్ష పెట్టబోతున్నాను. జూనియర్ ఆఫీసర్‌వైన నీకు ఆఫీస్ బాధ్యతలు అప్పగిస్తున్నాను. ఆఫీసుకి ఇన్‌చార్జ్ ఆఫీసర్ని చేస్తున్నాను మై బోయ్. నువ్వెలా నిర్వహిస్తావో చూస్తాను. ఈ పరీక్షలో నెగ్గావా ప్రమోషన్ ఖాయం. ఇక వెళ్ళొచ్చు"

"జైహింద్" సెల్యూట్ చేసి మిలటరీ నడక నడుస్తూ బయటికొచ్చాడు.

"సార్ మీకు పేపర్ దోసె తినిపించినట్టున్నారు?" అని చిన్నగా నవ్వాడు ప్యూన్ గుండు.

"పిచ్చివాడా! ఈ ప్రపంచం ఒక పెద్ద మాయ. తినేదెవడూ తినిపించేదెవడూ. ఆడేదెవరూ, ఆడించేదెవరూ. అంతా 'పిచ్' మాత మహిమ!"

"బ్రహ్మానందం గారికేదో అయ్యిందండోయ్. పిచ్చి పిచ్చిగా వాగుతూ వెర్రిగా నవ్వు తున్నారు" గుండు చాటింపేశాడు క్షణాల్లో.

అంతా పరుగెత్తుకొచ్చారు. సానుభూతి చూపారు. అతడు మామూలు మనిషి కాలేదు. నవ్వుతూ మధ్య మధ్య కళ్ళు తుడుచుకుంటూ ఏదేదో వాగుతూనే వున్నాడు.

సాయంత్రం ఆఫీసర్ నారాయణగారు తాళాలప్పగించేసి "రేపు మన ఆపీసుకి నువ్వే సర్వాధికారివి. విష్యూ గుడ్ లక్ మై బోయ్" అని భుజం చరిచాడు.

చేతిలోని తాళాలవంక చూసి కెవ్వున అరిచాడు. భోరున ఏడ్చాడు.

"అయితే రేపు మన బాసు ఏక్ దిన్ కా సుల్తాన్ అన్నమాట" గుండు అన్నాడు పళ్ళికిలిస్తూ.

"షటప్ అండ్ గెటవుట్" అరిచాడు బ్రహ్మానందం.

అంతా మంత్రించినట్టు మాయమైపోయారు.

నీరసంగా కాళ్ళీడ్చుకుంటూ వచ్చిన భర్తని చూసి కలవరపడింది శ్రీలక్ష్మి.

"ఒక్క రన్ అయినా తీయకుండా రన్ అవుట్ అయిపోయిన వాళ్ళలా వున్నారేవిటండీ?"

"మా ఆఫీసర్ పీనుగ సెలవు ఇవ్వనన్నాడు. పైగా ఆఫీసు తాళాలు నాకప్పగించేడు!"

"అయితే రేపు మీ ఆఫీసుకి మీరే మహారాజన్న మాట!" సంబరంగా అంది.

"అంత సంబరపడిపోతున్నా వేంటి. ఆఫీసుకి మీ ఫ్రెండ్స్ అందర్నీ తీసుకొచ్చి చూపిస్తావా ఏంటి?"

"క్రికెట్ వదులుకుని నేనెందుకొస్తానండీ? మీరే వస్తారు!"

"నేనా? మరి ఈ తాళాలు?"

"ఆఫీసుల్లో అతిగా సుఖపడేది ఇద్దరే. అధికార్లు, ప్యూన్లు. వాళ్ళెక్కడికెళ్ళినా సరే పనుండి వెళ్లామంటే ఎవరూ ఏమీ అన్లేరు. అంచేత ఆఫీసుకెళ్ళి ఆఫీసు పనిమీద బయటి కెళ్తున్నానని చెప్పి ఇంటికొచ్చేయండి"

"అమోఘం! అద్భుతం! బ్రిలియంట్! శ్రీలూ జిందాబాద్!"

"మావారెంత మంచివారో!" గట్టిగా కావలించుకుని ముద్దు పెట్టుకుంది. ఉక్కిరి బిక్కిరి అయ్యాడు బ్రహ్మానందం.

తెల్లవారింది. చకచకా రెడీ అయి సింగారించుకుని టీవీ ముందు సెటిలైపోయింది శ్రీలక్ష్మి.

మేచ్ మొదలవబోతుంటే ముక్కు ఎగబీలుస్తూ "టాటా గుడ్ బై వీడుకోలూ. నువ్వైనా చూడు నా శ్రీలూ" అంటూ కళ్ళు తుడుచుకుంటూ ఆఫీసు దారి పట్టాడు.

అందరి ఇళ్ళల్లోంచీ క్రికెట్ కామెంటరీ విన్పిస్తోంది. షాపుల దగ్గర జనం గుమిగూడి మరీ చూస్తున్నారు.

'నేను తప్ప ప్రపంచంలోని అంతా అదృష్టవంతులే సుమా!' అని పైకే ఏడుస్తూ ఆఫీసు కెళ్లాడు.

ఆఫీసులో ఒక్క పురుగు కన్పించలేదు. ఏమయ్యారబ్బా అని దిక్కులు చూస్తుంటే అతడి బుర్రలో ఫ్లాష్ వెలిగింది. హఠాత్తుగా ఏ నాయకుడైనా చనిపోతే శలవు ప్రకటించేశారేమో!

వెర్రి సంతోషం వచ్చేసింది.

"హుర్రే! ఇంటికిపోదాం క్రికెట్ చూద్దాం ఛలో ఛలో అల్లరి చేద్దాం ఛలో ఛలో" అంటూ డాన్స్ చేసాడు.

ఎవర్నో ఒకర్ని అడిగి వార్త కన్ఫర్మ్ చేసుకుందామని బయటి కొచ్చి చూశాడు. భరణి పాకెట్ రేడియో చెవి దగ్గర పెట్టుకుని వెళ్తూ కన్పించాడు

"హలో స్కోరెంత?"

"సిక్టీ టూ ఫర్ టూ'

"అప్పుడే మన వాళ్ళు రెండు వికెట్లు తీసేసుకున్నారన్నమాట. వెరీగుడ్ మన గెలుపు ఖాయం!"

తలాడించాడతడు.

"ఇవాళ ఏ ఆఫీసుల్లోనూ జన సంచారం లేదు. ఎవ్వరైనా లీడర్ చనిపోయాడా? శలవు ప్రకటించారా?"

బ్రహ్మానందం వినయంగానే అడిగాడు. కానతడు కయ్‌మని మీద పడి కరిచేశాడు.

"ఓరి త్రాష్టుడా! నీ నాలుక వేయి చీలికలవ్వనూ. ఏం కూశావురా అప్రాచ్యపు పీనుగా. ఎవడో నాయకుడు చావాలా? సెలవు ప్రకటించాలా? నీది నోరా అపశకునాల పుట్టా? ఛీ ఛీ. ఎవడో చచ్చి క్రికెట్ మేచ్ కేన్సిల్ అవ్వాలని కోరుకుంటావుట్రా దౌర్భాగ్యుడా!"

తిట్ల పురాణపు చిట్టా విప్పేడతడు.

"బాబోయ్!" అని పరుగిచ్చుకుని ఆఫీసులోకి జంప్ చేశాడు.

ఓ ప్రక్కన సిగరెట్ కాలుస్తూ గుండు కన్పించాడు.

"ఏంవోయ్! నువ్వొక్కడికే వచ్చావన్న మాట!"

"అవును సార్"

"అందరికీ హఠాత్తుగా ఏవయ్యిందిరా?"

"ఏవేవో రోగాలొచ్చాయటండీ. లీవు లెటర్లు మీరే చూడండి" ఓ బొత్తి అందించాడు.

"తెలివైన వాళ్లురా. అందుకే హాయిగా ఇంట్లో కూర్చుని రంగ రంగ వైభోగంగా క్రికెట్ చూడగల్గుతున్నారు. ఒరే గుండూ. ఓ పని చెయ్‌రా!"

"చెప్పండి బాసూ!"

"నా కడుపులో ఏదో గడబిడగా వుంది. ఇంటికెళ్లొస్తాను. నువ్వు కొంచెం ఆఫీసుని జాగ్రత్తగా చూసుకో. నువ్వు సినిమాకెళ్లడానికి డబ్బులిస్తాను"

"నాకు తెలుసు సారూ. మీరు చాలా మంచివారు. సినిమాకి డబ్బులిస్తారు, ఐస్‌క్రీమ్, మిరపకాయ బజ్జీలు తినడానికి డబ్బులిస్తారు. ఇంకా..."

"చాలు చాలు. లిస్టు పొడిగించొద్దు గానీ జాగ్రత్త సుమా!"

"మీరేం భయపడకండి. ఈ బెంచీనే బెడ్ చేసుకుని పడుకుని గుర్రు పెట్టేనంటే ఆఫీసులోకి మనిషి కాదు కదా పురుగు కూడా రాదు"

"ఎలా మేనేజ్ చేస్తావో చూస్తానుగా!"

ఇంటికెళ్లాడు బ్రహ్మానందం. వెళ్ళీ వెళ్లగానే టీవీ ముందు సెటిలైపోయాడు. చిప్స్ పాకెట్ చేతిలో పెట్టింది శ్రీలక్ష్మి. అవి తింటూ "అవుట్ చేయండి" "కేచ్ కేచ్", "బాల్ ఇటొస్తుంది ఫీల్డింగ్ చేయండి", "అయ్యో అయ్యో పరుగెత్తి ఆపరా ఫోర్ అయిపోద్ది", "బేటింగ్ అదరగొట్టాలి గురూ", "ఉయ్ వాంట్ సిక్సర్", "రన్, రన్" అంటూ అరుస్తూ రకరకాల విన్యాసాలు చేశాడు.

టీవీ చూట్టానికొచ్చిన పిల్లలు టీవీ చూడడం మానేసి అతడ్ని చూస్తూ కూర్చున్నారు.

ఇంక అయిదు ఓవర్లే మిగిలాయి. ఇండియా గెలవాలంటే 38 రన్స్ కావాలి. బ్రహ్మానందానికి యమ టెన్షన్‌గా వుంది. ఎవర్నీ మాట్లాడనివ్వలేదు. కనీసం నోరుని సైతం నమలనీయలేదు. టీవీకి దగ్గరగా కూర్చుని ఊపిరి బిగబట్టి కూర్చున్నాడు.

ఆఖరికెలా అయితేనేం ఇండియా విజయం సాధించింది.

"ఇండియా గెలిచింది. హే హే" అంటూ అరుస్తూ డాన్స్ మొదలెట్టాడు బ్రహ్మానందం. పిల్లలు డిస్కో డాన్స్ చేశారు.

"సోఫా పాడవుతుంది కుర్చీలు విరిగిపోతాయి" అంటూ శ్రీలక్ష్మి గోలపెట్టింది గానీ ఎవరూ విన్పించుకోలేదు.

దగ్గర్లోని మిఠాయి దుకాణం నుంచి రెండు కిలోల స్వీట్లు కొనుక్కొచ్చి ఆ చుట్టు ప్రక్కల వారందరికీ పంచిపెట్టాడు. గాలిలో తేలిపోతూ ఇండియా జట్టు ఎంత గొప్పగా ఆడిందో వర్ణించి వర్ణించి పూదరగొట్టాడు.

అప్పుడు ఆఫీసు గుర్తొచ్చింది. "బాపురే" అని ఎగిరి గంతేసి స్కూటరెక్కి వెళ్ళి ఆఫీసులో పడ్డాడు.

ప్యూన్ గుండు ఎదురై "చాలా ఘోరం జరిగిపోయింది సారూ. ఆడిటింగ్ టీము ఇన్స్పెక్షన్ కొచ్చింది" అంటూ బాంబు పేల్చాడు.

"ఏవిటి?ని...నిజంగానే?"

"ఆఫీసులో ఎవరూ లేరని కారాలూ మిరియాలూ నూరారు"

చలిజ్వరం వచ్చిన వాళ్ళా వణికిపోయాడు.

"నా ఉద్యోగానికేం ముప్పు వస్తుందో దేవుడోయ్! ఆఫీసరుగాడు నన్ను గినీపిగ్‌ని చేసేశాడు తండ్రోయ్!"

"శోకాలు తీయకు బాసూ చీమ చిటుక్కుమన్నా కస్సుమని లేస్తున్నారు"

"ఇప్పుడెలారా. వాళ్ళ మూడ్‌ని దారిలోకి తేవడం ఎలా?"

"అక్కడికీ వాళ్ళడిగిన చికెన్ బిర్యానీలూ, కిళ్ళీలు, సిగరెట్లు అన్నీ మీ ఖాతాలో రాయించి తెచ్చిచ్చానండీ. అయినా ధుమధుమలాడుతూనే వున్నారు. లోపలున్నారు వెళ్ళు సారూ తప్పదు"

బలిపశువులా వణకుతూ ఆఫీసర్ రూమ్‌లోకి నడిచాడు.

బిర్యానీ మరియు సిగరెట్ల వాసన గుప్‌మని తగిలింది. ఆడిట్ పార్టీకి చెందిన నలుగురూ పోర్టబుల్ టీవీలో వస్తున్న క్రికెట్ విజేతలకి బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం చూస్తున్నారు!

హమ్మయ్య అని బ్రహ్మానందం నిట్టూర్చాడో లేదో పిడుగులా పడ్డారు.

"మీరంతా ఎక్కడ చచ్చారయ్యా? కలర్ టీవీ సప్లై చెయ్యడానికి ఒక్క పీనుగ కూడా లేకుండా పోయారు. పోర్టబుల్తో ఏడ్వాల్సొచ్చింది. లాభం లేదు. మీ గురించీ, మీ ఆఫీసు గురించీ అడ్డదిడ్డంగా రాసి పారేస్తాం!"

* * *

**(ఆంధ్రభూమి వారపత్రిక 20.1.2000)**

# సిద్ధాంతి బలం

"ఏమండీ - ఇది విన్నారా" శ్రీలక్ష్మి అంది.

"నీ నోట్లోంచి వూడిపడందే నాకెలా విన్పిస్తుందే" అన్నాడు బ్రహ్మానందం.

"మీ కన్నీ హాస్యాలే. మన ప్రక్క వీధిలోని కాంతమ్మ గారికి ఆకస్మిక ధనలాభం వచ్చిందటండీ"

"పెరట్లో లంకెల బిందెల దొరికాయా?"

"అహ. వారసుల్లేని వారి దూరపు బంధువుల ఆస్తిలో వీరికి వాటా లభించిందిట. ఇదంతా ఈమధ్య చేయించిన వాస్తు మార్పుల వల్లనే జరిగిందంటున్నారు. గృహబలం బాగుంటే గ్రహబలం బాగుంటుందిట"



"ఎవర్నుంచో ఆస్తి సంక్రమించడానికీ వాస్తుకీ లంకె ఏమిటే"

"వాస్తు బాగుంటే అన్నీ వాటికవే వచ్చి పడ్తాయిట. ఆరోగ్యం, ఐశ్వర్యం సంతానం, సంతోషం అన్నీ వాస్తుమీదే ఆధారపడి వున్నాయిట"

"అంటే వాస్తు ప్రకారం ఇల్లు కట్టుకుని కూర్చుంటే అన్నీ వాటంతటవే వచ్చి పడతాయా? అయితే చంద్రబాబుకి చెబుదాముండు. వాస్తు గృహజ్యోతి అని ఒక పథకం ప్రకటిస్తారు. వాస్తు ప్రకారం పేదలకి ఇళ్ళు కట్టిస్తారు. దాంతో పేదల సమస్యలన్నీ మటుమాయమై పోతాయి గనుక ప్రభుత్వ ధనాగారం వెలవెలబోతోందన్న భయం వుండదింక"

"ఉపన్యాసం ఆపి నేన్చెప్పేది వింటారా వినరా?"

"వినకపోతే పుడ్డు వుండదుగా. కానియ్ నా చెవులప్పగించేస్తున్నాను ఇక నీ ఇష్టం"

"పెళ్ళై అయిదేళ్ళు కావొస్తోంది. ఇంతవరకూ మనకి పిల్లా పీచూ లేరు. ఇదంతా తప్పకుండా వాస్తుదోషం వల్లనే అంటున్నారంతా. ఒక్కసారి మంచి సిద్ధాంతిని తీసుకురండీ"

"సంతానం గురించి డాక్టర్ దగ్గరికెళ్ళాలి గాని సిద్ధాంతి దగ్గరికెందుకే"

"ఆయనా ఒక రకమైన డాక్టరేనండీ. నా మాట వినరూ" గోముగా అడిగింది.

"అది కాదే. వాస్తుగోల ఓ కొత్తరకం వ్యాధి.."

"ప్లీజ్.. నా మాట వినండి. మీలో లోపం వున్నందునే సంతానం కలగలేదని అంతా చెవులు కొరుక్కోవడం నేను భరించలేనండీ" బ్రహ్మాస్త్రం ప్రయోగించిందామె.

బ్రహ్మానందం నోరు మూత పడిపోయింది.

ముఖంలో రంగులు మారాయి.

"మీరొప్పుకున్నారు. అంతే చాలు. ఏ పుట్టలో ఏ పాముందో ఎవరు చూడొచ్చారు?"

"ఏ పామైనా కరిచేది మనల్నేకదే!"

"అదిగో మళ్ళీ.."

"అద్దె ఇల్లు కదా మార్పులూ చేర్పులూ చేయమంటే మన ఓనరు వానరుడై గంతులేస్తాడేమోనే!"

"గృహబలం బాగుంటే ఆయనకీ మనకీ కూడా మంచిదేనండీ. అందుకని ఒప్పుకుంటా ళ్ళెండి. మీకెందుకు ఆయన చేత ఒప్పించే పూచీ నాది"

"సరే అయితే. ఇవాళే ఎంక్వైరీ చేసి రేపే గొప్ప వాస్తు పండితుడ్ని తీసుకొస్తాను"

ఆఫీసుకెళ్ళగానే "మన ఊళ్ళో గొప్ప వాస్తు సిద్ధాంతి ఎవరోయ్" అంటూ ఆరాతీశాడు బ్రహ్మానందం.

అంతా తలో పేరూ చెప్పారు. ఒకరు చెప్పిన దాన్ని మరొకరు ఖండించారు.

"వాడికేం తెలీదు" అని ఒకరంటే, "వీడొట్టి డబ్బు మనిషి. పీల్చి పిప్పి చేస్తాడు" అని ఇంకొకరన్నారు.

"ఇతగాడిదంతా కేటలాగ్ జ్ఞానం" అని ఒకరు తీసిపారేస్తే, "అతగాడు ఇల్లు పడగొట్టి తిరిగికట్టమంటాడు" అన్నారు మరొకరు.

కాని అంతా పొరుగూళ్ళోని సోమయాజులు గారు 'ది బెస్ట్' అని ఏకాభిప్రాయాన్ని వ్యక్తపరిచారు.

పెరటి మొక్క వైద్యానికి పనికిరాదన్న సామెత గుర్తొచ్చి నవ్వుకున్నాడు. ఆ మర్నాడే రెక్కలు కట్టుకునెళ్ళి సోమయాజులు గారింటి దగ్గర వాలాడు బ్రహ్మానందం.

వారిదో చక్కని మేడ. ఇరుకు సందులో వున్నా ముచ్చటగా పొందికగా వుంది. అడుగడుగునా సంపద చిందులేస్తోంది.

'ఇక్కడికొచ్చిన వారి గృహబలమేమో కాని ఈయన గృహబలం మాత్రం దివ్యంగా వుంది' అనుకోకుండా వుండలేకపోయాడు.

గేటు ప్రక్కన పెద్దబోర్డు వ్రేలాడుతోంది. దాని మీద 'వాస్తువేద సామ్రాట్, వాస్తు విజ్ఞాన చక్రవర్తి శ్రీ సోమయాజులు సిద్ధాంతి' అని రాసి వుంది.

'నిజంగా చాలా గొప్పవాడే కాబోలు' అనుకుంటూ లోపలికెళ్ళాడు.

ముందు హాల్లో పదిమంది వరకూ కూర్చుని వున్నారు. డాక్టర్‌ని కలవడానికి నిరీక్షిస్తోన్న రోగుల్లా వున్నారంతా!

ఓ కుర్చీలో కూర్చున్నాడు. గోడలకి తగిలించిన ప్రముఖులతో సోమయాజులు గారి ఫోటోల్నీ ఓ ప్రక్కనున్న ఆయన నిలువెత్తు పెయింటింగునీ చూసి అబ్బురపడ్డాడు. ఆ పెయింటింగులో సోమయాజులు గారు పట్టు వస్త్రాలు ధరించి చాలా హుందాగా వున్నారు. దివ్యజ్ఞానిలా వెలిగిపోతున్నారు. కుడిచేతికి బంగారు కడియం కూడా వుంది.

"మీరు అప్పాయింట్‌మెంటు తీసుకున్నారా?" కాంపౌండర్‌లాంటి కుర్రాడొచ్చి అడిగాడు.

"లేదే"

"తీసుకోందే సిద్ధాంతిగార్ని కలవడం కుదర్దు'

బ్రహ్మానందం ఆశ్చర్యపడ్డాడు.

"సిద్ధాంతిగారంటే ఏమనుకున్నావు. ఎక్కడెక్కడ్నుంచో వస్తారు. ఎక్కడెక్కడికో తీసు కెళ్తారు. ఎప్పుడూ బిజీయే" ప్రక్కతనన్నాడు.

"అప్పాయింట్‌మెంట్ ఎవరిస్తారు?"

"ఆ రూంలో సెక్రటరీ వుంది. ఆవిడ్ని కలవండి"

'మళ్ళీ ఇంకో రోజు రమ్మంటే ఎలారా బాబూ' అనుకుంటూ లోపలికెళ్ళాడు.

"అరె బ్రహ్మం నువ్వట్రా. రారా"

తల విదిలించి చూశాడు. కిన్నెర! చిన్ననాటి క్లాస్‌మేట్!

"నువ్విక్కడ..."

"సెక్రటరీని ఏవిటిలా వచ్చావ్. నీకూ సమస్య వచ్చిపడిందన్న మాట"

"అహ అది కాదు కానీ.."

"నాన్చొద్దురా బ్రహ్మం. సమస్యలూ ఇబ్బందులూ కష్టాలూ లేని వాళ్ళిక్కడికి ఎందుకొస్తారు చెప్పు. సమస్యలొస్తే చాలు ఠకీమని తొలగే చిట్కా కావాలి. అందుకనిలా పరుగెత్తుకొస్తూంటారు. ఇందాక ఒకాయనొచ్చాడ్రా బ్రహ్మం. వాళ్ళబ్బాయి బాగా చదవట్లేదుట. కానీ మార్కులు బాగా రావాలిట. ఎలాగైనా మెడిసిన్లో సీటు కొట్టెయ్యాలిట. ఆ కుర్రాడు సరిగ్గా చదవక పోడానికీ మార్కులు బాగా రాకపోవడానికీ కారణం వాస్తుదోషమని నమ్మి వచ్చాడు. వాస్తు సరిచేస్తే మెడిసిన్లో సీటొచ్చేస్తుందిట.ఆ పిచ్చినేమనాలి చెప్పరా!"

వెర్రిగా నవ్వేడు.

"ఈయనకి చాలా బిరుదులు వున్నాయి. బంగారు కడియం కూడా వుంది. ఇవన్నీ ఎవరిచ్చారు?"

"ఆయనకాయనే"

"అదేవిట?"

"దాన్ని మార్కెటింగ్ టాక్టిక్స్ అంటారు. ప్రచారం లేనిదే ఏ ప్రోడక్టూ అమ్ముడుపోదు. ఇదీ అంతే.."

"నాకు వాస్తుమీద నమ్మకం లేదు కిన్నెరా. కాని మా ఆవిడ పోరు పడలేక.."

"ప్రోబ్లం ఏవిటి?'

సంతానహీనతని చెప్పలేకపోయాడు. "మా ఆవిడకెందుకో మేం అద్దెకుంటున్న ఇంటివాస్తు మంచిది కాదన్పిస్తోంది. అందుకే ఏదీ కలిసి రావటం లేదంటోంది. దాంతో.."

"ఒకసారి సిద్ధాంతి గారికి చూపించేస్తే మనశ్శాంతిగా వుంటుందిలే. వాస్తు నమ్మకం కొంత మనశ్శాంతిని కొన్నాళ్ల వరకూ ఖచ్చితంగా ఇస్తుంది"

"అప్పాయింట్‌మెంట్ కావాలి కిన్నెరా"

"నీకు అప్పాయింట్‌మెంటేవిటి నీ మొఖం. ఇంకొకర్ని ఆపి నిన్ను పంపిస్తానుండు. మీ వూరు తీసుకెళ్తానంటే మధ్యాహ్నం ఆరేంజ్ చేస్తాను మరి"

"ఆ హెల్ప్ చేసి పెట్టు పుణ్యం వుంటుంది"

"అవేం మాటల్రా బ్రహ్మం. చిన్ననాటి నేస్తాన్ని ఆ మాత్రం చేయలేనా?!"

"థాంక్యూ. నీ వల్ల నా పని త్వరగా తెముల్తోంది. నువ్విక్కడ వుండటం నా అదృష్టం అనుకో" అన్నాడు బ్రహ్మానందం.

"నీకో రహస్యం చెప్పనా? అప్పాయింట్‌మెంట్ అని హడావిడి చేస్తూ బిల్డప్ ఇస్తాం గానీ వచ్చిన వారందరికీ ఏవో కబుర్లు చెప్పి ఆయన్ని కలిసే అవకాశం కల్పిస్తాం. మేమేదో వారికి ఫేవర్ చేసినట్టు ఫీలవుతూ నీలాగే పొగిడేస్తుంటారంతా" గలగలా నవ్వేసింది.

"చదువులోనే కాదు అన్నిటా నువ్వు చురుకే సుమా. జీతం ఏ మాత్రం ఇస్తున్నారేవిటి"

"నాలుగు వేలు. మా ఇల్లు ఈ దగ్గర్లోనే. ఈసారొచ్చినప్పుడు మీ ఆవిడ్ని కూడా తీసుకురా"

"తప్పకుండా"

మరో పది నిమిషాలకి సోమయాజులుగార్ని కలిశాడు బ్రహ్మానందం.

ఆయన పూజా పీఠం ప్రక్కనే బస్కీ వేసుక్కూర్చున్నారు. నుదుట పెద్దబొట్టు పట్టు వస్త్రాలు ధరించి విగ్రహపుష్టితో అలారారుతున్నారు.

బ్రహ్మానందం నమస్కరించగా కూర్చోమని సైగ చేశారు. కూర్చున్నాడు.

"నువ్వు తీవ్రమైన సమస్యల ఒత్తిడితో సతమతమవుతున్నావు. ఎటూ దారి కానక ఏమిటిలా అయ్యిందా అని కలవరపడుతున్నావు. ఎవరికీ అపకారం చేసే వాడ్ని కానే ఎందుకిలా జరుగుతోందని ఆందోళన పడుతున్నావు. అవునా?"

లోలోపల నవ్వుకుంటూ తలాడించాడు.

"ఇదంతా నీ గృహ వాస్తు దోషాల వల్ల సంభవించిన పరిణామం. మేము స్వయంగా వచ్చి పరిశీలిస్తాం. నీకు శుభం కలిగేలా చేస్తాం"

"కాని మాకు గృహం లేదు. అంటే స్వంత ఇల్లు కాదండి..."

"స్వంతమా అద్దెదా అన్నది కాదు ప్రశ్న. నీవు ఏ కప్పుక్రింద నివశిస్తే అదే నీ గృహం. ఆ గృహ గ్రహ ప్రభావం అందులో వుండే వారి మీద వుంటుంది. దిశమారితే దశమారుతుందిరా పిచ్చివాడా. ఇవాళే వచ్చి చూస్తాను. కార్యదర్శితో మాట్లాడు.."

నమస్కరించి కిన్నెర దగ్గరికెళ్ళాడు.

"రారా"

"అందరికీ ఒకే డైలాగా?"

నవ్వింది జవాబుగా. "ఫీజు అయిదొందలు. విజిటింగ్ ఫీజు వెయ్యి. రానూపోనూ టాక్సీ ఖర్చు నీదే"

"బాబోయ్ ఇంతింత ఫీజులా. సూపర్ స్పెషలిస్ట్ డాక్టర్ కూడా ఇంత చార్జి చెయ్యడు"

"ఈయనంతకంటే ఎక్కువే కదా. తప్పదు ఇచ్చేయ్. దేనికైనా ఒప్పుకుంటారు గాని ఫీజులో కన్సెషన్‌కి ఒప్పుకోరాయన. నేనూ హెల్ప్ చేయలేన్రా'

"రోటిలో తల దూర్చేక... సామెత గుర్తొస్తోంది" డబ్బిస్తూ అన్నాడు.

మధ్యాహ్నం సోమయాజులు గార్ని టాక్సీలో తీసుకెళ్ళాడు బ్రహ్మానందం.

సిద్ధాంతి రూపవేష భూషణాల్ని చూసి పరమానందపడి పోయింది శ్రీలక్ష్మి. ఎదురెళ్ళి పాదాభివందనం చేసింది.

సిద్ధాంతి ఇల్లూ పరిసరాలూ చూశారు. ఏవో లెక్కలు వేశారు. ఇరుగు పొరుగుల గురించి వాకబు చేశారు. అన్నీ తెలుసుకుని పెదవి విరిచారు.

"వాస్తుదోషాలు చాలా వున్నాయి. వాస్తు పండితుల్ని సంప్రదించక ఇంజినీర్లనో మేస్త్రీలనో నమ్మి ఇళ్ళు నిర్మిస్తే ఇలాగే వుంటుంది. పడమర కన్నా తూర్పు బెత్తెడే ఎక్కువ. వాయవ్యంలో బరువు చాలదు. వాడకం నీరు దక్షిణానికి వెళ్ళటం లేదు. అందుకే ఆర్థిక సమస్యలు.."

"మాకలాటి సమస్యల్లేవండీ.."

"లేకపోతే వస్తాయి. తెలివైన వాడివి గనుక ముందే జాగ్రత్త పడ్డావు"

"అయిదేళ్ళ నుంచి వుంటున్నాం. ఏ లోటూ లేదండి ఒక్క సంతానలేమి తప్ప..!"

"తెలుసు.. ఇక్కడి చెట్టు కూడా సరిగ్గా పుష్పించదు. ఇంకో ఇల్లు చూసుకోవాల్సిందే. వాయువ్యగదిని పడక గది చేసుకో. దక్షిణాన ఖాళీ ప్రదేశమో పచ్చని చెట్లో వుండే ఇంటిని చూసుకో. వెంటనే సంతానం ప్రాప్తిస్తుంది.."

మరేమనాలో తోచక బుర్రగోక్కున్నాడు బ్రహ్మానందం.

ఇంతలో ఇంటి యజమానిల పరుగు పరుగున వచ్చి సిద్ధాంతి కాళ్ళమీద పడ్డాడు. ఆశ్చర్యంగా చూశారాయన.

"నేను సార్. మర్చిపోయారా"

"లేదు లేదు" గుర్తించకపోయినా గుర్చించినట్లే నవ్వేరు. చూశారు.

"మీరు గీసిచ్చిన ప్లాన్ ప్రకారమే ఈ ఇల్లు కట్టాను. మాకు అన్ని విధాలా శుభస్కరంగా వుంది. అద్దె నెల నెలా ఠంచనుగా వచ్చి పడుతోంది. మళ్ళీ మీ దర్శనం చేసుకోలేకపోయాను మన్నించండి"

చాలా ఇబ్బంది పడిపోయారు సోమయాజులు గారు. కాస్సేపు గంభీరంగా వుండి ఆ పిమ్మట ఆయన్నో ప్రక్కకి తీసుకెళ్ళారు.

"అన్నీ బాగానే వున్నాయి. అంతా బాగానే వుంది కాని ఒక్కలోపం వుంది.."

"ఏవిటి స్వామీ..."

"కొత్త గృహంలో కొన్నాళ్ళ పాటైనా సంతానవంతులుండాలి. పిల్లల నవ్వుల్తో కేరింతల్తో ఇల్లు ప్రతిధ్వనించాలి. కొంత కాలమైనా అలా వున్న ఇల్లు ఆనందనిలయంగామారుతుంది. వీరిని ఖాళీ చేయించి సంతానం గల వారికి అద్దెకివ్వు"

"అలాగే స్వామీ"

సోమయాజులు గార్ని టాక్సీ ఎక్కించి పంపించేక, "మమ్మల్ని మారమని సలహా ఇచ్చారు. వాస్తు దోష ముందిట" అన్నాడు బ్రహ్మానందం.

"మీచేత ఇల్లు ఖాళీ చేయించమని నాకు చెప్పేరు. మీ వల్ల ఇంటికి లోపం వచ్చిందిట" అన్నాడు ఇంటి యజమాని.

ఇద్దరి మాటలూ విని ఇద్దరి వంకా అయోమయంగా చూస్తుండిపోయింది శ్రీలక్ష్మి!

* * *

**(ఆంధ్రభూమి వారపత్రిక 9.3.2000)**

# దశమగ్రహం

**శ్రీ**లక్ష్మి చెల్లెలి పెళ్లికెళ్లారు శ్రీలక్ష్మీ, బ్రహ్మానందం.

శ్రీలక్ష్మి వెంటనే పెళ్లి పనుల్లో పడిపోయింది. బ్రహ్మానందం మరో రకమైన పనిలో పడ్డాడు.

పెళ్లికి కొన్న చీరలూ నగలూ దగ్గర్నుంచి కూరలూ ఆకుల వరకూ సమస్తమూ ఎన్నెన్ని కొన్నారో ఎంతకి కొన్నారో కనుక్కుంటూ పుస్తకంలోకి ఎక్కించేస్తున్నాడు బ్రహ్మానందం. ఆఖరికి చాకలి మంగళ్ల కట్నాలని కూడా వదల్లేదతడు.

“ఎంత మంచి అల్లుడూ! అన్నీ వివరంగా కనుక్కుని లెక్కలు రాస్తున్నాడు. ఎక్కడా ఏమీ మిస్ కాకుండా మాట తేడాలు రాకుండా ముందు చూపుతో రాస్తున్నాడు సుమా” అని కొందరు మెచ్చుకున్నారతడ్ని.

“ఇతడో చాదస్తపు మొగుళ్లా వున్నాడే. అరటి ఆకుల్లో కూడా కొసముక్కలెన్ని అని లెక్కేస్తున్నాడు చూడు” అన్నవాళ్లూ వున్నారు.



అయినా ఎవర్నీ ఏమీ పట్టించుకోకుండా తన పరిశోధనా కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా కొనసాగించేశాడు బ్రహ్మానందం.

అతడ్ని చూసి అంతా ఎక్కడ నవ్వి పోతారోనని శ్రీలక్ష్మికి కంగారుగా వుంది. ఇదంతా ఎక్కడికి దారి తీస్తుందోనని మావగారు కాంతారావుకి భయంగా వుంది. అసలిదంతా ఎందుకో ఎవిటో తెలీక బావమరిది అనంత్‌కి కన్‌ఫ్యూజన్‌గా వుంది.

పెళ్లయింది. పెళ్లి కూతుర్ని అత్తవారింటికి సాగనంపారు. బంధువులంతా ఎక్కడి వాళ్ళక్కడ సర్దుకున్నారు. పందిట్లో మావగారు బాకీల లెక్కలేస్తూ కూర్చుంటే గదిలో బ్రహ్మానందం ఖర్చు లెక్కలు రాస్తూ కూర్చున్నాడు.

"అర్థరాత్రి వేళ అంకాలమ్మ శివాలన్నట్టు ఇప్పుడీ లెక్కల గొడవేంటండీ, పడుకోండిహ" ఆవులిస్తూ అంది శ్రీలక్ష్మి.

"ఇది లెక్కల గొడవకాదు, డబ్బుల గోల. ఇహ నిద్రెలా పడుతుంది చెప్పు?"

"అంటే ఏవిటంటారు?"

"లెక్కలు పూర్తవ్వొచ్చాయి. ఒక్క నిమిషం... హమ్మయ్య! పూర్తయింది. మీ నాన్న నీ పెళ్లి కన్నా మీ చెల్లెలి పెళ్లి ఘనంగా చేశారు. కట్నం ఎక్కువిచ్చారు. భోజనాల్లో ఒక కూరా ఒక పచ్చడీ అప్పడం ఎక్స్‌ట్రా వేశారు. చీరలు రెండెక్కువ కొన్నారు. మన పెళ్లిలో కుట్టుడాకుల్లో భోజనాలు వడ్డించారా ఇప్పుడేమో అరటి ఆకులు వేశారు. వాటిల్లో కొస ముక్కలే ఎక్కువ తెలుసా?"

"అవ్వ! ఎందుకొచ్చిన పోలికలండీ ఇవీ. ఎవరైనా వింటే నవ్విపోతారు!"

"నవ్వించిన సినిమాకే కాసుల వర్షం కురుస్తుందే పిచ్చిదానా" అంటూ లేచి పందిట్లోని మావగారి దగ్గరికెళ్లాడు బ్రహ్మానందం.

"రావోయ్ అల్లుడూ. ఇంకా పడుకోలేదా?" కాంతారావుగారడిగారు.

"మీరో సంగతి తేల్చి చెప్పేస్తే సంతోషంగా వెళ్లిపడుకుంటాను. మీకు ఇద్దరు కూతుళ్లూ సమానమా కాదా? అది తేల్చండి చాలు"

"సమానమేనయ్యా! ఇద్దరూ నా చెరో కన్నూనూ. నీకెందుకొచ్చిందా సందేహం?"

"బ్రతికించారు. మరటువంటప్పుడు ఇద్దరికీ సమానంగా ఖర్చుపెట్టాలి కదా?"

"అప్పటి ఖర్చు అప్పటిదే ఇప్పటి ఖర్చు ఇప్పటిదీనూ. ఆ రేట్లకే ఇప్పుడు రమ్మంటే రావు కదా"

"రాకపోతే తగ్గించుకోవాలి. ఇలాటి తిరకాసులు మన దగ్గర కుదరవు. మా పెళ్లిలో కన్నా మీ చిన్నమ్మాయి పెళ్లికి అన్ని రకాలగానూ కలిపి మొత్తం పద్దెనిమిది వేలు ఎక్కువ ఖుర్చు పెట్టారు. ఆ డిఫరెన్సు సొమ్ము ఇచ్చేస్తే వెళ్లి గుర్రుకొట్టి నిద్రపోతాను"

ప్రాన్పడిపోయారాయన.

"కంగార్లేదు. రేపివ్వండి. గుడ్‌నైట్"

లోపలికెళ్లి జరిగిందంతా భార్యకి చెప్పేసరికి ఆవిడా అదిరిపోయింది. "మా నాన్న అసలే అప్పుల్లో మునిగిపోయి వున్నాడండీ. మీరిలా బాధించడం భావ్యం కాదు"

"నిండా మునిగిన వాడికి చలేమిటి?"

"పైగా అంతా మీరు మంచివాళ్ళనీ బుద్ధిమంతులనీ అనుకుంటూంటే మీరిలా అడగటం ఏం బావోలేదండీ"

"ఓహో. అదో చిక్కుందా? సరే. ఇరవై శాతం డిస్కౌంట్ ఇస్తాను. 14400 ఇచ్చెయ్య మను"

తల పట్టుకుంది శ్రీలక్ష్మి. మర్నాటి ఉదయమే బావమర్ది అనంత్ బ్రహ్మానందాన్ని లేపాడు.

"బావగారూ! త్వరగా లేచి రెడీ అవండి. ఎకవుంట్స్ చూసుకుందాం"

"అలాగుటోయ్. నువ్వు చాలా బుద్ధిమంతుడివోయ్. నిన్ను చూస్తోంటే ముచ్చటే స్తోందనుకో. పది అంకెలు లెక్క పెట్టు. అవి పూర్తయ్యేలోపు వచ్చి వాల్తాను"

మరి పది నిమిషాలకి బావాబావమరుదు లిద్దరూ చెరో కుర్చీలో చెరో పుస్తకమూ పట్టుకుని కూర్చున్నారు.

"నీ లెక్కప్రకారం నాకెంత ఇవ్వాలో తేల్చి చెప్పు బామ్మర్దీ"

"మీరు మాకు 5200 ఇవ్వాలి బావగారూ!"

కడప బాంబు మీద పడ్డట్టు అదిరిపడ్డాడు బ్రహ్మానందం.

"నేన్నీకివ్వడం ఏవిటి? ఇదెక్కడి బిల్లప్పు? నా చెవిలో పూలచెట్లు కనిపిస్తున్నాయా?"

"వివరణ అడిగితే చెబుతాను కదా బావగారూ అలా చెమటలు కక్కుతారెందుకూ?"

"అలాగా నాయనా! చెప్పు. చెప్పవోయ్ చెప్పు. ఏం చెబుతావో చెప్పు"

"అయిదేళ్ళ క్రితం మీకిచ్చిన కట్నమూ చేసిన పెళ్లి ఖర్చులకి బ్యాంకు వడ్డీ ప్రకారం లెక్కకట్టి ఇప్పటి ఖర్చు తీసేస్తే మీరే తిరిగి ఇవ్వాల్సొచ్చారు బావగారూ! మీరు పెద్ద మనిషి గనుక వెంటనే ఆ సొమ్ము ఇచ్చేస్తే చిన్నా చితకా బాకీల్ని తీర్చేస్తాం"

"ఆ పప్పులేం మన దగ్గర వుడకవోరే బామ్మర్ది. లెక్కలు లెక్కలే. వడ్డీలు కావు"

"ఎలా కాకుండా పోతాయండీ?"

"నేను చెబుతున్నాను గనుక పోతాయంతే. సరే. నువ్వు మరీ బ్రతిమాల్తున్నావు గనుక నలభై పర్సంట్ డిస్కౌంట్ ఇస్తాను. మిగతాది త్వరగా ఇచ్చెయ్యండి. నా దగ్గర వేషా లెయ్యాలని చూడకండి మరి. సర్కస్ జంతువుల్ని ఆడించినట్టు ఆడించేస్తాను ఏవను కుంటున్నారో"

"అది కాదు బావగారూ!"

"ఇంకేం చెప్పొద్దు. తిన్నగా వెళ్లి మీ నాన్నకి చెప్పు. నా స్టయిలే వేరు. గుర్తుంచుకో. ఇవ్వక పోతే నా విశ్వరూపం చూపించాల్సొస్తుంది. దట్సాల్" స్టయిలుగా నడుస్తూ ఇంట్లోకెళ్లి పోయాడు బ్రహ్మానందం.

మరి కాస్సేపటికి మావగారొచ్చారు.

"నా పరిస్థితి నీకు తెలీందే వుంది అల్లుడూ. పోనీ రెండు వేలిస్తాను..."

"హమ్మో! అంత డిస్కౌంటా? దివాళా తీసెయ్యనూ. సారీ నేనివ్వలేనండి"

"నువ్వు మంచి వాడివి. అన్నీ తెలిసిన వాడివి. అంతకు మించి తూగలేను బాబూ"

"మరీ మొగమాటపెట్టేస్తున్నారు గనుక నాలుగు వేలివ్వండి ఎలాగో సర్దుకుంటాను"

ఇంకేం మాట్లాడలేక నిస్సహాయంగా చూశారు. "డబ్బు సమకూరగానే..."

"అలా అన్నారు బావుంది. ఓ మూడు నెలల టైము తీసుకోండి"

భారంగా అడుగులేస్తూ ఆయన వెళ్లగానే శ్రీలక్ష్మి అంది "మీరింత డబ్బు మనిషిగా మారతారని కలలో కూడా అనుకోలేదు"

"వూరికే నాలుగు వేలు వచ్చి ఒళ్లో పడితే చేదా? నా తెలివి తేటల్ని అర్థం చేసుకోడానికి ప్రయత్నించవే"

* * *

"మా నాన్న ఉత్తరం రాశారండీ. బాకీ డబ్బు ఒక నెల రోజుల్లో పంపిస్తానన్నారు. ఎల్లుండు మా చెల్లెల్ని కాపురానికి పంపిస్తున్నారట. మనల్ని రమ్మని రాశారు"

"నేను రాను. ఆఫీసులో చచ్చేంత పనుంది. కావలిస్తే నువ్వెళ్లు"

"కాపురం పెట్టేక ఏకంగా మా చెల్లెలింటికెళ్లి వస్తాన్లెండి"

హఠాత్తుగా బ్రహ్మానందం ముఖంలో ఫీలింగ్సు మారిపోయాయి.

“కొత్త కాపురం కదూ! సారెలూ సామాన్లూ పెడతారు కదూ?”

సంశయిస్తూనే తలాడించింది.

“మరలా చెప్పవేం. నేనూ శలవుపెట్టేసి వస్తాను. ఇంచక్కా ఇద్దరం కలిసి మీ చెల్లెలి కాపురాన్ని చూసొద్దాం”

“ఆఫీసులో పని వుందన్నారుగా?”

“ఎప్పుడూ వుంటూనే వుంటుంది. ఆఫీసు గురించి మనకి కలిసొచ్చేది పోగొట్టు కుంటామా?”

అయోమయంగా చూసిందామె. చిద్విలాసంగా నవ్వేడు బ్రహ్మానందం. ఇద్దరూ వూరి కెళ్లారు. శ్రీలక్ష్మి చెల్లెలి కాపురం బాగుండాలని ఆశీర్వదించారు.

ఆ పిమ్మట కాగితం కలం తీసుకుని కూర్చున్నాడు బ్రహ్మానందం.

“ఇవన్నీ ఎందుకు అన్నయ్య గారూ” తోడల్లుడు అడిగాడు.

“నీకర్థం కాదులే. దీన్ని రీసెర్చి అంటారు”

ఇంటికి తిరిగొస్తూనే మావగారికి ఉత్తరం రాశాడు.

తనకి పెట్టిన సామాన్ల లిస్టు, తోడల్లుడికి పెట్టిన సామాన్ల లిస్టూ జతచేసి రెంటికీ వున్న తేడా రెండు వేలనీ దాన్నీ పాతబాకీ నాలుగు వేలనీ వెంటనే పంపించెయ్యమని కోరాడు.

సంగతి విని నుదురు కొట్టుకుంది శ్రీలక్ష్మి. “మీ వరసేం బావోలేదు. పెళ్లయి అయిదేళ్ళయినా ఇంకా మావగార్ని నంజుకు తింటానంటారేవిటండీ ఖర్మ!”

“ముద్దొచ్చినప్పుడే చంకెక్కాలే”

“అసలే కామేశ్వరి కూపీ లాగితోందే అని నేను భయపడుతోంటే మీరు మరీ రెచ్చి పోతున్నారు. ఆఖరికి కొంపమీదికి ఏం ఉపద్రవం వచ్చిపడుతుందో ఏమిటో”

“ఎవరా కామేశ్వరి? ఏమావిడ కథ? నాక్కూడా చెప్పవే కొంచెం జాగ్రత్తగా వుంటానూ”

“ప్రక్కవీధిలోని తెల్ల మేడలో వుంటోందావిడ. స్త్రీ చైతన్య సంఘం సెక్రటరీలెండి. మీ గురించావిడకి ఎవరో ఏదో చెప్పారట. కట్నం దగ్గర్నుంచి అన్ని వివరాలూ ఆరా తీస్తోంది. ఇప్పుడీ సంగతి కూడా తెలిస్తే...”

“హమ్మో! పొరబాటున కూడా నువ్వు నోరు జారకే. ఏవీ చెప్పొద్దు. ఆవిడ మన సంగతులు తెలుసుకుని పేపర్ వాళ్లకి ఉప్పందిస్తే వాళ్లు బాక్సు కట్టి ప్రచురిస్తే నా ప్రెస్టేజ్ గంగలో కలిసిపోద్దే. ఆఫీసులో నవ్వుల పాలవుతానే. పోలీసు కేసు కూడా అవ్వద్దే”

"తెలుసండీ. చేసుకున్న వారికి చేసుకున్నంత మహదేవ అన్నారు!"

"అన్నీ తెలిసి నీ పతిదేవుడ్నిలా క్షోభకి గురి చెయ్యడం ఏం న్యాయం? ఇదేనా పతివ్రతా ధర్మం?"

"నాకు తెలిసిన ధర్మం ఇదే"

"అయ్యో! ఇప్పుడెలారా దేవుడా!"

"అంతా వుత్తుత్తి నాటకమని మా నాన్నకి రాసెయ్యండి"

"చూస్తూ చూస్తూ ఎలా రాయనే? ఒకటా రెండా? ఆరు వేలు. పోనీ ఓ పని చెయ్యి శ్రీలూ. జరిగిందేదో జరిగిపోయింది. దాన్ని వసూలు చేసేసుకున్నాక ఇంకెప్పుడూ ఇలాటి డిమాండ్స్ చెయ్యను. చేస్తే నీ ఎడం కాలి చెప్పుతో కొట్టు. సరేనా?"

ఆమె ఏమీ మాట్లాడలేదు. అవుననలేదు కాదనలేదు. అతడి వంక అదోలా చూసి లోపలికెళ్లిపోయింది. జుట్టు పీక్కుంటూ కూర్చున్నాడు బ్రహ్మానందం.

మరి రెండ్రోజులకి అనంత్ వచ్చాడు.

బ్రహ్మానందం ఆఫీసు నుంచి రాగానే ఎదురెళ్ళి "నమస్కారం బావగారూ. ఇదిగో మీ డబ్బు" అని పూలపొట్లం మధ్య నోట్ల కట్టలుంచి అందించాడు అనంత్.

నాలుగువైపులకీ భయంగా చూసి గబుక్కున పొట్లం తీసుకున్నాడు.

"మొత్తం ఆరు వేలు. లెక్కపెట్టుకోండి బావగారూ"

నోట్ల కట్టమీద చెయ్యి వేయబోయి ఎందుకో జంకిపొట్లం కట్టేశాడు.

"శ్రీలూ! మీ తమ్ముడికీ నాకూ ఫస్ట్ క్లాసైన ఫిల్టర్ కాఫీ పట్రా. ఏమైనా మీ నాన్న చాలా పెద్దమనిషోయ్"

"అవును బావగారూ. అందుకనే మా నాన్నగారికి షష్ఠి పూర్తి చేద్దామనుకుంటున్నాం"

"చెయ్యండోయ్. చాలా మంచి ఆలోచన"

కాఫీలు తెచ్చిస్తూ "మా చెల్లెలు షష్ఠి పూర్తికి పది వేలు ఖర్చు పెట్టి మా అమ్మా నాన్నలకి పట్టుబట్టలూ వుంగరాలూ కొంటోందిటండీ. అన్నిటా వాళ్ళతో పోటీ పడ్డవాళ్ళం. ఇందులో మాత్రం ఎందుకు వెనుకంజ వేస్తాం? అందుకని మేమూ పదివేలు ఖర్చుపెడతామని చెప్పాశానండీ" అంది శ్రీలక్ష్మి.

"ఏవిటీ? పదివేలు! హమ్మో!" మూతికాలిన పిల్లిలా గంతులేశాడు బ్రహ్మానందం.

"పెద్దల్లుడు గనుక అవసరమైతే కొంత ఖర్చు కూడా భరిస్తారని మీ మాటగా చెప్పేనండీ"

"అమ్మోయ్ నాయనోయ్. నీ వాగ్దానాలకో నమస్కారం తల్లోయ్!"

"అలా ఇదైపోతారేమిటి? రావాల్సినవి పీకల మీద కూర్చుని వసూలు చేసి. పెట్టాల్సొచ్చినప్పుడు పిసినారితనం చూపుతారేవిటండీ. బ్రహ్మానందం ది గ్రేట్ జూనియర్ ఆఫీసరా మజాకా!"

"బావగారు ఇంకా ఎక్కువ ఇద్దామనుకుంటున్నారేమో అక్కా"

"హమ్మో! రెచ్చిపోకండి బాబోయ్! కాస్త తగ్గండి. ఆకాశం మీంచి నేలమీదకి రండి. నాయనా బామ్మర్దీ! బుద్ధి గడ్డితిని ఏదేదో రాశాను. నీ డబ్బు నేను తిరిగి పువ్వుల్లో పెట్టి ఇచ్చేస్తున్నాను. తీసుకెళ్ళు నాయనోయ్. షష్ఠిపూర్తి ఖర్చులూ అవీ నానెత్తిన రుద్దొద్దు తండ్రోయ్!"

"అలా జావకారిపోతారేవిటండే. మనకెంత అవమానం ఎంత ఇన్సల్టూ ఎంత అదీ ఎంత ఇదీ!!'

"అవన్నీ భరిస్తాను గానీ శ్రీలూ ఇది భరించలేను. అత్యాశకి పోయాను. బుద్ధొచ్చింది. లెంపలేసుకుంటున్నాను. ఇక వదిలెయ్యండి" చెంపలు గట్టిగా వాయించుకున్నాడు బ్రహ్మానందం.

పడీ పడీ నవ్వేరు శ్రీలక్ష్మీ అనంతూ.

"ఆ నవ్వులేవిటే. నేను పిచ్చి మాలోకంలా కన్పిస్తున్నానా"

"షష్ఠి పూర్తీ లేదు ఖర్చూ లేదండీ. మీకు బుద్ధి చెప్పడానికి నాటక మాడాం" అంది శ్రీలక్ష్మి.

"భలేగా బుద్ధి చెప్పేరోయ్. ఇంకెప్పుడూ పరాయి సొమ్ముకి అర్రులు చాచను. ఆశపడను. నువ్వూ పడొద్దురేయ్ బామ్మర్దీ"

"ఇప్పుడు మా బావగారన్పించారు"

"ఇంటే ఇంతవరకూ కాదా?"

"ఇంతవరకూ మా నాన్నగారి నెత్తికెక్కిన దశమగ్రహం!"

* * *

**(ఆంధ్రభూమి వారపత్రిక 17.2.2000)**

# నడమంత్రపు అధికారం

**ఆ**ఫీసర్ నారాయణగారికి ఆయన స్వంత జిల్లాలోని ఆఫీసుకి ట్రాన్స్‌ఫర్ వచ్చింది.

స్టాఫ్ అంతా ఆయన్ని అభినందనల్తో ముంచెత్తారు.

"ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ వచ్చినంత మాత్రాన ఒరిగేదేం వుండదోయ్. త్వరగా రిలీవర్ రావడం మీద నా అదృష్టం ఆధారపడి వుంటుంది"

"పోనీ నేను జూనియర్ ఆఫీసర్ని గనక నాకు చార్జి ఇచ్చి రిలీవ్ అయిపోకూడదా సార్" బ్రహ్మానందం అడిగాడు.

అతగాడికి త్వరగా ఆఫీసరైపోవాలనీ ఆఫీసుని ఏకఛత్రాధిపత్యంగా ఏలెయ్యాలనీ మహా ఉబలాటంగా వుంది.

"హెడ్డాఫీస్ పర్మిషన్ కావాలోయ్. పర్మిట్ చేసే వారయితే ఈ పాటికి ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చేసే వారే. అప్పుడు నా పనీ హ్యాపీగా వుండేది"

నిట్టూర్చాడు బ్రహ్మానందం.

సరిగ్గా అప్పుడు టెలిగ్రాం వచ్చింది.

బ్రహ్మానందానికి చార్జి ఇచ్చి వెంటనే రిలీవ్ అయిపోమని ఆదేశిస్తూ హెడ్డాఫీసు పంపిన టెలిగ్రాం అది.



ఎగిరి గంతేశాడు బ్రహ్మానందం.

అంతా అతగాడ్ని గొప్పగా అభినందించేశారు.

చాటుగా మాత్రం ఇలా ఎలా జరిగిందో అర్థంగాక చెవులు కొరుక్కున్నారు స్టాఫ్ యావత్తూ. ఏమంత్రి చేతనో రికమండేషన్ చేయించడమో లంచాలు తినిపించడమో చేసి వుంటాడని కూడా అనుకున్నారు. ఒక్కసారి సీట్లో కూర్చున్నాడంటే పట్టాల్సినపట్లు పట్టి పెట్టాల్సిన ముగ్గులు పెట్టి పర్మనెంటుగా సెటిలైపోతాడని అంచనా వేశారు.

బ్రహ్మానందం మాత్రం రెండు కేజీల స్వీట్స్ పాకెట్‌తో గాలిలో తేలుతూ ఇంటికెళ్లాడు.

"ప్రమోషనొచ్చిందా?" చేటంత మొహం చేసుకుని అడిగింది శ్రీలక్ష్మి.

"వచ్చినట్టేనే. ప్రస్తుతం ఇన్చార్జి ఆఫీసరుగా వేశారు. త్వరలో పర్మనెంట్ చేస్తారు. ఇక ఆఫీసులో మన ప్రభ వెలగబోతోంది. ఫ్యాను కారూ అధికారం–ఓహ్! మనదిహ రాజ యోగమే!" సోఫాలో పడుకున్నట్టుగా కూర్చుని టీపాయ్ మీద కాళ్లు పెడుతూ అన్నాడు.

"అబ్బ! ఎంత మంచి వార్త చెప్పేరండీ" అంటూనే వెళ్లి ఇరుగమ్మకీ పొరుగమ్మకీ మాత్రమే చెప్పింది. అంతే. కానీ, రెండు నిమిషాల్లో వీధిలోని అందరికీ తెలిసిపోయింది. ఎంచు మించు అంతా వచ్చి అభినందించారు.

"నాలా సిన్సియర్‌గా పనిచేసే వాడికి ప్రమోషన్లు వెదుక్కుంటూ వచ్చి ఒళ్లో వాలతాయి. అసలు మీరు నమ్మరేమోగాని మా ఆఫీసు నా వల్లే నడుస్తోంది. నేన్లేకపోతే ఆఫీసు మూసే యాల్సిందే" అంటూ చిన్నసైజు ఉపన్యాసమిచ్చాడు.

అంతా స్వీట్సు తిని కాఫీలు తాగి మరీ వెళ్లారు.

మర్నాడు ఆఫీసు వాళ్లు నారాయణ గారికి వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. సభకి సఫారీ సూట్‌లో హుందాగా వున్న బ్రహ్మానందం అధ్యక్షత వహించాడు.

అధ్యక్షోపన్యాసంలో ఆఫీసులో చాలా మార్పులు తెస్తాననీ మోడల్ ఆఫీసుగా తీర్చిదిద్దు తాననీ ప్రకటించాడు. ఇంతవరకూ ఆఫీసు వ్యవహారాలు సవ్యంగా నడవకపోవడానికి కారణం నాయకత్వ లోపమేనంటూ పరోక్షంగా నారాయణగార్ని కించపరిచాడు కూడా.

అతడి ధోరణిని బట్టి అతడు ఆ సీట్లో తిష్ఠ వేసినట్టేనని భావించేరంతా. దాంతో ఒకర్ని మించి ఒకరు అతడ్ని పొగట్టం మొదలు పెట్టారు.

వీడ్కోలు సభ కాస్తా బ్రహ్మానందం అభినందన సభగా మారిపోయింది.

మొదటిరోజున అతడ్ని పికప్ చేసుకోడానికి కారు వచ్చింది.

ఇంట్లోంచి ఫుల్ సూట్లో బయటికొచ్చాడు బ్రహ్మానందం.

ఇరుగు పొరుగు అంతా తననే గమనిస్తున్నారని గమనించి కారు అద్దంలా మెరిసేలా తుడవలేదని డ్రైవర్ మీద విరుచుకుపడ్డాడు.

"ఇంకెప్పుడూ ఇలా జరగనివ్వను సార్" అన్నాడతడు ఏడుపు స్వరంతో.

"ఈసారికి క్షమిస్తున్నా"

అతడు డోర్ తీసి పట్టుకోగా ఎక్కి కూర్చుని శ్రీలక్ష్మికి టాటా చెప్పాడు.

ఆఫీసు ముందాగింది కారు.

"హారన్ కొట్టు"

ఆ శబ్దానికి ప్యూన్ గుండు పరుగునొచ్చాడు.

"డోర్ తీసి పట్టుకో" హుంకరించాడు.

వణకుతూ డోర్ తీయగా హుందాగా దిగాడు.

"బ్రీఫ్‌కేస్ పట్టుకుని నా వెనకాలే రా"

"యస్సార్!"

రాజు వెడలె రవితేజములలరగ – అన్నట్టు నడుస్తూ ఆఫీసులో అడుగుపెట్టాడు.

ఒక్కొక్క టేబుల్ దగ్గరా ఒక్కో క్షణం ఆగి ఆగి నడుస్తున్నాడు. అంతా సెల్యూట్ చేస్తూ విష్ చేస్తోంటే తల పంకిస్తూ లోపలికెళ్తూ ఆగాడు.

ఒకతనేదో ఫైలు చూస్తూ లేవలేదు.

దగ్గేడు. అయినా అతడు విన్పించుకోలేదు.

విపరీతమైన కోపం వచ్చేసింది బ్రహ్మానందానికి.

"ఏవిటోయ్ మిస్టర్ కొండల్రావ్, ఫైలు చూస్తున్నావా లేక ఫైల్లో డిటెక్టివ్ నవల పెట్టుకుని చదువుతున్నావా?"

కంగారు పడ్తూ లేచాడతడు – "ఫైలు చూస్తున్నాన్సార్"

"ఏం ఫైలది? నీ దగ్గర ఎన్ని ఫైల్సు పెండింగ్‌లో వున్నాయి?"

"ఇదొక్కటే సార్"

"మిగతావి ఏమయ్యాయి?"

"డిస్పోజ్ చేశాన్సార్. కొన్నిటికి కొర్రీలు వేశాను. జవాబులు రావాలి"

"దాంతో నీపనై పోయిందా? జవాబులు వాటంతట అవి రావోయ్. రప్పించుకోవాలి. వచ్చే దాకా వెంటాడాలి"

"అలాగే సార్"

"అలాగే అంటే కాదు, నువ్వేం చేస్తావో ఎలా చేస్తావో నాకు తెలీదు. మూడు రోజులు గడువిస్తున్నాను. ఆలోగా అన్నిటికీ జవాబులు తెప్పించి ఫైల్సు పుటప్ చెయ్యాలి. దిసీజ్ మై ఆర్డర్"

టకటకా బూట్ల శబ్దం చేసుకుంటూ తన రూంలోకెళ్లిపోయాడు బ్రహ్మానందం.

అంతా విస్తుపోయారు.

కొండలరావు సిన్సియర్ వర్కర్. ఆ సంగతి బ్రహ్మానందంతో సహా అందరికీ తెలుసు. పెండింగు ఫైల్సు ఒక్కొక్కరి దగ్గరా యాభైకి తక్కువ వుండవు. అలాటిదతడి మీద కళ్లు మూసుకుని పడడం అందరికీ బాధ కలిగించింది. యూనియన్ వాళ్లు కల్పించుకుంటామంటే కొండలరావు వారించాడు.

కాస్సేపయ్యాక స్టెనో జయలలితని పిల్చాడు బ్రహ్మానందం. స్లీవ్‌లెస్ జాకెట్టు పల్చని చీర ధరించిన ఆమె వూరికే పైట సర్దుకుంటూ వచ్చింది.

"గుడ్మాణింగ్ సార్"

"కమాన్ కూర్చో. నా గురించి ఆఫీసులో ఏమనుకుంటున్నారు?"

"అంతా హడలిపోతున్నారు సార్. ఇన్నాళ్లకి ఈ ఆఫీసుకి ఫస్టాస్ ఆఫీసరు లభించారు సార్"

"థాంక్యూ థాంక్యూ"

"మీరేమీ అనుకోనంటే ఒక మాట చెప్పనా బాస్?"

"చెప్పు... చెప్పు"

"హీ మాన్లా వున్నారు బాస్..." కైపు కళ్లతో చూసింది. తడబడ్డాడతడు.

"ఇప్పుడే ఏమయింది. ముందు ముందు నువ్వే చూస్తావుగా"

మర్నాడు కొందరి సీట్లు మార్చేడు. లేడీ కొలీగ్స్‌తో కబుర్లు చెప్పకుండా వాళ్ళందరి సీట్లూ తన కేబిన్ ప్రక్కనున్న రూంలోకి మార్చేడు. కేంటీన్లో ఎక్కువ సమయం గడప కుండా మధ్య మధ్య అటుగా వెళ్లి చూసొస్తున్నాడు. ఎవరికీ పర్మిషన్లు ఇవ్వొద్దనీ, పంక్చువాలిటీ స్ట్రిక్టుగా అమలు చెయ్యాలనీ ఆఫీసు మేనేజరుకి ఆదేశాలిచ్చాడు.

తనిది వరకు చేసినటువంటివి–పోచికోలు కబుర్లు చెప్పడం, కేంటీన్లో దొర్లటం, స్వంత పనుల మీద అటూ ఇటూ వెళ్లటం–లాటివి ఎవరూ చెయ్యకుండా తగిన చర్యలు తీసుకున్నాడు.

అంతేకాదు, హెడ్డాఫీసుకి పంపించాల్సిన రిపోర్టుల్నీ ఫైల్సునీ చకచకా పంపించేందుకు గాను ఉద్యోగుల మీద ఒత్తిడి పెంచాడు. ఎలావోలా పైవారి అనుగ్రహం సంపాదించి తనా సీట్లో పాతుకు పోవాలని తలపోస్తున్నాడు.

ప్యూన్ గుండు వచ్చి ఫైలు టేబుల్ మీద పెట్టి వెళ్లబోతోంటే ఆపాడు బ్రహ్మానందం.

"ఒరే గుండూ"

"సార్"

"ఇంకెప్పుడూ ఫైలు తెచ్చి అలా టేబుల్ మీద పెట్టొద్దు'

"మీరు చూడాలని..."

"చూడాలి. చూస్తాను. కానీ ఆ ఫైలు రాసినవాడు స్వయంగా పట్రావాలి. తెల్సిందా?"

"తెల్సింది సార్. నా పని కూడా వాళ్లనే చెయ్యమంటున్నారు"

"షటప్ అండ్ గెటవుట్"

ఒక్క దూకుతో బయటపడ్డాడు గుండు.

మరి కాస్సేపటికి చిట్టిబాబు ఫైలు తీసుకొచ్చాడు.

"నన్నే ఫైలు తెమ్మన్నావంటేమిత్రా" క్రితం రోజు కలిసి తిరిగిన చనువుతో అన్నాడు.

"మర్యాద మర్యాద!"

"నేనిప్పుడు అమర్యాదగా ఏం మాట్లాడాన్రా"

"అధిక ప్రసంగాలొద్దు. కమ్ టు ద పాయింట్"

సర్దుకుని నిలబడి "చెప్పండ్సార్" అన్నాడు.

"నేను చెప్పను. నువ్వే చెప్పాలి. ఆ ఫైలు ఏమిటో దేనిగురించో పూర్వాపరాలేమిటో అన్నీ వివరించాలి. సంతకం ఎక్కడ పెట్టాలో చూపించాలి. పొట్టి సంతకం పెట్టాలో పొడుగు సంతకం పెట్టాలో చెప్పాలి. ఊ.. చెప్పు"

బిక్క చచ్చిపోయాడతడు.

"ఏవిటలా చూస్తున్నావ్? ఇది ఆఫీసు. ఇక్కడ నేను చెప్పిందే వేదం. చేసిందే శాసనం. మైండిట్"

"ఓకే సార్"

* * *

బ్రహ్మానందం కొత్త పద్ధతులెవరికీ నచ్చలేదు.

సీట్లోంచి లేవడానికి లేదు. కబుర్లు చెప్పుకోడానికి లేదు. కాస్త ఆలస్యంగా రావటానికి వీల్లేదు. ఆడవాళ్లతో పిచ్చాపాటీ మాట్లాట్టానికి బొత్తిగా వీల్లేదు.

కానీ అతడు మాత్రం స్టెనో జయలలితతో గంటల తరబడి కబుర్లు చెబుతున్నాడు. తన ఘనకార్యాలు ఏకరువు పెడుతూ ఆమె అభినందనల్ని పదే పదే అందుకుంటున్నాడు.

అతడి అలుసుతో ఆవిడ ఫోజు కొడుతోంది. అథార్టీ చలాయించాలని చూస్తోంది.

అంతా అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఒకరిద్దరు ఉద్యోగులు యూనియన్ నాయకులకి ఉత్తరాలు రాశారు. బ్రహ్మానందాన్ని వూడబీకేస్తే చూసి ఆనందిద్దామని ఆశిస్తున్నారంతా.

అవాళ యథాప్రకారం బ్రహ్మానందం జయలలితకి తన చిన్నప్పటి వీరకృత్యాలు వర్ణించి చెబుతున్నాడు. ఆమె నవ్వుతూ మధ్య మధ్య అభినందిస్తోంటే ఏనుగెక్కినంత సంబర పడుతూ మరీ కోసేస్తున్నాడు.

ఇంతలో టక్ చేసి టై కట్టుకున్న ఓ పెద్ద మనిషి స్ప్రింగ్ డోర్ తెరచుకుని లోపలికొచ్చాడు.

బ్రహ్మానందానికి ఒళ్లు మండిపోయింది.

"నువ్వసలు మనిషివేనా?" అని నిలదీసేసరికి బిత్తరపోయాడతడు.

"మేనర్స్ వుండొద్దూ? టై కట్టుకుంటే చాలదు. దానికి తగ్గట్టు డిగ్నిఫైడ్‌గా వ్యవహరించాలి. ఎందుకలా చూస్తావ్? మిస్టర్! నీ కాటు మొహం చూట్టం నాకిష్టం లేదు. అయినా నేను చాలా బిజీగా వున్నాను. అర్జంట్ పనిలో నిలువునా కూరుకుపోయి వున్నాను. డోంట్ డిస్టర్బ్‌మీ..." అతడేదో చెప్పబోయాడు గాని విన్పించుకోలేదు.

అతగాడు వెళ్ళకపోయేసరికి, "బయటికి వెళ్లవయ్యా" అని అరిచాడు గట్టిగా.

అతడెళ్లిపోయాక గుండు వచ్చాడు.

“నువ్వెందుకు వచ్చావ్? నేను పిలిచానా? లేదు. బెల్లు కొట్టానా? లేదు. మరెందుకు వచ్చావ్? అసల్నీ డ్యూటీ ఏంటి? పిచ్చి పిచ్చి వేషాలేస్తే నీ ఇంక్రిమెంట్ కట్ చేస్తాను జాగ్రత్త!” మీదపడి కరిచేశాడు.

ఏదో చెప్పాలనొచ్చిన గుండు ఏమీ చెప్పకుండానే పారిపోయాడు.

“అబ్బబ్బ! వెధవాఫీసు! ఎవర్తో ఎలా మసలాలో కూడా తెలీదు. ఇడియట్స్!”

“అవును బాస్. ఆఫీసర్ బాస్‌తో ఎలా బిహేవ్ చెయ్యాలో వీళ్లకి తెలీదు. మీరోసారి క్లాస్ తీసుకోవాలి బాస్...” వయ్యారాలు పోతూ అంది జయలలిత.

“గుడ్ ఐడియా! ఈసారి హెూటల్లో మీటింగు పెట్టి క్లాస్ తీసుకుంటాను. అందర్నీ పాలిష్ చెయ్యాల్సిన బాధ్యత కూడా నా మీదే వుంది కదా!”

ఆఫీస్ మేనేజర్ వచ్చాడు నీళ్లు నములు్తూ.

“ఇవాళ మీకందరికీ ఏమయింది? వూరికే నా మీదకి దండయాత్ర కొస్తున్నారేంటి? అసల్నా గురించి మీరేమనుకుంటున్నారు?” కోప్పడ్డాడు బ్రహ్మానందం.

“క్షమించాలి. కొత్త ఆఫీసర్ వచ్చార్సార్” అంటూ చావు కబురు చల్లగా చెప్పేడు.

“ఏ..వి..టి..? కొ... కొత్త ఆఫీసరా?” కళ్ళు తిరుగుతోంటే తికమక పడ్డాడు.

“అయామ్ బ్రహ్మానందం. నా సీటు ఖాళీ చేస్తారా?” అంతక్రితం మెడపట్టి బయటికి త్రోసేసినంత పనిచేయబడ్డ టై పెద్ద మనిషి అన్నాడు లోపలి కొచ్చి.

“అంటే...”

“నారాయణ స్థానంలో నన్ను పోస్టు చేశారు. నా ఆర్డర్ ఎంచేతో మీకందలేదు. బ్రహ్మానందానికి చార్జి ఇమ్మంటే ఆ బ్రహ్మానందం మీరే అనుకుని మీకు చార్జి ఇచ్చి వెళ్ళి పోయాడు నారాయణ. నిజానికి నాకిచ్చి వెళ్లమని హెడ్డాఫీసు వారి వుద్దేశం. నేను జాయినవ్వడం ఆలస్యమయ్యేసరికి మీరు ఆఫీసుని మీ స్వంత జాగీరు చేసేసుకుని ఎడాపెడా దున్నేశారు. మీమీద ఏం చర్య తీసుకోవాలన్నది తర్వాత చూస్తాను ముందు ఆ సీటు నాకిచ్చి మీరు మీ సీట్లోకెళ్తారా?”

దభీమని కొత్త బ్రహ్మానందం కాళ్లమీద పడి పోయాడు పాత బ్రహ్మానందం!

* * *

**(ఆంధ్రభూమి వారపత్రిక 3.2.2000)**

# మోడ్రన్ పనిమనిషి

ప్రకింటికెళ్లిన శ్రీలక్ష్మి హుషారుగా కూనిరాగం తీస్తూ వచ్చింది.

ఏదో అర్జంట్ ఫైలు చూస్తున్న బ్రహ్మానందం ఆవిడ వంక ఆశ్చర్యంగా చూశాడు.

"ఏవిటి కథ గాలిలో తేలిపోతున్నావ్?"

"ప్రక్కింటి పిన్నిగారి పనిమనిషి మనకో పనిమనిషిని రికమండ్ చేస్తోందండీ"

"పనిమనిషి కోసం రికమండేషనా? బాగుంది. అయినా మనకి పనిమనిషెందుకులేవే. వాళ్లతో వేగటం చాలా కష్టం"



"అంతా అలాగే ఉండర్లెండి. పనిమనుషుల్లోనూ పనిమంతులుంటారు. ఆఫీసర్‌గారి భార్యకి చేదోడు వాదోడుగా పనిమనిషి లేదంటే ఎంత నామోషీ చెప్పండి?"

"ఆ రూటులో వస్తే ఇక నీ మాటకి అప్పీలేం వుంటుంది. సరే అలాగే కానియ్ గాని పనిమనిషితో అన్ని విషయాలూ నేను మాట్లాడతాను. నాకు నచ్చితేనే పెట్టికుందాం. సరేనా?"

"కన్నూ కండా బావుంటే మీకు నచ్చేస్తుందాయె!"

"నన్ను మరీ చొంగ కార్చుడు వెధవగా జమ కట్టెయ్యకు మరి. ఎవరెలాటి వారో, ఎవరెలా పని చేయగలరో ఇట్టే పట్టెయ్యగలను తెలుసా?"

"పనిమనిషిని పెట్టుకోవడానికి ఇన్ని ఆలోచించాలా? మీది మరీ చోద్యం!"

"అమ్మమ్మ. పని మనుషులంటే అల్లాటప్పా వాళ్ళు కాదే. మనింటి గుట్టు మట్లు గుప్పెట్లో పెట్టుకునే ఆడమాయల ఫకీర్లు. మనం చాలా జాగ్రత్తగా వుండాలి"

అపనమ్మకంగా చూసిందామె. అది గ్రహించి అవమానంగా ఫీలయ్యాడు.

"కొన్ని ఇళ్లల్లో ఊరికెళ్లినప్పుడు దొంగలు పట్టానికీ, ఇంట్లో ముసలాళ్ళు హత్యకి గురవడానికీ ఈ పనిమనుషులు అందించిన సమాచారమే కారణమని పోలీసులు బోల్డుసార్లు రుజువు చేశారే. అంచేత ఆ పని మనిషెవరు, ఆవిడ పద్ధతీ ప్రవర్తనా ఎలాంటివి వగైరాలు ముందే తెల్సుకోవాలి. అవన్నీ నీకర్థంగావు గానీ పనిమనిషి రాగానే పిలుపు. నేనొచ్చి ఎన్ని కేరట్లు బంగారమో గీటు పెట్టి మరీ చెప్పేస్తాను"

"ఆంటీజీ" అనెవరో పిలిచారు.

శ్రీలక్ష్మి వీధిలోకెళ్లి "ఎవరూ?" అంది.

"పనిమనిషి కావాలన్నారటగా. అచ్చుమ్మ చెప్పింది"

ఆవిడ వేషాన్నీ, స్టైలునీ, నల్లకళ్ల జోడునీ చూసి నిలువునా ఆశ్చర్యబోయింది శ్రీలక్ష్మి.

"నువ్వు పనిమనిషివా?"

"ఏం పనిమనుషులు సినిమా స్టార్లా ఉండకూడదా? వుంటే మీ ఇంటాయన్ని ఎగరేసుకుపోతారని భయమా?"

"మా ఆయనేం ఆడ గాలికి వంకర్లు తిరిగిపోయే రకం కాదు గానీ మాటలు తగ్గించి లోపలికి రా"

కొత్త పనిమనిషి వచ్చిందని బ్రహ్మానందానికి చెప్పింది. అతడొచ్చి ఆమెని ఎగా దిగా చూశాడు.

"నీ పేరు?"

"పాకీజా!"

"అదేం పేరు?"

"నచ్చలేదా? టాబూ అని మార్చేసుకోనా?"

"అంత పని చేయొద్దు గానీ నీకు ఎక్స్‌పీరియన్స్ ఎంత?"

"ఎందులో?" మెలికలు తిరిగిపోతూ అంది.

"నీకిలాంటి రోగం కూడా వుందా తల్లీ!"

"మగాళ్లని సూత్తే సిగ్గు"

"ఓహో! అదొకటుందా? ఇంతకీ నీకీ వృత్తిలో ఎక్స్‌పీరియన్స్ – అనుభవం ఎంత?"

"ఇంటర్వ్యూ సేత్తన్నారా?"

"భలేగా కనిపెట్టేసావే! ఫర్లేదు. తెలివైందానివే. ఆఫీసర్ని కదా ఆఫీసులో చాలా ఉద్యోగాలకి ఇంటర్వ్యూ చేస్తుంటాను. నా సెలక్షన్ సూపర్‌గా వుంటుందని మెచ్చుకుంటూ వుంటారంతా" కోతలు కోశాడు.

"తొరగా సేసెయ్యండి. మల్లీ నేను ఇంటర్వ్యూ సెయ్యాల" బొడ్లోంచి చిన్న సంచి తీసి అందులోని వక్కపొడి నోట్లో వేసుకుంటూ అంది పాకీజా.

"ఏమిటీ నువ్వు మమ్మల్ని ఇంటర్వ్యూ చేస్తావా?"

"మరి మీ గురించి తెలుసుకోవద్దా? మీ ఇంట్లో ఏటేటున్నాయో, ఏవేం తింటారో, ఎందరు సుట్టాలు పట్టాలు వత్తారో తెలుసుకోవద్దేంటీ?"

"అమ్మో.. దేవాంతకురాలివేనే! ముందు నువ్వు మాకు నచ్చనీ, తర్వాత నువ్వు మా గురించి ఆలోచిద్దువు గానీ. ఊ.. నీ ఎక్స్‌పీరియన్స్ ఎంత?"

"పదేళ్ళ నుంచీ సేస్తన్నాను"

"ఇంతక్రితం చేసిన ఇంట్లో పనెందుకు మానేశావ్? నువ్వు మానేశావా లేక వాళ్ళే తీసేశారా?"

"నానే రాజీనామా ఇచ్చేసినాను"

"ఎందుకని?'

"ఆ మొగుడూ పెళ్లాలిద్దరూ అస్తమానూ కోడిపుంజుల్లా దెబ్బలాడుకుంటూ వుంటారు"

"అయితే నీకొచ్చిన నష్టమేమిటి?"

"పని మానేసి ఆళ్ళ గొడవ సూడాలా? ఆళ్ల గోడు ఇనాలా? పని సెడిపోతాంది కదా మరి. ఓవర్ టైమ్ ఇయ్యరాయె!"

"సరిసరేగానీ జీతం ఎంత కావాలి?"

"మీ సంగతులు సెప్పేక సెబుతాను"

"నీ మొగుడేం చేస్తాడు? రిక్షా తొక్కుతాడా? త్రాగుబోతా?"

"నేనెలా కన్పిత్తన్నానేంటి? అలాటిలాటోడు కాదు. సినిమాల్లో ఏషాలేస్తుంటాడు"

"ఏంటీ?!" అదిరిపడ్డారిద్దరూ.

"ఏం వేషాలేస్తుంటాడు"

"స్టంట్లు చేస్తాడు. హీరోకన్నా బాగా సేత్తాడు గానీ హీరోచేత దెబ్బలు తినిపిత్తా ఉంటారు"

"ఎన్ని ఇళ్లల్లో పని చేస్తున్నావ్? నీకు ఉద్యోగం ఇస్తే ఎన్ని గంటలకి పనిలోకి వస్తావు?"

"ఎన్నో ఇళ్ళు సెయ్యను. ఒక్క ఇల్లు ఒక్క మాట. టైం ప్రకారం వచ్చేత్తాను"

ఇంకేం అడగాలా అని ఓ నిముషం ఆలోచించాడు బ్రహ్మానందం. బుర్ర గోక్కున్నాడు. ఏమీ తోచలేదు.

"సరే నీ ఇంటర్వ్యూ మొదలెట్టు. రావే నువ్వూ వచ్చి కూర్చో" భార్యతో అన్నాడు బ్రహ్మానందం.

ఇద్దరూ సోఫాల్లో కూర్చున్నారు.

"మీరు దెబ్బలాడుకోరు కదా!"

"అబ్బే దెబ్బలాడుకోం" ఇద్దరూ ఒక్కసారే అన్నారు.

"అనుమాన రోగాలు లేవు గందా!"

ఒకరి ముఖాలొకరు చూసుకుని "లేవు" అన్నారు.

"పిల్లా పీచూ..."

"ఇంకా లేరు"

"ఇంకో ఏడాది దాకా పుట్టరు కదా?"

"ఆ గొడవ నీకెందుకు?"

"నా పని పెరుగుద్ది కదా. కడుపుతో వున్నామె సిన్నా సితకా పన్జెబితే కాదన్లేను గదా. అందుకని అడుగుతున్నా"

"ఫిఫ్టీ ఫిఫ్టీ ఛాన్సు వుంది మరి. అపైన నీ ఇష్టం"

"చుట్టాలొస్తా వుంటారా? ఎన్నాళ్ళకొస్తా వుంటారు. ఎందరొస్తుంటారు. ఎన్నేసి రోజులుంటారు?"

"బంధువులెక్కువగా రారు. ఒకల్లిద్దరు నెలకోమారు వస్తారు. ఒకటి రెండ్రోజుల కన్నా ఎక్కు వుండరు. జీతం సంగతి చెప్పకుండా ఇవన్నీ అడుగుతున్నావేంటి. జీతం మాకు నచ్చక పోతే పెట్టుకోం కదా"

"మీ టీవీ కలరా? నలుపూ తెలుపా?"

"కలరే"

"కేబుల్ కనెచ్చన్ వుందా?"

"వుంది"

"రోజుకి రెండు సినిమాలు వేస్తారా?"

"వేస్తారు గానీ అన్నీ మేం చూడం"

"మీరు సూడకపోతేనేం నేను సూత్తాను. స్టార్ టీవీ వత్తాది కదా!"

"నీకు ఇంగ్లీషొచ్చా?" ఆశ్చర్యపడింది శ్రీలక్ష్మి.

"సినిమాలు సూత్తానికి బాస రావాలేంటి?"

"సరే గానీ జీతం ఎంత కావాలో చెప్పు ముందు" బ్రహ్మానందం అన్నాడు.

"కలర్ టీవి, కేబుల్ కనెచ్చనూ, వీసీఆర్ వున్నాయి కనుక పాతిక పర్సెంటు డిస్కౌంటు ఇత్తన్నా. ఫ్రిజ్జూ, వాషింగ్ మిషనూ, గ్రైండరూ వున్నాయి కదా?"

"వున్నాయి"

"ఇంకో పది పర్సెంట్ తగ్గిత్తున్నా. పైపు తిప్పితే టాంక్‌లోంచి నీళ్ళొత్తాయి కదా?"

"వస్తాయి'

"ఇంకో పది పర్సంటు తగ్గిత్తన్నా!"

"ఇవన్నీ పోను ఎంతివ్వాలో చెప్పు'

చేతివేళ్ళు మడిచి ఏవో లెక్కలేసుకుంది. ఏ అంకె చెబుతుందోనని ఆత్రంగా చూడసాగారిద్దరూ.

"మూడొందలిచ్చేయండి"

"మూడొందలే!"

"యస్సూ. పొద్దున కాఫీ, టిఫినూ, మజ్జానం టీ ఇయ్యాలి. ముగ్గురి కన్నా ఎక్కువ సుట్టాలొచ్చినా మూడ్రోజుల కన్నా ఎక్కువున్నా ఓవర్ టైమ్ ఇవ్వాలి. నెలకోరోజు సెలవు. అవాళ్టి సినిమా ఖర్చు మీదే. పండగల్లో ఒక పూటే పని చేత్తాను. కరెంటు లేకపోతే పిండి రుబ్బను. నీళ్ళు తోడను. ఏడాదికో కొత్త చీర, రెండు పాత చీరలు ఇవ్వాలి. రెండు నెలల అడ్వాన్సు ఇవ్వాలి. ఇయన్నీ మీకిష్టమైతే సెప్పెయ్యండి పన్లో దిగిపోతాను"

"నీకూ నీ పనికీ ఓ దణ్ణం గాని వెళ్ళిరా పాకీజా. నీలాంటి హైటెక్ పనిమనుషుల్ని మేం భరించలేం" అన్నాడు బ్రహ్మానందం.

"ఆంటీజీ మీరేమంటారు?"

"నా మాటే దాని మాటానూ"

"మూడొందలిచ్చీయండి ఎళ్లిపోతాను"

"ఎందుకూ?"

"ఇంతసేపూ ఇంటర్వ్యూ చేసి పనివ్వనన్నారుగా. అందుకు"

"పనివ్వలేదు. పని చేయలేదు. మరెందుకివ్వాలి?" లా పాయింటు లాగాడు బ్రహ్మానందం.

"ఇవాళ ఒకటో తారీక్కదా. ఇయాల్టి పనిపోయిదాయె. మల్లీ నెలదాకా ఎవరూ పెట్టుకోరు. అందుకని నెల జీతం ఇచ్చీయాల్సిందే'

"నేనివ్వను. నీ దిక్కున్న చోట చెప్పుకో. అరిచేవంటే పోలీసుల్ని పిలిచి జైల్లో తోయిస్తా" కళ్ళెర్రజేశాడు బ్రహ్మానందం.

వెంటనే కొంగు బిగించి రంకెవేసి వీధిలోకి దూకింది పాకీజా.

"అచ్చమ్మా, రత్తమ్మా, ఎంకమ్మా, నాంచారో..." అని గావుకేకలు పెట్టింది.

చుట్టు ప్రక్కలి ఇళ్ళల్లోని పని మనుషులంతా ఎక్కడ పనినక్కడ వదిలేసి బిరబిరా వచ్చేశారు.

పాకీజా తనకి జరిగిన అన్యాయాన్ని వివరించగా అంతా ఉగ్రులై పిడికిళ్ళు బిగించారు.

"బ్రహ్మానందం తగ్గు తగ్గు...! బ్రహ్మానందం సిగ్గు సిగ్గు!" అని నినాదాలు చేశారు. మధ్య మధ్య "యూనియన్ జిందాబాద్" అని కూడా అన్నారు.

జనం పోగయ్యారు. ఏవిటేవిటో అన్నారు. రకరకాల వ్యాఖ్యానాలు చెలరేగుతున్నాయి. "ఏదోటి తెమల్చండి. మీ వల్ల మా ఇళ్ళల్లోని పనులు ఆగిపోయాయి" అన్నారు ఇరుగూ పొరుగూ.

పరిస్థితి అదుపు తప్పుతోందని అర్థమైపోయింది. గబుక్కున లోపలి కెళ్లి మూడొందలు తెచ్చి పాకీజా చేతిలో పెట్టేడు బ్రహ్మానందం.

గర్వంగా నవ్వి "డిస్పర్స్" అంది. అంతా చిటికెలో మాయమైపోయారు.

పాకీజా హుందాగా నడిచి వెళ్లిపోతుంటే గుడ్లప్పగించి చూస్తూండిపోయారు బ్రహ్మానందం దంపతులు!

* * *

**(ఆంధ్రభూమి వారపత్రిక 30.3.2000)**

# డాగోపాఖ్యానం

"మిస్టర్ బ్రహ్మానందం!"

"యస్సార్. నమస్తే సార్!"

"అర్జంటుగా నీతో పనిబడిందోయ్. పర్సనల్ పని. ఏమీ అనుకోవు కదా?"

"భలే వారు సార్. పనేమీటో చెప్పండ్సార్ చకచకా చేసేస్తాను"

"వెంటనే మా ఇంటికి రా"

"బయల్దేరుతున్నాను సార్"

బ్రహ్మానందం రిసీవర్ పెట్టేస్తుంటే "ఎవరండీ?" అనడిగింది శ్రీలక్ష్మి.

"మా బాస్ సుబ్రమణ్యం గారు. ఏదో పర్సనల్ పనుందిట. ఇంటికి రమ్మన్నారు"

"మీరేమిటి మీ హెూదా ఏమిటి? ఆయన పెద్దాఫీసరు అయితే మీరు చిన్నాఫీసరు!"

"అయినా ఆయన మా బాస్ కదుటే" చొక్కా తొడుక్కుంటూ అన్నాడు.

"అందుకని ఆయనగారు పిలవగానే కుక్కలా తోకాడించుకుంటూ వెళ్లిపోతారా? మీకేమోగాని నాకు ఇన్సల్టుగా వుంది"



"ఆయన పై అధికారి ఆయన్ని పిలిస్తే ఆయనా ఇలాగే పరిగెడతారే! బాసిజం బానిసత్వం అన్నీ అన్ని ఆఫీసుల్లోనూ వున్నవే" మాట్లాడుతూనే బయటకు నడిచాడు.

మరి పది నిముషాల్లో సుబ్రమణ్యం ముందు ప్రత్యక్షమయ్యాడు బ్రహ్మానందం.

"గుడ్. వచ్చావా. నీ సిన్సియారిటీ నాకు బాగా నచ్చుతుందోయ్. ఇదిగో ఏమేవ్ మన బ్రహ్మానందం వచ్చాడు"

"ఆ తలమాసినోడా? ఏ ముఖం పెట్టుకొచ్చాడూ?" లోపల్నుంచే కరచినట్లుగా అంది వై. విజయ. బ్రహ్మానందం ముఖంలో ఏడు రంగులూ గబగబా మారాయి.

"అబ్బెబ్బే ఆ బ్రహ్మానందం కాదు. మా జూనియర్ ఆఫీసర్ బ్రహ్మానందం''

"అవును మేడం. నేనే మేడం. నమస్కారం మేడం. బాగున్నారా మేడం" లేచి నిలబడి మర్యాదిస్తూ అన్నాడు.

"నువ్వా! కూర్చో. మా మిలూ గిలూ మిల్క్ తాగాక వస్తాన్లే"

"అలాగే మేడం"

ఒద్దిగ్గా కూర్చున్నాడు.

"అర్జంటుగా మేం ఊరికి వెళ్లాల్సి వచ్చిందోయ్. రెండు రోజుల పాటు వుండను"

"నిశ్చింతగా వెళ్లిరండి సార్. ఆఫీసు గురించి మీరేం వర్రీ కాకండి. అన్నీ మీరున్నట్టుగానే చక్కబెడతాను"

"ఆఫీసు గురించి దిగుల్లేదోయ్ బ్రహ్మానందం. నువ్వూ నేనూ లేకపోయినా ఆఫీసు నడుస్తూనే వుంటుంది"

"ఇహిహి... భలేగా చెప్పారు!"

"మా మిలూ, గిలూల్ని ఏవో కేర్ సెంటర్లో వుంచడం ఇష్టం లేదోయ్. కావాల్సిన వాడివి నువ్వున్నావు కదాని పిలిచాను"

"సమయానికి మీకు నేను గుర్తుకు రావడం నా భాగ్యం సార్. మిలూ గిలూల గురించి మీరేం వర్రీ కాకండి. వాళ్లని మీకన్నా ప్రేమగా చూసే బాధ్యత నాది"

"వెరీగుడ్. నువ్వీ మాటంటావని నాకు తెలుసోయ్. ఇదిగో ఏమేవ్. బ్రహ్మానందం మిలూ గిలూల్ని తీసుకెళ్తానంటున్నాడు"

"నువ్విలాటి పన్లు బాగా చేస్తావని నాకు తెలుసు. అందుకే నేనే నీ పేరు సజెస్టు చేశాను" బుట్ట బొమ్మలా తయారై వస్తూ అంది వై.విజయ.

"చాలా థేంక్స్ మేడం" లేచి నిలబడి అన్నాడు.

"కూర్చో... మిలూ వెజిటేరియన్. మార్నింగ్ అర లీటరు పాలు, మధ్యాహ్నం పప్పన్నం, సాయంత్రం పావులీటరు పాలు, బ్రెడ్ సరిపోతాయి" సోఫాలో కూర్చుని కాళ్లాడిస్తూ చెప్పింది.

"మరి గిలూగారి సంగతి మేడం?"

"వాడు నాన్ వెజ్. మార్నింగ్ పాలు, మధ్యాహ్నం చికెన్ కర్రీతో అన్నం, మసాలా ఎక్కువ వేయవద్దని మీ ఆవిడకు చెప్పు. సాయంత్రం జస్ట్ మిల్క్ బ్రెడ్డు. వారికెలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలి సుమా"

"నాకప్పగించండి మేడమ్. మా బిడ్డల్లా చూసుకుంటాం" అతి వినయంగా అన్నాడు.

"మార్నింగ్ ఎయిట్‌కి, ఈవెనింగ్ సెవెన్‌కి వారిని బయటికి తీసుకెళ్లాలి. మధ్యలో బాత్రూం కెళ్లిపోతార్లే" సుబ్రమణ్యం అన్నారు.

"బయటకెందుకు సార్. మా బాత్రూమ్స్ బాగుంటాయి సార్. టైల్సుతో నీట్‌గా తళతళ మెరుస్తూంటాయి సార్"

"వారికి బయటకు వెళ్లడమే అలవాట్లే"

"వారెకెలా అలవాటైతే అలాగే తీసుకెళ్తాన్సార్"

"మమ్మల్నెలా చూస్తావో మిలూ గిలూల్ని కూడా అలాగే చూడాలి"

"మీ కన్నా ఎక్కువగా చూస్తాను మేడం. ఎంతైనా చిన్న బాసులు కదా. వారినోసారి పిలిస్తే..."

"మిలూ... గిలూ... కమ్ హియర్!"

రెండు తెల్ల బొచ్చుకుక్కలు చెంగు చెంగున వచ్చి బ్రహ్మానందం మీదకి గెంతాయి.

కెవ్వున అరిచి సోఫాలోంచి లేచాడతడు.

అవి రెండూ సోఫాలో దర్జాగా కూర్చున్నాయి.

"ఆ సోఫా వారిది. అందులో ఎవర్నీ కూర్చోనివ్వరు" గొప్పగా నవ్వుతూ చెప్పింది విజయ.

"అలాగాండీ. ఇంత వరకూ మీరు చెప్పింది ఈ పిల్లల గురించేనా? నేనింకా ఇంకో పిల్లలేమో అనుకున్నాను. భలేగా అపార్థం చేసుకున్నాను సార్" సగం ఏడుస్తూ, సగం నవ్వుతూ అన్నాడు బ్రహ్మానందం.

"చాలా కేర్‌ఫుల్‌గా వుండాలోయ్. చక్కని ట్రీట్‌మెంట్ ఇవ్వాలి లేకపోతే మా ఆవిడకు కోపం వచ్చేస్తుంది" అన్నారు సుబ్రమణ్యం.

"నాకు తెల్సుసార్. మేడంకి కోపం వస్తే మీరు రెచ్చిపోతారు. అంతదాకా రానివ్వను సార్. మా పిల్లల్లాగే చూసుకుంటాన్సార్. ఇంక వెళ్లమా సార్!"

"ఇంకో సంగతి మరిచిపోయాను. రోజూ మా మిలూ గిలూలకి బాత్ చేయించాలి. గోరు వెచ్చని నీటితో చేయించాలి సుమా..."

"అలాగే మేడం... వస్తాన్సార్...'

"గో...గో విత్ అంకుల్'

విజయ చెప్పిందో లేదో తోకాడించుకుంటూ బ్రహ్మానందం దగ్గరకు వచ్చాయి.

"రండి రండి"

అవి కదల్లేదు.

వెంటనే అన్నారు సుబ్రహ్మణ్యం "వాటికి తెలుగు రాదు. ఇంగ్లీషులో చెప్పు బ్రహ్మానందం"

"అలాగా సార్. బావుంది సార్. కమాన్ కమాన్"

ఆటో మీద రెండు కుక్కల్నీ తీసుకుని ఇంటికెళ్లాడు బ్రహ్మానందం.

శ్రీలక్ష్మిని చూసి బొయ్‌మని అరిచాయొక్కసారే.

అదిరిపడి చూసి కెవ్వుమందామె.

"ష్...నోనో. స్టాప్ స్టాప్"

మొరుగుడు ఆపి గుర్రుగా శ్రీలక్ష్మి వంక చూడసాగాయి.

"కుక్కల్ని తీసుకొచ్చారేంటండీ. అవంటే నాకు చచ్చేంత భయం. వాటిని చూస్తే చాలు బొడ్డు చుట్టూ ఇంజెక్షన్లు గుర్తొస్తాయి"

"అది కాదు శ్రీలూ. మా బాస్ అర్జంట్‌గా ఏదో ఊరెళ్లాల్సి వచ్చిందిట. వీటిని డాగ్ కేర్ సెంటర్లో వదల్లేక నాకప్పగించారు. నేనైతే బాగా చూస్తానని వాళ్ల నమ్మకమని కూడా చెప్పారే!"

చిరాకుగా మొహం పెట్టింది శ్రీలక్ష్మి.

"మీరు ఆఫీసరండీ. ప్యూన్లపని చేస్తానంటారేవిటి? వెంటనే కుక్కల్ని వాళ్లకప్ప గించేసి రండి"

"బావుండదే... ప్లీజ్ శ్రీలూ...!"

"వీటికి చాకిరీ చేయడం నాతరం కాదు. ఇరుగు పొరుగు వాళ్ళు ఈ కుక్కలు ఎక్కడి వంటే హవ్వ... ఎంత సిగ్గు చేటండీ!"

"పెంచుకుందామని కొనుక్కొచ్చాం అని చెబుదామే. రెండ్రోజులయ్యాక ఏదో చెప్పి తిరిగి అమ్మేశాం అందాం. ప్లీజ్. శ్రీలూ. బాసు కన్నా బాసు పెళ్లాం డేంజరు మనిషి. కుక్కల్ని సరిగ్గా చూడలేదనుకో ఏ శంకరగిరి మాన్యాలో పట్టించేయిస్తుంది"

"అయితే ఒక షరతు. వాటి ఆలనా పాలనా అన్నీ మీరే చూసుకోవాలి. వాటి వంక నేను కన్నెత్తి చూడను"

"అలాగే తప్పుతుందా మరి!" బాసుగారి భార్య చెప్పిన రూల్సు గట్రా గుర్తు చేసుకుని కుక్కల డ్యూటీలో పడ్డాడు బ్రహ్మానందం.

మిలూ, గిలూలు రెండు గంటల్లోనే అతడికి చేరువైపోయాయి.

శ్రీలక్ష్మి దరిదాపులక్కూడా వెళ్లడం లేదు. ఆమెని అవీ, వాటిని ఆమె గుర్రుగా చూసుకుంటున్నారు.

బ్రహ్మానందం మిలూ, గిలూల్ని పొద్దుటే బయటకు తీసుకెళ్తుంటే చూసింది మనోరమ. రివ్వున శ్రీలక్ష్మి ఇంటికొచ్చి వాలింది.

"శ్రీలక్ష్మీ మీ కుక్కలు బాగున్నాయి. ఎక్కడ కొన్నారు? ఎంతకి కొన్నారు?"

"మా వారికి పెట్ డాగ్స్ అంటే ఇష్టం. డాగ్స్‌ని పెంచడం గొప్ప వారి సరదా కదా అందుకని అయిదు వేలు పెట్టి కొనుక్కొచ్చారు"

"వాటి ఖరీదు అయిదు వేలా? తిండికీ వాటికీ చాలా ఖర్చవుతుందేమో?"

"మనిషికయ్యే ఖర్చవుతుంది. పెట్ డాగ్స్ స్టేటస్ సింబల్" ఫోజు కొట్టింది.

మిలూ గిలూల్ని స్నానం చేయించి పాల గిన్నెలు ముందుంచాడు. అవి తృప్తిగా త్రాగాయి.

మధ్యాహ్నం పెట్టాల్సిన భోజనం గురించి చెప్పి ఆఫీసుకు వెళ్ళిపోయాడు బ్రహ్మానందం.

బిక్కుబిక్కుమంటూ గదిలోనే వుండిపోయింది శ్రీలక్ష్మి. ఆమెకీ కుక్కలకీ సయోధ్య కుదర్లేదింకా. ఒకర్నొకరు శత్రువులుగానే చూసుకుంటున్నారు.

డోర్ బెల్ మ్రోగినా, ఫోన్ మ్రోగినా ఇంటికెవ్వరైనా వచ్చినా సరే మొదట భౌయ్‌మని అరుస్తున్నాయి.

స్టాప్ అని అరిస్తే తప్ప ఆగడం లేదు.

బాత్రూంకి వాటంతట అవే వెళ్తున్నాయి గానీ బాత్రూం కడగడానికి చిరాకుపడుతూ కస్సుబుస్సుమని వాటిమీద పడకుండా వుండలేకపోతోంది.

సాయంత్రం బ్రహ్మానందం వచ్చేసరికి మిలూ గిలూలు అతణ్ని చుట్టేశాయి. ఆప్యాయంగా కాళ్ళు నాకాయి.

"చూశావా శ్రీలూ! నేనంటే వీటికెంత ఇదో చూడు"

మూతి మూడు వంకర్లు తిప్పి లోపలికి వెళ్ళిపోయింది.

ఉస్సురంటూ నిట్టూర్చి డాగ్స్‌ని బయటకి తీసుకెళ్ళాడు బ్రహ్మానందం.

"ఏమిటోయ్ కుక్కల వాకింగా? కుక్కల్తో వాకింగా?" అగ్గిపుల్లతో పళ్ళు కెలుక్కుంటూ అడిగాడు ఎమ్మెస్.

నవ్వాడు తప్ప జవాబివ్వలేదు.

మర్నాడు శ్రీలక్ష్మి దూరపుబంధువొచ్చాడు.

యధా ప్రకారం మిలూ గిలూ మొరిగాయి.

కోపం వచ్చి చెడామడా తిడుతూ "పోండి అవతలికి గెటవుట్" అందామె.

అంతే! వెంటనే వీధి గుమ్మం దాటి బయటకెళ్లి కూర్చుండిపోయాయి. తర్వాతెళ్లి లోపలికి రమ్మని ఎంత బ్రతిమాలినా రాలేదు. ఏం పెట్టినా తిన్లేదు. శ్రీలక్ష్మికి ఎంతో జాలివేసింది. విలవిల్లాడింది.

"కుక్కలు గుమ్మానికవతలే వుండాలి గానీ అర్జంటుగా అయిదు వేలు కావాలి. ఇవ్వు శ్రీలక్ష్మీ" బంధువడిగాడు.

బంధువుల్లో అతడికి మంచి పేరు లేదు. అతడెంత త్వరగా వదిల్తే అంత మంచిదని చూస్తోందామె.

"లేవు" గదిలో కెళ్తూ అంది.

"నీ గొలుసూ గాజులూ ఇవ్వు" ఆమెకు అడ్డొచ్చి మరీ అడిగాడు.

అతడి కర్కశ స్వరానికీ వికృత ప్రవర్తనకీ అదిరిపడింది. భయపడ్తూనే పొమ్మంది. పోలేదు గానీ చాకు బయటికి తీసి మీదికొచ్చాడు. అతడ్నాప బోతుంటే ఆమె చెయ్యి మెలితిప్పాడు. గిలగిల్లాడింది.

ఆమె మెడలోని చెయిన్ కట్ చేయబోతుంటే మిలూ, గిలూలు ఒక్కసారిగా అతడి మీదకు జంప్ చేశాయి. తరిమి తరిమి కొట్టాయి.

బ్రహ్మానందం ఇంటికొచ్చేసరికి మిలూ, గిలూలు శ్రీలక్ష్మి ఒళ్ళో కూర్చునున్నాయి.

తన కళ్ళని తనే నమ్మలేకపోయాడు.

"మనమూ డాగ్స్‌ని పెంచుకుందామండీ!"

* * *

**(ఆంధ్రభూమి వారపత్రిక 4.5.2000)**

# బామ్మరిదీ – బ్లాక్‌మెయిలూ

**అ**వాళో చక్కని ప్రోగ్రాం వేసుకుని హుషారుగా ఇంటికొచ్చాడు బ్రహ్మానందం.

సోఫాలో తాపీగా కూర్చుని టీ త్రాగుతున్న అనంత్ కళ్ళబడేసరికి ఒక్కసారిగా నీరు కారిపోయాడు.

అనంత్ శ్రీలక్ష్మి వాళ్ళ పెదనాన్న గారబ్బాయి. నాటకాల పక్షి.


"హాయ్ బావగారూ – ఎప్పుడొచ్చారూ"

"ఇప్పుడే వస్తున్నాను గానీ ఎలాగున్నావోయ్ హనుమంతూ"

"నా పేరు హనుమంతు కాదు అనంతు..."

"నాకు మాత్రం తోక లేని హనుమంతుళ్ళా కన్పిస్తూంటావులే..."

"ఎంత బాగా చెప్పేరు, ఏమైనా మీరు మీరే బావా..."



"ఏవంటున్నార్రా.." అంటూ లోపల్నుంచి వచ్చింది శ్రీలక్ష్మి.

"బావ శ్రీరామచంద్రుడూ నేనూ హనుమంతుడ్నీనట. బావే అంటున్నారు"

"అవునంతేరా.. మీ బావలాంటి మనిషి ఈ భూ ప్రపంచం మీద వుండరనుకో.." అందామె.

"అంటే బావ మరీ మంచివాడనా లేక మరీ మరీ చెడ్డ వాడనా?"

"ఒరే హనుమంతూ. పెడర్థాలు తీయకురా నీకు పుణ్యం వుంటుంది గానీ. ఈ మధ్యేమీ నాటకాల్లేవేంటి, మా ఇంటిమీద పడ్డావ్"

"నువ్వు రోజూ కలలో కొస్తున్నావు బావా"

"నేనా?"

"నువ్వే. ఈ మధ్య మా ఫాదరు నట్లు టైట్ చేశాళ్ళే. నాటకాలకి డబ్బివ్వట్లేదు. అందుకని..." మిశ్చీవస్‌గా నవ్వేడు అనంత్.

"అక్కడ తన్నితే ఇక్కడ పడ్డావన్నమాట! ఇక్కడ తన్నితే ఎక్కడ పడతావో..!"

"చాల్లెండి. రాక రాక మా తమ్ముడొస్తే అవేం మాటలు. మీ బావ గోలకేంగాని నీ ఇష్టమొచ్చినన్నాళ్ళూ వుండరా అనంతూ. పెద్దనాన్నా వాళ్ళూ బాగున్నారా.."

"ఓ.." బ్రహ్మానందం వంక ఓరగా చూసి ఫోజు కొట్టాడు.

మొఖం ముట ముట లాడిస్తూ లోపలి కెళ్ళిపోయాడు బ్రహ్మానందం.

మర్నాడు ఆఫీసులో బ్రహ్మానందం సీరియస్‌గా పని చేసుకొంటుంటే ప్రత్యక్ష మయ్యాడు అనంత్.

"ఏకంగా ఇక్కడి కొచ్చేశావేంట్రా!"

"రాకూడదా? అక్క పర్మిషన్ తీసుకునే వచ్చాను"

"అది కాదురా. నీ పేరు తలచుకుంటేనే బీపీ పెరుగుతుంది. ఇక నువ్వు ప్రత్యక్షమైతే..."

"నీ గుండె మరీ ఇంత వీక్ అనుకోలేదు బావా. నువ్వు హీరోలా వుండాలి"

"హీరో అంటే నీ అర్థం ఏవిటి నాయనా. నువ్వు అడిగినప్పుడల్లా డబ్బిచ్చేవాడనా?"

"మా బావ భలే జోకులేస్తాడు.."

"దీన్ని ఏడుపు జోకు అంటారు"

"ఏడ్చేవాళ్ళని అననీ బావా మనకేవిటి గానీ.. నీ రూం బావుంది బావా... ఏసీ బాగా పనిచేస్తోంది. టేబుల్ బావుంది. నీ కుర్చీ మరీ బావుంది. ఆ కుర్చీలో భలే నిండుగా వున్నావు బావా. సీటు కంఫర్టబుల్‌గా వుంది కదా? ఉండే వుంటుందిలే. ఇంత పెద్ద ఆఫీసులో ఆఫీసరువా మజాకా...!"

"ఆ గొడవంతా ఎందుగ్గానీ నువ్వొచ్చిన పనేవిటో త్వరగా చెప్పరా"

"చెప్పడానికొచ్చేక చెప్పకుండా ఎలా వెళ్తాను చెప్పు? ముందు బెల్ బటన్ నొక్కు చెబుతా.."

అయిష్టంగానే నొక్కాడు. గుండు వచ్చాడు.

"ఏవోయ్.. కులాసానా?"

అనంత్ పలకరింపుకు ఎగాదిగా చూశాడు గుండు.

"ఆ ఎక్స్‌ప్రెషన్ బాగోలేదు గాని అర్జంటుగా మార్చేసెయ్. నేను మీ ఆఫీసరుగారి బామ్మర్దినోయ్. రాజకీయాల్లోనూ ఇలాంటి చోట్లా బామ్మర్దులెంత పవర్‌ఫుల్లో నీకు తెలుసు కదా"

"నమస్తే సార్. టీ తీసుకురానా సార్.."

"నీ పేరేవిటీ"

"గుండు సార్.."

"చూడు మిస్టర్ గుండూ. అలాటివి నువ్వు అడక్కూడదు. నన్ను చూడగానే అలా అలా అల్లుకుపోయి ఇలా ఇలా తెచ్చిపెట్టెయ్యాలి. టీతో బాటు రెండు సిగరెట్టు పెట్టెలూ ఒక అగ్గిపెట్టె అరడజను వక్కపొడి పొట్లాలూ ఒక జరదా కిళ్లీ పట్రావోయ్. వెళ్ళెళ్ళు. ఇచ్చి పుచ్చుకోటాల గురించి నువ్వూ మా బావా ఆనక చూసుకుందురుగాన్లే. ముందు వెళ్ళు చెబుతా"

గుండు వెళ్ళగానే మొఖం ఎర్రగా చేసుకుని తనలో తను వుడికిపోతూ అన్నాడు బ్రహ్మానందం. "నీ వరసేం బావోలేదు. వాడు నీ గురించి చీవుగా అనుకుని టాంటాం వేసేస్తాడు.."

"నువ్వంత చీపుగా ఆలోచించకూడదు బావా. అరె చూడనేలేదు నీ సఫారీ సూట్ చాలా బావుంది బావా"

బ్రహ్మానందం మాట్లాడలేదు. తిరిగి తనే అన్నాడు.

"మీటర్ ఎనిమిదొందలుంటుందేమో. వుంటాదిలే. ఎక్కడ కొన్నావు బావా? ఎక్కడ కొంటేనేం బ్రహ్మాండమైన సెలక్షన్. రేటు మా అక్కకి తెలుసా బావా..తెలిసుం డదులే.. ఎవరో గిఫ్టు ఇచ్చారని కోసి వుంటావు. లేకపోతే వూరుకుంటుందేవిటి.. అద్సరే గాని బావా.. ఒక అయిదొందలు కొట్టు.."

"నా దగ్గర లేవు"

"పోనీ నాలుగొందలు నరుకు"

"నువ్వడిగినంతా ఎడంచేత్తో ఇవ్వడానికి మీ అక్కవుందిగా...!"

"అక్క ఎకౌంట్ అక్కదే. నీ ఎకౌంట్ నీదే.. సరే ఆఖరి మాట.. రెండూ యాభై చంపు.."

"నువ్వొస్తే చాలు చంపుకుతినేస్తావు కదురా.."

"ఎంతమాట. మా బావ ఆకుపచ్చగా వుంటేనే కదా నేనూ నా నాటకాలూ పచ్చగా వుండేది.. అరె.. చూడనేలేదు. నీ పెన్ చాలా బావుంది బావా. ఫారన్దా? ఎవరు ప్రెజంట్ చేశారు? మా అక్కకి తెలిసినట్టులేదే..."

"నాయనా అనంతూ నీకో నమస్కారం గాని.. ఈ డబ్బు తీసుకుని దయచెయ్యి. నువ్వు ఇంకాస్సేపు ఇక్కడే వుంటే నేను హాస్పటల్లో అడ్మిట్ అవ్వాల్సొచ్చేట్టుంది"

డబ్బు జేబులో కుక్కుకుని "మా బావగారిది పెద్ద గుండె ఐ మీన్ విశాల హృదయం... అవును గాని బావా... నీ పిఏ ఆడా మగా?"

"ముందు నువ్వు దయచెయ్యరా..."

"టీ సిగరెట్లూ వచ్చేదాకా సరదాగా కబుర్లు చెప్పుకుందాం బావా..."

"పిల్లికి చెలగాటం ఎలక్కి ప్రాణ సంకటం అంటే ఇదేరా బాబూ...!"

గుండు వచ్చి అనంత్ కోరినవన్నీ తెచ్చి చేతిలో పెట్టాడు. టీ కప్పులు టేబుల్ మీద వుంచాడు.

"నువ్వు మా బావకన్నా మంచి వాడివోయ్ గుండూ. ఇంద ఈ వక్కపొడి నోట్లో వేసుకో" ఒక పాకెట్ గుండు కిస్తూ చెప్పేడు.

"టీ బావుంది బావా. త్వరగా చల్లారితే మజా వుండదు త్రాగెయ్...వస్తాబావా..."

"ఇంక రావద్దు. ఈ ట్రిప్పుకి సరిపడా దక్షిణ సమర్పించుకున్నా కదా! ఇంక దయచెయ్.."

"అలా ఎలా కుదుర్తుంది బావా.. ఎల్లుండు ఈ ఊళ్ళో నాటకం వెయ్యబోతున్నాం.. నీతో మళ్ళీ మళ్ళీ అవసరం పడుతూనే వుంటుంది. తప్పదు మరి. బై బై.."

వెళ్ళిపోయాడు అనంత్. కసిగా పళ్ళు కొరుక్కుంటూ జుట్టు పీక్కోబోతే వింతగా చూశాడు గుండు. వెర్రి నవ్వు నవ్వి "నువ్వెళ్ళి నీ పని చూసుకో" అన్నాడు బ్రహ్మానందం.

అనుమానంగా చూస్తూ నిష్క్రమించాడు గుండు.

ఆ రాత్రి ప్రశాంతంగా గడిచింది. అనంత్ ఎలాంటి టెండరూ పెట్టకపోయేసరికి మహదానందపడిపోయి పొగిడేశాడు.

"నువ్వు చాలా మంచి వాడివిరా బామ్మర్దీ. గుడ్ యాక్టర్‌వి. ఈ నాటకాలూ అవీ అవుటాఫ్ డేట్ అయిపోయాయి. నువ్వు సినిమాల్లోనూ టీవీలోనూ ఎందుకు ప్రయత్నించకూడదూ?" అన్నాడు ఆ మర్నాడు భోంచేస్తుండగా.

వెంటనే భర్తని సపోర్టు చేసింది శ్రీలక్ష్మి.

"మీ బావ చెప్పింది కరక్టురా. డైలాగ్ చెప్పలేని వాళ్ళంతా నటులై వెండితెరనీ బుల్లితెరనీ దున్నేస్తున్నారు. నువ్వు ప్రయత్నించావంటే అమాంతం చుక్కల్ని చూసేస్తావు.."

"శాటిలైట్ ఛానల్సు వచ్చేక బోల్డన్ని సీరియల్సూ బోల్డన్ని ప్రోగ్రాములూ వస్తున్నాయి. టీవీకి ట్రై చెయ్యరా అనంతూ.."

బావగారి వంక ఆరాధనగా చూశాడు అనంత్.

"ఎంత గొప్ప ఐడియా ఇచ్చావు బావా. నువ్వు రియల్లీ గ్రేట్..."

"నా గొప్ప నేను చెప్పుకోకూడదు గానీ అంతా అలాగే అంటూ వుంటారు.." ఉబ్బి తబ్బిబ్బవుతూ అన్నాడు బ్రహ్మానందం.

"ఇంకేం ఆలోచించకురా. వెంటనే హైదరాబాదు చెక్కేసెయ్" వూతమిచ్చింది శ్రీలక్ష్మి.

"బావ ఎప్పుడు వెళ్లమంటే అప్పుడు వెళ్తాను. ఏం బావా ఎప్పుడు వెళ్ళను?"

సెకండ్ థాట్ వచ్చింది బ్రహ్మానందానికి. బామ్మర్ది వంక అనుమానంగా చూశాడు. అతడి కళ్ళు నవ్వుతున్నాయి. హైదరాబాదు ఖర్చుకి టెండర్ పెడతాడేమోనని భయమేసింది.

"వెళ్దువుగాన్లే. ఈ మూఢాలూ, ఆషాఢాలూ అయ్యేక.." అంటూ లేచి చెయ్యి కడుక్కున్నాడు బ్రహ్మానందం.

"మూఢాలవీ పెళ్ళిళ్ళకిగానీ ప్రయాణాలకెందుకూ...!" సాగదీసింది శ్రీలక్ష్మి.

"బావకి వుందేమోలే అక్కా"

మరుసటి రోజున బ్రహ్మానందం పేపరు చదువుతూ కాఫీ త్రాగుతోంటే ప్రక్కకి చేరాడు అనంత్.

"రాత్రి పార్టీకెళ్ళినట్టున్నావు కదా బావా.." అన్నాడు మెల్లగా.

అక్కడే వున్న శ్రీలక్ష్మి "అవున్రా తమ్ముడూ. ఎవరో కస్టమర్ ఆఫీసు వాళ్లందరికీ హోటల్లో పార్టీ ఇచ్చార్ట" అంది.

"చిన్న పనిమీద అటు వెళ్ళేన్లే అప్పుడు చూశాను. ఆ హోటల్ త్రీస్టార్ హోటల్ కదా బావా? చాలా బావుంది. నువ్వెక్కిన శాంత్రోకారు కలర్ అదిరిందనుకో. నీ ప్రక్కన కూర్చున్న అమ్మాయి చాలా అందంగా వుంది కదా బావా..."

పొలమారింది బ్రహ్మానందానికి. షర్టు మీద కాఫీ ఒలకబోసుకున్నాడు.

"అయ్యయ్యో.. చిన్న పిల్లల్లా ఇదేం పనీ.." తడిగుడ్డతో అతడి షర్టు తుడుస్తూ అంది.

"బావ చిన్నపిల్లాడులా కాదు గాని రాత్రి నవ యువకుల్లా మెరిసిపోయాడు అక్కా.. బావ ప్రక్కన.. ఊహూ.. సీతా సావిత్రుల కోవకి చెందిన నువ్వు కాదక్కా... మరా అమ్మాయి.. కారులో నీ ప్రక్కన కూర్చుందే ఆ అమ్మాయి ఎవరు.. ఎవరు బావా.. మోడ్రన్ డ్రెస్సు వేసుకుని నవ్వుతూ.. నీ మీద పడ్తూ..."

"నీకో నమస్కారంగానీ నీకేం వరం కావాలో కోరుకోరా నాయనా.. చిన్న పాయింటుని చిలవలు పలవలు చేసి చంంపుతావు కదురా..."

"ఏంటండీ.. రాత్రి ఏం జరిగింది..'

"అబ్బే ఏం జరగలేదే.. నువ్వెళ్ళి ఇంకో కప్పు కాఫీ పట్రా చెబుతా. నీ తమ్ముడిక్కూడా ఇంకో కప్పు.."

ఇద్దరి వంకా అదోలా చూసి లోపలికెళ్ళిపోయింది శ్రీలక్ష్మి.

"నువ్వు చాలా తెలివైన వాడివి బావా. వాసనని భలే పసిగట్టేస్తావు"

"నా తెలివి తెల్లారినట్టే వుంది. హనుమంతుడి ముందు కుప్పిగంతులెయ్యను గాని నీ డిమాండేదో చెప్పి నన్నిహ వదిలి పెట్టరా..!"

"ఇవాళ మా నాటకానికో పాతిక టిక్కెట్లు అమ్మిపెట్టాలి బావా"

"అమ్ముకుంటానో వూరికే పంచుకుంటానో నీకనవసరం. నీకు పాతిక టిక్కెట్ల డబ్బు కావాలి. అంతే కదా?"

"అంతకంటే పెద్ద కోరిక ఒక్కసారే ఎలా కోరుకోగలను బావా?"

"సంతోషం. పాతిక టిక్కెట్ల డబ్బు ఇచ్చేస్తాను గాని వదిలిపెట్టేసేయ్. ఇంక ఇప్పుడప్పుడే రావద్దు. నా కాపురం కూల్చొద్దు"

"ఇప్పుడప్పుడే రాన్లే బావా. ఈసారి ఏకంగా హైదరాబాద్‌కి ముహూర్తం పెట్టుకునొస్తాను"

తల పట్టుకున్నాడు బ్రహ్మానందం!

* * *

**(ఆంధ్రభూమి వారపత్రిక 25.5.2000)**

# రాంగ్ నెంబర్

**"ట్రింగ్..** ట్రింగ్.. ట్రింగ్... శ్రీలూ శ్రీలూ శ్రీలూ... హలో హలో హలో" పాటలా పాడుతూ చేతులూ కాళ్ళూ తలా తిప్పుతూ వచ్చాడు బ్రహ్మానందం.

"అలా వున్నారేవిటి. పిచ్చి కుక్క కరిచిన వాడెవడైనా కరిచాడా?" గాభరాగా అడిగింది శ్రీలక్ష్మి.

"నన్నెందుకు కరుస్తారోయ్? బ్రహ్మానందం ది ప్రౌడ్ ఓనరాఫ్ ఏ న్యూ టెలిఫోన్!"

"అబ్బ! ఎన్నాళ్ళకి. ఏడాది నుంచి ప్రయత్నిస్తుంటే ఇప్పటికి ఫోన్ కనెక్షన్ ఇస్తున్నారన్న మాట"

"ఇక నుంచి ఆఫీసుకెళ్లగానే నేను ఇంటికి ఫోన్ చేయొచ్చు. నేను రావటం ఆలస్యమైతే నువ్వు ఫోన్ చేసి కనుక్కో వచ్చు"

"గ్యాస్ కంపెనీకి ఫోన్ చేసి గాస్ బుక్ చేసుకోవచ్చు. సూపర్‌బజార్‌కి ఫోన్ చేసి సరుకులు పంపించమనొచ్చు"



"మా నాన్నగారికి ఫోన్ చేసి యోగక్షేమాలు కనుక్కోవచ్చు"

"ఓహ్! ఎన్ని ఉపయోగాలో!"

"మన చుట్టు ప్రక్కల వాళ్లకి ఫోన్లు లేవు కనుక నలుగుర్లో మనకి స్టేటస్ పెరుగు తుందండీ"

"అవునవును. మనకి బోల్డంత మర్యాద ఇస్తారు"

టెలిఫోన్ డిపార్ట్‌మెంట్ నుంచి ఇద్దరు వర్కర్లు వచ్చారు. టెలిఫోన్ ఎక్కడుంచాలో కనుక్కుని చకచకా లైన్ లాగేరు. అట్ట బాక్సులోంచి పండు ఎరుపురంగు ఫోన్‌ని బయటికి తీసి తుడిచి కనెక్షన్ ఇచ్చారు.

"ఎంత ముద్దొస్తోంది!" మురిసిపోయింది శ్రీలక్ష్మి.

"సరికొత్త మెడల్. చాలా బాగుంది"

"మీ నెంబర్ 344322 సార్. మేం వెళ్ళొస్తాం సార్" అన్నాడొకడు.

"ఒకే చాలా థాంక్సోయ్. మంచి మోడల్ ఫోన్ తెచ్చి పెట్టారు"

"వెళ్తాం సార్" మళ్లీ అన్నాడు.

"ఒకే"

"వెళ్తాం సార్"

అనుమాన మొచ్చి వాళ్ల వంక చూసాడు. వాళ్ళు తనవంకే చూస్తూ నిలుచున్నారు తప్ప వెళ్ళే ప్రయత్నమేమీ చేయడం లేదు.

"ఓహోహో మరచేపోయాను" జేబులోంచి యాభై నోటు తీసిచ్చి "సినిమా కెళ్లండి" అన్నాడు బ్రహ్మానందం.

"థాంక్సండి. మా మామూలు వందరూపాయలు సార్"

"మరీ రేట్లు పెంచేస్తే ఎలాగా" అంటూ మరో యాభై ఇచ్చాడు.

"ఇంకో యాభై ఇవ్వాలి సార్"

"అదేమిటి? ఇందాక యాభై ఇచ్చాను. ఇప్పుడు యాభై మొత్తం వంద సరిపోయింది కదా!"

"ఇచ్చారు సార్. కానీ ఇందాకటి యాభై సినిమా చూడ్డానికి ప్రత్యేకంగా ఇచ్చిన బోనస్ సార్"

"అదీ ఇదీ ఇందులో చూసుకోండోయ్"

"కుదర్దు సార్. దేని దారి దానిదే. ఏ లైన్ ఆ లైనే"

ఏడుస్తూ ఇంకో యాభై ఇవ్వగా సెల్యూట్ చేసి వెళ్లిపోయారు. భార్య వంక చూసి వెర్రిగా నవ్వాడు బ్రహ్మానందం.

"గొప్పలకి పోయి యాభై తగలేశారు" విసుక్కుంది.

"కావాలనే ఇచ్చాను శ్రీలూ. వాళ్లతో కనెక్షన్ బాగోకపోతే లైను పీకేస్తారు. ఫోన్ డెడ్ అయినా పట్టించుకోరు. ఎక్కువకి బిల్లులొచ్చేస్తాయి. అందుకనే ఎక్కువిచ్చానన్నమాట!"

"సరేలెండిగానీ నేను హారతిచ్చి కొబ్బరికాయ కొట్టేవరకూ ఫోన్ ముట్టుకోవద్దు"

ఫోన్‌కి బొట్టుపెట్టి హారతిచ్చి కొబ్బరికాయ కొట్టింది శ్రీలక్ష్మి.

"మొదటిసారి ఎవరికి చేయను చెప్మా!"

"మీ ఆఫీసర్‌కి చేయండి. ఆయన భార్య వుంటే ఫోన్ నాకివ్వండి. మనకీ ఫోన్ వచ్చిందని ఫోజు కొడతాను"

ఆఫీసర్ నారాయణగారింటికి ఫోన్ చేసాడు.

"హలో! నారాయణ హియర్"

"నమస్తే సార్! నేను బ్రహ్మానందాన్ని"

"ఏమిటోయ్! ఆఫీస్ నుంచి ఫోన్ చేస్తున్నావా? వెరీగుడ్. ఆదివారం నాడు కూడా ఆఫీసుకెళ్లి పనిచేస్తున్నావంటే యు ఆర్ రియల్లీ గ్రేట్. నీలాంటి వాళ్ళు దేశానికెంతో అవసరమోయ్!"

ఇబ్బందిగా కదిలాడు బ్రహ్మానందం.

"సార్! మరేమో ఆఫీస్‌కు బయల్దేరబోతోంటే టెలిఫోన్ వాళ్లొచ్చి ఫోన్ కనెక్షన్ ఇచ్చార్సార్. మొదటిగా మీకు ఫోన్ చేసాను"

"గుడ్. చాలా సంతోషం మిస్టర్ బ్రహ్మానందం. ఈ రోజున ఫోన్ ప్రాథమిక అవసరమైందోయ్. క్విక్ కమ్యూనికేషన్‌కి ఎంతో ఉపయోగపడ్తోంది. ఇంటింటికీ ఫోన్ సౌకర్యం వచ్చినప్పుడే మన దేశం నిజంగా అభివృద్ధి చెందినట్టు..."

"కరెక్టుగా చెప్పార్సార్. మా ఫోన్ నెంబర్ 344322"

"అన్ని అంకెలు కూడితే తొమ్మిది అయ్యిందోయ్. యూ ఆర్ వెరీ లక్కీ!"

"థాంక్యూ సార్" ఫోన్ పెట్టేశాడు.

"వాళ్లావిడ్ని పిలువకపోయారా?"

"ఈయన సుత్తే భరించలేకపోతున్నాను. ఇక ఆవిడ కూడా వస్తే... ఆనక తీరిగ్గా సుత్తి వేయించుకో. మనం గమనించలేదు గానీ మనది గొప్ప నెంబరు శ్రీలూ. టోటల్చేస్తే తొమ్మిది వస్తోంది. లక్కీ నెంబర్"

"భలే కలిసొచ్చిందండీ. ఒక్క అయిదు నిమిషాల్లో ఇరుగు పొరుగు అందరికీ చెప్పొస్తా నండీ. ఏవిటో ఆనందం భరించలేక పోతున్నాను"

శ్రీలక్ష్మి పని గట్టుకుని ప్రక్క ఇళ్ళకి వెళ్లి గొప్పగా ఫోన్ వచ్చిన సంగతి చెప్పింది. అవసరమైతే ఉపయోగించుకోమని కూడా చెప్పింది.

మరో రెండు గంటలకి ప్రక్క వీధిలో వుండే ఓ ఆ సామి వచ్చాడు. అతడెవరై వుంటారా అని చూస్తుంటే అతడే నోరువిప్పాడు.

"అలా తేభ్యం మొహాలు వేసుకుని చూస్తున్నారేమిటి? నా పేరు ఏవీయస్ రావు. కొందరు సలహాలరావు అంటారు. ఇంకొందరు ముద్దుగా ఏవీయస్ అంటారు. మీరు కూడా అలా పిలవ్వొచ్చు"

"అలాగాండి. రండి రండి..." ఆహ్వానించాడు బ్రహ్మానందం.

సోఫాలో కూర్చుని అంతా పరిశీలనగా చూశాడు.

"ఫోన్ అలా టీపాయ్ మీద పెట్టకూడదు. దానికోసం రౌండ్ టేబుల్స్ ప్రత్యేకంగా వస్తున్నాయి. అవి కొనండి. దాని మీద ఎంబ్రాయిడరీ చేసిన క్లాత్ కూడా వెయ్యండి. తెల్సిందా? సోఫాని కొంచెం అటుగా తిప్పండి. హాయిగా ఫ్రీగా సోఫాలో కూర్చుని ఫోన్ చేసు కోవచ్చు. ఫోన్ పక్కన పెన్నూ, నోటుబుక్కూ వుంచండి. ఏవైనా నోట్ చేసుకోడానికి ఉపయోగిస్తాయి. ఈ ప్రక్కన ఫ్లాస్కులో చల్లని నీళ్ళు రెండు గాజు గ్లాసులూ పెట్టండి. ఇకపోతే కాల్ కోసం వెయిట్ చేయాల్సి వచ్చినప్పుడు బోర్ కొట్టకుండా టేప్ రికార్డర్ కొత్త కేసెట్స్‌తో సహా ఈ ప్రక్కన రేక్‌లో పెట్టండి" చిన్న సైజు సలహాల ఉపన్యాసం ఇచ్చి ఆ పైన టప టపా అరడజను కాల్స్ చేసేశాడు.

"ఏవిటోయ్ బ్రహ్మానందం. యస్టీడీ ఫెసిలిటీ లేదా?" పరమాశ్చర్యంగా అడిగాడు.

"పెట్టించలేద్సార్!"

"చాలా పొరపాటు చేశావోయ్. వెంటనే పెట్టించేయ్. నాబోటి వాళ్లు ట్రంకాల్ చేయడాని కొచ్చారనుకో నువ్వు కాదన్లేవు. బిల్లు పేలిపోతుంది. అదే యస్టీడీ వుంటే తక్కువ బిల్లుతో బయటపడిపోతావు" అతడి మేలు కోరి చెబుతున్నట్టు చెప్పాడు.

"టీ తీసుకోండి అన్నయ్యగారూ!" శ్రీలక్ష్మి టీ కప్పుతో వచ్చింది.

"నేను టీ త్రాగనమ్మా. కాఫీయే త్రాగుతాను. ఇన్‌స్టంట్ కాఫీ కలిపి తీసుకురా"

గతుక్కుమని ముఖాముఖాలు చూసుకున్నారు భార్యాభర్తలు.

"మా ఇంట్లో కాఫీ తాగం"

"త్రాగొద్దు. నాలాంటి వాడికోసం స్పెషల్‌గా తెచ్చి వుంచండి. ఈసారికి టీతో ఎడ్జస్ట్ అయిపోతాన్లే"

టీ కప్పు లాక్కున్నట్టుగా తీసుకుని మరీ త్రాగి "వక్క ఎక్కడ? ఎదురుగా వుంచండి. మీరు చాలా పద్ధతులు నేర్చుకోవాలి" అన్నాడు.

వక్కపొడి డబ్బా ఇవ్వగా గుప్పెడు నోట్లో పోసుకుని "వస్తానోయ్. బైబై" అనెళ్లి పోయాడు ఏవీఎస్.

"ఈయనెక్కడ దొరికాడే మన ప్రాణానికీ!" తల పట్టుకున్నాడు బ్రహ్మానందం.

ఫోన్ కోసం వచ్చే వారి సంఖ్య పెరిగింది. కొంచెం ఇబ్బందిగా వున్నా సహించి సర్దుకుపోతున్నాను. బ్రహ్మానందం దంపతులు బయట కన్పిస్తే చాలు అంతా మర్యాదగా పలకరిస్తున్నారు. అందుకని మహదానందంగా వుంది కూడానూ.

ఫోన్ మ్రోగగా రిసీవర్ ఎత్తాడు బ్రహ్మానందం.

"నేను నర్సాపురం నుంచి యస్టీడీలో మాట్లాడుతున్నాను. మీ ఇంటికి మూడిళ్లవతలున్న సుబ్బారాయుడుగార్ని అర్జంటుగా పిలుస్తారా?"

"పిలుస్తాన్లేగాని మళ్లీ చెయ్యండి"

"మళ్ళీ లైను దొరకదుగాని పరుగునెళ్లి పిలవ్వయ్యా ఇవతల మీటరు తిరిగిపోతోంది"

"అది కాదండీ..."

"నువ్వెక్కడి జిడ్డువయ్యా బాబూ! వేగిరం వెళ్లి పిలవ్వయ్యా మగడా. ఇవతల మీటరు..."

"వెళ్తున్నా వెళ్తున్నా" చొక్కా తొడుక్కుంటూ లుంగీతోనే పరుగునెళ్లి పిలుచుకొచ్చాడు.

సుబ్బారాయుడు మాట్లాడి ఫోన్ పెట్టేశాక "నన్ను వెంటనే పిలవ్వొద్దా, బోల్డు బిల్ల యిందిట. కోప్పడుతున్నారు" అని విసుక్కున్నాడు.

బిక్కచచ్చిపోయాడు బ్రహ్మానందం.

అతడెళ్లేక "ఫోన్ని ఫ్రీగా ఉపయోగించుకుంటూనే ఎదురు తాటాకులు కడుతున్నారు చూడు. ఫోన్ లైన్ పీకేద్దామనిపిస్తోంది శ్రీలూ"

"నిజమేనండీ! ఎప్పుడూ ఎవరొకళ్లు వస్తున్నారు. బొత్తిగా ప్రైవసీ లేకుండా పోయింది" స్నానం చేసి నైటీ తొడుక్కునొస్తూ అంది శ్రీలక్ష్మి.

"అమ్మాయిగారివాళ జిగేల్మని మెరిసిపోతున్నారేమిటి కథ?"

"ఇవాళ పౌర్ణమి..." చిలిపిగా నవ్వింది.

"ఓహ్... అయితే డాబా మీద వెన్నెల్లో..."

"ష్...ఎవరైనా వింటారు"

"తలగడా పరువూ తీసుకో పదపద"

వెన్నెల్లో డాబా మీద పడుకుని హుషారుగా కబుర్లు చెప్పుకుంటుంటే క్రింద తలుపు చప్పుడయింది. అయిష్టంగానే లేచొచ్చి తలుపు తీశాడు.

ఎదురింటి సుత్తివేలు లోపలికొస్తూ "అరగంట నుంచి తలుపు బాదుతున్నాను" అన్నాడు కంప్లయింట్ చేస్తున్నట్టు.

"అదీ.. మరీ... డాబా మీద పడుకున్నాం"

"రాత్రి తొమ్మిదవ్వ లేదు అప్పుడే డాబా ఎక్కేస్తే ఎలా? అర్జంటుగా ఫోన్ చేసు కోవాల్సి వస్తే మాకెంత ఇబ్బంది?" అంటూ ఫోన్ తీసి ఒళ్లో పెట్టుకుని డయల్ చేశాడు.

మాంచి మూడ్లో వుండగా వచ్చి డిస్టర్బ్ చేసినందుకు తిట్టుకుంటూ నీరసంగా కూర్చున్నాడు బ్రహ్మానందం.

"హలో నేనేరా... ఏవిటి కబుర్లు... విశేషాలేం లేవు. బోరుగా వుంటే ఫోన్ చేశాను. సిని మాలేం చూశావు? ఇవాళ రేపు ఫామిలీతో చూడదగ్గ సినిమాలు రావట్లేదురా. మరీ దిగజారిపోతున్నాయనుకో. అన్నట్టొరేయ్ ఇండీసెంట్ ప్రపోజల్ సినిమా వచ్చింది. వెళ్దామా? ఫస్ట్ షోకైతే తెలిసిన వాళ్లుంటార్రా. సెకండ్ షోకెళ్దాం. కొన్ని సీన్లు యమ రంజుగా వున్నాయిట....."

అడ్డూ అదుపూ లేకుండా సాగిపోతోంది అతడి సంభాషణ.

టెలిఫోన్ వైరుని అతడి పీక చుట్టూ బిగించి చంపాలన్నంత కసితో రగిలిపోతు న్నాడు బ్రహ్మానందం.

ఎట్టకేలకు ఫోన్ పెట్టేసి... "అలా గుడ్లప్పగించి చూడకపోతే కూలింగ్ వాటర్ తెచ్చి వ్వచ్చుగా. ఇంట్లో మీ ఆవిడ లేదా?" అన్నాడు దబాయింపుగా.

విసురుగా లేచి గ్లాసుడు నీళ్లు తెచ్చిచ్చాడు.

"నీ మూడ్ బాగున్నట్టు లేదు. రేపు కలుస్తాను" అంటూ వెళ్లగా దభీమని తలుపు వేసేశాడు.

మర్నాడు ఉదయమే ఫోన్ మ్రోగింది భయపడుతూనే వెళ్లి రిసీవర్ ఎత్తాడు బ్రహ్మానందం.

ఆఫీసర్ నారాయణ గారు!

"మిస్టర్ బ్రహ్మానందం. మా ఇంట్లో కరెంటు ఒక ఫేజు పోయిందోయ్. నువ్వెలాగైనా వెళ్లి లైన్‌మేన్ని వెదికి పట్టుకుని తీసుకొచ్చి లైను సరిచేయించాలోయ్. ఏసీ నడవకపోతే నా వైఫ్ ఇంట్లో వుండలేదు. ఏమీ అనుకోకుండా వెంటనే తీసుకొస్తావు కదూ?"

"ఇప్పుడే వెళ్లి తీసుకొస్తాన్సార్..... అబ్బే! ఏమీ అనుకోను. ఇట్స్ మై ప్లెజర్" అన్నాడు ఏడుపు మొహం పెట్టి.

సంభాషణ విన్న శ్రీలక్ష్మి విరుచుకుపడింది. "మీరేమైనా ప్యూనా అలాటి పనులు చెయ్యడానికి? మీరు వెళ్ళొద్దు"

"స్వయంగా ఆయన చెప్పేక చెయ్యకపోతే బాగుండదే. ఈసారికి..."

మూతి మూడు వంకర్లు తిప్పి లోపలికెళ్ళిపోయిందామె.

"దేవుడా" అనుకుంటూ లైన్‌మేన్ కోసం రోడ్డు మీద పడ్డాడు బ్రహ్మానందం.

* * *

ఫోన్ మ్రోగేసరికి బ్రహ్మానందమూ శ్రీలక్ష్మీ కూడా అదిరిపడి భయం భయంగా చూశారు. ఆగిపోతే బాగుద్దని ఆశగా చూశారు గాని అలా మ్రోగుతూనే వుంది.

అదుర్తోన్న గుండెల్తో వెళ్లి రిసీవర్ ఎత్తాడు. "344322 యేనా?"

"అవును"

"మీ వీధి చివరి మలుపులో చెట్టు క్రిందున్న ముష్టేశ్వర్రావుని పిలవండీ"

"ఆఖరికి ముష్టివాడిక్కూడా ఫోన్ కావాల్సొచ్చిందా? ఎంత లోకువైపోయిందిరా బాబూ! ఇంతకీ నువ్వెవడివి నాయనా?"

"వీరముష్టిని"

"ముష్టి వేషాలేస్తావేంట్రా ముష్టీ. నేనేమైనా నంగిరి పింగిరి వాడిలా కన్పిస్తున్నానేం టొరేయ్. ఖబడ్దార్. కోపమొస్తే కబాడీ ఆడేస్తాను. అసలు మన స్టైలే వేరొరేయ్. ఇంకా చూస్తావేంట్రా. పెట్టేయ్. ఫోన్ పెట్టెయ్..." కరిచేశాడు బ్రహ్మానందం.

ఠకీమని పెట్టేశాడు అవతలతను.

"ఇంక లాభం లేదు బాబోయ్. ఈ ఫోన్తో నేను వేగలేను. ఏదో స్టేటస్ సింబల్ అనుకున్నాను గాని మరీ ఇంత చీప్ అయిపోతానను కోలేదు బాబోయ్! నాయనోయ్!"

"మరేం చేద్దామండీ" దిగులుగా అంది శ్రీలక్ష్మి.

"చెబుతా చెబుతా"

మర్నాడు కుక్క పిల్లని తెచ్చి గుమ్మంలో కట్టేసి "కరిచే కుక్క వున్నది జాగ్రత్త" అని పెద్ద బోర్డు గేటుకి తగిలించాడు.

"ఇక మనకెలాంటి డిస్టర్బెన్సూ వుండదు" అని ఆనందపడుతోంటే ఫోన్ మోగింది.

"బ్రహ్మానందం గారేనా?"

"కాదు ఆనంద బ్రహ్మన్ని. రాంగ్ నెంబర్" అని ఫోన్ పెట్టేశాడు బ్రహ్మానందం.

* * *

**(ఆంధ్రభూమి వారపత్రిక 27.1.2000)**

# సినిమా భాగోతం

**సి**నిమా హాలు ముందు ఆటో దిగారు బ్రహ్మానందమూ, శ్రీలక్ష్మీ.

ఎదురుగా హౌస్‌ఫుల్ బోర్డు కనిపించింది. నీరు కారిపోయారిద్దరూ.

"ఈ సినిమా ఎంతో బావుందని వూరిపోతూ వస్తే ఇలా జరిగిందేవిటండీ!" శ్రీలక్ష్మి అంది.

"మన్లాగే అంతా అనుకునొచ్చుంటారు. కొంచెం ముందొస్తే బాగుండిపోయేది"

"ఫిఫ్టీన్ ట్వంటీ, ఫిఫ్టీన్ ట్వంటీ" అంటూ ఒకతను వాళ్ల చుట్టూ ప్రదక్షిణ చేశాడు. బ్రహ్మానందం అతడ్ని పట్టించుకోకపోయేసరికి మరొకరి దగ్గరి కెళ్లిపోయాడు.

"ఆ టిక్కెట్స్ తీసుకుందామండీ!"

"బ్లాక్‌లో టిక్కెట్లు కొనమంటావా?" హత్య చేయమంటావా అన్నట్టు అన్నాడు.

"ఈ ఒక్కసారికీ కొందామండీ!"



"నోనో. అలాంటి వాటిని మనం ప్రోత్సహించకూడదు. మనం ప్రోత్సహించేకొద్దీ వాళ్ళు రెచ్చిపోతారు. థియేటర్ వాళ్లతో కలసి మొత్తం టిక్కెట్స్ అన్నీ బ్లాక్ చేసేస్తుంటారు. జనాన్ని నిలువునా దోచేస్తారు. మన్లాంటి చదువుకున్న వాళ్ళు, సంస్కారవంతులు అలాంటి చట్ట విరుద్ధపు పనులు చేయకూడదు"

"డోసు సరిపోయింది గానీ ఇక ఉపన్యాసం ఆపెయ్యండి. అంతా మనవంకే విచిత్రంగా చూస్తున్నారు. నేను సినిమా చూడ్డానికి వచ్చాను గానీ మీ వూకదంపుడు ఉపన్యాసం వినడానిక్కాదు" కోపంగా అందామె.

"బ్లాక్‌లో టిక్కెట్లు కొనలేదని కోపించడం ఏం బావోలేదు శ్రీలూ. ఇంకో సినిమా చూపిస్తాను పద"

మూతి ముప్పై వంకర్లు తిప్పి ముందుకు నడిచింది.

"ఊర్వశికి వస్తావా?"

"టెన్ రూపీస్ ఎక్స్‌ట్రా!"

"మీటర్‌కి రావా?"

జవాబివ్వలేదతడు. ముఖం తిప్పేసుకున్నాడు.

"ఛా...ఛా. అంతా పుచ్చిపోయారు. ఈ దేశం ఇంక బాగుపడదు"

"ఎక్స్‌ట్రా పదిరూపాయలు ఆటో వాడికిచ్చి ఆ చెత్త సినిమా చూసేకన్నా అదేదో బ్లాక్ మార్కెటీర్ ముఖాన కొట్టి ఈ సినిమా చూడటం మంచిది కదండీ!"

"కానీ బ్లాక్‌లో నేను టిక్కెట్లు కొననే!"

"నేను కొంటాన్లెండి"

చొరవగా వెళ్లి రెండు టిక్కెట్లు తీసుకుంది శ్రీలక్ష్మి.

"సినిమా మొదలైంది. త్వరగా పదండి"

వడివడిగా వెళ్తుంటే చిదంబరం ఆపేశాడు "మిమ్మల్నెక్కడో చూసినట్టుందే" అన్నాడు ఒక కన్ను మూసి చూస్తూ.

"హమ్మో... వీడేదో ఫ్లాష్‌బాక్‌లోకి వెళ్తున్నట్లున్నాడు పదవే బాబూ"

అతడ్ని వదిలించుకుని హాల్లోకి పరుగెత్తారు.

సినిమా మొదలైంది. అంతా చీకటిగా వుంది. తడుముకుంటూ వెళ్లారు.

ఒక సీట్లో కూర్చోబోయేసరికి కెవ్వుమన్నారొకరు. సారీ చెప్పి మరో సీట్లో కూర్చోబోగా "నీ జిమ్మడ. కళ్ళు కన్పట్టం లేదట్రా" అని తిట్లు మొదలెట్టిందొకావిడ.

"నిజంగానే కళ్ళు కనబడడం లేదు. ఏమనుకోకండి"

"కళ్ళు కనబడని గుడ్డోళ్ళు సినిమా ఎలా చూద్దామనొచ్చారో ఏమో!"

గతుక్కుమన్నాడు బ్రహ్మానందం.

"చీకట్లో కనబడడం లేదంటున్నాను గానీ అస్సలు కన్పించదనడం లేదమ్మా"

"అమ్మనా? నేన్నీకంటికెలా కన్పిస్తున్నాను?"

'దెయ్యంలాగా' నోట్లో అనుకుని తడుముకుంటూ ముందుకెళ్లి చెరో సీట్లోనూ కూలబడ్డారు.

"బాబూ సినిమా మొదలై ఎంతసేపయ్యిందీ?" ప్రక్క సీట్లోని అతడ్ని అడిగాడు బ్రహ్మానందం.

"రూపాయి ఆట అయింది"

బుర్ర గోక్కుని "కథేం జరిగిందీ!' అనడిగాడు మళ్లీ.

"అదిగో ఇందాకట్నుంచీ ఆ హీరోగాడు హీరోయిన్ ఎనకాల పడి తిరుగుతూనే వున్నాడు. ఇద్దరూ కిందా మీదా పడి దొర్లుతూనే వున్నారు"

"ఇంతక్రితమే మొదలయ్యిందటలే" భార్యతో అన్నాడు.

"సినిమా మొదట్నుంచీ చూడకపోతే నాకు తృప్తిగా ఉండదండీ"

మౌనాన్ని ఆశ్రయించేసాడు బ్రహ్మానందం. రెట్టిస్తే ఇంకోసారి సినిమా చూపించ మంటుందేమోనని భయపడ్డాడు.

డ్యూయెట్ పాడుతున్నారు హీరో హీరోయిన్లు. అంతా ఈలలు వేస్తూ గోల చేశారు. బ్రహ్మానందం ప్రక్కన కూర్చున్నతను ఏకంగా డాన్స్ మొదలెట్టాడు.

"నువ్వు కాస్త తిన్నగా కూర్చుని మమ్మల్ని సినిమా చూడనిస్తావా?"

"సూడవయ్యా ఎవడొద్దన్నాడు?'

"నువ్వు అడ్డొస్తోంటే ఎలా చూడనయ్యా?"

"నోర్ముయ్యండెహె" వెనకతను అరిచాడు.

నోరుమూసుకున్నారిద్దరూ.

కాస్సేపటికి కమ్మని వాసన ముక్కు పుటాల్ని తాకింది. తెరమీద దృష్టి నిలవట్లేదు. ప్రక్కతను నములుతున్న చిప్స్ వాసన బ్రహ్మానందాన్ని తిన్నగా ఉండనివ్వట్లేదు.

"బాబూ! కొంచెం పాకెట్ దూరంగా పెడతావా?"

"పెట్టకపోతే ఏం చేస్తావ్?" పెంకెగా అడిగాడు.

"నేను కూడా తినేస్తాను"

గబుక్కున అటు తిరిగి కూర్చున్నాడతను. నవ్వుకున్నాడు బ్రహ్మానందం.

ఇంటర్వెల్లో చిదంబరం వచ్చాడు.

"మిమ్మల్నెక్కడో చూశాను. ఎక్కడ చూసానబ్బా"

అతడు బుర్ర గోక్కుంటూ ఆలోచిస్తుంటే "ఎక్కడా చూళ్ళేదుగానీ వెళ్లి సినిమా చూడు" విసుక్కున్నాడు బ్రహ్మానందం.

"నేనంత తేలిగ్గా మరచిపోయే ఘటాన్ని కాదండీ మరి. ఎక్కడో చూశాను. ఎక్క డబ్బా? పెళ్లిలోనా? హొటల్లోనా? బార్‌లోనా...?"

"అలాటి చోట్లకి నే వెళ్ళను గానీ వెళ్ళవయ్యా వెళ్ళు" అని దులపరించేశాడు.

అదృష్టవశాత్తూ సినిమా కూడా మొదలవడంతో అతడెళ్లిపోయాడు.

"మీరు చెప్పేది నిజమేనా?"

"ఏమిటి?"

"అతన్నెక్కడా చూడకపోవడం"

"నిజమేనే. ఎక్కడా చూళ్ళేదు"

"నేన్నమ్మను. ఏ సందులోనో అతగాడికి కన్పించి ఉండకపోతే అలా ఎందుకంటాడు?"

"నిజంగా నిజమేనే బాబూ. నేను శ్రీరామచంద్రుడ్నే. నన్ను అనుమానించడం మహాపాపమే" నుదురు కొట్టుకున్నాడు.

"ఎరక్కపోయి ఈ సినిమాకి వచ్చాను. నా ఖర్మకాలి వీడెవడో వెంటబడ్డాడు" బ్రహ్మానందం గొణుక్కుంటుంటే ఠపీమని నెత్తిమీద ఒక్కటిచ్చుకున్నారెవరో. లేచి ఎవరని అడిగే ధైర్యం లేక కుక్కిన పేనులా ఉండిపోయాడు.

హీరో రౌడీల్తో స్టంటు చేస్తుంటే ప్రక్క సీట్లోని పల్లెటూరతను రెచ్చిపోయి బ్రహ్మా నందాన్ని మోచేత్తో పొడిచెయ్యసాగాడు. అతడి తొడమీద చరచసాగాడు. అయినా ఏమీ అనకుండా భరిస్తూ లోలోన ఏడుస్తూండిపోయాడు.

సినిమా  పూర్తయింది. లైట్లు వెలిగాయి

"మిమ్మల్నెక్కడో చూశాను సారూ. ఎక్కడబ్బా?" అంటూ మళ్ళీ వచ్చాడు చిదంబరం.

"ఇంకోసారలా వాగితే వంగదీసి గుద్దుతానొరేయ్. నేను అల్లాటప్పా వాడిలా కన్పి స్తున్నా నేంట్రా అంతా తెగ రెచ్చిపోతున్నారు. రండ్రా నా తఢాఖా చూపిస్తాను" చొక్కా చేతులు మడిచి రెచ్చిపోయాడు బ్రహ్మానందం.

"ఆ గుర్తొచ్చింది.. మిమ్మల్ని ఇందాకే ఈ సినిమా హాలు దగ్గరే చూశాను. హమ్మయ్య భలేగా గుర్తొచ్చింది. సమస్య తీరిపోయింది" తేలికబడ్డ మనసుతో వెళ్లిపోయాడు చిదంబరం.

గుడ్లు మిటకరించి చూస్తుండిపోయాడు బ్రహ్మానందం!

* * *

**(ఆంధ్రభూమి వారపత్రిక 16.3.2000)**

# పరమ వీర సుత్తి

**క**ళ్లజోడుపై నుంచి ఇంటి నెంబర్లు చూస్తూ అడుగులేస్తున్న ఏవీయస్‌ని "హలో" అంటూ పలరించాడు బ్రహ్మానందం.

"ఎందుకు పిలిచేవు?"

"మిమ్మల్నెక్కడో చూసినట్టు గుర్తు'

"ఎక్కడ చూశావు?"

"అదే గుర్తు రావట్లేదు'

"సినిమా హాల్లోనా?"

"కాదు..."

"హొటల్లోనా?"

"కాదనుకుంటా..."

"మీ ఇంట్లోనా?"

"కాదయ్యా బాబూ. వూరికే ప్రశ్నల్తో వూదరగొట్టేస్తావేంటి?"



“ఇంకెక్కడ చూశావు?”

“ఎక్కడో కాదు మహానుభావా ఇప్పుడే ఇక్కడే చూస్తున్నాను. చాలా?”

“ఎందుకు చూస్తున్నావ్?’

“నా బుద్ధి గడ్డి తిని’

“గడ్డి తిన్నావా బిర్యానీ తిన్నావా?”

“మీ పేరు ఏవియస్ కాదు కదా?”

“అయితే ఏవిటి కాకపోతే ఏవిటి?”

“అయితే పారిపోతాను కాకపోతే సందేహం తీర్చుకుంటాను”

“సందేహం ఏమిటి?”

“సుబ్బరామయ్యగారిల్లెక్కడో చెబుతారని”

“ఆయనెవడు?”

“ఓ నాయకుడు”

“ఏం చేస్తాడు?”

“వూరి మీదపడి వుపన్యాసాలిస్తుంటాడు”

“ఎలక్షన్లయ్యాక కూడా ఇస్తాడా?”

“ఇవ్వడు”

“ఎందుకివ్వడు?”

“అతగాడికి అవసరం లేదు గనుక”

“అతడ్తో నీ అవసరం ఏమిటి”

“కొంచెం రికమండేషన్ చేయించుకుందామని”

“దేని గురించి?”

“ట్రాన్స్‌ఫర్ కోసం”

“ట్రాన్స్‌ఫర్ ఎందుకు?”

“ట్రాన్స్‌ఫర్ ఎందుకేవిటి మహానుభావా ఈ వూర్నించి వెళ్లిపోడానికి”

“ఎందుకెళ్లడం?”

"చుట్టాల బాధా చుట్టాల దాడీ తట్టుకోలేక"

"ఎక్కడికెళ్తావ్?"

"మీకందనంత దూరం"

"పీటీ ఉషలా పరుగెడతావా?"

"పెట్టను గాని మీరు మెతిమా?"

"అంటే ఏమిటి?"

"మెదడు తినే మనిషి"

"నేను నాన్‌వెజ్‌లా కన్పిస్తున్నానా?"

"నాకైతే వెజ్‌లానూ కన్పించట్లేదు, నాన్‌వెజ్‌లానూ కన్పించట్లేదు. కేవలం మనుషుల్ని మాత్రమే తినే కాన్నిబాల్స్‌లా కన్పిస్తున్నారు"

"వాళ్లు నీ బంధువులా?"

"ఓయమ్మోయ్ ఓర్నాయనోయ్! వీడెవడండీ బాబూ. ఏదో చెబుతాడని పిలిస్తే నిలబెట్టి తినేస్తున్నాడు"

"నీకేం చెప్పాలి?"

"సుబ్బరామయ్య ఇల్లెక్కడుందో చెబితే చాలు"

"ఆ ఇల్లు ఎక్కడుందని చెప్పేరు?"

"ఈ వీధిలోనే..."

"వీధి మధ్యలోనా చివర్లోనా?"

"మధ్యలోనే అనుకుంటా"

"లెఫ్ట్ సైడా రైట్ సైడా?"

"రాంగ్ సైడ్. నీకో నమస్కారంగాని నన్నొదిలెయ్"

"నువ్వు మస్కా బాగా కొడతావా?"

"నేనెలా కన్పిస్తున్నాను?"

"నీ పేరేంటి?"

"బ్రహ్మానందం అంటారు"

"ఆనందబ్రహ్మ అనెందుకు అనరు?"

"నీలాంటి విషాదం ఎదురవ్వద్దని"

"నేను శనిలా కన్పిస్తున్నానా?"

"అబ్బే మీరు శనిలా వుండడం ఏవిటీ శనే మీలా వుంటాడు" గొణుక్కున్నాడు బ్రహ్మానందం.

"ఏవిటి గొణుక్కుంటున్నావ్?"

"మీ పొట్టనిండా ప్రశ్నలేగాని జవాబుల్లేవా అని"

"జవాబెందుకు ఇవ్వాలి?"

"ప్రశ్న వేశాను గనుక"

"ప్రశ్నకి ప్రశ్న జవాబుగా ఇవ్వకూడదా?"

"ఇవ్వకూడదు"

"ఎందుకివ్వకూడదు?"

"ప్రశ్నకి సమాధానం ప్రశ్న కాదు గనుక"

"ఎందుక్కాదు?"

"కాదంతే"

విసురుగా ముందుకి నడిచాడు బ్రహ్మానందం. "భలే బేరం దొరికిందిరా బాబూ! ఎక్కడో పిచ్చి కుక్క కరిచిన మనిషిలా వున్నాడు"

"ఏంటి బాబూ! నీలో నువ్వే మంత్రాలు చదువుకుంటున్నావూ" ఒక పెద్దావిడ అడిగింది.

"మంత్రాలు చదవట్లేదు బండబూతులు తిడుతున్నాను"

"ఎవడా అభాగ్యుడు?"

"ఇందాక రోడ్డు మీద తగిలాళ్లే. మనిషిని నిలబెట్టి కొరుక్కు తినేసే మనిషి"

"అలాటి వారూ వుంటార్లే గాని అబ్బాయ్..."

"చెప్పండి బామ్మగారూ..."

"నేను బామ్మనేవిట్రా. నీకేమైనా చత్వారం వుందా? నాకింకా నలభై వెళ్లనే లేదూ"

"నలభయ్యా ఎనభయ్యా?"

"ఏవిటి గొణుగుతున్నావ్?"

"అబ్బే ఏం లేదు. మిమ్మల్నెక్కడో చూసినట్టుందే"

"చూశావా? నా పేరు మనోరమ. ఏమయినా గుర్తొచ్చానా?" కళ్లజోడు తుడిచి తిరిగి పెట్టుకుని చూస్తూ అడిగింది.

"అమ్మో!" బిగ్గరగా అరిచాడు స్థాణువైపోయి.

"ఏవిటలా బిగుసుకుపోయావ్? మూర్ఛ రోగంలా బిగుసుకుపోయే రోగమేదైనా వుందేమిటి?"

"అహ... అబ్బే, అదేం కాదు. మీ పేరు వినేసరికి రమాప్రభ అని మా చుట్టాలమ్మాయి గుర్తొచ్చింది"

"ఆ అమ్మాయి నాలాగా అందంగా వుంటుందా?"

"అందం సంగతెవడు చూశాడండీ కంటబడితే చాలు కైమాచేసి మ్రింగేస్తుంది. మహా డేంజరు మనిషి"

"అలాంటి వాళ్లూ వుంటార్లే కాని బ్రహ్మానందం ఇల్లెక్కడో చెబుతావా?"

"ఏ బ్రహ్మానందం?"

"మా శ్రీలక్ష్మి మొగుడు. ఈ ప్రాంతంలోనే వుంటున్నాడన్నారు"

గతుక్కుమన్నాడు. దూరపు బంధువు కాబోలు! ఆమెనెలాగోలా వదిలించుకోకపోతే నెత్తిమీద జుట్టు ఇంట్లో ప్రశాంతత వుంచదనుకున్నాడు.

"వాళ్లెప్పుడో పోయారుకదా!" అన్నాడు.

"ఏవిటి? పోయాడా? అనుకున్నాన్లే. అలాటి అర్భకుడు ఎక్కువ కాలం బతకడని పెళ్లిలోనే అనుకున్నాను"

"అహహ పైకి పోలేదు. మరో వూరు పోయారు. ట్రాన్స్‌ఫర్ అన్నమాట"

"ఆ సంగతి తిన్నగా చెప్పలేవూ!"

"చెబుదామనే అనుకున్నాను. ఇంతలో నాలిక తడబడి..."

"ఇలా తలతిక్కగా వాగి వుంటావు. అందుకే అతగాడు అడ్డంగా కరిచేసి వుంటాడు"

మెల్లగా జారుకోబోతుంటే "ఏంటలా జారుకుంటున్నావ్, ఇలారా!" అని గద్దించింది మనోరమ.

"దారేపోయే దానయ్యని పట్టుకుని మీరిలా జాడించడం ఏం బావోలేదు"

"ఆగాగరా బడుద్ధాయ్"

"ఏవిటి నేను బడుద్ధాయినా? నేనెవర్నో తెలుసా?"

"నీ మొహం చూడగానే తెలిసిందిలే ఇంకా నోటితో చెప్పాలా!"

"అహ అదికాదు బా...పిన్నిగారూ!"

"ఇప్పుడు నాకు నచ్చేవు. అద్సరేగానబ్బాయ్. మా శ్రీలక్ష్మి మొగుడ్నెరుగుదువా?"

"ఎలా వుంటారండీ?"

"పొట్టిగా వుంటాడు. అడ్డంగా పెరిగి వుంటాడు. జిడ్డు మొహంతో నీలాగే మడ్డీగా వుంటాడు"

బ్రహ్మానందం మొహంలో రంగులు చకచకా మారిపోయాయి. ఏడవలేక నవ్వేడు. "తెలీదండి. వస్తానండి"

"ఆగవయ్యా. ఆ పరుగేవిటి ఏ కుక్కో తరుముతున్నట్టు" రెక్క పట్టుకుని మరీ ఆపింది.

"పనుందండీ. అర్జంటుగా ఒకాయన ఇల్లు పట్టుకోవాలి"

"చెయ్యి పట్టుకోవడం విన్నాను కాలు పట్టుకోవడం విన్నాను గాని ఇల్లు పట్టుకోవడం విన్లేదయ్యా"

"టౌన్లోని భాష ఇలాగే తగలడుతుందండి. నన్నిహ వదుల్తారా?"

"ఎందుకు వదల్నూ? ఈ చిరునామా కాస్త చూసిపెట్టు"

చీటీ తీసుకుని చూశాడు. తనింటి చిరునామాయే అది!

ఎలా చెప్పాలో అర్థం గాక నీళ్లు నములుతోంటే అందావిడ– "ఆ నంగి వేషాలేంటి? చదవటం రాదా? నీదంతా పైపై పటారమేనా అబ్బాయ్"

"ఆ...అహహ... కాదండి. మరేమో ఈ ఇల్లు దుర్గాకాలనీలో వుంది. మీరేమో దుర్గానగర్లో వెదుకుతున్నారు. అది వేరు ఇది వేరన్నమాట"

"అలాగా. ఆ తల మాసినోడెవడో ఇదే అదన్నాడే"

"తలమాసిన వాళ్లు అలాగే చెబుతారు'

"నువ్వు చెప్పేదైనా నమ్మొచ్చా? నీ తలా మాసినట్టుంది"

"ఎంత మాటన్నారు పిన్నిగారూ! నా ఇంటి చిరునామా గురించి నేను అబద్ధ మాడతానా?'

"నీ ఇల్లేవిటి మా శ్రీలక్ష్మి ఇల్లు"

"అవునదే అదే.."

"నీకు తెలుసా?"

"నాకేవిటి అందరికీ తెలుసు గాని తల పేలిపోతోంది నన్ను వెళ్లనివ్వండి"

"పెద్దవాళ్లతో ఇలాగేనా వ్యవహరించేది. ఏం చదువు చదివేవయ్యా?"

"మీ సుత్తి ఎంతసేపని భరించను?"

"సుత్తీ కొడవలీ అంటున్నావేంటి మాజీ కమ్యూనిస్టువా?"

"బాబోయ్ మీకు వేన వేల నమస్కారాలుగాని నన్ను వదిలెయ్యండి. అమ్మో! మెతిమ ఇటే వచ్చేస్తున్నాడు దేవుడోయ్" ఏవీయస్ రాకని చూసి పారిపోబోయాడు గాని అత గాడి చొక్కా పట్టుకునాపింది మనోరమ.

"నన్ను వెళ్లనివ్వరా?"

"మా శ్రీలక్ష్మి ఇల్లు చూపించే వరకూ వెళ్లనిచ్చేది లేదు"

"ఇదెక్కడి కనెక్షన్ తల్లీ..." ఏడుపు మొఖం పెట్టేడు బ్రహ్మానందం.

"ఎవర్తోనే మాట్లాడుతున్నావ్?" అంటూ వచ్చాడు ఏవీయస్.

"శ్రీలక్ష్మి ఇంటి గురించడుగుతున్నా. వాళ్లిల్లు ఈ ప్రాంతంలో లేదుట"

"ఇంటి నెంబర్లు కలవనప్పుడే తెలిసిపోయింది గాని నువ్వు ఇందాక పారిపోయిన బడుద్దాయివి కాదూ?" బ్రహ్మానందం మీది కెళ్తూ అడిగాడు.

"అయితే, ఇందాకేదేదో వాగింది మా ఇంటాయన గురించేనా?" నిలదీసిందావిడ.

"అంటే మీరిద్దరూ భార్యాభర్తలా? చచ్చేంరా దేవుడోయ్. ఒకరిది పరమసుత్తి. రెండో వారిది వీరసుత్తి. మధ్యన నా బుర్రచేత రామ కీర్తన పాడించేట్లున్నారు దేవుడోయ్!"

"కాకిగోలేవిట్రా వెధవాయ్" కసిరిందామె.

"నేను వెధవాయిని కాను"

"నీకు నువ్వనుకుంటే సరిపోద్దా?" ఏవియస్ ప్రశ్నించాడు.

"ఎందుకు సరిపోదు?"

"నీ బుర్రకి అర్థంకాదు గాని ఈ చిరునామాకెలా వెళ్ళాలో చెప్పేడు"

"బస్సెక్కిదిగి ఆటో ఎక్కి దిగండి"

"ఎందులో దిగాలి?"

"కృష్ణలో అయితే శ్రేష్ఠం"

"అదిగో అటు చూడండి. ఆ వస్తున్నది మన శ్రీలక్ష్మిలా లేదూ?"

మనోరమ మాటలకి అటు చూశాడు బ్రహ్మానందం. నిజంగానే శ్రీలక్ష్మి వస్తోంది.

ఇంతసేపూ బంధువులని తెలిసినా తెలీనట్లు నటించినందుకు ఏం తిట్టిపోస్తుం దోనని భయపడ్డాడు. ముఖం చాటేసి జారుకుందామని చూశాడు గాని ఆమె అతన్ని చూసి పిలిచింది.

"మిమ్మల్నే. మీ గురించి వస్తోంటే మీరలా వెళ్లిపోతారేంటి?"

"హాయ్. నువ్వా శ్రీలూ! ఏవిటిలా వచ్చావ్? కంట్లోనలకపడిందీ. అందుకని నిన్ను చూళ్ళేదూ..."

"మన శ్రీలక్ష్మేనండీ.. అమ్మాయ్"

"నువ్వా అత్తయ్యా. అరె మావయ్య కూడా వచ్చారే" సంబరపడ్తూ అంది శ్రీలక్ష్మి.

"అవునే అమ్మాయ్. పుష్కరాల పదిరోజులూ మీ ఇంట్లో వుండి వెళ్దామనొచ్చాం. ఇతగాడ్ని మీ చిరునామా చెప్పమంటే తలతిక్కగా మాట్లాడుతున్నాడు. ఎక్కడో పిచ్చోళ్ళా వున్నాడు!"

"పిచ్చోడు కాదు మంచోడే. మీ అబ్బాయి"

"ఆఁ" ఇద్దరూ మ్రాన్పడిపోయారొక్కసారే.

"పదిరోజులుంటారా! అన్నాళ్ళూ మీ ప్రశ్నలూ సుత్తులూ ఎడాపెడా భరించి పిచ్చెక్కకుండా వుండాలా!"

తనలో తను గొణుక్కుంటూ గొణుక్కుంటూనే దభీమని పడిపోయి గిలగిల తన్నుకో సాగాడు బ్రహ్మానందం!

* * *

**(ఆంధ్రభూమి వారపత్రిక 2.3.2000)**

# టెక్నిక్

**"హ**లో అంకుల్..."

గుమ్మంలో ప్రత్యక్షమైన మోడ్రన్ మెరుపు తీగని చూసి తడబడ్డాడు బ్రహ్మానందం.

"హలో.. మీరు..."

"మిమ్మల్ని ఇంటర్ వ్యూ చెయ్యడానికొచ్చాను సర్..."

"ఓ.. వెల్‌కం వెల్‌కం.. కూర్చోండి... ఏ పత్రిక నుంచి వచ్చారు?"

బేగ్‌తో సహా లోపలికి వచ్చింది. అతడి ప్రశ్న పట్టించుకోకుండా చుట్టూ పరిశీలనగా చూడసాగింది లయ.

ఇంట్లో శ్రీలక్ష్మి లేనందున స్మార్ట్‌గా వున్న ఆ అమ్మాయినే చూస్తూండిపోయాడు బ్రహ్మానందం.

"మీ ఇంటి అలంకరణ చాలా బాగుంది సర్.."



"థాంక్యూ. నేనేం చేసినా బాగా ఆలోచించి చేస్తాను. అవసరమైనదే చేస్తాను. అది కూడా అవసరమైనంతే చేస్తాను"

"వెరీ గ్రేట్ సర్... మీ గురించి తెలుసుకోవాలని చాలా ఉత్సాహంగా వుంది సార్."

"నేను ఆఫీసర్ని అయినా ఫోజులు కొట్టను. డిగ్నిఫైడ్‌గా వుంటాను. నేలమీద నడుస్తానన్న మాట.."

"మీకు కారు లేదా సర్.."

ఇబ్బందిగా కదిలాడు.

"ఆఫీసు వాళ్ళు కారు ఇస్తామన్నారు. అనవసరపు ఖర్చని నేనే వద్దన్నాను. లేదంటే పెట్రోలూ, డ్రైవరూ మెయింటెనెన్సూ బోల్డు ఖర్చు కదా. అఫీసు సొమ్ము అయినా సరే అనవసరపు ఖర్చు పెట్టక పోవడం నా స్పెషాల్టీ.."

"మీరు చాలా గ్రేట్ సర్..."

అతడి భుజాలు రెండంగుళాలు పెరిగాయి.

"నేనెప్పుడూ అంతే, డిస్కౌంట్లూ ఫ్రీ గిఫ్టులూ బంపర్ బహుమతులూ వగైరాలంటే ఆశపడను. రేటు ఎక్కువయినా సరే క్వాలిటీ ముఖ్యం.."

"మీ ప్రిన్సిపుల్ బావుంది సర్. ఫ్రీ గిఫ్టులు ఇచ్చినంత మాత్రాన క్వాలిటీ ఎందుకు తగ్గుతుంది సర్?"

"సరుకు నిల్వలు పేరుకు పోయినప్పుడు డిస్కౌంట్లు పెడతారు. సరుకులో సత్తా లేనప్పుడు ఇది కొంటే ఫలానాది ఉచితం అని ఆశ పెడతారు. తాయిలానికి ఆశపడే పిల్లల్లా అంతా ఆశపడి కొనేస్తూంటారు. నేనలా కొనను.."

"ఫ్రీగా కొన్ని వస్తాయి కదా సర్.."

"వస్తే మాత్రం. ఫ్రీ సరుకుల కోసం క్వాలిటీతో రాజీపడను గాక పడనంతే.. నన్నెవరూ మోసం చెయ్యలేరు.. పడగొట్టనూ లేరు.."

"అందుకే మీరు గ్రేట్ అయ్యారు సర్.."

"థాంక్యూ.." లేచి వెళ్ళి ఫ్రిజ్ లోంచి కూల్ డ్రింక్ గ్లాసులో పోసిచ్చాడు.

"మీ వయస్సు వాళ్ళకి బొజ్జ రావడం సహజం. మీకు రాలేదంటే మీ ఆరోగ్య రహస్యం ఏవిట్సర్"

"రోజూ ఒక కిలోమీటరు వాకింగు చేస్తాను. అతిగా తినను. పార్టీల కెళ్ళినా సరే లిమిట్‌లో వుంటానెప్పుడు. చాలామందిలా ఎగబడి పీకల్దాకా తినేసెయ్యను"

"జిహ్వా చాపల్యాన్ని కంట్రోలు చేసుకోగలగటం మహర్షులకే చెల్లింది సర్. మీరు కూడా ఆ కోవకే వస్తారు సర్..."

ముసి ముసి నవ్వులు కుమ్మరించేడు బ్రహ్మానందం.

"ఏవిటో అంతా అలాగే అంటూ వుంటారు"

"మీ జుట్టు నల్లగా నిగనిగలాడుతోంది సర్. మీకు చుండ్రు లేదు కదా సర్.."

"అలాంటివి మన జోలికి రావు.." గర్వంగా చెప్పేడు.

"మిమ్మల్ని చూస్తే జెలసీగా వుంది సర్. మీ శ్రీమతిని కలిసి ఆవిడ అదృష్టాన్ని పొగడాలన్పిస్తోంది.."

"ఏవిటో మీరు అతిగా పొగిడేస్తున్నారు. ఇంతకీ మీరు ఏ పత్రిక నుంచి వచ్చారు?"

"పత్రిక నుంచి కాదు సార్ ఓ ప్రఖ్యాత సంస్థ నుంచి వచ్చాను. మీలాంటి గ్రేట్ పర్సన్స్‌ని ఇంటర్ వ్యూ చేసి మీ గురించి ప్రచారం చేస్తుంటాం అఫ్‌కోర్స్. మా ప్రోడక్ట్స్ గురించి మీ అభిప్రాయాలని కూడా రాస్తాం"

"నాలాటి వాడ్ని అడ్డుపెట్టుకుని మీరు వ్యాపారం చేసుకుంటారన్నమాట. బావుంది.." నవ్వుతూ అన్నాడు.

బేగ్‌లోంచి 'గ్రేట్ హెయిరాయిల్' సీసాల్ని బయటికి తీసింది లయ.

ఇబ్బందిగా చూశాడు బ్రహ్మానందం.

"ఇది మా ప్రోడక్ట్ సర్. జుట్టుని నల్లగా వుంచుతుంది. చుండ్రుని దరి చేరనీయదు. తలనొప్పి లాటివి రానివ్వదు"

"త్రీ ఇన్ ఒన్ అన్నమాట"

"గ్రేట్ సర్. మీ గ్రహణ శక్తి అమోఘం సర్. మీరలా అంటున్నారని ఉపయోగిస్తున్నారని ప్రచారం చేసుకుంటాం సర్.."

"ఒకే"

"మీ ఫోటో కూడా ఇస్తే.."

"మొహమాట పెడ్తున్నారు" అంటూ వెళ్ళి ఆల్బంలోంచి ఓ ఫోటో తెచ్చిచ్చాడు.

"నా ఇంటర్‌వ్యూని మీరు ఏ పత్రికలో ప్రచురించిందీ తెలియజేస్తే మా బంధుమిత్రుల్నీ ఆఫీసు స్టాఫ్‌ని అందర్నీ కొని చూడమని చెబుతాను"

"తప్పకుండా సార్. మా హెయిరాయిల్ని కొనమని రికమండ్ చెయ్యండి సర్. మీరు చెబితే నమ్మి కొంటారని నా నమ్మకం"

"దానికేం వుంది అలాగే చెబుతాను"

"చాలా థాంక్స్ సర్.. మీ నల్లని నిగ నిగ జుట్టుకీ చుండ్రు లేకపోవడానికీ ఏకైక కారణం మా గ్రేట్ హెయిరాయిల్ వాడటమేనని మీరు చెప్పినట్టు రాసుకుంటాను"

"రాసుకోండి.. దానికేం.."

"థాంక్యూ.." అంటూ రెండు సెంటు సీసాల్ని అతడికి అందించింది.

"సెంటు సీసాలా? అబ్బే... మేం వాడం.."

"మీలాంటి స్టయిలిస్టులు వాడకపోతే ఎలా సర్... తీసుకోండి... ఫ్రీయే.."

"ఓ ఫ్రీయా.. గుడ్.." బాటిల్స్ అందుకుని వాటి వంక సంతృప్తిగా చూశాడు.

పెద్ద హెయిరాయిల్ సీసాలు రెండు తీసి అతడి ముందుంచింది. ఇంటర్ వ్యూ ఫ్లస్ ప్రకటన ఇచ్చినందుకు వూరికే ఇస్తోంది కాబోలనుకున్నాడు.

శ్రీలక్ష్మికి చూపించి ఫోజు కొట్టాలని కూడా అనుకున్నాడు.

అయినా తొందర పడి వాటిని చేతుల్లోకి తీసుకోలేదు.

"నూట యాభై రూపాయల్సార్.." అదిరిపడ్డాడు బ్రహ్మానందం.

"వీటి ఖరీదా? నాకెందుకు? వద్దు వద్దు..అసలు మేం వాడం.."

"మీరు వాడతానని ప్రకటించేక వాడకపోతే బాగుండదు సర్. ఈసారికి తీసు కోండి సర్.."

"వూహు.. నాకొద్దు. మా ఆవిడకి తెలిస్తే తిట్టిపోస్తుంది" అనేసి నాలిక్కరుచు కున్నాడు.

"హెయిరాయిల్ కొనేంత స్వేచ్ఛ కూడా మీకు మీ ఇంట్లో లేదా సర్?" యమాశ్చర్యంగా చూస్తూ అడిగింది.

"అహహ. ఇంట్లో నేనే కింగ్‌ని.."

"మరయితే భయపడకుండా తీసుకోండి సర్.."

"వద్దంటే వద్దంతే..'

"ఇవి కొంటేనే ఆ సెంటు సీసాలు ఉచితం సర్.."

"అలాగా.. అయితే ఇవీ వద్దు" చేతిలోని బాటిల్స్ ఆమె ముందుంచాడు.

"తీసుకున్నాక ఇవ్వటం ఏం బావో లేద్సర్. ఫలానా ఇంట్లోని ఫలానా హీరో ఇలా చేశాడని మీ ఇరుగుపొరుక్కీ వాళ్ళకీ వీళ్ళకీ చెప్పేననుకోండి సర్ చాలా చీప్‌గా ఇన్సల్టింగ్‌గా వుంటుంది సర్... ప్లీజ్ సర్. ఈ ఒక్క సారికీ తీసుకోండి... హీరోలాంటి మీరిలా ఎదుట లేని మీ ఆవిడకి భయపట్టం ఏం బావోలేదు సర్.."

ఆ చివరి ముక్క అతడి మీద బాగా పనిచేసింది.

'ఇజ్జత్‌కీ సవాల్' అన్పించింది.

రకీమని లేచి నూటయాభై ఆమె చేతిలో పెట్టాడు.

"థాంక్యూ సర్.. నెక్ట్స్ మంత్ వస్తాన్సర్.."

"వద్దొద్దు రావద్దు..."

"మీకు నచ్చితేనే కొందురుగాని సర్..'

"నాకు నచ్చదు గాని రావద్దు రావద్దు.."

అదోలా చూసి వెళ్ళిపోయిందామె.

శ్రీలక్ష్మికి ఎలా చెప్పడమా అని ఇదవుతోంటే చిన్న బేగ్‌తో వచ్చిందామె. హెయిరాయిల్ సీసాల్నీ సెంటు సీసాల్నీ చూసి గతుక్కుమంది.

దగ్గరికెళ్ళి పరీక్షగా చూసి "హెయిరాయిలెందుకు కొన్నారు?" అనడిగిందామె.

"అవి కొంటే సెంటు సీసాలు ఫ్రీ అని.." నీళ్ళు నమిలాడు.

"సెంటు సీసాల కోసం వాటిని కొన్నారన్న మాట"

"వూహు. అవి కొంటే ఇవి ఇచ్చారు"

"ఇవి ఫ్రీగా ఇస్తున్నారని అవి కొన్నారన్న మాట"

"అహ. హెయిరాయిల్ కొన్నానని సెంటు సీసాలు ఫ్రీగా ఇచ్చారు"

"మనం శుభ్రమైన కొబ్బరి నూనె వాడతాం కదా. అవెందుకు కొన్నారు"

"సెంటు సీసాల కోసం"

"సెంటు వాసన నాకు ఎలర్జీ కదా. ఎందుక్కొన్నారు..?"

"సెంటు సీసాల కొన్లేదే వూరికే ఇచ్చారు"

"ఉచితంగా ఇస్తున్నారని ఏవీ కొనకూడదని లెక్చరిస్తూంటారుగా"

"అప్పుడప్పుడూ కొనొచ్చు. ఇంక లెక్చర్లివ్వను. లెంప లేసుకుంటున్నాను"

"హమ్మయ్య బ్రతికించారు. ఇంకా మీరేమంటారోనని హడలి ఛస్తున్నాను"

"నేనేమైనా అనే పని చేశావా ఏవిటి ఖర్మ!"

"ఇందాక మనోరమా వాళ్ళింట్లో మాట్లాడుతోంటే ఎవడో వచ్చి నన్ను ఇంటర్ వ్యూ చేశాడు. బావోదని కొన్నాను"

రెండు హెయిరాయిల్ సీసాలూ, రెండు సెంటు సీసాలు బ్యాగ్‌లోంచి బయటికి తీస్తూ అంది శ్రీలక్ష్మి.

"ఎంతకి కొన్నావ్?" ఏడుపు మొఖంతో అడిగాడు.

"రెండు వందలు చెబితే బేరమాడి వందకి కొన్నాను. మీరు?"

"యాభైకి కొన్నాను. నేనెలాగైనా గ్రేట్ కదా" ఠకీమని అబద్ధమాడేశాడు.

"ఏం కాదు. మీరు కొన్నది సెకండ్ క్వాలిటీది అయి వుంటుంది. అదైతే యాభైకే ఇస్తానని అన్నాడు. మేం క్వాలిటీ సరుకే కొంటాం అన్చెప్పి ఇవి కొన్నాను..."

తెల్లమొఖం వేశాడు బ్రహ్మానందం!

* * *

**(ఆంధ్రభూమి వారపత్రిక 1.6.2000)**

# ఇ-హిహి

రక్తవర్ణం మీద 'అర్జంట్' అన్న నల్లటి అక్షరాలు గల ఫైలునందుకుని తాడు విప్పి ఫైల్లోకి చూసిన చందాలరెడ్డి నుదురు ముడిపడింది.

కాంట్రాక్టరు పేరు చూసి క్రింది పెదవి కొరుక్కున్నారు. క్రింది ఆఫీసర్ల ఫేవరబుల్ రిమార్కులు చూసి గమ్మునుండి పోయారు కాస్సేపు.

ఇక్కడో ముక్క చెప్పాలి.

చందాలరెడ్డి పేరు విన్నవాళ్ళు ఇదేం పేరని నవ్వుకుంటారు. ఆయన్ని బాగా ఎరిగిన వాళ్ళు ఆయన తల్లిదండ్రుల ముందు చూపుని ప్రశంసిస్తూంటారు. మరి కొందరు మాత్రం అది ఆయన అసలు పేరా లేక వాడుక పేరా అని సందిగ్ధంలో పడుతూంటారు.

చందాలరెడ్డి తండ్రి గారికి భవిష్యత్తు చదవగల విజ్ఞానం వగైరా వున్నాయో లేవో తెలీదు గాని చందాలరెడ్డి పుట్టినప్పుడు జరిగిన ఓ చిన్న సంఘటనే ఆయన తండ్రి చేత ఆ పేరు పెట్టించింది.

మరేం లేదు. చందాలరెడ్డి తల్లి నొప్పుల్తో రెండు రోజులు బాధపడ్డా పురుడు రాలేదు. అదేవిటబ్బా అని అంతా తలలు బ్రద్దలు గొట్టుకొంటోంటే దేవాలయ స్థాపనార్థం ఎవరో చందాకొచ్చారు. దైవకార్యం గనుక లేదని చెప్పలేక చందాలిచ్చి లోపలికొచ్చారో లేదో కేర్‌మని పసివాడి ఏడ్పు విన్పించింది గదిలోంచి.

దాంతో ఆ పిల్లాడికి చందాలరెడ్డి అని పేరు పెట్టేశారాయన.

చందాలరెడ్డి కూడా చందాలివ్వటం లోనూ పుచ్చుకోవటం లోనూ కూడా సవ్యసాచి, సార్థక నామధేయుడు అన్పించుకోవడమే గాక గబగబా నిచ్చెన మెట్లన్నీ ఎక్కి ఇప్పుడో ప్రభుత్వ రంగ సంస్థ యం.డీ. అయి కూర్చున్నారు.

సిగరెట్టు దమ్ము గట్టిగా లాగి వదుల్తూ మళ్ళీ ఫైలు పరిశీలించారు.

మూడు లక్షల కాంట్రాక్టుని స్వాహారావుకివ్వడం గురించి ఫైనల్ నిర్ణయం తీసుకోడానికి సంబంధించిన ఫైలది. క్రింది నుంచి పై వరకూ ఆఫీసర్లందరూ ఆమోదించ మంటూ రాయటమే కాదు ఎక్కడా చిన్న లొసుగు కూడా లేకుండా పకడ్బందీగా తయారు చేశారు.

తన ఆదాయాన్ని దెబ్బ తీయ్యడానికి తన సంస్థలోని వాళ్ళంతా కుట్ర చెయ్యటం లేదు కదా అని ఇదయ్యేరో క్షణం.

ఎంచేతంటే. ఆర్థిక సంబంధమైన ప్రతి పనిలోనూ ఆర్థిక లాభం చూసుకోవడం ఆయన లక్షణం – పాలసీ. ఆ సంగతి ఓపెన్ సీక్రెట్ గనుక ఆయన వాటాని సీల్డ్ కవర్లో అందజేస్తూంటారు.

కానిప్పుడా సంప్రదాయానికి బ్రేక్ పడింది. చిన్నదో చిటికెదో అయితే పోనీలే అనుకునేవారేమో కాని మూడు లక్షల కాంట్రాక్ట్ అంటే దాదాపు ముప్పై వేలు ఆదాయం రావాల్సినమాట!

ఇంకేం ఆలస్యం చెయ్యకుండా not approved (ఆమోదించలేదు) అని పర పరా రాసేసి సంతకం బరికేశారు చందాలరెడ్డి.

ఫైలునో పక్కకి విసిరేసినా విసుగూ కోపం తగ్గలేదు. అసంతృప్తీ బిపీ కూడా ఒక దానితో ఒకటి పోటీ పడసాగాయి.

ఇక వుండలేక ఆఫీసు నుంచి బయటపడి బార్ కెళ్ళి స్కాచ్ కొట్టి ఇంటికెళ్ళి పడుకుండి పోయారు.

ఆ మర్నాడూ ఆ మర్నాడూ కూడా ఆఫీసుకి రాలేదాయన.

చందాలరెడ్డిని తృప్తి పరచక పోతే తన ఫైలు తిరిగొచ్చేస్తుందని అర్థమైపోయింది స్వాహారావుకి. ఇంకో క్షణం కూడా వృధా చెయ్యకుండా ఆయనింటికి పరుగెట్టాడు.

"తిరుపతెళ్ళేను సార్ అందుకే తమ దర్శనం వెంటనే చేసుకోలేకపోయాను" అంటూ చిన్న నగల పెట్టె ఆయన ప్రక్కన పెట్టాడు స్వాహారావు.

"అలాగా....." అంటూ కొంచెంగా నగల పెట్టె తెరచి చూశారు చందాలరెడ్డి. డైమండ్ నెక్లెస్. దాని ఖరీదు అంచనా వేస్తూ "నీ ఫైలు మీద నాట్ అప్రూవ్డ్ అని రాసేశానోయ్" అన్నారు ఇబ్బందిపడ్తూ.

"తమరు తల్చుకుంటే.... ఇ ఇహ్హిహ్హి..." అని చిన్నగా నవ్వేడు స్వాహారావు.

చందాలరెడ్డి గారి బుర్రలో ఫ్లాష్‌లా వెలిగిందో ఐడియా.

"చూద్దాంలే" అనేసి గబగబా షేవింగ్ చేసుకుని సూట్ వేసుకుని ఆఫీసు కెళ్ళారు.

స్వాహారావు ఫైలింకా తన టేబుల్ మీదే వుండటంతో దాన్నందుకుని not ప్రక్కన e జేర్చారు.

Note approved అన్న అక్షరాల వంక చిర్నవ్వుతో చూశారు చందాలరెడ్డి.

* * *

**(ఆంధ్రజ్యోతి వారపత్రిక 6/5/1983)**

# అది చిత్రం! ఇది విచిత్రం!

**"భ**లే మంచిరోజు పసందైన రోజు....."

హేపీగా పాడుకుంటూ మల్లెపూల పొట్లాన్ని స్వీట్సు పాకెట్నీ వూపుకుంటూ ఇంట్లో ప్రవేశించబోతూ గతుక్కుమన్నాడు సూరిపండు.

లోపల్నుంచి రమాప్రభ వాక్ప్రవాహం అక్షరాలా ఎగిరివస్తోంది.

ఆవిడ లత పిన్నిగారమ్మాయి. వచ్చిందంటే జీళ్ళపాకంలా ఓ పట్టాన వదల్దు. కదల్దు. పై పెచ్చు ఎదుటి మనిషిని గాలి తీసిన బుడగని చేసి ఆడుకోవడం ఆవిడకి సరదా హాబీ!

"పొద్దున్నే లేచి ఎవడి మొహం చూశానో..." అనుకోబోయి మింగేశాడు అద్దంలో తమ మొహమే చూసుకున్నానని గుర్తొచ్చి.

"హాయ్ రమా! ఎంత సేపయిందొచ్చి" ఆముదం తాగుతున్నట్టు మొఖం పెట్టి అన్నాడు.

"నీ ఎక్స్‌ప్రెషన్స్‌కీ, డైలాగుకీ పొంతన కుదర్లేదు. డబ్బింగ్ సినిమాలా వుంది"

"ఇహ్హిహ్హి....."

"ఎవిటలా చిక్కిపోయావ్" మళ్ళీ తనే అంది.

"నేనెక్కడ చిక్కేను? కొంచెం బొజ్జ కూడా వచ్చింది చూడు"

"నీ మొఖం. నీకు బొజ్జేమిటి? కనీసం మూడు కేజీల బరువు తగ్గి వుంటావ్. కదా లతా"

"నువ్వు చెప్పేవంటే నిజమే అయ్యుంటుంది" తాళం వేసింది సూరిపండు భార్య లత.

"వూహు – బరువు పెరిగేను"

"నీకేం తెలీదు. మొఖం కొంచెం పీక్కుపోయింది. చేతి కండరాలు వేలాడుతున్నాయి. చొక్కా లూజయింది. ఫాంటు మరీ లూజయింది. తేల్చి తేల్చి అడుగులేస్తున్నావు కదూ ఖచ్చితంగా మూడు కేజీల బరువు తగ్గేవు" అన్నీ పట్టుకుని చూపిస్తూ మరీ చెప్పింది రమాప్రభ.

ఇంకా ఆర్గ్యూ చేస్తే జుట్టుపీకి ఒప్పిస్తుందేమోనన్పించి వెర్రినవ్వు నవ్వేడు సూరిపండు.

"మల్లెపూలు తెచ్చేవా? నాకెంతో ఇష్టం. ఎన్ని మూర లేమిటి?" పొట్లం లాక్కుంటూ అడిగింది.

"మూడు మూరలు. మూర రూపాయి"

గబగబా కొలిచింది. "రెండు మూరల బెత్తెడుంది. ఎలా మోసపోయావో చూశావా? ఒక మూర అంటే రూపాయి నష్టం. మరీ ఇంత వెర్రిబాగుల వాడివైతే ఎలాగా!"

ఆ మాటలకి గిలగిల తన్నుకున్నాడు పండు.

"పూల దగ్గరా గాజుల దగ్గరా ఆ మాత్రం మోసాలు జరుగుతాయి. వాటిల్లో వచ్చే నష్టాలు అలాటివి మరి"

"చాలు చాల్లే. మోసపోయింది గాక వెధవ సమర్ధింపొకటా! మీ ఆయనకి నీ ట్రైయినింగు చాలదు లతా. వాడిన పూలు తెచ్చాడు చూడు. పైగా దండని సాగదీసి ఇతగాడ్ని బురిడీ కొట్టించాడు" అంటూనే దండని జడలో ముడుచుకుంది.

"అదేవిటి? స్వీట్సు పాకెట్టా?"

"ఆ... అవును" అంటూ అందిచ్చి లోపలికెళ్లబోతోంటే, "ఏం తెచ్చావో చూడనీ" అంది.

లత మంచినీళ్లు తెచ్చివ్వగా ఒక్క గుటకలో తాగేశాడు.

"బందరు లడ్డూలా" అంటూ ఒకటి కొరికింది. "అబ్బే ఏమంత బావోలేదు. కొంచెం గట్టిగా వున్నాయి. ఇవాళ చేసిన తాజా సరుకు కాదు. తీపి కూడా కొంచెం తక్కువే..."

"నేను చెయ్యలేదు' జోకు వేసినట్టు నవ్వేడు.

"నీకేదీ చేతకాదని తెలుసులే గాని కొనేముందు రుచిచూసి కొనొద్దూ. నీకన్నా పల్లెటూరి వాళ్ళు నయం!"

మళ్ళీ వెర్రిగా నవ్వి ఏదో పనున్న వాళ్ళా హడావిడిగా గదిలో కెళ్ళిపోయాడు.

"ఏవిటే రమా. మా ఆయన్ని నిలువునా నంజుకు తినేస్తున్నావేంటే" అడిగింది లత.

"ఈ మగాళ్ళకి తాము గొప్ప వాళ్ళమన్న ఫీలింగు వుంటుంది లేవే. అప్పుడప్పుడూ ఇలాటి చిన్న చిన్న జెల్లకాయలిస్తే సరైన దార్లో నడుస్తారు. మీ ఆయన సరిగ్గానే వుంటున్నాడా వెర్రిమొర్రి వేషాలేస్తున్నాడా?"

"ఆయనలాటి వారు కాదు. శ్రీరామచంద్రుడనుకో"

"మగాళ్ళని నమ్మకూడదే. నమ్మినట్టు నటిస్తూనే ఎప్పుడూ ఓ కంట కని పెడుతూండాలి. ఆ మధ్య సినిమాల్లో ఇద్దరు పెళ్ళాల గోల ఎక్కువైందగ్గర్నుంచి ప్రతివాడూ రెండో సెటప్ కోసం వువ్విళ్ళూరుతున్నాడు. జాగ్రత్త"

"నువ్వొచ్చి వెళ్తే చాలు నట్లూ బోల్టులూ గట్టిగా బిగించినట్టు బిగుసుకుపోరూ!" నవ్వింది లత.

ఆమె టీ కలపడానికి కిచెన్లోకెళ్ళగా రమాప్రభ పండు గదిలోకి తొంగి చూసింది.

"ఎక్కడ్నుంచో నిన్ను చూడాలనొస్తే మాటలూ పాటలూ లేకుండా గదిలో దూరా వేంటి!" గదిలోకెళ్తూ అంది.

"అహహ ఏం లేదు. వస్తున్నా గానీ రమా – నేన్నీకన్నా రెండు నెలల పదిరోజులు పెద్ద వాడ్ని కదా. మరీ బావగారన్న గౌరవం కూడా లేకుండా నువ్వు నువ్వు అంటే ఏం బావుంటుంది చెప్పు?"

"నెలలు నిండకుండానే పుట్టావు గనుక కొంచెం పెద్దోడివయ్యావు. ఆ మాత్రానికే పెద్దరికం రాదు"

నుదురు కొట్టుకున్నాడు.

గదిని పరికించి చూస్తూ "నీ టేస్ట్ ఏం బావోలేదు. బెడ్‌రూం గోడలకి దేవుళ్ళ కేలండర్లూ బీరువాలో వెండి సామాన్లూనా? ఛ్ఛ పూర్ టేస్ట్" పెదవి విరిచేసింది రమా ప్రభ.

"ఇదంతా లతే అలంకరించింది" సంజాయిషీ ఇస్తున్నట్టు అన్నాడు.

"అయితే మాత్రం నువ్వు చెప్పుకోవద్దూ. నీ బుర్రేమైపోయిందీ. బెడ్‌రూం రొమాంటిగ్గా వుండాలి. ఆనందం, ఆహ్లాదం చిందులేసేలా వుండాలి అని నచ్చచెప్పలేవూ? ఇంటీరియర్ డెకరేషన్ ఓ కళ. అది నీలాటి వారికెలా అబ్బుతుందిలే. ఏదో గుడ్డెద్దు చేలో పడ్డట్టు ఫైలు చూసి ఫైలు రాసేయమంటే రాసేస్తావు గానీ!"

పొంగి రాబోయిన నవ్వునాపుకుంటూ వచ్చి ఇద్దరికీ టీకప్పు లందించింది లత.

బేలగా రక్షించమన్నట్టు చూశాడు సూరిపండు.

"అక్కా సినిమా కెళ్దామా" లత అంది మాట మార్చడానికి.

"వెళ్తే కొత్త సినిమాకెళ్ళాలి. మీ సుద్దపప్పు క్యూలో దూరి టిక్కెట్లతో క్షేమంగా వస్తాడా లేక కాళ్ళూ చేతులు విరగ్గొట్టుకొస్తాడా?!"

"బాబోయ్. నేను సినిమాకి రాను. నాకు అర్జంటు పనుంది" చేతులెత్తేశాడు.

"నేన్చెప్పలేదూ వట్టి పిరిగ్గొడ్డు ఇంకెక్కడి హీరోయిజం! అమ్మాయిలు సినిమా కెళ్దామంటే నీళ్ళు నమిలే నంగిరిపింగిరి గాడితో నువ్వు ఎలా వేగుతున్నావో గానీ నేనైతే తెల్లారేసరికి విడాకులిచ్చేద్దును"

వెర్రిగా నవ్వుదామనుకున్నాడు గాని నవ్వు రాలేదు. వాళ్ళు చూడకుండా గోడకేసి తల కొట్టుకున్నాడు.

"టీ ఎలా వుంది?" టీ తాగుతూ అడిగింది రమాప్రభ.

ఆమె మాటలు విననట్టు టీ చప్పరిస్తూండిపోయాడు. బాగుందంటే రక్కుతుంది. బాగోలేదంటే కరుస్తుంది. ఎలాగైనా గాయాలవడం ఖాయం!

"చిన్నప్పుడు మీ అమ్మ తలంటేప్పుడు చెవుల్లో నూనె పోయలేదా?"

"ఎందుకు?"

"చెవుడు రాకుండా వుండటానికి"

"చెవిలో నూనె పోసుకోకూడదని డాక్టర్లు అంటున్నారు తెలుసా" అనబోయి మింగేశాడు.

"జడపదార్థానికి ఉదాహరణగా మీ ఆయన్ని చెప్పుకోవచ్చే"

"ఇంక చాలు గాని పద" అంటూ నవ్వుతూ బలవంతాన ఆమెని తీసుకుపోయింది. లత.

'బతుకు జీవుడా' అనుకున్నాడు సూరిపండు.

మర్నాటికి చాకిరేవు బండ మీద వుతికి నీళ్ళలో జాడించి, మెలితిప్పి, పిండి పక్కన పడేసినట్టు అయిపోయాడతడు.

ఆఫీసుకి రోజూకన్నా రెండు గంటలు ముందే వెళ్ళి సీట్లో కూలబడ్డాడు.

సాయంత్రం అంతా వెళ్ళిపోయారుగాని అతడు కదిలేలా కన్పించకపోయేసరికి ప్యూను గుండు సమీపించాడు.

"ఏంటి బాసూ – ఇంటికెళ్ళవా? ఆఫీసుకి తాళాలు వేసేయాలి"

"ఇల్లేమిటి ఇల్లాలేమిటి అంతా మిధ్య, మాయ!"

"ఏవయ్యిందివాళ. దూరదర్శన్ కార్యక్రమం చూశావా?"

"అనుభవాలు అనుభవించిన వాడికే తెలుస్తాయిగానీ ఇతరులకు తెలీవు"

"గొప్పగా సెలవిచ్చారుగానీ ఇక లేవండి పోదాం"

"ఎక్కడికి పోవాలి? నరకానికా?"

"అదేవిటి? బాసూ"

"జగమేమాయ బ్రతుకే మాయ....."

అతడి మొఖంలో మొఖం పెట్టి ముక్కు ఎగబీలుస్తూ వాసన చూశాడు.

"ఏం చేస్తున్నావ్?"

"కాస్త మందుపుచ్చుకున్నారేమోనని..."

"మందు బాబులా కన్పిస్తున్నాన్రా?"

"వుంటే కొంచెం పొయ్యండి సార్ ఈ మధ్య తాగనేలేదు"

"నీ బాధ నీది. నా బాధ నాది. కాని ఆవిడ బాధా నాదేనే ఖర్మ!"

"ఆవిడెవరు బాసూ? ఇంటావిడా?"

"దానికేంరా నెంబర్‌వన్ పతివ్రత. రమాప్రభ అని చుట్టాలమ్మాయి వచ్చిందిలే. క్షణ క్షణం మాటమాటకీ మాటల్తో చిత్రవధ చేసేస్తూ ఒళ్ళంతా కుళ్ళ బొడిచేస్తుందనుకో. అక్షరాలా ఆడ వస్తాదు అంటే నమ్మ. ఇంటికెళ్ళాలంటే వణకొస్తోంది. వైరాగ్యమూ వస్తోంది"

"ఎట్టెట్టా! ఏమంటారేమిటి...?"

"నన్ను చెల్లని కానీలా తీసిపారేస్తుంది. మెత్తని కత్తితో కైమా కొట్టేస్తుంది"

"అయితే మరో ఆడ అస్త్రాన్ని ప్రయోగించాల్సిందే బాసూ. మీరు నిశ్చింతగా వుండండి. ఈ రాత్రికే పారిపోయేట్టు చేస్తాను. మరి నాకు క్వార్టర్ బాటిల్....." పెదాలు తడుపుకుంటూ అన్నాడు గుండు.

"క్వార్టరేమిటి ఆవిడ్ని తరిమేస్తే హాఫ్ బాటిలూ చికెన్ బిర్యానీ సమర్పించుకుంటాన్రా. కానది నీకు సాధ్యమా అని. నీక్కూడా గుండు కొట్టించి పంపించగల దేవాంతకురాలు. మహాకంత్రీ!'

"మా ఇంటిపేరే గుండు. మా ఆడశక్తి ప్రతాపం మీరే చూస్తారుగా"

"త్వరగా వచ్చెయ్యాలి మరి...'

"ఇలా వెళ్ళి అలా తీసుకురానూ"

కాస్త మనశ్శాంతిగా అన్పించింది సూరిపండుకి. అయినా తిన్నగా ఇంటికెళ్ళే సాహసం చేయలేదు. కాసేపు పార్కులో దొర్లి తాపీగా ఇంటికెళ్ళాడు. సరిగ్గా అప్పుడు గుండూ. అతడి భార్యా మోపెడ్ దిగారు.

"వీరే మా జూనియర్ ఆఫీసర్. ఈమె మా ఇంటిది. పేరు సరళ" పరిచయం చేశాడు గుండు.

"నమస్కారం సారూ"

ఆవిడ స్వరమాధుర్యానికి అదిరిపోయాడు పండు. ఇంత నోరు చేసుకుని తిప్పుకుంటూ మాట్లాడేసరికి ఏవిటోగా అన్పించింది.

తనవంక అదోలా చూసే సరికి అదిరిపోయి "రండి రండి" అంటూ ఇంట్లోకి దారి తీశాడు.

పకోడీలు తింటూ కబుర్లు చెప్పుకుంటున్నారు లతా, రమాప్రభానూ.

"నువ్వెక్కడెక్కడో దొర్లి వచ్చేదాకా నీకోసం వండిన పకోడీలు వుంటాయేవిటి. మేమే తినేస్తున్నాం" పండుతో అంది రమాప్రభ.

ఆవిడ మాటలు పట్టించుకోలేదతడు

ఫోజు కొడుతూ నవ్వి "వీరు మా కొలీగూ అతడి భార్య సరళానూ" అంటూ పరిచయం చేశాడు.

లత లేచి పలరింపుగా నవ్వి ఆహ్వానించింది. కాని ఆసరికే సరళ వెళ్ళి వాళ్ళ పక్కన కూర్చుని ప్లేటు లాక్కుని మరీ పకోడీలు తినసాగింది.

"శానా బాగుండాయి. ఇంకా వుంటే పట్రండి..."

అదిరిపడి చూసింది లత.

ఆవిడ ధోరణికి రమాప్రభ కూడా విస్తుపోయింది. ఏదో అనమని నోరు దురద పెట్టింది గానీ గెస్ట్సు కదాని అణచుకుంది.

వాళ్ళు ఆశ్చర్యం నుండి తేరుకునేసరికి ప్లేటు ఖాళీ అయిపోయింది.

"నీళ్ళు నీళ్ళు"

గబగబా తెచ్చిచ్చింది లత.

సూరిపండూ, గుండూ వినోదం చూస్తున్నట్టు చూస్తూ కాస్త ఎడంగా సోఫాలో కూర్చున్నారు.

సరళ దృష్టి లత జడకి పెట్టుకున్న రంగుల హెయిర్ బాండ్ మీద పడింది.

"అరె బాగుందే..." అంటూ లేచి వెళ్ళి ఠక్కున లాగి తన జడకి పెట్టేసుకుంది.

పక్కనే వున్న అద్దంలో చూసుకుని మురిసిపోతూ "ఎట్టాగుంది" అని అడిగింది పండుని.

"బ్రహ్మాండం. నీకు చాలా బాగుంది" అని గుండూ, "ఫెంటాస్టిక్" అని సూరిపండూ పొగిడేరు.

వారి ప్రవర్తన వెనుక ఏదో మెలిక, ఏదో అంతరార్థం, ఇంకేదో కుట్ర వుందని ఊహించింది రమాప్రభ.

"వత్తాసుకోసం తీసుకొచ్చినట్టున్నా వేంటి కథ" అంది పండుతో.

కానతడు విన్పించుకోనట్టు గుండుతో కబుర్లలో పడ్డాడు.

లతకి మాత్రం అంతా అయోమయంగా వుంది. అతిథులని గౌరవించాలో అక్కర్లేదో తోచక బిత్తరి చూపులు చూస్తుండిపోయింది.

ఇంతలో పక్కింటి వారమ్మాయి ఏదో అడగడానికొచ్చింది. ఆమె నుదుట కొత్తరకం బొట్టు బిళ్ళ వుండటం చూసి "భలే బాగుందే" అంటూ వెళ్ళి చొరవగా దాన్ని తీసి తను పెట్టేసుకుంది సరళ. అద్దంలో చూసుకుని సంబరపడిపోయింది.

"బాగుంది. జిగురుండాది. పాకెట్టు ఎట్టా కొన్నావ్?"

"ఆర్రూపాయలు"

"నయమే"

మరేమన్పించిందో లేక కొత్తవాళ్ళున్నారనో వచ్చిన సంగతి చెప్పకుండానే వెళ్ళిపోయిందా అమ్మాయి.

సరళ చూపులు రమాప్రభ మెడలోని నెక్లెస్ మీద పడ్డాయి. "ఈ డిజైన్ బాగుందే. అన్నీ రాళ్ళేనా"

చొరవగా లాక్కోబోతుంటే తనే తీసిచ్చింది

దాన్ని మెడలో వేసుకుని అద్దంలో చూసుకుంది. అటూ ఇటూ తిరిగింది. గుండుకి చూపించింది.

“ఏమీ అనుకోకండి. ప్రతీది స్వయంగా చూసి ధరించి గాని దేన్నీ మెచ్చుకోదు మా ఆవిడ” అన్నాడు గుండు.

నెక్లెస్ తీసిచ్చేసింది. రమాప్రభ కట్టుకున్న చీర అంచు డిజైన్ చూసి ఎగిరి గంతేసింది సరళ.

“బాగుందాదే. కుచ్చిళ్ళు బాగా వచ్చాయి. ఎన్ని గజాలుందో కొలుస్తానుండు” అంటూ కొంగులాగి గబగబా మూరల్తో కొలవబోయింది. రమ లాక్కుంది. సరళ వదలకుండా గట్టిగా లాగే సరికి చీర వూడి వచ్చింది. గబుక్కున చీరని చిక్కించుకుని గుండెలు కప్పుకుని గదిలోకి పారిపోయింది రమాప్రభ.

“ఆమెకి సిగ్గెక్కువనుకుంటా. చీర చూస్తావుంటే పారిపోతాందేంటి!”

“చీర సాంతం విప్పి చూస్తానంటే ఎలాగా” కోపంగా అంది లత.

“చూడందే ఎలా తెలుస్తుందబ్బా. అరె నీ జాకెట్టు డిజైన్ కొత్తరకంగా వుందే. మనిద్దరిదీ ఒక్కటే సైజు. తొడుక్కుని చూస్తానుండు...” అంటూ లత జాకెట్ హుక్స్ మీద దాడి చేసింది సరళ. దాంతో కెవ్వున అరచి లత కూడా గదిలోకి పారిపోయింది.

“మీ ఆడోళ్ళు భలే చిత్రంగా వున్నారే” అంది పండుతో సరళ.

“రెండ్రోజులుంటారు కదా. మా ఇంట్లో ఎన్ని విచిత్రాలున్నాయో చూద్దురు గాని” అన్నాడు సూరిపండు రమాప్రభకి వినిపించేలా.

అతడి మాటలు చెవిన బడటం ఆలస్యం “నేనీ రాత్రికే జెండా ఎత్తేస్తాను బాబూ” అనేసింది రమాప్రభ.

“మనం వచ్చిన పనయింది. వెళ్దాం పద” లేస్తూ అన్నాడు గుండు.

“చాలా థాంక్స్” అన్నాడు సూరిపండు హుషారుగా హీరోలా కల తిరుగుతూ.

“ఇంత స్టైలుగా తిరుగుతూండారంటే విఐపి ధరించారా? చూడనీండి...”

ఆమె మీది మీది కొస్తోంటే, “బాబోయ్’ అంటూ అంతర్ధానమయ్యాడు సూరిపండు!

* * *

**(మయూరి వారపత్రిక12/5/2000)**

# దాసోహం

"**కా**మధేనువు లాంటి ఆఫీసులో పాడికుండ లాంటి ఒకే ఒక పోస్టుకి అయిదుగురు అభ్యర్థుల్ని పంపుతున్నాం. కాల్ లెటర్ ఖరీదు అయిదొందలు" గట్టిగా సిగరెట్టు దమ్ములాగి వదుల్తూ అన్నాడు ఎంప్లాయిమెంటు సుబ్బారాయుడు.

ఎంప్లాయిమెంటు అన్నది అతడి ఇంటి పేరు కాదు వృత్తి పేరు.

అలా అని అతడే ఎంప్లాయ్‌మెంట్ ఎక్ఛేంజిలోనూ వుద్యోగం వెలగబెట్టటం లేదు గాని వాటిలో ఏపనైనా ఎలాటిపనైనా అతడు బట్ట నలక్కుండా చేసేస్తాడు.

ఫారెన్ విస్కీ సీసాకి, మదవతి నగ్న శరీరానికి, గుప్పెడు నోట్లకి దేశ కీల రహస్యాల్ని విదేశాల కందించగల పెద్దమనుషులున్నంతకాలం సుబ్బారాయుడు లాంటి వారి పని నల్లేరు మీద బండిలా అతి సునాయాసంగా అయిపోవడంలో విచిత్రం ఏమీలేదు.

పార్టీ అధినాయకుడి ముందు పార్టీ టిక్కెట్టు కోసం నిలబడ్డ వాళ్ళలా అతగాడి ముందు నిలబడ్డ ఎనిమిది మంది కుర్రాళ్ళూ నమ్మ లేనట్టుగా చూశారు. వాళ్ళలో ఎవ్వరూ కూడా వెయ్యిలోపు సొమ్ముకి ఎంప్లాయ్‌మెంట్ కాల్ తెచ్చుకోలేక పోయారింత వరకూ!

"అంతకారు చౌకంటే ఉద్యోగం ముందే రిజర్వు అయిపోయిందంటారా గురూ గారూ" అడిగాడో శిష్యపరమాణువు.

"లేదులేదు – సంబంధిత అధికారి మాత్రం నిప్పులాంటి మనిషి అతడి మీద ఏ అస్త్రాలూ పనికిరావు. ఆపైన మీ అదృష్టం మరి"

బుర్ర గోక్కుంటూ ఒకరూ గొణుక్కుంటూ ఒకరూ ఆవేశంతో ఒకరూ నిష్క్రమించారు.

మిగిలిన అయిదుగురూ అటూ ఇటూ వూగారు.

వాళ్ళంతా మెరిట్ వున్న వాళ్ళే. చక్కని విద్యార్హతలు గల వాళ్ళే. అయినా వాళ్ళనే ఉద్యోగమూ వరించడం లేదు. ఎప్పుడేదారిన వచ్చి మెడలో వరమాల వేస్తుందోనన్న ఆశ వాళ్ళని ఆశ పెట్టడమూ మాన్లేదు.

"నాకు పంపించండి" ఒకతనన్నాడు తెగించి.

ఆ వుత్తర క్షణాన మిగతా వాళ్ళూ ఎడ్వాన్సిచ్చేశారు.

ఏరకంగా ప్రయత్నిస్తే ఆ ఉద్యోగం వస్తుందోనని పథకాలేసుకుంటూ వాళ్ళు బయటి కెళ్ళిపోతోంటే ఒకరికి సైగ చేశాడు సుబ్బారాయుడు.

మిగతా వాళ్ళు చూడకుండా తిరిగొచ్చాడతడు అమితాశ్చర్యంగా.

అందర్లోనూ తననే ప్రత్యేకంగా పిలిచినందుకు మరింత ఆశ్చర్యంగానూ నమ్మశక్యం గాకుండానూ వుందతడికి.

"అయిదు వేలిస్తే ఆ వుద్యోగపు సీట్లో నువ్వు కూర్చుంటావు"

తన చెవుల్ని నమ్మలేకపోయాడతడు. కొంచెం గిల్లి చూసుకుని, "ఆఫీసరు పరమ రూల్సు మనిషన్నారు....." అన్నాడు సందేహంగా చూస్తూ.

"అవున్నిజమే. పరమస్ట్రిక్టు మనిషి"

"మరి పని....."

"అది నాకొదిలి పెట్టు. రెడీయేనా?'

"రెడీయే"

"ఇంక నిశ్చింతగా నిద్రపోయి త్రీడీ కలలు కను"

* * *

ఓ కుర్రాడు అసెంబ్లీ ఎన్నికల్లో నిద్రాహారాలు మాని ప్రచారం చేసిన చిన్నవాడు చెప్పులరిగేలా యమ్మెల్యే గారింటి చుట్టూ తిరిగి తిరిగి పదిమంది చేత కూడా చెప్పించి ఎలాగైతేనేం యమ్మెల్యే గార్ని తీసుకుని సదరు ఆఫీసు కెళ్ళి ఆఫీసరుగార్ని కలిశాడు.

"మీరొచ్చిన పనేమిటో త్వరగా చెబితే బావుంటుంది" నిర్మొహమాటంగా అన్నాడా ఆఫీసరు.

"మన పద్ధతీ అంతే. సూటి ఎవ్వారవే గాని సాటు ఎవ్వారం గాదు. ఏంటి" అని నవ్వేరు యమ్మెల్యే గారు "మనాఫీసులో చిన్న కుర్సీ ఖాళీ గుందంట అందులో మావోడ్ని కూర్సో బెట్టాలి ఏంటి'

దిమ్మెర పోయినట్టు ఫీలింగ్సు పెట్టి అన్నాడు "ఎంప్లాయిమెంట్ ఎక్సేంజీకి రాశాం. ఎవరెవరి పేర్లు పంపుతారో తెలీదు"

"మావోడి పేరుంది లేవయ్యా ఏంటి. మిగతా కథ సెప్పు"

"ఇంటర్వ్యూలో ఎవరెక్కువ మార్కులు తెచ్చుకుంటే వాళ్ళని సెలక్టు చేస్తాం"

కుండపగిలినట్లు నవ్వేరు యమ్మెల్యే గారు "వొడ్డించేవోడు మనోడైతే ఏంటి ఏ మూల్న కూకున్నా నస్టం లేదు. ఏంటి మనోడని బొట్టెట్టేక నాలుగు మార్కులెక్కు వెయ్యాలి. కుర్సీలో కూర్సో బెట్టాలి. ఏంటి"

"మీ లాంటి ప్రజా నాయకులిలా అడ్డదార్లు తొక్కడం బావోలేదు"

"సూడు ఆఫీసరూ, నాను దేశానికంతటికి లీడర్నికాను. నా నియోజక వర్గంలో జనం సల్లగా వుంటే శాన. ఆళ్ళ ఓట్లు నాకూ నా కుటుంబానికీ పడితే శాన. ఏంటి ఆళ్ళ ఓట్లు పడాలంటే నేనేదో సెయ్యాలి గదా. ఏదో సెయ్యాలంటే ఏవో పాట్లు పడాలి గదా ఏంటి?"

"క్షమించండి ఇంటర్వ్యూలో ప్రతిభ కనబర్చిన వాడ్ని సెలక్ట్ చేసుకుంటాన్తప్ప మరింకే ఒత్తిడికీ నేను లొంగను" మొండిగా అన్నాడు.

"యవ్వారం హయిదారాబాదెళ్ళి పోద్ది మరి"

"వెళ్ళనివ్వండి"

"మంత్రిగారు మండిపోతారు. ఆనక తవఁరు చాపా మూటా సంక నెట్టుకుని పోవాలి సింతలపూడి అడువుల్లోకి. ఏంటి"

"చూడండీ మీరు ఢిల్లీ వెళ్ళినా మరింకెవరి చేత ఎంత ఒత్తిడి తెచ్చినా నేను వినను, లొంగను. రూల్స్‌నతిక్రమించను. మీరింక వెళ్ళొచ్చు"

"సూత్తాను. ఏంటి నువ్వు పట్టుకున్న కుందేలికి మూడేకాళ్ళయితే నేను పట్టుకున్న దానికి రెండే కాళ్ళు. ఏంటి అదీ సూత్తానయ్యా" అని రోషంగా వెళ్ళిపోయాడాయన

ఉసూరు మంటూ అనుసరించాడు కుర్రాడు.

* * *

ఇంకో యువకుడు చిరిగి మాసిన బట్ట లేసుకుని దేవదాసులూ గెడ్డం పెంచి ఆ ఆఫీసరు ఇంట్లోంచొచ్చి జీపు ఎక్కబోతోంటే అమాంతం వెళ్ళి కాళ్ళ మీద పడిపోయాడు.

"ఏయ్ ముష్టోడా దూరం..... దూరంగా వుండు..."

"అవున్సార్. నేను ముష్టోడ్నే సార్. ఉద్యోగం అడుక్కోడానికొచ్చాసార్. నా మీద రోగిష్ఠితల్లీ అవిటి తండ్రీ ఆధారపడి వున్నార్సార్. పెళ్ళి కెదిగిన ముగ్గురు చెల్లెళ్ళూ చాలీచాలని బట్టల్తో బ్రతుకులీడుస్తోన్న ఇద్దరు తమ్ముళ్ళూ వున్నార్సార్. వాళ్ళందరికీ నేనే ఆధారం సార్. నేను సంపాదిస్తే వాళ్ళు పచ్చడి మెతుకులు తినగలర్సార్. మీరు నాకుద్యోగం ఇవ్వకపోతే మూకుమ్మడిగా ఆత్మహత్య చేసుకొని చచ్చిపోతాం సార్" అన్చెప్పి బావురుమన్నాడు.

"ష్... ఐ హేట్ యూ యంగ్ మేన్. నీలాంటి వాళ్ళంటే నాకసహ్యం. దేశం నీకేమిచ్చిం దని కాదు దేశానికి నువ్వేమిచ్చేవని ఆలోచించి ముందడుగు వెయ్యాల్సిన యువతరం ఇలా నిర్వీర్యమైపోవడం దారుణం. నువ్వేమిటో నీ శక్తేమిటో తెలుసుకో మిస్టర్. గుప్పెడు మెతుకులు సంపాదించుకోడానికి డిగ్రీలక్కర్లేదు" అని జీపెక్కి వెళ్ళిపోయాడాయన దుమ్మునా యువకుడి కళ్ళల్లో పోసి!

* * *

ఆఫీసరు మరో వూళ్ళో కేంపువేసి వుండగా చాకులాంటి వేశ్యని ఎరగా ట్రావెలర్స్ బంగళాకి పంపించాడు  మరో కుర్రాడు.

"ఎవరు మీరు?"

అదోలా చూస్తూ నవ్విందామె.

నుదురు చిట్లించాడు "మీకేం పని?"

"నాపని కాదు మీపనే"

"అంటే?"

"మీక్కావల్సినవి ఇద్దామని..." మత్తుగా గమ్మత్తుగా చూస్తూ పైట జారుస్తూ అంది.

"నిన్నెవరు పంపించారు?"

"తర్వాత చెబుతాగా"

"నీ మైకంలోపడి మర్చిపోవచ్చు గాని ముందే చెప్పునోట్ చేసుకుంటాను"

"మీ ఆఫీసులో ఇంటర్వ్యూకి హాజరవ్వబోతున్న చిన్నవాడు" అంటూ చొరవగా ఆయన్ని రాసుకుంటూ కూర్చుని వివరాలు చెప్పింది.

"ఐసీ – నీకు డాన్సు వచ్చా?"

"చేసి చూపించనా?"

"ఓ గంట సేపు చెయ్యగలవా?"

"రాత్రంతా చెయ్యగలను..."

"అరగంట చాల్లే పోలీసులు రావడానికి..." అంటూ ఫోన్ చెయ్యబోతోంటే "ఎవరికి చేస్తున్నారూ" అనడిగింది గాభరాగా.

"నీ డాన్స్ చూట్టానికి పోలీసుల్ని పిలుస్తున్నాను"

"బాబోయ్"

వెనుదిరిగి చూడకుండా పారిపోయివచ్చి చెడామడా తిట్టేసిందా కుర్రాడ్ని ఆ లలనా మణి!

* * *

వాళ్ళ కన్నా తెలివైనవాడ్నని భావించే మరో కుర్రాడు పూలూ పండ్లు ఆటబొమ్మలూ అందాల వస్తువులూ తీసుకెళ్ళి ఆఫీసరు గారి భార్యా పిల్లల్ని ఆకట్టుకోబోతోంటే ఆఫీసరొచ్చాడు.

"ఎవర్నువ్వు? ఏవిటివన్నీ?"

"ఏం లేద్సార్ పిల్లలు ఆనందిస్తారనీ....."

"ఆ మాత్రం నేను కొనగలన్లే....."

"అహ అదికాద్సార్. మిమ్మల్ని సంతోష పెడదామనీ...."

"ఈ బొమ్మల్తోనా?"

"అబ్బే – అవే కాదండి. కొంచెం బరువెక్కువేనండి...." అంటూ అయిదు వేల రూపాయలున్న కవర్ని టీపాయ్ మీద పెట్టేడు.

"నీ పనేవిటి?"

చెప్పేడు సంబరంగా.

"ఐసీ. చూడు మిస్టర్. లంచం తీసుకోవడం కన్నా ఇవ్వడం పెద్దనేరం. దేశం అథో గతిపాలు కావడానికి నీలాటి వాళ్ళే సగం కారణం. ఇంకెప్పుడూ డబ్బుతో మనుష్యుల్ని కొనాలని చూడకు. ఆ డబ్బుతో ఏ స్వయం ఉపాధి పథకం చేబట్టినా వుద్యోగంలో కన్నా ఎక్కువ సంపాదించగలవు. నలుగురికి ఉపాధి కల్పించి వుత్పత్తి పెంచడంలో తోడ్పడి దేశాభివృద్ధికి పాటుపడిన వాడివి కాగలవు"

అంతా బుద్ధిమంతుళ్ళా విన్నాడు. కాని తన పట్టు వదల్లేదు.

ఆయనొకటేమాటన్నాడు "గెటౌట్"

క్షణాల్లో తన తెచ్చిన సామాను చేతబట్టి గేటు దూకి రాక తప్పలేదతడికి!

* * *

ఆ నలుగురి కుర్రాళ్ళ విఫలయత్నాలని సుబ్బారాయుడికి వివరించి నిరాశగా నిలబడి నిట్టూర్చాడు అయిదోవాడు.

"అయితే నీకుద్యోగం గ్యారంటీ అన్నది ఋజువైపోయిందన్న మాట" చిద్విలాసంగా నవ్వేడతడు.

ఈ లాజిక్కేవిటో అర్థం కాలేదు కుర్రాడికి.

అయోమయం మార్కు మొహంతో గందరగోళంగా చూసిన ఆ కుర్రాడి బుర్రలో మెరుపు మెరిసింది.

"అంటే ఆ నలుగుర్నీ గుర్తు పెట్టుకుని వాళ్లని డిస్క్వాలిఫై చేసేసి నన్ను సెలక్ట్ చేసేస్తాడంటారు"

"చచ్చినా అలాటి పని చెయ్యడు. లిస్టుని వెనక్కి త్రిప్పేసి ఇంకో లిస్టు పంపమంటాడు"

పిచ్చిగా చూశాడు.

"పద. బ్రహ్మాస్త్రం వేస్తాను చూద్దువు గాని"

టాక్సీలో ఆఫీసరింటి కెళ్ళేరు. బెదుర్తూ వెనగ్గా వున్నాడు కుర్రాడు.

"నమస్కారం. నేను మన కులసంఘం జిల్లాశాఖకి అధ్యక్షుడ్ని. మీ గొప్పతనం గురించీ మీ కర్తవ్య పరాయణత్వం గురించీ చాలా విన్నాం. మీలాంటి వారు మన కులంలో

వున్నందున మొత్తం మన కులానికే గొప్ప తనం వచ్చేసింది. వచ్చే నెలలో జరిగే మన కుల సంఘ రాష్ట్ర సభలో మిమ్మల్ని సన్మానించి మన సంఘం తనని తాను సన్మానించుకో దలిచింది. దయచేసి మీరు కాదనకూడదు. ఇది మన రాష్ట్రంలోని మన కులస్తులందరి కోరిక. ఆకాంక్ష. దయచేసి ఒప్పుకోండి"

మందహాసం చేస్తూ తలాడించాడు.

"సంతోషం. అన్నట్టితడు మనవాడే. మీ ఆఫీసులోని ఓ ఇంటర్వ్యూకి అటెండ్ కాబోతున్నాడు. మనవాడికి మీరు కాస్త పుల్ ఇవ్వాలి. అన్ని రంగాల్లోనూ మనవాళ్ళని మనం పైకి తీసుకురావాలి. అది మన బాధ్యత"

"ష్యూర్. తప్పకుండా"

కాఫీ త్రాగేక శలవు తీసుకున్నాడు సుబ్బారాయుడు.

'ఎంతా వారలైనా కులకాంతా దాసులే లోలోన పాడుకుంటూ అనుసరించాడు కుర్రాడు పరమానంద భరితుడై గాలిలో తేలిపోతూ.

అంతా విన్న ఆఫీసరు గారి భార్య మాత్రం హడావిడిగా వచ్చి "మీరేం అభయ మిచ్చారో తెలుసా? ఏ ప్రలోభాలకీ లొంగని మీరిలా ఇంత చిన్న కారణానికి లొంగటం..... నమ్మ లేకపోతున్నాను" అంది.

"ఓసి పిచ్చిదానా. నీకో రహస్యం చెప్పనా. విదేశాల్లో వున్నప్పుడు మనదేశం వాడ్ని చూసి మన వాడని అభిమానిస్తాం. అలాగే ఇతర రాష్ట్రాల్లో వున్నప్పుడు మన రాష్ట్రం వాడని గౌరవిస్తాం. అలాగే మన భాషవాడ్నీ మన మతంవాడ్నీ మన కులం వాడ్నీ ప్రేమిస్తాం. అందులో దేశభక్తే తప్ప స్వార్థం లేదు మనవాళ్ళని కలుపుకోవడంలో సంకుచిత్వం దేశ ద్రోహం ఏమీలేవు. పైగా దేశమంటే మనుషులు – ఐమీన్ మన మనుషులు గనుక అదీ దేశభక్తి క్రిందే లెక్క" అంటూ చింకి లెక్చరిచ్చాడు ఘనత వహించిన ఆఫీసరు'

దేశభక్తికీ కొత్త నిర్వచనం ఇస్తోన్న అతడి కులపిచ్చికి 'ఔరా' అని ముక్కు మీద వేలుంచుకుంది సదరు ఆఫీసరు భార్యామణి!

* * *

**(స్వాతి సపరి వారపత్రిక 4.4.1988)**

# సిఫారసు

**కొ**త్త మంత్రివర్గం సమావేశమయింది.

ప్రధాని అధ్యక్షోపన్యాసం చేస్తూ "మనం అధికారంలో కొచ్చిన ఇరవై నాలుగ్గంటల్లో అవినీతిని అంత మొందిస్తామని వాగ్దానం చేశాం. అది నెరవేరాల్సిన బాధ్యత మన మీద ఉంది. అంచేత అవినీతి నిర్మూలనకు ఈజీ మార్గాలను సూచించాల్సిందిగా మీ అందర్నీ కోరుతున్నాను!" అన్నారు.

"అవునవును. ఈ ఒక్క వాగ్దానం నెరవేరిస్తే చాలు మళ్లీ ఒక్క ఏడాదిలో ఎన్నికలొచ్చినా మనకేం ఢోకా ఉండదు!" ఓ యువ మంత్రి అత్యుత్సాహంతో అన్నాడు.

అంతా అతడి వంక తినేసేలా చూశారు. నీళ్లు నమిలాడతడు.

"ఆర్యా! అవినీతిని చిటికెలో మాయం చేయగల చిట్కా నా దగ్గరుంది!" రాజకీయాల్లోనే కాదు నిజంగా కూడా తల పండిపోయినాయన అన్నాడు.

"ఇంకా చూస్తావేమయ్యా. త్వరగా చెప్పేసెయ్!" ఆత్రం ప్రదర్శించాడు ప్రధాని.

"అవినీతీ ఫో, పారిఫో! అని అరిస్తే మన గొంతు నొప్పెడుతుంది గానీ, అదెక్కడికీ పోదు. మంత్రాలకి చింతకాయలే కాదు, ఏ కాయలూ రాలవు!" నవ్విందొకావిడ.

"ముందాయన్ని చెప్పనీయండి!" అసహనంగా అన్నారింకొకరు.

"ఏం లేదు, ఆర్యా! అవినీతిని మటుమాయం చెయ్యడానికి ఏకైక సూత్రం ఏమిటంటే అవినీతిని నీతి చేయడమే!"

అందరి బుర్రల్లోనూ ట్యూబ్‌లైట్లు వెలిగాయి.

ఆయన చెప్పిన ఐదు నిమిషాలకి చప్పట్లు కొట్టారు.

"ఓహోుఁ!" అన్నారు. "చమత్కార్!" అన్నారు. "గ్రేట్!" అన్నారు.

పిమ్మట అభినందనలతో ముంచెత్తారు.

తలమీది టోపీ తీసి గోక్కున్నారు ప్రధాని.

"మీ సూచన బాగానే ఉంది కానీ అవినీతిలో చాలా రకాలున్నాయి కదా! లంచం గొండితనం. బంధుప్రీతి. ఆశ్రితపక్షపాతం వగైరా వగైరా! మరి వీటిల్లో వేటి

వేటిని చట్టబద్ధం చెయ్యాలి? ఏ మేరకు చెయ్యాలి? ఇది అందరికీ వర్తింపజేయాలా, లేక కొన్ని వర్గాలకే పరిమితం చెయ్యాలా?"

"అమ్మో! పెద్ద తిరకాసే ఉందే!" అరవబోయి నోరు నొక్కేసుకున్నారొకరు.

"ఇది మనం తేల్చలేం, ప్రధాని వర్యా! ఇందుకో కమిటీని నియమించాల్సిందే. ఆ కమిటీ దేశంలోని మేధావుల్నీ, ప్రముఖుల్నీ, వివిధ యూనియన్లనీ సంప్రదించాలి. ఆ పిమ్మట రిపోర్టు సమర్పిస్తే దాన్ని మనం చర్చించి గానీ, చర్చింకుండా గానీ అమోదించడం నీతిగా ఉంటుందని నా మనస్సాక్షిగా చెబుతున్నాను"

"ఈ మనస్సాక్షిగారి అభిప్రాయం నాకు నచ్చింది. అవినీతి నిర్మూలనా కమిటీని వేసేద్దాం. మరి దీనికి ఛైర్మన్‌గా ఎవరిని నియమిద్దాం?" ప్రధాని అడిగారు.

వెంటనే "రామ్ సుఖరామ్ బెస్ట్ సార్!" అని కుర్చీ ఎక్కి మరీ చెప్పాడో మంత్రి వర్యుడు.

"అతడెవరు?" ఈ సారి గెడ్డం గోక్కున్నారు ప్రధాని.

"గిన్నీస్ రికార్డుకెక్కిన ప్రముఖుడు సార్! వారి పూజ గదిలో, పడక గదిలో, వంటింట్లో అన్ని చోట్లా దొంతర్లు దొంతర్లుగా నోట్ల కట్టలు దొరికాయ్ సార్! అవి వారింట్లో కెలా వచ్చాయో, ఎందుకొచ్చాయో పాపం, వారెవరికీ తెలియదు సార్! అంచేత ఇన్‌కమ్‌టాక్స్ అధికారులతో సహకరించలేకపోయారు కూడాను సార్!"

"మరింకేం? ఏక సభ్య కమిటీ సరిపోతుంది అతగాడ్ని అవినీతి నిర్మూలనా కమిటీకి ఛైర్మన్‌గా నియమిస్తూ తీర్మానాన్ని ప్రతిపాదిస్తున్నాను!"

చప్పట్లతో ఆమోదం తెలిపారంతా.

* * *

అవినీతిని నీతిగా మార్చెయ్యడానికి గానూ రాజకీయనాయకులు, అరాజకీయ నాయకులు, అధికారులు, అనధికారులు, వారి వారి సంఘాలు రామ్‌సుఖ్‌రామ్ కమిటీకి సూచన లివ్వాల్సిందిగా కోరుతూ అన్ని పత్రికల్లోనూ పేజీడు ప్రకటనలిచ్చారు.

మొదట పార్లమెంటు సభ్యులు మూడు బృందాలుగా వచ్చి విడివిడిగా ఆయన్ని కలిశారు.

కానీ అంతా ప్రతిపాదించింది మాత్రం ఒక్కటే.

"కుంభకోణాలూ, స్కామ్‌లూ అవీ ఇవీ అంటూ కేసులూ గొడవలూ ఎక్కువ చేసేస్తున్నారు. అందుకని వేల, కోట్ల రూపాయల్ని స్విస్ బ్యాంకుల్లోనూ, ఇతరత్రానూ దాచుకోవాల్సిన దుస్థితి దాపురిస్తోంది. మంత్రుల మీదా, పార్లమెంటు సభ్యుల మీదా అలాంటి ఆరోపణలు చెయ్యకూడదని రూల్ తేవాలి. అప్పుడిహ ఆ డబ్బంతా మన దేశంలోనే ఉంటుంది. దేశాభివృద్ధి కెంతగానో తోడ్పడుతుంది కూడా. పైగా, ప్రపంచ ధనికుల లిస్ట్‌లోకి మన దేశం వారెక్కువగా చేరి ప్రశంసలందే అవకాశం పుష్కలంగా ఉంది!"

రామ్‌సుఖ్‌రామ్ పొంగిపోయారు.

"చాలా గొప్ప పాయింట్లు చెప్పారు. ఎంపీల మీద ఎవరూ ఎలాంటి ఆరోపణలూ చెయ్యరాదు. మరెలాంటి కేసులూ పెట్టరాదు. వారు చేసే పనులన్నీ చట్టబద్ధాలే! – ఇలా రికమెండ్ చేస్తాను. చాలా?"

"చాలు మహాప్రభో! మేమే చట్టం, చట్టమే మేమని ఋజువు చెయ్యబోతున్నారు. మన ప్రజాస్వామ్య వ్యవస్థలో విప్లవం తీసుకురానున్నారు. ముఖ్యమైన నగరాల్లో మీ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని పార్లమెంటులో తీర్మానం ప్రవేశపెడతాం!" అన్నారు ముక్తకంఠంతో.

ఆ వార్త టీవీలో, పత్రికల్లో రావడం ఆలస్యం అన్ని రాష్ట్రాల మంత్రులూ, ఎంఎల్‌ఏలూ విమానాల్లో, రైళ్లలో, కార్లలో ఢిల్లీకి దూసుకొచ్చారు. కమిటీ భవనాన్ని దిగ్బంధం చేశారు.

"ఏమిటయ్యా... ఏమైందీ?" అయోమయంగా అడిగారు రామ్‌సుఖ్‌రామ్.

"ఎంపీల మీద మీరింత పక్షపాతం చూపడం అన్యాయం, అక్రమం! రాష్ట్రాల్లో శాసనాలు చేసే మేం వారికన్నా ఏ రకంగానూ తీసిపోం గాక తీసిపోం!"

"ఒప్పు కుంటున్నాను. అయితే ఏమిటంటారు?"

"ఇంకా ప్రత్యేకంగా బొట్టు పెట్టాల్సిన పనే ముంది? వాళ్లతో బాటు మమ్మల్నీ చేర్చండి. మమ్మల్నీ చట్టానికతీతుల్ని చేసెయ్యండి. మేం చేసే కార్యాలన్నీ నీతిమయమూ, ధర్మబద్ధమూ అని ముద్రేసెయ్యండి!"

ఒక నిమిషం ఆలోచించారు. వారి కోరికెంతో సబబుగా అనిపించింది.

"ఓకే! అంగీకరిస్తున్నాను"

వెంటనే అంతా కలిసి ఆయన్ని ఆకాశానికెత్తేశారు.

ఆ మర్నాడు ఐఏఎస్, ఐపిఎస్ ఆదిగా గల ఉన్నతోన్నత అధికారులూ, వారి సంఘాలవారూ వచ్చారు. మొహం ముడుచుకుని కూర్చున్నారు.

"మీరెందుకొచ్చినట్టూ? ఇలా ఎందుక్కూర్చున్నట్టూ?"

"అవినీతి నిర్మూలనాసంఘ చైర్మన్‌గా మీకు సెక్రటరీ హోదా కల్పించారు కదా! మీరూ, మేమూ ఒకటే కదా! అయినా మీరు మమ్మల్ని పట్టించుకోకపోవడం ఏం బావోలేదు. అందుకని మా నిరసన తెలియజేస్తున్నాం!"

"మిమ్మల్నెలా మరచిపోతాను? అసలు ప్రభుత్వాన్ని నడుపుతోంది మీరే! ఐ ఏ ఎస్ అంటే ఐయామ్ సేఫ్ గాళ్లు మీరే! మీకేదో చెయ్యాలనుంది కానీ ఏం చేయాలో తోచి చావడం లేదు. మీరు సలహా ఇవ్వకూడదూ!" సిన్సియర్‌గా అడిగారు రామ్ సుఖ్‌రామ్.

"అందుకే కదా మేం వచ్చిందీ! దేశాన్ని పట్టాల మీద నడిపిస్తున్న ముఖ్యులం మేమే ! నాయకులొస్తారు. పోతారు. మేం మాత్రం దృఢంగా నిలబడి పరిపాలిస్తుంటాం. ఆ సంగతి మీకూ తెలుసు. అంచేత మీరు మాకు సూపర్ పవర్ స్టేటస్ కల్పించాలి!" అని కోరారు.

"అంటే ఏం చేయాలంటారు?"

"మేం లంచాలు తీసుకోవచ్చు. నిబంధనలను అతిక్రమించవచ్చు. కళ్ళు మూసుకుని ఎడంచేత్తో చేసినా సరే మా సంతకాల్నెవరూ ప్రశ్నించకూడదు!"

"ఇప్పుడు మాత్రం మిమ్మల్నెవరు అడగ్గలుగుతున్నారయ్యా? అధికారమంతా మీదేగా!?"

"అది నిజమే కావచ్చు. కానీ అడుగుతారేమోనన్న భయంతో మా వాళ్లు కొందరు మడిగట్టుకుంటున్నారు. మేమంతా సంఘటితంగా ఉండాలంటే, మాలో అసమానతలు నశించాలంటే వారికి కూడా ధైర్యం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అప్పుడే వాళ్లు సైతం నిర్భయంగా దేశం కోసం రాత్రీ పగలూ కష్టించి పని చేయగలుగుతారు!"

"మీ కోరిక న్యాయసమ్మతమైందని భావిస్తున్నాను!"

"ఓహ్! యు ఆర్ గ్రేట్! బ్రిలియంట్! ఇంత త్వర త్వరగా నిర్ణయాలు తీసేసుకుంటారని ఊహించలేకపోయాం"

షేక్ హేండ్లివ్వడమే కాదు. అమాంతం ఆయన్ని లాక్కెళ్లిపోయి ఆఫీసర్స్ క్లబ్‌లో భారీగా సన్మానించి మరీ వదిలిపెట్టారు.

ఆ వార్త బయటికి రావడం ఆలస్యం, దేశంలోని గెజిటెడ్ అధికారులంతా ఆగ్రహావేశాలు వెళ్లగక్కుతూ టెలిగ్రాములిచ్చారు. ఫాక్స్‌లు పంపారు. ఫోన్లు చేశారు. క్షణాల్లో సంప్రదింపులు పూర్తిచేసి ఓ యాక్షన్ కమిటీని ఏర్పరచి రామ్‌సుఖరామ్ దగ్గరకి పంపించేరు.

"మమ్మల్నిలా చిన్నచూపు చూడటం అన్యాయం, అక్రమం. అభివృద్ధి నిరోధకం, ఆశ్రిత పక్షపాతం. ఇంతటి నైచ్యానికి పాల్పడిన రామ్‌సుఖ్‌రామ్‌ని వెంటనే తొలగించి, మరొకర్ని అవినీతి నిర్మూలనా సంఘానికి ఛైర్మన్‌గా నియమించమని డిమాండ్ చేస్తున్నాం. మమ్మల్ని పిపీలికాల్లా చూస్తే సహించమని, మా శక్తేమిటో ఋజువు చేసుకుంటామనీ ప్రభుత్వాన్నీ, మిమ్మల్నీ కూడా హెచ్చరిస్తున్నాం"

పిడికిళ్లు బిగించి ఆవేశపడిపోయారంతా.

"కంఠశోష ఎందుకు చెప్పండి? అంతా చెప్పింది వినడానికే కదా నేనున్నదీ! మీ గోడేమిటో రెండు ముక్కల్లో చెప్పండి!" అన్నారు సుఖరామ్.

మంచినీళ్ల గ్లాసులన్నీ ఖాళీ అయ్యాయి ఒక్కసారే!

"రామ్‌సుఖరామ్‌జీ! కేంద్ర ప్రభుత్వంలో కానీండి, రాష్ట్ర ప్రభుత్వంలో కానీండి కష్టపడి పనిచేస్తున్నది మేము. కార్యాలు చాకచక్యంగా చక్క బెట్టి ఏదో కాస్తంత సంపాదించు కోగలుగుతున్నాం. పాయింటూ ఏమిటంటే, అందులో సగంపైనే పైవాళ్లకి నైవేద్యం పెట్టాల్సి వస్తోంది. పెట్టమంటే హెరాజ్ చేస్తున్నారు. శంకరగిరి మాన్యాలకి ట్రాన్స్‌ఫర్లు చేయిస్తున్నారు. అక్రమకేసులు బనాయించి ప్రమోషన్లు దక్కకుండా దెబ్బకొడుతున్నారు. అంతేకాదు, రామ్‌జీ! మమ్మల్ని కరివేపాకులా వాడుకుని పక్కన పడేస్తున్నారు!"

భోరుమని ఏడ్చేశారు. ప్రత్యేక టవల్స్ అందరికీ సప్లై చేయించారు సుఖరామ్.

"పాయింట్‌కి రండి మరి! అవినీతి నిర్మూలనా సంఘం సమయం ఎంతో విలువైనదిగా భావించాల్సిందిగా కోరుతున్నాను!"

"రామ్‌సుఖరామ్‌గారూ! సిగ్గు విడిచి మా గోడు చెప్పుకుంటున్నాం. మాలో ఒక్కరంటే ఒక్కరు కూడా హాయిగా, గుండెల మీద చేతులేసుకుని నిద్రపోవట్లేదంటే నమ్మండి! ఏసిబి వాళ్లో విజిలెన్స్ వాళ్లో ఇన్‌కమ్‌టాక్స్ వాళ్లో, మరొకళ్లో ఎప్పుడు దాడి

చేస్తారో తెలియక విలవిల్లాడిపోతున్నాం మహాప్రభో! మాకు మీరు న్యాయం చేసి తీరాల్సిందే!" అని డిమాండ్ చేశారు.

"సరే, ఒక్కొక్కరూ పది లక్షలకు మించకుండా ఏ రకంగా సంపాదించుకున్నా ఫరవాలేదని చట్టం చెయ్యమని సిఫార్సు చేస్తాను!"

"అబ్బే... అలాంటి పీలింగులు పెడితే ఆ లెక్కలూ, తబ్సీళ్ళూ సరిగ్గా లేవని విజిలెన్స్ వాళ్లు వెంటబడతారు. మళ్లీ గొడవవుతుంది సార్! దయచేసి మా రెక్కలు కత్తిరించకండి సార్!"

వేడుకున్నారు, వేదనగా అర్థించారు.

ఆయన గొణుక్కున్నారు తప్ప ఏమీ అనలేదు.

పరిస్థితి గ్రహించి వారి లీడర్లొచ్చి తలో కాస్తా వేసుకుని, ఓ 'పెద్ద మొత్తం' సమర్పించుకుంటామని చెవిలో స్పష్టంగా చెప్పారు.

"ఇప్పుడు నాకు నచ్చారు. ఎవరి కష్టమూ మనం ఉంచుకోకూడదు. అలాగేనోయ్... మీ కోసం గేట్లు తెరిపించేస్తాను!"

పూలదండలతో ముంచెత్తారంతా.

ఈ సంగతి బయటకి పొక్కడం ఆలస్యం దేశం అట్టుడికి పోయిందొక్కసారే!

అన్ని రాష్ట్రాల్లోని ఎన్జీవోలు తదితర ఉద్యోగులంతా సమ్మె నోటీసులిచ్చారు. ధర్నాలు చేశారు. ఊరేగింపులు తీశారు.

"చిరుద్యోగులంటే ఇంత చులకనా?" అంటూ నిప్పులు గక్కారు.

లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తే ప్రమాదముందని గ్రహించి ఏదో పరిష్కారం చూడమని రామ్‌సుఖరామ్‌కి ముఖ్యమంత్రులంతా విజ్ఞప్తి చేశారు.

వెంటనే ఆయన టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి అన్ని రకాల ఉద్యోగుల సమన్వయ సంఘాలతోనూ చర్చలు జరిపారు.

"అధికారులకు కల్పించిన అన్ని సౌకర్యాలూ మాకూ ఇవ్వాల్సిందే!" అని గర్జించారు.

"ఇది చాలా దారుణం. అధికారికీ, గుమస్తాకీ తేడా చూపకపోతే ఎలా చూపి తీరాల్సిందే. ఎందులో చూపమంటారో మీరే చెప్పండి!"

"అయితే మాకు జీతభత్యాలు నిలిపివెయ్యమనండి చాలు!"

"ఏమిటేమిటీ...!"

"మా జీతాలు మా టీ ఖర్చులకే చాలవు. ఇష్టానుసారం లంచాలు తీసుకోవచ్చని జీవో ఇవ్వమనండి చాలు. ప్రభుత్వానికి వందల కోట్ల రూపాయలు ఆదా అవుతాయి"

"మీ సలహా భేషుగ్గా ఉందోయ్! ప్రభుత్వం మీద భారం తగ్గుతుంది. అంటే ప్రజల మీద పన్నుల భారమూ తగ్గుతుంది. మీ దేశభక్తికి జోహార్లు!" అన్నారు.

వెంటనే సుఖరామ్‌గారికి 'భారత వైఢూర్య' బిరుదు ఇవ్వాలంటూ రాష్ట్రపతికి విజ్ఞప్తి చేశారంతా.

అన్ని వర్గాల వారి అభిప్రాయాలూ సేకరించడం అయింది గదాని రిపోర్టుకి రూపు రేఖలివ్వబోతుంటే ఇంటిమీద రాళ్లవర్షం కురిసింది.

"ఆపండి బాబోయ్!" అని అరిచారు గానీ, వర్షం ఆయన మీదా కురవనే కురిసింది.

గాయాలతో ఏడుస్తూ, "నేను మీకేం అపకారం చేశాను?" అని ప్రశ్నించారు సుఖరామ్.

"మేం గ్రామ సర్పంచ్‌లం. గ్రామాల్లో మాదే రాజ్యం కానీ, మాకు తినడానికేమీ దొరకట్లేదని అఘోరిస్తుంటే మమ్మల్ని మీరు కూడా నిర్లక్ష్యం చేస్తారా?" అంటూ బైఠాయించారు.

జుట్టు పీక్కున్నారు. జట్టంతా ఊడి వచ్చింది. "మీకేం చెయ్యమంటారో శలవివ్వండి!" అన్నారు రామ్‌సుఖరామ్ అయోమయంగా చూస్తూ.

"మా గ్రామ పరిధిలో చేసే ప్రభుత్వ పనుల్లో పదిశాతం కమీషన్ మా కివ్వాలి. మా మీద ఎలాంటి నేరమూ మోపే అధికారం పోలీసులకు ఉండకూడదు!"

"అవి నా కమిటీ పరిధిలోకి రావు. కానీ అన్ని రకాల ప్రజా ప్రతినిధులూ చట్టానికి అతీతులని చట్టం చేయమని రికమెండ్ చేస్తాను. నన్నిహ వదిలేస్తే ఆసుపత్రికెళ్తాను!" అంటూ చేతులు జోడించారు.

గ్రామ బాంధవుడనే బిరుదు మెళ్లో వేసి జైజైలు కొడుతూ నిష్క్రమించారంతా.

పగలు నిద్రపోయి రాత్రి మేల్కొని రిపోర్టు వండేస్తున్నారు రామ్‌సుఖరామ్.

ఇంతలో తుఫానులా విరుచుకుపడ్డారు కొందరాడవాళ్లు.

"మీకేం అన్యాయం చేశాం?" పీలగొంతుతో అడిగారు.

"మా మా భర్తలు ఇన్‌కమ్‌టాక్స్ అధికారులుగా పనిచేస్తున్నారు. మీరు తేబోయే సంస్కరణల వల్ల ఇక మా నోట్లో మన్నే! ప్రభుత్వం సగం మంది ఉద్యోగుల్ని రిట్రెంచ్ చేసినా చెయ్యొచ్చు. ఇక మా భర్తల పరిస్థితేమిటి? మా గతేమిటి?"

"వ్యాపారులున్నారు. ప్రజలున్నారు..."

"అయితే మాత్రం మా వాళ్ల పరిధి కుంచించుకుపోలేదా? మిగతా అధికారుల భార్యలు ఒంటినిండా నగలు దిగేసుకుని తిరుగుతారు. మేం గాజుల్తో ముక్కుపుడకలతో సరిపెట్టుకోవాలా? వీల్లేదు!"

"ఇన్నాళ్లూ మీరు... అదే మీ మీ వాళ్లూ బాగానే సంపాదించారుగా?"

"ఏం సంపాదన మా బొంద! అంతా చాటుమాటు దేవుళ్లాటే కదా! కింద నుంచి పైదాకా వాటాలే కదా! పైగా, ఈ పోస్టింగులకే బోల్డు ఖర్చయింది. అంచేత మిగతా ఉద్యోగస్తులంతా ఎంతో కొంత శాతం మా కిచ్చేటట్లు చెయ్యాల్సిందే!"

"అదెలా కుదురుతుందమ్మా! కొందరి కెక్కువ లంచాలు రావచ్చు. కొందరికి తక్కువ రావచ్చు. అందుకే ఇక నుంచి అధికారుల్నీ, ఉద్యోగుల్నీ లంచాలని బట్టి ఏబిసిడిలుగా వర్గీకరించమని సిఫారసు చేస్తున్నాను. మీ మీ వారి ఉద్యోగాలు 'సి'లోకి వస్తాయి. ఇంకా 'డి' వారు కూడా ఉన్నారు కదా. ప్రస్తుతానికి వదిలి పెట్టండి. మీ మీ వారి నెవర్నీ రిట్రెంచ్ చెయ్యకూడదని గట్టిగా చెబుతాను. మూడేళ్ల తర్వాత సమీక్షా సంఘం వెయ్యమంటాను. మీకీలోగా నిజంగా అన్యాయం జరిగితే అప్పుడు మొరపెట్టుకుందురు గాని"

"ఆడవారి కన్నీరు మీకు అరిష్టదాయకం. అంచేత కనీసం ఏడాది తర్వాత సమీక్షా సంఘం వెయ్యమనండి. మీ చెల్లెళ్ళ కోసం ఈ మాత్రం చెయ్యలేరా?"

అయిష్టంగానే అంగీకరించారాయన.

ఇంకేం ఆలస్యం చేయకుండా ఆ మర్నాడే తమ కమిటీ రిపోర్టుని ప్రధానికి సమర్పించారు రామ్‌సుఖరామ్.

మంత్రి మండలి సమావేశమై ఆయన చేసిన సిఫార్సుల్ని చర్చించింది.

"పంచాయితీ బోర్డు మెంబరు మొదలుకొని ప్రధాని వరకూ ప్రజా ప్రతినిధులంతా చట్టానికతీతులు, సామాన్యులకి వర్తించే చట్టాలేవీ పదవిలో ఉన్నంత వరకూ వారికి వర్తించవు!" మొదటి సిఫార్సు చదివారు ప్రధాని.

"భేష్! బల్లలు చరిచారంతా.

"గెజిటెడ్, ఆపై అధికారుల మీద ఎలాంటి అవినీతి ఆరోపణలూ చేయరాదు. వారి చర్యల్ని ప్రశ్నించరాదు. పరిశీలించరాదు!"

"ఇదీ బావుంది!" చప్పట్లు కొట్టారు.

"మిగతా ఉద్యోగులు చేసిందంతా నీతి నియమాలకి లోబడి చేసినట్లుగా భావించాలి. లంచాలు యథేచ్ఛగా స్వీకరించవచ్చు. కానీ ఒకే పనికి ఒకే సొమ్ము వసూలు చెయ్యాలి. మనిషికీ మనిషికీ మధ్య వివక్ష చూపరాదు. వారికెలాంటి జీతభత్యాలూ చెల్లించరాదు....."

"ఇది విప్లవాత్మక చర్య! ఈ సారి మిగులు బడ్జెట్ ఖాయం!" అన్నారు రామ్‌సుఖరామ్ పేరుని ప్రతిపాదించినాయన.

"ఆఖరి సిఫారసు. ఇది ఆమోదించాకనే పై మూడు ఆమోదించాలిట. ఇదేమిటంటే, సదరు సిఫారసుల వల్ల లాభపడిన వారంతా తమ తమ మొదటి నెల పై సంపాదనంతా రామ్‌సుఖరామ్ కిచ్చి తీరాలి!"

"అన్యాయం! అక్రమం!"

ఆక్రోశించారంతా. "కేసు పెడదాం!" అరిచారొకరు.

"అతడికి సెక్రటరీ హోదా కల్పించాం కదా అతడి మీద నేరారోపణ చెయ్యడం కొత్త రూల్స్ ప్రకారం నేరమవుతుంది!" తల పట్టుకున్నారు ప్రధాని.

అంతా ఏడుపు మొహాలతో అవినీతి నిర్మూలనా సంఘ సిఫారసుల్ని ఏకగ్రీవంగా ఆమోదించేశారు.

"అది అవినీతి నిర్మూలన సంఘం కాదు, అవినీతి సంఘం!" అని గొణుక్కోకుండా ఉండలేకపోయారు కొందరు.

'హమ్మయ్య! ఎలాగైతేనేం. దేశం నుంచి అవినీతిని తరిమి కొట్టేస్తున్నాం. ఇది నా హయాంలో జరగడం నాకు గర్వకారణం. ఏదైనా అంతర్జాతీయ అవార్డు లభిస్తుందేమో ప్రయత్నించాలి!" అనుకున్నారు ప్రధాని!

* * *

**(ఆంధ్రప్రభ వారపత్రిక 25.11.2000)**

# జ్ఞాననేత్రం

**రో**డ్డే పోతున్న వాడినల్లా ఒక లాడ్జిముందు వ్రేలాడ దీయబడిన ప్రకటన చూచి ఠకీమని ఆగాను.

దానిమీదిలా రాసి వుంది.

"కేరళకు చెందిన ప్రఖ్యాత జ్యోతిష్కులు శ్రీ గణేశన్ గారిప్పుడు మీ వూళ్లో ఈ లాడ్జిలో వేంచేసి వున్నారు. వారిని దర్శించి మీ భూత భవిష్యత్తుల్ని తెలుసుకోండి.

వీరు

1. యన్టీఆర్ అధికారంలో కొస్తారని ముందే చెప్పేరు.
2. జనతా ప్రభుత్వ స్థాపన – పతనం గురించి చాలా ముందుగానే జోస్యం చెప్పేరు.
3. ఇందిరాజీ తిరిగి ప్రధాని అవుతారని 1977లోనే చెప్పేరు.

వెంటనే సంప్రదించండి"

ప్రకటన ప్రక్కనే హస్తం బొమ్మ దాని మీదేవో గీతలూ అక్షరాలూ కూడా వున్నాయి.

ఇలాటి జ్యోతిష్కులూ సిద్ధాంతాలూ అంటే నాకెంతో సరదా. వారి మాటలూ చేష్టలూ మంచి హాస్యాన్నందిస్తాయని నా నమ్మకం.

ఆ ప్రకటన చదివేక ఆయన్ని పరీక్షించాలన్న చిలిపి కోరికి కలిగింది. చిన్నగా ఈల వేసుకుంటూ లాడ్జిలోకెళ్లాను.

ఒకాయన నన్నాహ్వానించి ఓ గదిలో కూర్చోబెట్టాడు. అక్కడింకా ముగ్గురు వ్యక్తులున్నారు. జ్యోతిష్కుడు మరో గదిలో వున్నాడని అర్థమయ్యింది.

నేను తప్ప మిగతా ముగ్గురూ కబుర్లలో పడ్డారు. వారి సంభాషణ జ్యోతిష్యం గురించీ గణేశన్ గురించీ వారడగదల్చుకున్న ప్రశ్నల గురించీ సాగింది. కుంకుమ బొట్టు పెట్టుకున్న వ్యక్తి ఎక్కువగా మాట్లాడుతూండటం చూసి బహుశా అతడు గణేశన్ మనిషేమోనని అనుకున్నానో లేదో అతడడిగాడు "మీరు స్టూడెంటా?"

తల అడ్డంగా వూపాను.

"నిరుద్యోగి కాబోలు"

బదులుగా నవ్వి వూరుకున్నాను. మనం అడగబోయే ప్రశ్నలు కూడా ఆయన చెప్పేస్తున్నాడని ఒకాయన ఆశ్చర్యంగా చెప్పినందున ఆ సంభాషణని పొడిగించ లేదు.

లోపల్నుంచి ఒకరికి పిలుపురాగా వెళ్లేడతను. కొత్తగా ఇంకో ఇద్దరొచ్చారు.

పేపర్ తిరగేస్తూ వారి సంభాషణ ఆలకిస్తూండిపోయాను.

మధ్య మధ్య బొట్టు పెట్టుకున్నతను హడావిడిగా బయటికీ బాత్ రూమ్‌కీ వెళ్లి వస్తున్నాడు.

ఇంకో ఇద్దరు కూడా లోపలి కెళ్ళేరు గాని బొట్టతను వెళ్ళలేదు. వెళ్ళే వుద్దేశ్యం వున్నట్టు లేకపోయేసరికి నా అనుమానం బలపడింది. కబుర్ల వంకతో వచ్చిన వారి ప్రశ్నలు తెలుసుకుని లోపలికి చేరవేస్తున్నాడు.

అంచేతే జ్యోతిష్కుడు వచ్చిన వారడగబోయే ప్రశ్నలు కూడా చెప్పగలుగు తున్నాడనుకున్నాను.

ఏడిపిద్దామన్పించి "మీరొచ్చి చాలాసేపైంది కదా లోపలికెళ్ళరేం?" అనడిగా నాయన్ని.

"నేను ముందే కలుసు కున్నానండి. అంతా వెళ్ళేక గ్రహశాంతికి పూజ చేస్తాన న్నారు. అందుకనే వుండిపోయాను"

"ఓహెూ పూజలు కూడా చేస్తారా?"

"పూజలు చేస్తారు. తాయెత్తులు, మంత్రించిన దండలూ, ఉంగరాలూ ఇస్తారు. మంత్రోపదేశాలు చేస్తారు. మీరు ఆల్బమ్ చూళ్ళేదా?" అంటూ టేబుల్ మీదున్న ఆల్బమ్ అందించాడు.

నేనూ ఇతరులూ కలిసి దాన్ని తిరగేశాం. గణేశన్ గారికి చెయ్యి చూపించు కుంటున్న ప్రముఖ రాజకీయ నాయకుల, నటుల, ఇతర పెద్దల ఫొటోలున్నాయందులో.

"అబ్బో చాలా పేరున్న వారేనే. లేకపోతే అంత పెద్ద పెద్ద వాళ్లీయన చేత చెయ్యి చూపించుకుంటారా!" అని ఒకాయన ఆశ్చర్యం ప్రకటిస్తే ఔనౌనంటూ తలలూపారు మిగతావాళ్లు.

"ఇదంతా హంబక్. పబ్లిసిటీ స్టంటు" అందామనుకున్నాను గానీ వారి ఫీలింగ్సు చూసి మౌనాన్నాశ్రయించాను.

ఇంతలో నాకు పిలుపొచ్చింది. లోపలి కెళ్ళేను.

ఎఱ్ఱని పట్టు వస్త్రాలు కట్టుకుని మెడలో రుద్రాక్షమాలలు వేసుకుని నుదుట పెద్దబొట్టు పెట్టుకుని చెవులకి లోలకులూ ముంజేతికి కడియాలూ ధరించి ఒక ప్రత్యేకమైన వేషంతో మెరిసిపోతూ పద్మాసనం వేసుక్కూర్చున్నారాయన.

చెప్పొద్దూ ఆయన్నలా చూసే సరికి నమస్కరించాలన్పించింది. అప్రయత్నంగా నమస్కరించాను.

కూర్చోమని సైగ చేశారు. కూర్చున్నాను.

క్షణకాలం కళ్ళు మూసుకుని తెరుస్తూ అన్నారు. "నువ్వు బాగా చదువుకున్న కుర్రాడివి. చదువుకి తగ్గ ఉద్యోగం రాలేదు. ఎప్పుడొస్తుంది. ఎలాటిదొస్తుంది అసలొస్తుందా రాదా తెలుసుకోవాలని వచ్చావ్..."

నా అంచనా నిజమైనందుకు నవ్వొచ్చింది. నిస్సందేహంగా ముందు గదిలోని బొట్టుపెట్టుకున్నతను ప్రశ్నల్ని చేరవేస్తున్నాడు. నిరుద్యోగా అని అతడడిగినప్పుడు నవ్వి వూరుకోవడం మంచిదయ్యింది.

"కాదండి నేను మంచి ఉద్యోగమే చేస్తున్నాను....."

విప్పారిత నేత్రాలతో తీక్షణంగా చూసి "మంచి వుద్యోగం చేస్తున్నానన్న భ్రమలో వున్నావు పిచ్చివాడా. నిన్ను నువ్వు ప్రశ్నించుకో నిజం తెలుస్తుంది. నీ చెయ్యి చాపు" అన్నారు కాస్త కోపంగానే.

"క్షమించండి. నా గురించి ప్రశ్నలడగాలని రాలేదు. యన్టీఆర్ అధికారంలో కొస్తారని మీరు ముందే చెప్పేరు గదా. మరాయన మధ్యలోనే బర్తరఫ్ చెయ్యబడతారనీ ఒక నెలరోజులు అనారోగ్యంతో ఆవేదనతో గడుపుతారనీ తిరిగి పదవి చేబడతారనీ మీరు చెప్పేరో లేదో చెబితే ఆ ప్రకటన ఏ పేపర్లో అచ్చయ్యిందో తెలుసుకోవాలనొచ్చానండి. అలాగే ఇందిరా గాంధీ మతోన్మాదుల చేత హత్య చెయ్యబడుతుందని మీరు చెప్పేరో లేదో తెలుసుకోవాలనొచ్చానండీ?"

ఆయన ముఖం ఎఱ్ఱబడింది. కళ్ళు మూసుకున్నారు.

నవ్వుతూ ఆయన్నే చూస్తూ కూర్చున్నాను.

మూర్ఖుడా! నన్నే పరీక్షించాలని వస్తావా? నువ్వు పుట్టిన వూరు 'న'తో మొదలవుతుంది. నీ తండ్రి పేరు 'పా'తో మొదలవుతుంది. నీ పేరు 'శ్రీ'తో మొదలవుతుంది. అవునా?"

ప్రాన్పడిపోయాను. ఆయన చెప్పిందంతా నిజమే. నేను నర్సాపురంలో పుట్టాను. మా నాన్న పేరు పాపారావు, నా పేరు శ్రీరంగం ఇదంతా ఆయనకెలా తెలిసింది?

సన్నగా కంపిస్తూ చూశాను.

చిర్నవ్వు నవ్వారాయన.

ఆయనకి నిజంగా మహత్తర శక్తులున్నాయన్పించింది. చేతులు జోడించాను భక్తితో.

"నువ్వు అజ్ఞానంలో మూర్ఖపుతర్కంలో పడి కొట్టుకుపోతున్నావు. అందువల్లే నీ ప్రతిభ మసిబారిన మాణిక్యంలా గుర్తింపుకి నోచుకోకుండా వుంది. రేపు సాయంత్రం సరిగ్గా ఆరు గంటలకి రా. నీ జ్ఞాననేత్రం తెరచుకునేలా మంత్రాన్నుపదేశిస్తాను"

జేబులోని డబ్బుతీసి ఆయన ముందుంచి నమస్కారం చేసి చెంపలేసుకున్నాను. ఆయన దీవించేకగాని నా మనస్సు కుదుట పడలేదు.

గదిలోంచి బయటికొచ్చాను. బొట్టతను ఆత్రంగా వచ్చి అడిగాడు. లోపల జరిగిందంతా చెప్పేను. "విన్నారా" అంటూ రెండో గదిలో కూర్చున్న వాళ్ళని పిలిచి నాచేత చెప్పించాడు మళ్ళీ.

నాతో బాటే లాడ్జి బయటికొచ్చి నలుగురూ వినేలా గట్టిగా వివిధ ప్రశ్నలేసి మళ్ళీ మళ్ళీ అంతా చెప్పించుకుని "నేన్చెప్పలేదూ ఆ జ్యోతిష్కుడి గారికి దివ్యదృష్టి వుందనీ" అంటూ వ్యాఖ్యానిస్తూ అందరికీ వివరించసాగాడు.

నేనొచ్చేశాను. ఆ రాత్రంతా గణేశన్ గారి గురించీ ఆయనన్న మాటల గురించీ ఆలోచించాను. ఆలోచించగా ఆలోచించగా ఆయన చెప్పింది. నిజమే అన్పించసాగింది.

బ్యాంకులో ఉద్యోగం చేస్తూ నెలకి వెయ్యి రూపాయలు కళ్ళజూస్తున్న మాట నిజమే కాని నా ప్రతిభని బట్టి చూస్తే ఇంకా పెద్ద ఉద్యోగం రావాల్సిందే మరి. ఆయనెంత కరెక్టుగా చెప్పేరూ! ఆయన మంత్రం ఉపదేశిస్తే జ్ఞాననేత్రం తెరుచుకుంటే ఐఏయస్ పాసైతే...!

తీయని కలలు కన్నాను. ఊహల్లో వూరేగాను.

మరునాటి మధ్యాహ్నం అటు వెళ్ళే సరికి అక్కడ దగ్గర దగ్గర నలభై యాభై మంది ఆడా మగా వుండటం చూసి ఆశ్చర్యబోయాను. ఎందుకంత మంది వచ్చారని ఒకర్నడిగానో లేదో నావంక కోపంగా చూసి అన్నాడు "నీ లాంటి వాడే ఒకడు నిన్న వచ్చి గణేశన్ గారిని తూలనాడాడంట. ఆయన అతగాడి పుట్టుపూర్వోత్తరాలన్నీ చెప్పి తన విశ్వరూపం చూపించార్ట. అందుకనే ఇసుక వేస్తే రాలనంత జనం వచ్చేస్తున్నారు. నువ్వూ వెళ్ళు. నీ భవిష్యత్తు చెప్పటమే గాక నీకు బ్రహ్మయోగం పట్టే మార్గం కూడా చెబుతారు"

ఆ యువకుణ్ణి నేనేనని చెప్పాలన్పించ లేదు గాని లెంపలేసుకుని వచ్చేశాను.

సాయంత్రం ఆరుగంటలకెళ్ళేను. ఖాళీ లేనందున రెండ్రోజులు పోయాక రమ్మని కబురంపారు గణేశన్‌గారు. నా దురదృష్టాన్ని నిందించుకుంటూ నిరాశగా వెనుదిరిగి మళ్ళీ మూడోరోజున వెళ్ళేను.

మొదటిగదిలో బొట్టతనూ మరొకరూ మాత్రమే వున్నారు సామాన్లు సర్దుకుంటూ నన్ను లోపలికెళ్ళమన్నారు. లోపల గణేశన్‌గారు సాదా దుస్తుల్లో వున్నారు.

ఆశ్చర్యంగా చూస్తూ చేతులు జోడించాను. ఆయన గట్టిగా నవ్వుతూ "రారా కూర్చో. నీ వల్ల మంచి బిజినెస్సు జరిగింది" అన్నారు.

అయోమయంగా చూశాను.

"నన్నింకా గుర్తు పట్టలేదుట్రా. పదేళ్ళ క్రితం ఇంట్లోంచి పారిపోయిన మీ బాబాయ్ గణేశ్వర్రావున్రా. దేశమంతా తిరిగాను గాని నా వానాకాలం చదువు ఉపాధి చూపడానికి పనికి రాక పోయేసరికి ఈ వృత్తిలోకి దిగాను. జీవితంలో మోసబోయిన వాళ్ళూ జీవితాన్ని మోసం చేసిన వాళ్ళూ జ్యోతిష్కుల వెంట పడుతూంటారు. అంచేత మాటల గారడీ చేసి అందరకీ మంచి భవిష్యత్తు వుందని ఆశ పెట్టి నమ్మించగలిగితే చాలు మనం హాయిగా బ్రతికేయొచ్చు. ఎలా వుంది మన మంత్రం? జ్ఞాననేత్రం తెరచుకుందా?" అని బాబాయి పడీ పడీ నవ్వుతోంటే నేనింకా ఆశ్చర్యాంబుదిలో మునిగి తేలుతూనే వున్నాను!

* * *

**(జ్యోతి మాసపత్రిక జూన్ 1986)**

# సహస్రనామార్చన

**మొ**ఖం వేలాడేసుకుని వచ్చిన కొడుకుని చూసి “వెళ్ళిన పని అవ్వనట్టుందే” అన్నారు భూపతిరావు గారు.

“అవ్వలేదు. కాలేజీ కమిటీ వైస్ ఛైర్మన్ దగ్గర్నుంచి లెటర్ తీసుకెళ్ళేను. అయినా ప్రిన్సిపాల్ పట్టించుకోలేదు. ఈ కొత్త ప్రిన్సిపాల్ అదోరకం మనిషి నాన్నగారూ. ప్రతి దానికీ రూల్సుని వల్లిస్తూంటాడు...”

“తిండిపోతేమో?”

“అబ్బే – ఫలం, పత్రం, పుష్పం, తోయం దేనికీ లోబడడు. అదోరకం పెంకిఘటం”

“నేను కలిసి చూస్తానుండు” పైపంచె భుజానేసుకుని చేతికర్ర వూపుకుంటూ కాలేజీకి బయల్దేరారు.

కాలేజీ ఆవరణలో కుర్ర లెక్చరర్ ఆయన్ని విష్ చేశాడు. ఆయన ద్వారా ఆ ఉద్యోగం సంపాదించుకున్నాడతడు.

“ఏమోయ్! ఎలా వుంది నీ ఉద్యోగం. మీ కొత్త బాస్ ఏవంటున్నాడు”

“డిసిప్లిన్ అని అరుస్తున్నాడండి. తనకి ముందు పనిచేసిన వాళ్ళంతా అసమర్థులని ఆయన నిశ్చితాభిప్రాయం. అంచేతే స్టాఫ్‌ని ఆ డిపార్ట్‌మెంటు నుంచి ఈ డిపార్ట్‌మెంటుకీ, ఇక్కడ్నుంచి అక్కడికీ మార్చేస్తున్నాడు. మొక్కల పూలు కోయకూడదు, గుంపులు గుంపులుగా వుండకూడదంటూ రూల్సూ, రెగ్యులేషన్సూ దంచేస్తున్నాడు. వట్టిగొడ్డుకి అరుపు లెక్కువన్నది మీకు తెలీంది కాదు”

“చూద్దాం”

చిన్నగా నవ్వుకొని కాలేజీనీ పరిసరాలన్నీ ఓమారు పరికించి తిన్నగా ప్రిన్సిపాల్ గదిలో కెళ్లి విష్ చేశారు.

ఆయనో పెద్దమనిషిలా కన్పించేసరికి కూర్చోమని కుర్చీ చూపి “చెప్పండి” అనడిగారు ప్రిన్సిపాల్ చిదంబరం.

భావరహితంగా, బ్లాంక్‌గా వున్న ఆయన మొహాన్నీ, సూటిగా విషయానికొచ్చే అతడి తత్వాన్నీ, క్లుప్తతనీ చూసిన వెంటనే గ్రహించేరు భూపతిరావు గారు ఆయన అదో తరహా మనిషని.

"నేను మాజీ కమిటీ మెంబర్నిలెండి. మీరు కొత్తగా వచ్చేరని తెలిసి చూద్దామనొచ్చాను"

"ఐసీ" ఈ ఉపోద్ఘాతం వింటోంటేనే తెలుస్తోంది ఏదో పనుండి వచ్చేవని – అని లోపలనుకుంటూ అన్నారు.

"నేనొచ్చి అరగంటపైనే అయ్యింది లెండి"

"అరె! అలాగా. మా వల్ల ఆలస్యమేమీ జరగలేదు కదా?" లోపల తిట్టుకుంటూ పైకి నొచ్చుకుంటున్నట్టు మొఖం పెట్టి అన్నారు.

"అబ్బెబ్బే. అదేం కాదండి. మీరొచ్చి కాలేజీ అవతారాన్ని మార్చేశారని చాలా విన్నాన్లెండి. అదేమిటో చూద్దామని అన్ని డిపార్ట్‌మెంట్లకీ వెళ్ళి అన్నీ చూసి వస్తున్నాను. మీరు చేతల మనిషని గ్రహించి అభినందిద్దామని వచ్చేను"

చిదంబరం కొంచెంగా ఉబ్బేరు. "పెద్దవారు. ఆశీర్వదించాలి గాని పొగడకూడదు. సరైన సహకారం లభిస్తే ఇంకా చాలా చాలా చెయ్యగలను. ఇంత వరకూ చేసింది పిడికెడంత. ఇంకా చెయ్యాల్సింది ఆకాశమంత"

"నిజమే కాని వెయ్యిమైళ్ళ ప్రయాణమైనా మొదలయ్యేది మొదటి అడుగుతోనే. చేయాలన్న తపన, చెయ్యగలనన్న నమ్మకం వుండటం ముఖ్యం. అవి మీలో పుష్కలంగా వున్నాయి. అంచేత ఆకాశమంత పనైనా సరే అవలీలగా చేసెయ్యగలరని నేను ధీమాగా చెప్పగలను"

"అదంతా మీ అభిమానం" చిన్నగా మందహాసం చేస్తూ అని బజ్జర్ మ్రోగించి ప్యూన్‌తో రెండు కాఫీలు పట్రమ్మన్నారు.

"ఇది వరకు కాలేజీ కాంపౌండంతా చిందర వందరగా వుండేది. ఎక్కడ బడితే అక్కడ సైకిళ్ళు నిలబెట్టేసేవారు. గుంపులు గుంపులుగా స్టూడెంట్లు బాతాఖానీ వేసేవారు. మొక్కలు మోడుల్లా వుండేవి. ఇప్పుడదంతా మారిపోయింది. సైకిళ్ళు షెడ్సులోనే వుంటున్నాయి. మొక్కలన్నీ చక్కగా ఎదిగాయి. వాటికి పువ్వులు కూడా వుండటం ప్రత్యేక విశేషం"

"అందరూ తమ తమ బాధ్యతల్ని సవ్యంగా నిర్వర్తిస్తూండడమే దానిక్కారణం..." తన సంబరం బయటపడకుండా అన్నారు.

"అమ్మమ్మ అలాగనకండి. చేతిలో వున్న అధికారాన్ని పూర్తిగా వినిగించుకోలేక పోవడం మన దేశపు అధికార్ల మొదటి లక్షణం. ఒత్తిడులకూ, ప్రలోభాలకూ లొంగిపోవడం రెండో లక్షణం. ఆ రెంటికీ మీరు మినహాయింపని చెప్పక తప్పదు. ఇకపోతే ఏ అధికారైనా తనొక్కడూ సరిగ్గా పనిచేస్తూ నీతిగా వుంటే సరిపోదు. తన క్రింది వారందర్నీ సవ్యంగా, సక్రమంగా బాధ్యతాయుతంగా, నీతి వంతంగా ప్రవర్తించేట్టు చూడటం అత్యంత ముఖ్యం. ఆ సంగతి గ్రహించి ఆచరణలో పెట్టిన మిమ్మల్నెలా అభినందించాలో తెలీడం లేదు"

"మీలాంటి పెద్దల ఆశీస్సులు పొందగలిగినందుకెంతో ఆనందంగా వుంది"

"లైబ్రరీలో మీరు వ్రేలాడగట్టిన అట్టల మీది స్లోగన్లు చూశాను. ఒకదాని మీద 'దేవాలయంలో ధ్యానం గ్రంథాలయంలో జ్ఞానం' అని రాసివుంది. ఇంకో దానిమీద 'ఇక్కడ కళ్ళకీ మెదడుకీ మాత్రమే పని చెప్పండి' అని రాసి వుంది. అబ్బ! ఇంత గొప్ప గోల్డెన్ వరడ్స్ ఎప్పుడూ, ఎక్కడా వినలేదు, చూడలేదంటే నమ్మండి. ప్రతి గ్రంథా లయంలోనూ మీ యొక్క కొటేషన్స్ రాయించాల్సిన అవసరం ఎంతైనా వుంది..."

ఆ ప్రశంసని చిర్నవ్వుతో స్వీకరించారు. అలాటి బోర్డులు వున్నట్టే తెలీదాయనకి. నిజం చెప్పి ఆ ప్రశంసలు తనకి చెందవని చెప్పుకోవాలన్పించలేదు.

కాఫీలొచ్చాయి.

"పెద్దలయెడ మీకున్న గౌరవాభిమానాలకీ, మీ ఉన్నత సంస్కారానికీ ఇది ప్రత్యక్ష నిదర్శనం" అని పొగిడి కాఫీ కప్పు అందుకున్నారు.

"ఇది వరకు ప్యూన్లు, గుమస్తాలూ మాట విన్పించుకునేవారు కాదు. టైమ్ ప్రకారం వచ్చేవాళ్ళు కాదు. అలాటిదిప్పుడు ఎక్కడ చూసినా, ఎటు చూసినా పంక్చువాలిటీ, డిసిప్లిన్. ఓహ్ – గొప్పగా మంత్రించినట్టుగా మార్చేశారు కదండీ"

"మన కాలేజీకో ప్రత్యేకతనీ, గౌరవాన్నీ తీసుకు రావాలని అహరహం కృషి చేస్తున్నానండి. మీబోటి పెద్దలు తగు సలహాలిస్తే మరింతగా..."

"అమ్మమ్మ! అంతమాటనకండి, మీ ముందు మేమెంత చెప్పండి? విజ్ఞాన సర్వస్వాలు మీరు. మేం గాలివాటు మనుషులం. ఇంకోమాట. మీరేమనుకున్నా సరే చెప్పక తప్పదు. ఇదివరకటి ప్రిన్సిపాల్ ఆ పదవికి అనర్హుడని నెత్తీనోరూ కొట్టుకున్నా సర్వీసు రూల్సు దృష్ట్యానూ కమిటీ ఛైర్మన్ మనిషవడం వల్లనూ మిగతావాళ్ళు నాతో పూర్తిగా ఏకీభవించ లేదు. ఇప్పుడు కాలేజీలో వచ్చిన మార్పు చూస్తోంటే మీ ముందు పని చేసిన ప్రిన్సిపాల్సంతా ఎంత అసమర్థులో సాక్ష్యాధారాల్తో ఋజువవు తోందనుకోండి"

ఉబ్బి తబ్బిబ్బయ్యారు చిదంబరం.

"మిమ్మల్ని చాలా విసిగిస్తున్నట్లున్నాను. ఏదో పూర్వకాలం వాణ్ణి. ఇంత ఆనందాన్ని కడుపులో దాచుకోలేక వచ్చేను. మీరు శలవిస్తే శలవు తీసుకుంటాను" లేవబోతూ అన్నారు.

"మీరలా అనకండి. మీబోటి వారి సహాయ సహకారాలే మా కాలేజీకి శ్రీరామ రక్ష"

"అన్నట్టు నే వస్తోంటే మా వాడేదో కనుక్కోమని చీటీ ఇచ్చాడండి..." అంటూ జేబులు వెతికినట్టు వెతికి ఓకాగితం తీసిచ్చారు. "అక్కడికీ అన్నాను. నేను తీసుకెళ్ళటం బావోదురా. నువ్వెళ్ళి ప్రిన్సిపాల్ గార్ని కలిస్తే క్షణాల్లో పని చేసి పెడతారూ ఆవటాని..."

"ఇప్పుడైతే ఏంలెండి. ఒక్క క్షణం కూర్చోండి..." అని చెప్పి హెడ్ క్లర్క్‌ని పిలిచి క్షణంలో పని చేయించి కాగితం చేతిలో పెట్టేశారు చిదంబరం.

కృతజ్ఞతలు చెప్పి యింటికొచ్చి ఆ కాగితం కొడుక్కిచ్చారు భూపతిరావుగారు.

అతడమితాశ్చర్యంతో "ఇన్నాళ్ళు తిరిగినా నేను చేయించుకోలేనిది – కనీసం కదపలేనిది మీరు రెండు గంటల్లో చేయించు కొచ్చారంటే నమ్మలేకపోతున్నాను. మీరెలా సాధించ గలిగారు నాన్నగారూ" అనడిగారు.

"సహస్ర నామార్చన పూజరా. ధూప దీప నైవేద్యాలు విఫలమైనప్పుడు వదలాల్సిన పాశుపతాస్త్రంరా" అని నవ్వేరాయన!

* * *

**(జ్యోతి మాసపత్రిక ఏప్రియల్ 1987)**

# నేనూ మా ఆవిడా టెలివిజనూ

**యు**ద్ధాల్లో గెలిచిన రాజుల ముఖాలెలా వుంటాయో నాకు తెలీదు. తీవ్రమైన పోటీగల ఎన్నికల్లో నెగ్గిన అభ్యర్థుల ముఖారవిందాలెలా వుంటాయో నేను చూళ్ళేదు. కాని మా ముఖాలు అంటే నా మొఖమూ మా ఆవిడి ముఖమూ వారి ముఖాలకే మాత్రమూ తీసిపోవని ఖచ్చితంగా చెప్పగలను.

టీవీ షాపులోంచి టెలివిజన్ సెట్‌ని అతిభద్రంగా పట్టుకుని బయటి కొచ్చిన నేను బాక్సింగ్ చాంపియన్‌షిప్ గెలుచుకున్న మహమ్మదాలీలానూ డబుల్ సెంచరీ కొట్టిన సునీల్ గవాస్కర్లానూ వున్నాననడం ఏ మాత్రం అతిశయోక్తి కాదు.

అవును మరి. టెలివిజన్ కొనడం అనేది మేమిద్దరమూ గత నెల రోజుల్నుంచి రోజూ కంటున్న స్వప్నం. ఆ స్వప్నం ఇవాళ సత్యమై కళ్ళెదుట నిలిచింది. ఇక మేం నేల మీదెలా నడుస్తాం చెప్పండి?

“జాగ్రత్తండీ” టీవీ సెట్ మీద ఆప్యాయంగా చెయ్యేస్తూ అంది శ్రీమతి.

“చంటి పిల్లాడికన్నా జాగ్రత్తగా చూస్తున్నాను గానీ రిక్షాని పిలువు”

రిక్షాని పిలవడానికో అడుగు వేసే ఆగింది “టెలివిజన్ పట్టుకుని రిక్షాలో వెళ్తే ఏం బావుంటుందండీ”

“అవున్నిజమే సుమా. మన సంగతెలా వున్నా టీవీ పరువు నిలపాలి. ఆటోని పిలు”

ఆటో ఎక్కి కూర్చున్నాం.

“క్రింద పెడతారా?”

“వద్దొద్దు. ఒళ్ళోనే వుంచుకుంటాను. కుదుపులకేమైనా దెబ్బ తగలొచ్చు”

“అదీ పాయింటే సుమండీ” అని “బాబూ – కాస్త స్లోగా పోనియ్యవయ్యా” అంది ఆటో డ్రైవర్తో.

అతడు మా వంక కించిత్తు వింతగా చూసిన మాట యదార్థమే అయినా పట్టించుకునే స్థితిలో మేం లేం.

"హమ్మయ్య. మొత్తాని కెలాగైతేనేం టీవీ కొనేశాం. లోకంలో తమ కొక్కరికే వున్నట్టు పేద్ద వయ్యారాలు పోయింది వనజ" నిరసనగా అంది మా ఆవిడ.

వనజ నా స్నేహితుడి భార్య. వాడు కన్పించినప్పుడల్లా 'మా ఇంటికి రండ్రా. మా ఇంటికి రండ్రా' అంటూ పీకేస్తున్నాడన్చెప్పి నెలరోజుల క్రితం ఓ ఆదివారం పూట నేనూ. మా ఆవిడా వాళ్ళింటికి వెళ్ళాం.

వెళ్ళేక తెల్సింది. వాళ్ళీమధ్యే టెలివిజన్ కొన్నారని. ఆ సంగతి ముందే తెలిసుంటే వెళ్ళే వాళ్ళం కాదేమో. కాని వెళ్ళేం గనుక దానినీ చూడక తప్పలేదు. వాళ్ళు చెప్పిన సొదా వినక తప్పిందీ కాదు.

ఆ చుట్టు ప్రక్కల టెలివిజన్ యాంటెన్నా ఠీవిగా నిలబడిన ఇల్లు తమదేననీ, దానివల్ల తమకెంతో చక్కగా కాలక్షేపం అవుతోందనీ సినిమాల ఖర్చు పూర్తిగా తగ్గిపోయిందనీ, అందరూ తమని చూసి ఈర్ష్య పడుతున్నారనీ కామాలూ, ఫుల్‌స్టాపులూ లేకుండా వనజ టెలివిజన్ పురాణం విన్పించేసరికి నాకే ఏవిటోగా ఒళ్ళంతా చీమలు పాకినట్టుగా అన్పించింది. ఇక మా ఆవిడ సంగతి చెప్పాల్నా!

వాళ్ళ గడప దాటి రెండడుగులేశామో లేదో "వనజకి చూశారా ఎంత గర్వమో. ఎలాగైతే తమకే టెలివిజన్ వుందని గొప్ప! బడాయి! నాకున్న ముత్యాల నెక్లెస్‌లాంటి నెక్లెస్ తనకెక్కడిది? ఎలాగైతే లిక్కూ లిక్కూమని డొక్కు టెలివిజన్ కొన్నారని మురిసిపోతున్నారు మొగుడూ పెళ్ళాలు. అదీ ఓ గొప్పేనా బోడిగొప్ప!" అంది మా ఆవిడ అక్కసుగా.

నేను మౌనం వహించేసరికి "మాట్లాడరేవండీ" అంది.

"అవునవును" అన్నాను. నిజం చెప్పొద్దూ మనస్ఫూర్తిగానే అన్నాను. వాళ్ళ ప్రవర్తన నాకూ బొత్తిగా నచ్చలేదు.

"ఆవిడది ఆడ నోరు గనుక ఎగిరి పడిందనుకోండి. మీ ఫ్రండ్ కేమొచ్చిందండీ రోగం? తనూ నేనమ్మా అంటూ చొల్లు కార్చుకుంటూ చెబుతాడా?"

"వాడి ప్రవర్తనా నాకు నచ్చలేదు"

"ఇలాటి వాళ్ళని తెలిస్తే మీ రెంత పట్టుబట్టినా వచ్చే దాన్ని కాదు. బొత్తిగా సంస్కారం లేదు....." అంటూ వాళ్ళ మీద కాస్సేపు అక్షింతలు వేశాక దృఢ స్వరంతో అంది "మనమూ టెలివిజన్ కొందామండీ"

నడినెత్తి మీద పిడుగుపడ్డట్టు అదిరిపోయాను. పిచ్చిగా చూశాను.

తనో నిశ్చయానికొస్తే ఇక దానికి తిరుగుండదని తెలుసు. అయినా వారించకుండా వుండలేకపోయాను.

"నీకేమైనా మతిపోయిందా. టెలివిజన్ అంటే మాటలనుకున్నావా? దగ్గర దగ్గర రెండున్నర వేలుంటుంది. మన చేతికొచ్చే జీతం ఆరొందలే నాయె. నాలుగు నెలల పాటు అన్నం మానేసి గాలి భోంచేసి అద్దిల్లు వదిలేసి చెట్టు క్రింద కాపురం పెడితే తప్ప కొన్లేం!"

"మీ ఫ్రండ్ కొన్లేదూ? అతడి జీతం అయిదొందల కన్నా తక్కువే అన్నారుగా!"

"అది నిజం గనుక అన్నాను. మరెలా కొన్నాడూ అంటావా వాడు పనిచేసేది ఆర్టీవో ఆఫీసులో. రోజుకి అథమ పక్షం వీడి వాటాకి వందరూపాయ లొస్తుందిట లంచం. వాడికేం టీవీలూ కొంటాడు. స్కూటరూ కొంటాడు. వాడితో పాటు మనమూ ఎగరాలంటే ఎలా?"

ఆవిడ దృష్టిలో నేను తక్కువ కాకూడదనే వుద్దేశంతో కాస్త గట్టిగానే చెప్పాను. నేను అవినీతిపరుణ్ణీ, దేశద్రోహినీ కాలేనంటూ చిన్న ఉపన్యాసం కూడా యివ్వాలన్పించింది గాని మేం నడుస్తోన్నది బజార్లో గనుక ఆ ఉపన్యాసం వినే అదృష్టం ఆవిడకి లేకుండా పోయింది.

"ఏమైనా సరే మనం కొనాల్సిందే. తలకాయొంచి ఫైళ్లు రాసే గుమస్తాలు కలలో కూడా టీవీని కొన్లేరంటుందా మీ ఫ్రండ్ భార్య? తన మొగుడు ఫైళ్ళు రాయకపోతే ఫైళ్ళ మీద సంతకాలు పెడుతున్నాడనుకొంటోందా మీ వనజ?"

"ఆవిడ సంగతలా వుంచుగాని మనం టీవీ కొనాలనుకోవడం అత్యాశే అవుతుంది"

"మీకు పౌరుషం లేదా? ఆవిడన్ని మాటలన్నాక..."

"ఇది మాటల వ్యవహారం కాదు మూటల వ్యవహారం"

"ఏం ఫర్లేదులెండి. ఈ నెల నుంచి పేపర్ కొనడం మానేద్దాం. ఒక పావు లీటరు పాలు తగ్గించేస్తాను. పని మనిషిని మాన్పించి నేనే అంట్లు తోమేసుకుంటాను. బట్టలు కూడా నేనే ఉతికేస్తాను. చాకలి ఖర్చు పూర్తిగా మిగులే. ఇంకా... టీవీ వున్నప్పుడు రేడియో అనవసరం కదా. దాన్ని అమ్మేద్దాం. కనీసం రెండొందలొస్తాయి.

మధ్యాహ్నం టిఫిన్లు మానేద్దాం. మీకింత అన్నం కూరా బాక్సులో పెట్టిస్తాను తిందురుగాని. అన్నట్టు మీరు ఆఫీసుకి బస్సులో వెళ్ళకుండా కాస్త పెందరాళే బయల్దేరి నడిచి వెళ్ళిపోదురు గాని. గట్టిగా నడిస్తే పావుగంటలో వెళ్ళి పోవచ్చు. ఏమంటారు?"

"చూడు కుసుమా. నువ్వు చెప్పినవన్నీ గట్టిగా అమలు పరిస్తే నెలకి మహా మిగిల్తే వంద రూపాయిలు మిగుల్తాయి. ఆ లెక్కన టీవీ కొనాలంటే రెండేళ్ళు పడుతుంది. ఈ లోగా రెండో మూడో యూనియన్ బడ్జెట్ లొస్తాయి గనుక దాని ధర అప్పటికి దగ్గర దగ్గర నాలుగు వేలవుతుంది. అంచేత నా మాట విని టీవీ సంగతి మర్చిపో. అసలివాళ మనం వాళ్ళింటికి వెళ్ళలేదనుకో"

ఛీత్కారంగా చూసిందావిడ.

నేను కొంచెం ఇబ్బందిగా ఫీలయ్యాను. ఆ గొడవ ఆవిడకే వదిలెయ్యకుండా అనవసరంగా వేలు పెట్టినందుకు!

"మీ మగాళ్లెప్పుడూ ఇంతే" విసురుగా కోపంగా అనేసి విసవిసా నడిచింది నాకంటే ముందు.

ఆమె నెత్తిమీద నీళ్లకుండ భళ్లున పగిలిందనీ అది కనబడకూడదనే ఆవిడ ముందుకెళ్లిపోయిందనీ నాకు తెలుసు. కానేం చెయ్యను. ఆవిడ కోపం పోగొట్టి ప్రసన్నురాల్ని చేసుకోవాలంటే టీవీ కొంటానని వాగ్దానం చెయ్యాలి. మరి డబ్బో?

డబ్బు పుట్టే మార్గం గురించి కంప్యూటర్ కన్నా వేగాతి వేగంగా ఆలోచించాను గాని బొత్తిగా ఒక్క ఐడియా కూడా రాలేదు. ఇంతలో అదృష్టవశాత్తూ ఓ బ్యాంకు కన్పించింది. బ్యాంకు కన్పించేసరికి అప్పు గుర్తొచ్చింది. అప్పు గుర్తొచ్చేసరికి పి.యఫ్.లోన్ బుర్రలో మెదిలింది!

"కుసుమా కుసుమా!" అంటూ హుషారుగా రెండడుగులు ముందుకేసి ఆమెని కలిసి "ఒక్క నెలలో టీవీ కొనేద్దామోయ్" అన్నాను – చెప్పొద్దూ కాస్త స్టైయిల్‌గానే అన్నాను.

విప్పారిన నేత్రాలతో ఆశ్చర్యంగా కించిత్తు అనుమానంగానూ చూసింది.

"నిజమేనోయ్. ప్రామిస్'

"డబ్బు....."

"దానికో ఏర్పాటు చేస్తున్నాలే. పీయఫ్ లోన్ ఓ వెయ్యిరూపాయల వరకూ వస్తుందిలే అప్లయ్ చేస్తాను. మిగతా సొమ్ము వాయిదాల్లో కడదాం. వాయిదాల పద్ధతిలో ఇంచు మించు అన్ని షాపులవాళ్ళూ అమ్ముతున్నారు కదా"

నమ్మలేనట్లు చూస్తోంటే "నిజమోయ్. నీతోడు!" అన్నాను.

అప్పటిగ్గాని ఆవిడకి పూర్తిగా నమ్మకం కలగలేదు. కలిగేక మబ్బులు తొలగిన ఆకాశంలోని జాబిలిలా ప్రకాశించిందామె ముఖం. ఆ జాబిలిని చూసిన సంద్రంలా వుప్పొంగింది నా హృదయం ఆనందంతో.

"మీరు నిజంగా చాలా మంచివారండీ"

నా భుజాలు రెండంగుళాలు పెరిగాయి.

"నేను కూడా కొంచెం పొదుపు చేస్తాన్లెండి. వాయిదాలు తేలిగ్గా కట్టేయొచ్చు. మనం వనజావాళ్ళ టీవీ కన్నా మంచికంపెనీ టీవీ కొనాలండీ"

"ఓ – అలాగే"

ఇంతలో సిటీబస్సు రాకతో ఆగిన మా సంభాషణ మళ్ళీ బస్సు దిగేక కంటిన్యూ అయ్యింది.

"అవునూ మనింట్లో టీవీ ఎక్కడ పెడదామండీ?" మా ఆవిడ బుర్రలోంచి వూడిపడిందో అనుమానపు ముక్క!

"అదీ నిజమేనోయ్ మనముంటోన్నది రెండు గదుల పోర్షన్లో. ఒకటి వంటగదీ. రెండోది బెడ్‌రూమ్ కమ్ డ్రాయింగ్ రూం. మరేం చేద్దామంటావ్?"

"ఎలావోలా ముందు గదిలోనే పెట్టాలండీ. మనింటికెవరొచ్చినా ముందు టీవీయే కన్పించాలి" ఖండితంగా అంది.

"మరి మంచం ఏం చేద్దాం?"

"వంటింట్లోకి మారిస్తే?"

"వంటిల్లే బెడ్ రూమా? ఎవరైనా వింటే నవ్విపోతారు"

"మనం చెబితే గాని ఇతర్లకి తెలీదండీ. కానీ టీవీని చూడ్డానికి మనింటికొచ్చిన వాళ్ళంతా బెడ్‌రూమ్‌లో టీవీ వుండటం చూసి ఏదోగా అనుకోరూ?"

"అనుకుంటే అనుకోనీ గాని ఆ వంటింట్లో నేను పడుకోలేను"

"పోనీ ఓ పని చేద్దామండీ. రాత్రుళ్ళు ముందు గదిలో పడుకుందాం. పగలు మంచాన్ని వంటింట్లో పెట్టేద్దాం"

"రోజుకి రెండుసార్లు మంచాన్ని అటూ ఇటూ తిప్పాలన్న మాట"

"చూసేవాళ్ళకి హుంగుగా కన్పించాలంటే ఇలాటి సర్దుబాట్లు తప్పవండీ. టీవీ వుందంటే ఎంత గొప్ప ఎంత మర్యాద!"

"ఇంక చాలు చాలు మావాడి భార్య గుర్తొస్తోంది"

"ఆ వనజకీ, నాకూ సాపత్యముటండీ?" సత్యభామలా ఫోజు పెట్టింది.

"వూరికే అన్నాన్లే – అంతా చూస్తున్నారు నడు నడు"

తాళం తీసి ఇంట్లో ప్రవేశించాం.

ఏ ప్రక్కన టేబుల్ పెట్టి దానిమీద టీవీ పెట్టాలో అప్పటికప్పుడే స్థల నిర్ణయం చేసి గాని మరో కార్యక్రమంలోకి దిగలేదు మేం.

ఆ మర్నాడే లోన్‌కి అప్లయ్ చేశాను.

"అప్లయ్ చేసి వూరుకుంటే కాదండీ. త్వరగా శాంక్షన్ అయ్యేట్లు చూడండి. వీలుంటే ఆ సెక్షన్ వాళ్ళని కలుసుకోండి" అంది కుసుమ.

"అలాగే"

"మన ప్రక్కింటి పిన్ని గారూ. ఎదురింటి కాంతమ్మ గారూ ప్రక్క పోర్షన్‌లోని కమలా అంతా మనం టీవీ కొంటున్నందుకు ఈర్ష్యతో ఛస్తున్నారనుకోండి"

"అప్పుడే వార్త చాలా దూరం ప్రయాణం చేసిందన్న మాట"

"మీదంతా చిత్రమండీ. కొంటున్నప్పుడు కొంటున్నట్టు చెబితే తప్పేవిటండీ!"

"కొన్నాక ఎలాగూ తెలుస్తుందిగా"

"ఏమో బాబూ – ఎవరికీ చెప్పకుండా లోపలే దాచుకోవడం నాకు చేతకాదు"

మరి రెండ్రోజులకి వివిధ పేపర్లలో పత్రికలలో వచ్చిన టెలివిజన్ ఎడ్వర్టైజ్‌మెంట్లని కట్ చేసి పట్టుకొచ్చి "వీటిల్లో ఏ మోడల్ టెలివిజన్ బావుందో సెలక్టు చెయ్యండి" అంది మా ఆవిడ.

"చేద్దామోయ్ కంగారేవిటీ"

"అయ్యో రామా – అదేం మాటండీ. ఇంకో ఇరవై రోజుల్లో కొనబోతూ కంగారెందు కంటారేవిటీ ఈ లోగా మనకి నచ్చిన కంపెనీది సెలక్ట్ చేసుకుని దాని బాగోగుల గురించి నలుగుర్నీ వాకబు చెయ్యొద్దూ!"

"అయితే ఇలా ఇయ్యి చూస్తాను"

"అవన్నీ తీరిగ్గా చూద్దురు గాని కానీ – ముందిది చూడండి. ముచ్చటగా వుంది కదూ?" అంది ఓ కటింగ్ చూపిస్తూ.

అది ఆవిడకి నచ్చిందని అర్థమైపోయింది. దానికే ఓటు వెయ్యక తప్పలేదు.

ఆ మరుసటి వారం అబిడ్స్ వెళ్ళి మేం సెలక్ట్ చేసుకున్న కంపెనీ టీవీ ఖరీదూ వాయిదాలపై అమ్మకానికి గల షరతులూ తెలుసుకునొచ్చాం ఇద్దరం.

ఇంకో వారం రోజులకి టీవీ కొంటామనగా "ఏమండోయ్ మనం అసలు సంగతి మర్చిపోయాం" అంది శ్రీమతి.

నా గుండెల్లోంచి ఎక్స్‌ప్రెస్ రైళ్ళు దూసుకుపోతోంటే "ఏవిటే అదీ" అనడిగాను ఆత్రంగా.

"ఇంకా ఏవిటని నెమ్మదిగా అంటారేవిటండీ. టీవీని టేబుల్ మీద పెడతాం కదా మనం ఎక్కడ కూర్చుని చూద్దాం!"

"వనజా వాళ్ళానే కుర్చీల్లో కూర్చుందాం"

"అబ్బెబ్బే కుర్చీలేం బావోవండీ. పైగా వాళ్ళలానే మనమూ కుర్చీ వేసుకుంటే ఇక మన గొప్పేవిటి చెప్పండి?"

"గొప్పల జోలెందుకులే....."

"ఇంట్లో టీవీ పెట్టుకుని గొప్ప లెందుకంటారేవిటి ఖర్మ! ఓ ప్రక్కన కొత్త టీవీ, యింకో ప్రక్కన పాతకుర్చీలూ వుంటే చూసిన వాళ్ళు నవ్వర్టండీ"

"మరి నన్నిప్పుడెందులో దిగమంటావో చెప్పు"

"మీరెప్పుడూ ఇంతే. నా మాటొక్కటీ సరిగ్గా విన్పించుకోరు కదా!"

"విన్పించుకోవడం ఏవిటి ఏకంగా అమలు పరిచేస్తూంటేను. నాన్చక ఏం చేద్దామంటావో చెప్పు. చెప్పే ముందు మన తాహతు గురించి ఒకటికి రెండుసార్లు ఆలోచించి మరీ చెప్పు"

"అన్నీ ఆలోచించాల్లెండి గాని సోఫా ఖరీదెంతుంటుందీ" గోముగానే అడిగింది పాపం. కాని నా ఒళ్ళంతా క్రొత్త బ్లేడుతో చీరి కారం పూసినట్లుగా మండింది.

"నాలుగొందలకి పైనే గాని ఒక్క పైసా తగ్గదు"

"అంతేకదా ఫర్లేదులెండి. మీరింకా ఏ వెయ్యో అంటారేమోనని హడిలి ఛస్తున్నాను. సాయంత్రం ఆఫీసు నుంచి పెందలాడే వచ్చేస్తే బజారు కెళ్ళి ఒక సోఫా, గుమ్మానికీ, కిటికీకీ కర్టెన్లూ, రెండు పెయింటింగులూ కొనుక్కొద్దాం.

"రామా రామా" తల పట్టుకుని కూర్చుండి పోయాను.

"ఏమయ్యిందండీ"

"ఖూనీ – ఖూనీ!"

"చాల్లెండి ఎవరైనా వింటే నిజంగానే ఖూనీ జరిగిందనుకుంటారు"

"ఇప్పుడు జరగటం లేదూ. మాటల్తో నన్ను నిలువునా చంపేస్తున్నావు కదా!"

"అయ్యో మీకెలా చెప్పాలి. శుక్రవారం పూట చావు మాట అంటారేవిటండీ ఖర్మ!'

"అనునుగానీ కాపర్స్ కూడా నువ్వే తెచ్చి అవి కొందాం ఇవి కొందాం అంటే బావుంటుందోయ్"

"ఇదిగో ఈ గాజులు తీసుకెళ్ళి ఏ బ్యాంకులోనైనా తాకట్టుపెట్టండి. చులాగ్గా అయిదొందలిస్తారు. నెమ్మది మీద తీర్చుకుందాం"

"కుసుమా!"

"చెప్పేది వినండీ. మన గదిలో ఇప్పుడు టీవీ పెడితే దిష్టి బొమ్మ మెడలో బంగారు లాకెట్ వేసినట్టుంటుంది. సోఫా, కర్టెన్లూ, పెయింటింగులూ వుంటే చాలా గొప్పగా రిచ్‌గా అందంగా వుంటుంది. చూసే వాళ్ళొక్కసారే డంగైపోతారు. ఇక మీ వనజ చూస్తే ఏడ్చి మొత్తుకుంటుంది"

"మనం ఆవిడతో పోల్చుకుని అనవసరంగా ఖర్చులు చేస్తున్నామేమోనని నా అనుమానం"

"ఇదేం పెద్ద ఖర్చు కాదులెండి. ముందు నా మాట వినండి చెబుతాను"

వినక తప్పదు గనక విన్నాను.

నిన్ననే అవన్నీ కొనేసి మా గదిని మాకు చేతనైనంత గొప్పగా అలంకరించాం.

ఇవాళ పీ.యఫ్. లోన్ చేతికి రావడంతో టీవీ షాపులో ఆ డబ్బు కట్టేసి టెలివిజన్ చంకనెట్టుకుని విజేతల్లా ఇప్పుడు ఇంటి ముఖం పట్టాం.

"ఇదిగో బాబూ ఆ ప్రక్కదే మా ఇల్లు. అక్కడ ఆపు" ఆటో అతన్తో అంది కుసుమ.

ఆటో ఆగింది.

ఏడు రూపాయల చిల్లర అతడికి సమర్పించి వీధిలో వాళ్ళందరికీ కన్పించేలా టెలివిజన్ సెట్ని పట్టుకుని కొన్ని నిమిషాలు వీధిలో గడిపాం.

తాళంతీసి "ఒక్క నిమిషం వుండండి" అంటూ లోపలికెళ్ళి ఓ కొబ్బరికాయ తెచ్చి టీవీకి దిష్టితీసి బయట పారేసింది.

లోపలి కెళ్ళి పేకింగ్ విప్పి మా టేబుల్ మీద టీవీ పెట్టాను.

నిజం చెప్పొద్దూ చాలా ముచ్చటేసింది. అసలే ఎన్నో కొత్త మార్పుల్ని సంతరించుకున్న మాగదిలో టీవీ పెట్టేసరికి కొత్త కళతో ఎవరో ఆఫీసర్ల ఇంటిలా అన్పించింది నాకు. ఏమైనా కాస్త డబ్బు ఖర్చుని సంకోచిస్తూంటాను గానీ మా కుసుమది మాంచి టెస్టు.

"ఆగండాగండి అప్పుడే ఆన్ చెయ్యకండి" పసుపూ కుంకుమా తెస్తూ అంది.

"ఆన్ చేసినా, చెయ్యకపోయినా ఒకటేనోయ్ షాపు మెకానిక్ వచ్చి యాంటెన్నా అరేంజ్ చేసే వరకూ ఏమీ రాదు"

"ఆ సంగతి మరిచేపోయాను సుమండీ. సాయంత్రం వచ్చేస్తాడు కదా!"

టీవికి పసుపురాసి బొట్లు పెడుతోంటే ప్రక్క పోర్షన్లోని కమల వచ్చింది "కుసుమ గారూ" అంటూ.

మా ఆవిడ ఆవిడ్ని చేటంత ముఖం చేసుకుని ఆహ్వానిస్తోంటే ప్రక్కింటి పిన్నిగారు తన అరడజను పిల్లల్తో వచ్చారు

"టెలివిజన్ తెచ్చార్టగా' అంటూ వచ్చారు ఎదురింటి కాంతమ్మగారూ ఆవిడ స్నేహితురాళ్ళు ఇద్దరూ.

మరో గంట వరకూ పిల్లలూ, పెద్దలూ వస్తూనే వున్నారు. సెట్‌ని చూసి మమ్మల్ని అభినందించి వెళుతూనే వున్నారు.

అంతా వెళ్ళేక "చూశారా" అంది నవ్వుతూ మా ఆవిడ. ఆవిడ ముఖం చూస్తే పున్నమి చంద్రుడైనా సరే ముఖం ముడుచుకోవాల్సిందే. అలా వెలుగుతోంది!

"నన్నింక అంతా 'టెలివిజన్ ప్రసాద్ గారు' అనేలా వున్నారు" నవ్వేను. ఆ నవ్వులో చిరుగర్వం లేకపోలేదు.

"అంటారండీ. మన వీధిలో టెలివిజన్ వున్నది మన కొక్కళ్ళకేనండీ. అన్నట్లు ఎదురింటి ఆ పార్వతి ఏమందో తెలుసాండీ? వాళ్ళూ టీవీ కొనుక్కుంటార్ట! పులిని చూసి నక్క వాత పెట్టుకోవడం అంటే ఇదేనండి"

ఏమనగలను ఆవిడే అలా అంటోంటే!

మర్నాడు ఆదివారం గనుక అలవాటు ప్రకారం ఎనిమిదైనా మంచం దిగకుండా దొర్లుతోంటే "ఏమండోయ్. ఇవాళ మన టీవీలో ఏం సినిమాయో తెలుసా? గోపాల రావు గారి అమ్మాయండీ" అంది ప్రక్కింటి వారి పేపరు పట్టుకువొచ్చి.

"మన టీవీలోనే కాదు – అందరి టీవీల్లో అదే సినిమా వస్తుంది"

నా మాటలు విన్పించుకోకుండా అంది. "మనం ఆ సినిమా చూడలేదు కదండీ. మనం చూడకుండా వెళ్ళిపోయినందుకెంతో బాధపడ్డాం. మీకు గుర్తు లేదూ? ఇప్పుడు ఎంచక్కా మనింట్లో దొరల్లా కూర్చుని సినిమా చూడొచ్చు"

నాకూ ఎంతో ముచ్చటేసింది "అవును సుమా. సినిమా ఎన్నింటికి?"

"సాయంత్రం ఏడు గంటలకి"

"సరేలే. ఇవాళ ఆఫీసులో కొంచెం అర్జంటు పనుంది. మధ్యాహ్నం వెళ్ళి ఆరింటికల్లా వచ్చేస్తాను"

"సినిమా టైముకి తప్పకుండా వచ్చెయ్యండి"

తలూపి లేచాను.

సాయంత్రం ఆరు గంటలయ్యింది. ఆఫీసు పని ముగించుకుని బస్టేజిలో నిలబడ్డాను సిగరెట్టు కాలుస్తూ.

ఆకాశం నిండా మబ్బులు. చలిగాలి. అసలివాళ ఉదయం నుంచీ ముసురుగానే వుంది. మధ్య మధ్య తుంపర్లు పడుతున్నాయి. బహుశా ఏ కోస్తాలోనో తుపాను వచ్చి వుంటుంది.

ఇలాటి చల్లని వాతావరణంలో క్రొత్త సోఫాలో భార్యనానుకుని వెచ్చగా కూర్చుని వేడి వేడి పకోడీలు తింటూ టీ త్రాగుతూ కబుర్లు చెప్పుకుంటూ టీవీలో చక్కని సినిమా చూట్టం..... ఓహ్! ఎంత చక్కని అనుభవం! తలచుకొంటేనే శరీరం పులకిస్తోంది. ఇక ఆ అనుభవం అనుభవంలో కొస్తే ఇంకేముంది. స్వర్గం మా ఇంట్లోకి డైరక్టుగా దిగి వస్తుంది....!

సిటీబస్సు రాకకి ఆలోచనలు చెదిరాయ్. బస్సెక్కి కూర్చున్నాను.

నా ఒంట్లో రక్తంగాక ఆనందం ప్రవహిస్తున్న అనుభూతి!

బస్సుదిగి మా ఇంటివైపు గబగబా అడుగులేశాను.

ఇంట్లోని జనాన్ని చూసి గతుక్కుమన్నాను. పొరబాటున పిల్లలబడిలోకి రాలేదు కదా? లేకపోతే కుసుమ ఏ నోమో నోస్తూ పేరంటానికందర్నీ పిలిచిందా?

తల విదిలించి చూశాను.

బడికాదు మా ఇల్లే. పూజలేం లేవు. పిల్లలూ, పెద్దలూ మొత్తం ఓ ఇరవై మంది మాగదిలోని సోఫామీదా. చాపల మీదా, కుర్చీల్లోనూ, నేలమీదా, గడపమీదా కూడా కూర్చుని టీవీ వంక చూస్తూ కబుర్లు చెప్పుకుంటున్నారు!

ముఖం చిట్లించి వాళ్ళని జాగ్రత్తగా తప్పించుకుని వంటింట్లో కెళ్లాను. నా వెనుకే వచ్చిన శ్రీమతితో "ఈ సంతేవిటి?" అన్నాను.

"సినిమా చూస్తామనొచ్చారండీ" నిరుత్సాహంగా అంది.

సణుక్కుంటూ బట్టలు తీసి లుంగీ కట్టుకునేసరికి ఎవరో అరుస్తూ వచ్చారు.

గబుక్కున ముందు గదిలోకొచ్చాం.

"ఒరే దొంగవెధవా చదువుకోమంటే ఇక్కడి కొచ్చి తగలడ్డావుట్రా. మీ చదువులు చెడగొట్టానికే ఇది కొన్నారు కాబోల్రా దేవుడా" అంటూ ఒకావిడొచ్చి వాళ్ళబ్బాయికి రెండు అంటించి రెక్కపట్టుకుని బయటికి త్రోసింది. తనూ వెళ్ళబోతూ ఆగి "ఏ సినిమా" అనడిగింది.

"గోపాలరావు గారమ్మాయి" ఎవరో అన్నారు.

"ఏవిటీ జయసుధ సినిమాయా? మరి చెప్పేరు కాదేం? ఆవిడ సినిమా అంటే చెవికోసుకుంటాను అక్కయ్యగారూ" అంటూ చతికిలబడింది.

ఆవిడ పిల్లాడు కూడా బురద కాళ్ళతో వచ్చి దూరాడు.

ఉస్సురని నిట్టూర్చామో లేదో నాలుగిళ్ళవతలుంటోన్న అప్పాయమ్మ గారొచ్చారు చెంగులో ఇన్ని వేరుశనక్కాయలు మూటకట్టుకుని.

"ఏమే పిల్లా. మీ యింట్లో చిన్న సినిమా చూపిస్తున్నారంటగా. చూద్దావనొచ్చావే. ఎప్పుడో ఆయన బ్రతికున్నరోజుల్లో చూశాను" అని మా ఆవిడతో అంటూనే చోటుకోసం చూసి నిరాశపడి "జరగండే" అని కసిరి కూలబడింది. తపీమని వేరు శనక్కాయలు నేలకేసి కొట్టి తింటూ "సినిమా ఇంకా మొదలెట్టలేదా" అంది.

"ఇంకో అయిదు నిమిషాల్లో మొదలవ్వద్ది"

నా తీయని ఊహకీ, ఈ చేదు వాస్తవానికీ లంగరందనందున కనీసం ఏదో మూలన కూర్చుని చూట్టానికైనా చోటు లేనందున విసురుగా వంటింట్లో కెళ్ళి మంచం వాల్చుకుని నిస్త్రాణగా కూలబడ్డాను.

"ఏం జేద్దావండీ" గుడ్ల నీరు కుక్కుకునంది శ్రీమతి.

"ఏం జెయ్యటం అనుభవించడమే. ఇద్దరం హాయిగా పక్క పక్కన కూర్చుని సినిమా చూసే యోగం ఎలాగూ లేదు గాని, ఇక్కడైనా కూర్చో. కాస్సేపు కబుర్లన్నా చెప్పుకుందాం"

"కూర్చుందును కానండీ దగ్గర్లేకపోతే పిల్లలు టీవీ మీటలు తిప్పి పాడు చేస్తారండీ" అంటూనే పరిగెత్తిందావిడ – టీవీ కాపలా కాయడానికీ వచ్చే జనానికీ స్వాగతం చెప్పడానికీనూ!

* * *

**(ఆంధ్రజ్యోతి వారపత్రిక 11.2.1983)**



సింహప్రసాద్

పేజీల్లో సినిమా చూపించే
కొత్త ఎక్స్‌పరిమెంటు
కామెడీ పిప్పరమెంటు

హాస్య కథల కదంబం
ఈ బ్రహ్మానందలహరి

ఇవి ఆంధ్రభూమి సచిత్రవార
పత్రికలో 22 వారాలపాటు
ధారావాహికంగా ప్రచురింపబడి
పాఠకులను అలరించి అభినందనలు
అందుకున్న 22 + 7 హాస్య కథలు.

ప్రముఖ కార్టూనిస్ట్ మృత్యుంజయ
బొమ్మలతో...